నుండియును, నాల్గవది హరిద్వారమునుండియును, అయిదవది యుజ్జయినీ నగరము నుండియును వచ్చె. మఱియు నాశవములలో మొదటిది క్షత్రియశవమును, రెండవది వైశ్యశవమును, మూడవది తైలకారుని శవమును, నాల్గవది లోహకారస్త్రీశవమును, అయిదవది చర్మకారునిదుహితృ శవమును నై యుండెను. ఈవిధముగ వచ్చిన శవములన్నియును శైలద్రోణియందుంబడియె. అట్లు బయలువెడలిపోయిన రాముండు నలుదిక్కులయందును సంచియెందును నన్యాయప్రవర్తనను గానక క్రమముగ సకలదేశములను జూచుచు దండకారణ్యమునందుం బ్రవేశించె. అనంతరమందా దండకారణ్యమును సర్వమునుచూచుచుండె. అట్లుచూచుచు వింధ్యాచలమునకుంబోయె. అప్పుడక్కడ నొక్కశూద్రుండు అధోముఖుండై యింద్రలోకాభిలాషచేత ధూమపానము నవలంబించి తపస్సును చేయుచుండె. అట్టి శూద్రునిజూచి చాపుట కుద్యుక్తుండై శ్రీరాముండతనితో నిట్లనియె. ఓ శూద్రుండా! నావచనమును వినుము. బ్రాహ్మణాది మూడువర్ణములవారుతప్పం దక్కినవారు తపస్సును చేయంగూడదు. శూద్రులు ద్విజశుశ్రూషను చేయవలయును. అట్టికృత్యమును విడిచిపెట్టి నిప్పుడు బ్రాహ్మణకృత్యమును చేయుచున్నావు. కావున నిప్పుడు నిన్నుం జంపి చచ్చినవారల బ్రదికించెదను. నీతపస్సునకు సంతసించితిని. కాంబట్టి నీకభీష్టమైన వరమును వేడుమనిన విని యాశూద్రుండధోముఖుండై శ్రీరామునకు నమస్కరించుచు వినయభయములతో నిట్లనియె. రావణగర్వాపహర్తవైన యోరామా! నన్నుగురించి తృప్తిఁబొందితినని చెప్పితివి? అట్లయినయెడల నాకభీష్టమయిన వరమునొసంగుము. దేనిచేత శూద్రునకు గతికలుగునదియును, దేనిచేత శూద్రునకు కీర్తి కలుగునదియును, తెలుప వేడెదననిన శ్రీరాముండు విని పరమసంతోషము కలవాండై యిట్లనియె. శూద్రులగువారు రామనామమును జపించుట కర్హులగుదురు. ఆరామనామజపముచేతనే శూద్రులకు సద్గతికలుగును. మఱియును నీవులోకములోని శూద్రులకందరకును నుపకారమును చేయుటవలన నీకీర్తి యాచంద్రార్కస్థాయియై యుండుననిన విని యాశూద్రుండు మరల నిట్లనియె. ఓ రఘుకులోత్తమా! కలియుగమునందు శూద్రులందఱును మందబుద్ధి కలవారగుదురు. మఱియును వ్యగ్రచిత్తులును కృషికర్మాదులను జేయువారును నగుదురు. అట్టివారికి జపాదులయందేవిధముగా బుద్ధిపుట్టును. కావునదానికిం దగినవరము నిప్పుడొసంగుమనియె. అట్లు శూద్రుండు చెప్పిన వాక్యములను విని శ్రీరాముండు మరలనిట్లనియె. ఓ శూద్రజనోత్తమా! పరులకు నమస్కరించు కాలమునందు శూద్రులు రామరామ యందురు. దానివలన సద్గతికలుగును. మఱియు నిట్టిమహోపకారమును చేసినందువలనం గలిగినకీర్తి నీకు మిగుల స్థిరమైయుండును. నీవిప్పుడు నాచేతంజంపంబడి వైకుంఠమునకుం బోంగలవు. మఱియును మఱియొకవరమును నిచ్చెదను. వినుము. నీవు శాశ్వతముగ గాషలక్ష్మిణా సమేతముగ నీపర్వతమునందుండుము. మఱియు నీవింధ్యపర్వతమునందు

యాత్రార్థముగ వచ్చువారలు ముందుగ నిన్నుదర్శించి పిమ్మట నన్నుదర్శించుదురు. అట్టిజనులు తప్పక మోక్షమును పొందుదురు. నన్ను దర్శింపకపోయినను నిన్ను దర్శించుటచేత మోక్షము కలుగునని చెప్పి యాశూద్రుని సంతోషముకలవానిగాఁ జేసి యయోధ్యాపట్టణమునందు మృతినొంది యేఁగురుని జీవింపఁజేసె. అదిమొదలుకొని శూద్రులు విష్ణుదాసులని చెప్పఁబడుచున్నారు. పరవందనకాలములయందు రామరామయని శూద్రులు వచించుచున్నారు. అంతట శ్రీరాముఁడు శూద్రునిజంపి సంతోషమునుపొందినవాఁడై సీతామహాదేవికి నానావిధములయిన కౌతుకములనుజూపుచు నయోధ్యాపట్టణమునకుఁబోయె. అట్లు శ్రీరాముఁడు మార్గమునందు వచ్చుచున్నకాలమునందు గృధ్రోలూకములనుజూచె. ఆరెండును వివాదమును పొందుచు శ్రీరాముని జూచుటకువచ్చె. అప్పుడు శ్రీరాముఁడా గృధ్రోలూకములతోనిట్లనియె. ఓగృధ్రోలూకములారా! మీరువివాదమును పొందుటకు కారణమును చెప్పుడనియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యమును విని ముందుగ నులూకమిట్లనియె. ఓరఘుకులోత్తమా! నేనుముందుగ నొక్కచెట్టుమీఁదగూటిని కట్టుకొంటిని. నేనుకొంచెము కాలము ఆగూటినివిడిచి యుంటిని. అట్లుండగా నీగృధ్రమువచ్చి నాగూటియందుఁబ్రవేశించె ననిచెప్పినపిమ్మట గృధ్రముతో శ్రీరాముఁడిట్లనియె. ఓగృధ్రమా! నీవుదీనిగృహము నేలనాక్రమించితివి? యనినవినియాగృధ్రము శ్రీరామునితోనిట్లనియె. ఓరఘుకులోత్తమా! నేనేముందుగ వృక్షము మీఁద గూటినికట్టికొంటిని. అంతట నేనుకొన్నిదినములాగూటిని విడిచియుంటిని. ఆకాలములో నిది యాగూటియందుఁ బ్రవేశించె. పిమ్మటనొక్కనాఁడు లూకము ఈగూటిని విడిచియుండఁగ నేనీగూటియందు ప్రవేశించితిని. ఈయులూకము నిర్నిమిత్తముగ నాతో కలహించుచున్నది. ఓరఘుకులోత్తమా! నీవీవిషయమునందుధర్మమునాచరింపుము. మీవంశమునం దధర్మమును చేయువాఁడెన్నఁడును పుట్టియుండలేదనియె. అట్లు చెప్పిన గృధ్రోలూకముల వచనములనువిని శ్రీరాముఁడిట్లనియె. ఓ పక్షికులోత్తములారా! మీరు గూటినినిర్మించునపుడు సాక్షి యెవఁడైనఁగలఁడా? అనినవిని యాపక్షులు సాక్షిలేదని చెప్పె. అప్పుడు శ్రీరాముఁడు మిగులనాశ్చర్యముకలవాఁడై పుష్పకమునందున్న వారితోనిట్లనియె. ఓజనోత్తములారా! ఇప్పుడిది మిగులదుర్ఘటమైయున్నది. ఈవిషయమునందు న్యాయమెట్లుకలుగును. ఈగృహము నీరెంటిలో దేనికిచ్చుట యుత్తమమనినవిని యాపుష్పకము నందలివారందఱును మిగుల నాశ్చర్యమునుపొందిరి. అంతట శ్రీరాముఁడు లూకముతోనిట్లనియె. ఓయులూకమా! నివీగూటినినిర్మించి యెంతకాలమైనదో తెలుపుమనిన నయ్యులూకము భూమి యెప్పుడుపుట్టినదో యప్పుడేనిర్మించితిననియె. అంతట గృధ్రమునకుఁగా నది యీభూమి యుదకమునందుండఁగానే నీగూటిని నిర్మించితిననినవిని శ్రీరాముఁడిట్లనియె. ఓగృధ్రమా! నిరాధారముగ భూమి నీటియందున్నకాలమున వృక్షము భూమిమీఁదెట్లుం

మును ఉండనేరను. కావున నోగృధ్రిమా! నీవు మిగుల నసత్యమయిన వాక్యమును పలికితివనియె. ఇట్లుచెప్పి శ్రీరాముఁడు దూతలచేత నాగృధ్రిమును పర్వతముమీఁద త్రిశూలాగ్రమునందుఁ బెట్టించె. అట్లు గృధ్రిము శ్రీరామునిమూలకముగ మరణమునుపొందుటవలన కృతార్థురాలయ్యె. మఱియు నాగృధ్రిము మరణకాలమునందు శ్రీరామునిఁజూచుటచేత పుణ్యలోకమును పొందినదయ్యె. అంత నయ్యులూకము తనగూటికిఁబోయె. పిమ్మట శ్రీరాముఁడు అయోధ్యాపట్టణమునకుఁబోయె. అట్లు వాద్యగీతములతోఁగూడ పట్టణమునందుఁ బ్రవేశించి మరలజీవించిన యా యోష్టురునిఁ జూచి సంతోషమునుపొందె. అంతట నయ్యోష్టురును యథేచ్ఛముగఁ దమతమదేశములకుఁబోయిరి. పిమ్మట శ్రీరాముఁడు సీతాసమేతముగ నెల్లవారిచేతను స్తోత్రముచేయఁబడి మిగుల సంతోషమునుపొందె. ఆసమయమునం దయోధ్యాపట్టణమున మహోత్సవమయ్యె. ఈవిధముగ శ్రీరాముఁడనేకాద్భుతకార్యములను చేయుచుండె.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండమునందలి
పదియవసర్గ ముగిసెను.

✷ శ్రీరాముఁడు నలుగురుస్త్రీలకు వరదానమునుచేయుట. ✷

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! అంతట శ్రీరాముఁ డొకనాఁడు వేటకొఱకరణ్యమునకుఁబోయె. అప్పుడు సీతామహాదేవియును, చతురంగబలములును బంధుమిత్రామాత్యాదులుకూడ శ్రీరాముని వెంటనంటిపోయిరి. అంతట శ్రీరాముఁడు సీతామహాదేవి కయ్యరణ్యమునందు నానావిధములయిన కౌతుకములను జూపుచు వేటయందు మిగుల నాసక్తికలవాఁడయ్యె. మఱియు నప్పుడు శ్రీరాముఁడు పాదుకలచేతఁ గప్పఁబడిన పాదములుకలవాఁడును నల్లనితలగుడ్డకలవాఁడును, నీలగోధాంగులిత్రాణముకలవాఁడును, ధనుఃపాణియును, శరములుకలవాఁడును, అశ్వారూఢుఁడును ఖడ్గచర్మమును ధరించినవాఁడును, రాజులచేతను చతురంగబలముచేతను జుట్టఁబడినవాఁడునునైయుండె. అప్పుడు సీతామహాదేవి జాలరంధ్రములనుండి శ్రీరాముని మాటిమాటికిని జూచుచుండె. అంతట శ్రీరాముఁడు బంధువులు మంత్రిపుత్రులు మొదలగువారితోఁగూడ నానావిధక్రీడలను సలుపుచు పొదలయందు మృగములను వెదకుచుండె. మఱియు నోభటులారా! మృగముపరుగెత్తుచున్నది పరుగెత్తుచున్నది. కొట్టుఁడుకొట్టుఁడు అనియె. ఈవిధముగఁజెప్పుచు శ్రీరాముఁడుకూడ నెగిరిదుముకుచుండె. మఱియును, మిగుల రమ్యములును విపులములును అయినగాంధారవనములయందు సంచరించుచుండె. మఱియును సింహపరాక్రమమువంటి పరాక్రమముకల యా శ్రీరాముఁడాయరణ్యమునందలి నదులనెగిరిదుముకుచుండె. మఱియు నయ్యరణ్యమునందునలుదిక్కులను జూచుచుండె. ఆసమయమునందు వనమునందలి మృగములను నలుదిక్కులకును పాఱఁదోలుచుండె. ఒకానొకప్పుడు గజసమూహములను వేటా

డుచుండె మఱియు నిప్పుడు కోటరములయందలి శుకములు మొదలగునవి మనోహరముగ మాటలాడుచుండె. ఒకానొకప్పుడు లతాగృహములయందు నానావిధములయిన కౌతుకములను జూచుచు విశ్రమించుచుండె. మఱియు నారాముఁడు పుత్రమిత్రాదులతోఁగూడ వృక్షములనీడయందును, సుపుష్పములుకల స్థలములయందును లతాగృహద్వారములయందును, సర్పాదులచేత వ్యాప్తమైన ప్రదేశములయందును, పల్వలములయందును నడుమనడుమ విశ్రమించి బయలువెడలి పోవుచుండె. అంతట మధ్యాహ్నకాలమునందొక సరస్తీరమునకుఁ బోయిరి. అప్పుడు శ్రీరాముఁడు తనతో వచ్చిన సీతామహాదేవి మొదలగువారికి పరమానందమును గల్పించె. మఱియు నారాముఁడు సైన్యసమేతముగ మృగములను వెంబడించి పోవుచుండె. ఈవిధముగ శ్రీరాముఁడు సంచరించుచుండఁగ నయ్యరణ్యమునందు మిగుల భయంకరమైన కోలాహలధ్వని కలిగె. ఆసమయమునందు మిగుల వేగము కలదియును, తీక్ష్ణమైన కోరపన్నులుకలదియును, భయమును కలుగఁజేయునదియును, వనమును సర్వమును నాక్రమించుటయందుఁ దగిన సామర్థ్యముకలదియును భూమ్యంతరిక్షముల రెంటియందును సంచరించుచున్నదియును అయినసింహము, కుటిలములయిన నదీప్రవాహములచేత మిగుల గంభీరమైనదియును, కంటకవృక్షములచేత వ్యాప్తమైనదియును, తోడేళ్లు పెద్దపులులు మొదలుగాఁగల క్రూరజంతువులచేత వ్యాప్తమైనదియును, పర్వతములచేత భయంకరమైనదియును, మనుష్యరహితమును నైన యాయరణ్యమునందుఁ బ్రవేశించె. అప్పుడు శ్రీరాముఁడా సింహమును వెంటనంటి యొంటరిగ మిగుల దూరముగఁబోయె. మఱియు నాసమయమునందు శ్రీరాముఁ డశ్వారూఢుఁడై యుండె. అప్పుడు సకల వ్యాధులు దూతలు లక్ష్మణుఁడు మొదలగువారు రాముఁడు కనఁబడక పోవుటచేత భీతచిత్తులైరి. అంతట శ్రీరాముఁడా సింహమును నిజబాణముచేతఁ గొట్టె. పిమ్మట నాసింహము దివ్యరూపమును ధరించి శ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా ! పూర్వజన్మమునందు నేను విద్యాధరుఁడను. అప్పుడు నేను పతివ్రతయగు నొక మునిభార్యను బలాత్కారముగఁ బొందితిని. అంతట నేను శపింపఁబడి యీసింహరూపమును బొందితిని. మఱియు నప్పుడు నేననేకవిధముల ప్రార్థింపఁగా నయ్యమ యిట్లనియె. ఓరీ ! గంధర్వాధమా ! నీకు చిరకాలమునకు రామబాణమువలన శాపవిమోచనము కాఁగలదనియె. అందువలన నేనిప్పుడు నీబాణమువలన శాపవిముక్తుఁడనైతినని చెప్పి రామానుమతమునుపొంది యాగంధర్వుఁడు స్వర్గలోకమునకుఁబోయె. అంతట రామచంద్రుఁడుకూడ తురగారూఢుఁడును సంతోషము కలవాఁడును నై తానున్న పర్వతగుహాముఖ్య ద్వారమున క్షణముసేపు నిలిచె. అట్లు నిలిచి యాగుహాద్వారమున [illegible] నొకశిలనుజూచె. అట్లు మిగుల గొప్పదగు శిలనుజూచి తన ధనుష్కోటిచేత దానిని చిమ్మివైచె. అంతట నాగుహనుండి కొంతదూరముపో

యి తపస్సును చేయుచున్న నలుగురు స్త్రీలనుజూచె. ఆనలుగురును చర్మావశిష్టులై యుండిరి. అప్పు డా స్త్రీలకు శ్వాసలు వచ్చుచుండుటచేత నా స్త్రీలను జీవించి యున్న వారినిగాఁ దెలిసికొనియె. అంతట శ్రీరాముఁడు వారిదగ్గరకుఁబోయి యెదుట నిలిచి యిట్లనియె. ఓనారీమణులారా! మీరు వేరువేరుగ మీయభీష్టములగు వరములను గోరుఁడు. నేను రఘుకులోద్భవుఁడ నగు రాముఁడనని చెప్పె. అంతట నా స్త్రీలు రామసంస్పర్శమువలన మాంసరక్త ధాతువులచేత పూరితములయిన శరీరములు కలవారై తమదేహములను చూచుకొని మిగుల నాశ్చర్యమునుపొంది మాశ్రీరామునిజూచిరి. అప్పు డారాముఁడు కోటిమందిసూర్యులయొక్క ప్రకాశము వంటి ప్రకాశముకలవాఁడును, ధనుర్బాణములను ధరించినవాఁడును, హయారూఢుఁడును నై యుండెను. మఱియు నప్పుడు శ్రీరాముఁ డనేకరూపములను ధరించియుండెను. అట్టి రాములఁజూచి యా స్త్రీలు నలుగురును మిగుల నాశ్చర్యము కలవారై యిట్లనిరి. ఓపురుషోత్తములారా! మీరలెవ్వరు? మీరందఱును నశ్వారూఢులరై యున్నారు, మీరు దేవతలా? దానవులా? నీవిషయమును సర్వమును చెప్పుఁడు. మమ్ముల నేలఁ బలుకరించితిరి. శుష్కించిన మాదేహములు కమనీయములై యుండుటకు కారణమేమి? అత్యద్భుతుఁడగు దుందుభియను దైత్యుఁడు ఇప్పుడు జీవించి యున్నాఁడా? మృతినొందెనా? అనిన విని శ్రీరాముఁ డిట్లనియె. ఓనారీమణులారా! రాముఁడనగు నే నొక్కరుఁడనే నాలుగుదేహములతో నున్నాఁడను. మఱియును నేను సప్తద్వీప పతియును, సూర్యవంశోద్భవుఁడను నై యున్నాఁడను. నేను వేటకొఱకు నరణ్యమునకువచ్చి కేసరిసంహారించితిని. నాధనుష్కోటిచేత మీ గుహాకడ్డముగనున్న శిలనుదోచివైచి మీ దగ్గరకువచ్చితిని. నాహస్తస్పర్శముచేత మీ దేహములు శుభకరములయినవి. దుందుభియను రాక్షసుని సంహరించిన వాలిని నాబాణముచేత హతముచేసితిని. మఱియును, రావణుఁడను లోకకంటకునికూడ వధించితిని. మీ కభీష్టములయిన వరముల నియ్యందలఁచి యిప్పుడు నేను మిమ్ములఁ బలకరించితిని. ఇప్పుడు నా కీయరణ్యమునందు కార్యమేదియును లేదు కనుక మరల నయోధ్యాపట్టణమునకుఁ బోవుచున్నాఁడను. మీరడిగిన విషయమునకు తగిన సమాధానమును చెప్పితిని. మీ రెవ్వరో మీ యభిప్రాయమును దెలుపుఁడు. దుందుభియొక్క మరణమునుగుఱించి యడుగుటకుఁ గారణమేమి? అనిన విని యా స్త్రీ లందఱును దుందుభి మరణమును పొందుటకును తమ గుహాద్వారమున కడ్డముగ వైచిన శిలను దోసివైచుటకు సంతోషించి యా శ్రీరామునితో నిట్లనిరి. ఓ రఘుకులోత్తమా! మేము నల్వురమును బ్రాహ్మణకులమునందుఁ బుట్టినవారము. మాతోఁగూడ నమితముగ క్షత్రియ వైశ్య కన్నియలఁగూడ దుందుభియను రాక్షసుఁడు గొనివచ్చె. అనంతరమందు ఆదుందుభి యేక కాలమునందు లక్షసంఖ్యాక కన్నియల వివాహమును చేసికొనియెదనని యాదుం

దుభి నిశ్చయించె. మఱియు నాదుందుభి తానుగొనివచ్చిన స్త్రీరత్నముల నీబిలమునందుంచి ద్వారమున కడ్డముగ శిలనుంచె. అదిమొదలుకొని మేమిక్కడ నివసించియుంటిమి. మాకగ్రభాగమునం దింకను ననేక స్త్రీలు గలరు. మేమందరమును వాయుపర్ణాశనులమై విష్ణుదేవునియందు సమర్పింపఁబడిన చిత్తములతో నున్నార మనిరి. ఆవచనములను విని శ్రీరాముఁడు నేను సాక్షాద్విష్ణుదేవుఁడనియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యములను విని యాకన్నియ లిట్లనిరి. ఓ రఘుకులోత్తమా! నీవు సాక్షాద్విష్ణుదేవుఁడవు కనుక నీనిజరూపమును చూపుమనియె. అంతట శ్రీరాముఁడు తననిజరూపమును జూపె. అప్పు డానల్వురుస్త్రీలును విష్ణుదేవునిజూచి సాష్టాంగనమస్కారములను జేసిరి. అంతట నావిష్ణుదేవుఁడో కన్యలారా! ఇప్పుడైనను మీసందేహము తీరెనదా? అనిన నాయంగన లిట్లనిరి. ఓదేవోత్తమా! నిన్ను దర్శించుటచేత మాకు భవభయముపోయినది. సమస్తదుఃఖములును నశించిన వనినవిని యారాముఁడు మరల శ్రీరామ రూపమునుధరించి యోయంగనలారా! మీ కభీష్టమైన వరమును గోరుకుఁడనియె. అప్పు డయ్యంగనలందఱును మన్మథబాణములచేత పీడింపఁబడినవారై యిట్లనిరి. ఓ రఘుకులోత్తమా! నీవిప్పుడు గాంధర్వవిధిచేత మాకుభర్తవై మాతోఁగూడ నిప్పుడే సురతక్రీడల సలుపుము. పిమ్మట మమ్ముల నీపట్టణమునకుఁ దీసికొని పొమ్మనిన విని శ్రీరాముఁ డిట్లనియె. ఓ యంగనలారా! నేను ఏకపత్నీవ్రతము నవలంబించినవాఁడను. నే నసత్యమును పలుకువాఁడనుగా ననియె. అంతట నయ్యంగనలందఱును విహ్వలచిత్తముకలవారై భూతలమునందుఁ బడిరి. అప్పుడు శ్రీరాముఁ డిట్లనియె. ఓ యంగనలారా! ద్వాపరయుగమునందు నేను కృష్ణుఁడనై జన్మించెదను. ఆసమయమునందు నాతోఁగూడ సురతసుఖముల ననుభవింపుఁడు. ఆద్వాపరయుగమునందు మీరు నల్వురును గ్రమక్రమముగ మిత్రవిందనాగ్నజితీ మద్రలక్ష్మణ అనునట్టి నామధేయములు కలవారగుదురు. మఱియు నాకాలమునందు మీరందఱును నన్నుఁ బెండ్లియాడెదరు. కావున నప్పుడు నానావిధములయిన సుఖముల ననుభవింపుఁడనిన విని యాయంగనలు కించిత్సంతోషము కలవారై యోరఘుకులోత్తమా! నీవు ముందరనడువుమనిరి. అంతట నారాముఁడు తురగారూఢుఁడై యాయంగనలతోఁగూడఁ గొంచెముదూరము నడిచె. అట్లు యోజనపరిమితికల దూరమునడువఁగానె యక్కడ పదునారువేలమంది స్త్రీలుండిరి. వారందఱును మూయఁబడిన నేత్రములుకలవారును శుష్కించిన యవయవములు కలవారును నైరి. మఱియును, దగ్ధమైన యౌవనముకలవారై యుండిరి.

ఇట్లు శ్రీ యానందరామాయణాంతర్గత రాజ్యకాండమునందలి
పదునొకండవసర్గ ముగిసెను.

* పదునారువేలస్త్రీలకు శ్రీరాముఁడు వరదానమును చేయుట. *

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! అనంతరమందు శ్రీరాముఁడు తెల్లగా దన హస్తముచేత నాస్త్రీలనందఱను స్పృశించె. అప్పుడు ఆస్త్రీలందఱును తారుణ్యము చేత నిండినమనస్సుకలవారైరి. అనంతరమా దాస్త్రీలందఱును తమపూర్వవృత్తాంతము సర్వమును దెలిపిరి. అంతట శ్రీరాముఁడు వారలనభీష్టములయిన వరములను గోరుఁడనియె. అప్పుడా స్త్రీలందఱును దుందుభియనురాక్షసుఁడు మరణమునుపొందినవృత్తాంతమును సర్వమునువిని మిగుల సంతోషము కలవారైరి. మఱియు నా సమయమునందు శ్రీరాముఁడా పదునాఱువేలమందికిని పదునాఱువేలరూపములతో గనఁబడియె. అంతట నాస్త్రీలందఱును రామరూపములనుజూచి పరాత్పరుండైన విష్ణువునుఁగాదలఁచిరి. పిమ్మట నాస్త్రీలందఱును మాకు భర్తవగుమని ప్రార్థించిరి. అనంతరమందు శ్రీరామునివలన నేకపత్నీవ్రతస్థుఁడనని చెప్పినమాటను విని వారందఱును దమలోఁ దామాలోచించియిట్లనిరి. ఓయంగనా! ఈరాముఁడు నాచేత వరింపఁబడియె. నీవును నీరామునివరించితివి. కావున మనమందఱమును బలాత్కారముగ నీరామునితో సురతక్రీడలను సలుపుదమని యాలోచించిరి. అంతట శ్రీరాముఁడు వారియభిప్రాయమును దెలిసికొని శ్రీరాముఁడిట్లనియాలోచించె. ఆహా! యీస్త్రీలందఱును బలాత్కారముగ నన్ను ననుభవించుట కాలోచించుచున్నారు. బ్రహ్మరుద్రేంద్రాదులును సిద్ధులు మునులు మొదలగువారును స్త్రీలచేత మోహింపఁబడిరి. స్త్రీలయొక్కతీక్ష్ణములయిన కటాక్షేక్షణములచేతఁ జూడఁబడిన పిమ్మట లోకములో నెవ్వఁడు మోహమును చెందఁడు. లోకములో స్త్రీలయొక్క కటాక్షేక్షణములు మీదఁబడువఱకును పురుషులకుచిత్తత, సత్కులప్రసూతత్వము, తపఃప్రగల్భత, నియమవ్రతములు మొదలగునవి కలిగియుండునుగాని యన్యముఁగాదు. ఆహా! ధర్మరక్షణపరుండనైన నన్నుఁగూడ నీస్త్రీలందఱును మోహమును పొందించుచున్నారు. మఱియును, మాంసరక్తమలపూరితమును గుణరహితమును, అపరిశుద్ధమును, అయిన స్త్రీశరీరమునందు మోహమును పొందుటకంటె నవ్యక్తమైన కార్య మేదియును లేదు. కావుననే "దారుణో హి పరకీర్తితో ఙ్గనా సన్నికర్షో విమలబుద్ధివర్తిభిః" (స్వచ్ఛమైనబుద్ధికలవారు స్త్రీసాన్నిధ్యము మిగుల భయంకరమైనదని చెప్పిరి) కాఁబట్టి యీస్త్రీలందఱును సమీపించునంతలోపల నదృశ్యత్వమును పొందెదను. మిగుల నిర్మలమైన నాయేకపత్నీవ్రతమును నేనెట్లు విడువఁగలను. ఏకపత్నీవ్రతస్థుఁడనగు నన్నీయంగన లేమిచేయఁగలరని శ్రీరాముఁడు నిశ్చయించి యక్కడనే స్థిరుఁడై యూరకుండె. ఇంతలోపల నాస్త్రీలందఱును నా రాజోత్తమునితో నిట్లనిరి. ఓరఘుకులోత్తమా! మేమందఱమును నిన్ను వరించితిమి. కావున నీవిషయమునఁ గడు విచారమును పొందనక్కరలేదు. మఱియు నో రామచంద్రా! పార్థివుఁడవగు నీకు నేకపత్నీవ్రతమన నేమి? ఒకవేళ నేకపత్నీవ్రతము నవలంబించితివేని యదిసంపూర్ణతను

పొందినది. కావున నిష్ఫలమైన వ్రతమునకుఁదగిన ఫలము ననుభవింపుమని చెప్పి యా స్త్రీలందఱును మిగులవేగముగ రామునిదగ్గరకుఁబోయిరి. అంతట నెల్లవారును స వ్యాపసవ్యబంధముచేత భుజపాశములనుచేసిరి. ఆవచనమునువిని శ్రీరాముఁడు వారి తో నిట్లనియె. ఓయంగనలారా! మీరు చెప్పినవాక్యము అనుకూలమును భద్రము నునైయున్నది. అయినను వ్రతమునవలంబించిన నాకుమాత్రము యోగ్యమైనదికా దు. కాఁబట్టి మీరుదుఃఖమును పొందకుఁడనిన విని యాయంగన లిట్లనిరి. ఓరఘుకు లోత్తమా! ధర్మమువలన నర్థము అర్థమువలన కామము కామమువలన ధర్మఫ లోత్పత్తియగునని విద్వాంసులు శాస్త్రములయందు నిశ్చయించిరి. అట్టికామము వ్రతబాహుళ్యమువలన నిప్పుడు నీముందర వచ్చియున్నది. కాఁబట్టి మాతోఁ గూడ నానావిధములగు సురతసుఖముల ననుభవింపుము. ఇదిస్వర్గభూమి యనిన విని శ్రీరాముఁడు వారితో నిట్లనియె. ఓయంగనలారా! మీకుఁగావలసిన వరముల నిచ్చెదను. మీవచనములను విననని వాని యా స్త్రీలందఱును నిట్లనిరి. ఓ రఘుకు లోత్తమా! దివ్యౌషధము రసాయనము, సిద్ధి, నిధి, సద్విద్య, వరాంగన, మంత్ర ము, అన్నోదకములు, అనునవి తమంతటఁదాము వచ్చెనేని నిషేధింపఁగూడదని యార్యులు పలుకుదురు. నీతివేత్తలగువారు దైవవశమువలనవచ్చిన సిద్ధియం దుపే క్షను జేయరు. ఉపేక్ష యెట్లుఫలమును కలుగఁజేయదో అటులనే దీర్ఘాలోచనకూడ ఫలమును కలుఁగజేయదు. మఱియు నో రామచంద్రా! దిట్టమైన యనురాగముకల వారును, సత్కులజన్మముచేత నిర్మలమైనవారును, స్నేహముచేతఁ దడపఁబడిన చిత్తముకలవారును, చక్కఁగ మాటలాడువారును, తమంతటఁదామే వరించినవారు ను, చక్కఁగ యాకృతికలవారును, పరిపూర్ణమైన యవ్వనముకలవారును, అయిన స్త్రీలనుపొందువారే ధన్యులుగాని యితరులు ధన్యులుగారు. ఓరఘుకులోత్తమా! ఈచక్కఁదనమెక్కడ? ఏకపత్నీవ్రతమెక్కడ? ఇవిరెండును నొక్కచోట నుండున వికావు. కావున నిప్పుడు మమ్ముల నిరాకరించుటతగదు. గాంధర్వవివాహముచేత మమ్ముఁ బరిగ్రహింపుము. ఇంతకంటె వేఱుగ నాలోచింపకుము. అనినవిని శ్రీరా ముఁడు మరలనిట్లనియె. ఓమృగాక్షులారా! ధర్మాత్ములగువారు ధర్మమును విడు వఁదగదు. మఱియు నో యంగనలారా! ధర్మార్థకామమోక్షములు నాలుఁగును శాస్త్రోక్తప్రకారముగ ననుభవింపవలయును. విపరీతముగ ననుభవించినయెడల పా పముకలుగును. నేనుచెప్పిన యేకపత్నీవ్రత మసత్యమైనదికాదు. ఓయంగనలారా! ఈజన్మమునందు నేనీవ్రతమును విడిచిపెట్టువాడను గానని యె. ఇట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యములనువిని యా స్త్రీలందఱు నొకరినొకరు చూచుకొని శ్రీరామునిపా దములను బట్టుకొనిరి. మఱికొందరు స్త్రీలు రామునిఁజుట్టుకొనిరి. ఇట్లుస్త్రీలచేతఁ జుట్టఁబడిన రాముఁడు అంతర్ధానమును పొందినయెడల నీ స్త్రీ లేమిచేయఁగలరో యని తలఁచి గుప్తరూపుఁడయ్యె. అప్పుడా స్త్రీలందఱును శ్రీరాముఁడు కనఁబడక పోవ

టచేత విస్మయావిష్టచేతస్కులైరి. మఱియు నా స్త్రీలందఱును నామతేళ్లవలె కాతర చిత్తములవారైరి. మఱియు నెల్లవారును సంభ్రాంతమైన చిత్తములవారై యి ట్లనిరి. ఓ రఘుకులోత్తమా! ఇంద్రజాలమాయను విడిచిపెట్టుము. నీ స్వరూపము నుజూపుము. మా హృదయములు కామాగ్నిచేత తప్తములయియున్నవి. నీహృదయమిట్లు నిర్దయ గలదియగుటకు కారణమేమి? మమ్ముల నిట్లుబాధపెట్టుట యుచితముగాదు. ఓ రఘుకులోత్తమా! నీకు మాయందు విశ్వాసము లేదా? మాయం దిష్టమే లేదా? నీవు మాయావిశారదుఁడవై మమ్ముల నాడించెదవా? నీకు మా చిత్తములయందుఁ బ్రవేశించుటకుఁ దగిన విజ్ఞానసామర్థ్యము కలదా? మాయందు దప్పు లేకయే నీవు కోపమును చెందుటయుచితమా? పరులయొక్క విప్రలంభదుఃఖమును నీ వెఱుఁగవా? ఓ ప్రాణేశ్వరా! నీదర్శనము లభింపనియెడల మేము మరణమును బొందెదము. మఱల నీదర్శనము కలిగినయెడల జీవించెదము. ఓ రఘుకులోత్తమా! నీ వెక్కడ నుంటివో యక్కడకు మమ్ములఁ గూడఁ దీసికొనిపొమ్ము? సర్వకాలములయందును మాకు నీదర్శనమునొసంగి కారుణ్యమును జూపుము. సజ్జనులగువారు కీడుగలుగు వఱకును నుపేక్షింపరు గదా? అని యనేకవిధముల విలపించుచు చిరకాల మరణ్యమునందు సకలదిక్కులయందును దిరుగుచుండిరి. మఱియు నాసమయమునందు స్త్రీలా చెట్టుదగ్గరకుఁబోయి మాభర్తనుఁ జూడలేదా? అని యడుగుచుండిరి. ఈవిధముగ నా స్త్రీలందఱును రామవియోగదుఃఖమును సహింపఁజాలక యడుగుచుండిరి. మఱియు నో పిప్పలవృక్షాధిపా! రాముని నీవు జూచితివా? నిన్ను శరణమును బొందితిమి. కావున మా రాముని జూచినయెడలఁ జెప్పుమని యడిగిరి. మఱియు నో తులసివృక్షమా! మా నాథుడగు రాముని నీవు చూడలేదా? ఓ వానరమా! నీవు మా ప్రభువగు రామునిఁ జూడలేదా? ఓ కోకిలా! నీవు మంగళకరములయిన ధ్వనులను జేయుచున్నావు కదా? ఈయరణ్యమునందు జానకీకాంతుఁడగు రామునిఁ జూచినయెడల దెలియజేయుము. ఓ కదంబవృక్షమా! దీననాథుఁడును, లక్ష్మీపతియును, సీతాపతియును, అగు రాముని నీవుచూచితివా? ఓ చిలుకమా! నీవుమాటలాడుచున్నావు కదా? మా రామునిఁ జూచితివా? లేదా? తెలుపుము. ఓ గజేంద్రమా! సప్తద్వీపాధిపతియగు రాముని జూచితివా? ఓ శుకమా! మా రాముని జూచినయెడల జెప్పుము. పావనమైన యోమహుగా! నీవెనను మా రాముని జూడను దెలుపక యూరకుండుట నిజమా? ఓ వాయుదేవా! ఇప్పుడు నీవు సీతారాముని జూచితివా? అని యా స్త్రీలందఱును విలపించిరని చెప్పి యా రామదాసు మరలనిట్లనియె. ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! ఈవిధముగ నా స్త్రీలందఱును రామవియోగవ్యసనముచేత దుఃఖించిరి. అనంతరమం దా స్త్రీలందఱును గండకీతీరమునకుఁ బోయి యిట్లని గానముచేసిరి. "శ్లో॥ కిం ప్రభో త్వయా జానకీయదా తేన రక్షసారణ్యమధ్యతః । స్వస్థలం హృతా గాత మీతలా తత్కృతే త్వయాన్న వశోచిషమ్॥ త్వద్వియోగత స్తథా మానసాస్సర్వతోవశే శోకమాగతాః॥

ఏకదా ప్రభో దేహి దర్శనం దేహినో వరాన్స్మస్తునోరతిః॥ నో వాంఛామో రాఘవ త్వ
త్తో రతిమద్య, యద్వద్దత్తం భూసురాజ్ఞ్యై వరదానం। తద్వన్న స్త్వం పూరయ
కామాన్వరదానైర్వాం ధామ స్తే సేవనమగ్రే జననేపి॥ అస్మాభిర్యచ్చంచలభావా ద
పరాద్ధం తత్సర్వం త్వం మా స్మర పూర్వం కారుణాతః। సః ప్రాణా స్తే దర్శన హేతో స్తను
మధ్యే। తిష్ఠంతి త్వాం పల్లవ యాచామ్యక్రియ తేద్య॥ భో భో రాఘవమారుష్టత్వం క్రో
ధం మా భజ దాసీష్వద్య। పర్యంతం సహి పశ్యం తీర్థం వాంఛా మో న హి త్వత్తః కా
మమ్॥ దేహి త్వం నిజదర్శనలాభం జన్మన్యగ్రే ర్పయ వరదానం। పాహి త్వం శర
ణాగ హ్యూపయాతా స్సర్వాస్తారయ నః ప్రణమామః రామ త్వం కిం నిర్దయ హృద
య స్త్వపి నః కిం। నాయాత్యద్య శ్రీజనకరుణా హృదయేతే। ఇత్థం క్రోధం త్వ
త్పదయుగలే పతితాసు, కర్తుం విష్ణో నార్హసి వరదో భవ నోద్య॥ బాలే దీనే శ్రీజన
వినుతే తనయే స్వేనో కుర్వంతిత్థం బహువిమలా మతిమంతః। క్రూరం కోపం త్వం
త్యజ వరదో భవ నోద్య। వారం వారం కరకమలైస్త్వాం ప్రణమామః॥ హే నాథ రా
ఘవ రమేశ్వర రావణారే సీతాపతే రిపునిషూదన కంజనేత్ర। త్వం దేహి రామ నిజద
ర్శన మధ్య విష్ణో దుఃఖార్ణవాత్సరితటం నయ కామినీర్నః॥ త్వత్పాదపద్మ నరసేవన
మాశ్రయామో। జన్మాంతరే గురుదయాం కరుణాసముద్ర। నో చేత్త్వదీయవిరహా
న్నిజజీవితాని త్యక్ష్యామ ఏవ నియతం సహసా హ్యసింధ్వాః॥" అని యాస్త్రీలం
దఱును గానము చేసిరని చెప్పి యారామదాసు మరల నిట్లనియె. ఓ శిష్యోత్తమా!
విష్ణుదాసా! ఈవిధముగ నాస్త్రీలు చేసిన గానమును విని శ్రీరాముఁడు స్త్రీలకు ప్రత్య
క్షమయ్యె. అంతట నాస్త్రీలందఱును శ్రీరామునిఁ జూచి మిగుల సంతోషముకల
వారును వికసించిన నేత్రములు కలవారును నైరి. ఈస్త్రీలగానమును మానవులు
వినినను పఠించినను సర్వాభీష్టములను పొందుదురు. కావున సర్వకాలములయందు
ను నీగీతమును గానము చేయవలయును. అట్లు ప్రత్యక్షమైన పిమ్మట నారాముఁ
డు ఆస్త్రీలకు వరములనిచ్చి సంతోషమును పొందింపఁదలఁచి యిట్లనియె. ఓయం
గనలారా! నావాక్యమును వినుఁడు. నేను దొల్లి వ్యాసునకెదుట పదునారగు సువ
ర్ణస్త్రీరూపముల దానము చేసితిని. దానివలన బ్రాహ్మణులందఱును సంతోషము
నుపొంది పదునాఱువేల స్త్రీలు నీకుఁ గలుగుదురనిరి. కావున ద్వాపరయుగమునందు
నేను కృష్ణరూపమునుధరించి మిమ్ములఁ బరిగ్రహించెదను. కావున మీరు ద్వాప
రయుగమునందు నానావిధరాజులకు పుత్రికల రగుఁడు. అప్పుడు దుందుభియనువాఁ
డు నరకాసురుఁడై పుట్టును. ఆనరకాసురుఁడు మిమ్ములనందఱ నపహరించును. అం
తట నేను మిమ్ములను విడిచిపెట్టుదును. మఱియు నానరకాసురుని సంహరించెద
ను. అంతట మీరందఱును నాతోఁగూడ సుఖముగ సురతసుఖముల ననుభవింపఁ
గలరనియె. ఈవిధముగ శ్రీరాముఁడు చెప్పినవాక్యములను విని యాస్త్రీలందఱు
ను పరమానందము కలవారైరి. ఇంతలోపల లక్ష్మణాదులు శ్రీరాముని వెదకుచు

నవ్వోటనకు నెగుదెంచిరి. వచ్చి పదునాలుగువేల స్త్రీలనడుమనున్న శ్రీరామునిం జూచి మిగుల నాశ్చర్యమునుపొందిరి. అంతట శ్రీరామునివలన సర్వము ను విని యెల్లవారును సంతోషమునుపొందిరి. అనంతరమందు రామాజ్ఞచేత దూతలుపోయి నానావిధములయిన యానాసనాదుల దెచ్చిరి. పిమ్మట శ్రీరాముండా స్త్రీలనందఱను వాహనములమీద నెక్కించుకొని సీతామహాదేవిదగ్గఱకు దీసికొనిపోయె అంతట నా స్త్రీలందఱును సీతామహాదేవికి నమస్కరించిరి. అప్పుడు శ్రీరాముండు జరిగినవృత్తాంతమును సర్వమును సీతామహాదేవికిం దెలిపె. అంతట శ్రీరాముండు సీతతోంగూడ బయలువెడలిపోయి మిగుల మనోహరమైన యా సరస్సుదగ్గఱకుంబోయె. అట్టి సరస్సునుజూచి సీతారాములు సంతోషమునుపొందిరి. పిమ్మట నాసరస్సునందు స్నానముచేసి మాధ్యాహ్నిక క్రియలను నెరవేర్చిరి. అనంతరమందు వేటకు వచ్చిన వారితోంగూడ నచ్చట భోజనమునుచేసె. పిమ్మట మనోహరములయిన కథలను చెప్పికొనుచు నాసరస్తీరమునం గూర్చుండిరి. పిమ్మట ధనుస్సునందు బాణమును సంధించి వనమునం దంతటను ఉరులను వద్ది యెల్లవారును నిద్రించుచుండిరి. అంత నర్ధరాత్రసమయమున నడవి పందులగుంపుఁ బయలు వెడలఁగానే రామభటులందఱును వానిని దరిమిరి. అంతట రాముండును వానిమీదం బాణములను ప్రయోగించె. అప్పుడా యడవిపందులన్నియును రామబాణములచేత విద్ధములై క్రిందబడియె. అట్లు అవియన్నియును మరణమును పొందినతోడనే యా వ్యాధులందఱును మిగుల నధికమగు కోలాహలధ్వనిని గల్పించిరి. ఈవిధముగ శ్రీరాముం డేనుదినములు వనమునందు సుఖముగనుండి నానావిధములయిన భోగముల ననుభవించి తనపట్టణమునకు సీతామహాదేవి మొదలగువారితోంగూడ మరలిపోయె. అనంతరమందు రఘుకులోత్తముండగు రాముండు బ్రాహ్మణక్షత్రియ వైశ్యులను రప్పించె. పిమ్మటం దాను దోడ్కొనివచ్చిన కన్నియలకు వస్త్రాభరణాదుల నొసంగె. వారందఱును నావస్త్రాభరణాదులచేత నలంకరింపంబడి మరలం దామప్పుడే పుట్టితిమని తలంచిరి. అనంతరమం దాకన్నియలందఱును వారివారిజాతి బాలురను వివాహితులైరి. మఱియు నాపట్టణమునం దెల్లవారును నానావిధములయిన పుణ్యవ్రతములను సల్పుచుండిరి. వివాహకాల మతిక్రమింపక మునుపే యెల్లవారును వివాహములను జేసికొనిరి. అనంతరమందా శ్రీరాముండు సీతాసమేతముగ సుబాహుపుత్రుని వివాహముకొఱకు మధురాపట్టణమునకుంబోయె. అప్పుడు పౌరజనపదులుగూడ నా శ్రీరాముని వెంటనంటిపోయిరి. అంతట నామధురాపురమునందు వివాహమును జరిపి కొంతకాలము న్వూరును నక్కడనే నివసించె. పిమ్మటనొక్కనాడు జానకీవాక్యమువలన కాళిందీనదియొక్క సైకతమునందు రాత్రికాలమున సువర్ణ పర్యంకముమీద సుఖముగ నిద్రించె. ఆసమయమందు శ్రీరాముని పాదపాజనము నిద్రించుటనుగని కాళిందీనది స్త్రీరూపమును ధరించివచ్చి శ్రీరామునిపాద

ములను స్పృశించె. అంతట రాముఁడు మేల్కాంచి తన కెదుటనున్నదియును, సూర్యునకు పుత్రికయును నగు కాళిందినిజూచె. ఆసమయమునం దాకాళింది దివ్యాలంకారములచేత నలంకరింపఁబడినదియును, దివ్యములగు నూపురములయొక్క ధ్వని కలదియును, నీలోత్పలదళములవలె నల్లనికాంతి కలదియును, సువర్ణకలశములవంటి స్తనములు కలదియును, నవ్వుమోము కలదియును, అరటిస్తంభములవంటి తొడలు కలదియును, కింకిణీజాల మాలికలుకలదియును, కేయూరకుండలములతోఁ గూడుకొన్నదియును, మిగుల నున్నతమగు జఘనప్రదేశము కలదియును, అయియుండె. అట్టి కాళిందినిజూచి యారాముఁడు క్షణముసేపూరకుండె. అంతట నీకాళిందిని రచించి బ్రహ్మదేవుఁడు కృతార్థుఁడయ్యెనని తలఁచె. అట్లు తలఁచి యాకాళిందియొక్క సౌందర్యమునకు మిగుల నాశ్చర్యమునుపొందె. అనంతరమం దోయంగనా! నీవిక్కడకు వచ్చుటకు కారణమేమని యడిగిన నయ్యంగన యిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీవెఱుఁగనిది యేదియును లేదని యాకాళింది లజ్జావనతవదన యయ్యె. అప్పుడు శ్రీరాముఁడు ననేకపత్నీవ్రతము కలవాఁడనని చెప్పి మఱియు నిట్లనియె. ఓ కాళిందీ! ఈజన్మమునందు నీయభీష్టమును దీర్చుటకు వీలులేదు. కావున నీవు నీస్వస్థలమునకుఁ బొమ్మనియె. అంత నాకాళింది మదన బాధకుఁ దాళక మూర్ఛనుపొందె. అట్లు మూర్ఛనుపొందిన కాళిందినిజూచి శ్రీరాముఁడు లెమ్మని చెప్పి యిట్లనియె. ఓకాళిందీ! నావచనమును వినుము. ద్వాపరయుగమునందు కృష్ణరూపముతో నీకు భర్తనయ్యెదను. కావున నప్పుడు నీయిష్టానుసారముగ సుఖముల ననుభవింపవచ్చును. నీవు నీ స్థలమునకుఁ బొమ్మనియె. ఇవ్విధముగ శ్రీరాముఁడు చెప్పినవాక్యములనువిని యాకాళింది శ్రీరామపదారవిందములను స్పృశించుచుఁ దనదు స్వస్థలమునకుఁబోయె. అంతట శ్రీరాముఁడును స్వస్థలమునకుఁబోయె. ఈవిధముగ శ్రీరాముఁ డనేకములును పాపరహితములునునగు నడవడికలనుజూపె.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండమునందలి
పూర్వార్థము పదిరెండవసర్గ ముగిసెను.

✷ అశ్వత్థహాసితము హాస్యముక్తియును చెప్పుట. ✷

శిష్యోత్తముడవైన యోవిష్ణుదాసా! అంతటనొకనాఁడు శ్రీరాముఁడు మిత్రులతోఁగూడ సభయందుఁ గూర్చుండి చామరములచే వీచబడుచు లక్ష్మణునితోఁగూడ మిగులమనోహరుఁడై ప్రకాశించుచుండె. ఇంతలోపల సభయందున్న యొక పురజనోత్తముఁడు వారాంగనలయొక్క నృత్యాదికమునుచూచి పరిహాసమునుచేసె. ఆహాస్యమునువిని శ్రీరాముఁడు పూర్వవ్యాపారమునుస్మరించె. తొల్లి యుద్ధసమయమునందు శ్రీరాముని బాణములచేత నెగఁగొట్టఁబడిన రావణునిశిరస్సులు శ్రీరామునకు నమస్కారమును జేయుటకు భూమికివచ్చుచుండె. అప్పుడు శ్రీరాముఁడు తననుఁ

కొట్టుటకు వచ్చుచున్నాననియెడు భయముచేత మరల బాణమును ప్రయోగించి యాతఁడీషుమున కేగుఁగొట్టె. ఆవృత్తాంతమును సర్వమునుస్మరించి నూయికులజు వారీసభయందున్నారనియె. అంతట హాస్యమునుచేయుట యుచితముకాదని తలఁచి లక్ష్మణునిపిలిచి యిట్లనియె. ఓలక్ష్మణా! ఈపట్టణములోనివారెవ్వరును పగులను హాస్యము చేయఁగూడదనియును, ఎవ్వరైనను నవ్విన యెడల దండింపఁబడుదురని యును, చాటింపుచేయింపుమనియె. ఆవృత్తాంతమునువిని లక్ష్మణుఁడు వల్లెయని దుందుభిఘోషములచేత చాటింపునుచేయించె. అంతట నదిమొదలుకొని యయోధ్యాపట్టణమునందలి వారందఱును నవ్వునువిడిచిపెట్టిరి. మఱియు నవ్వునుగలిగించుటకు కారణములయిన వారాంగనలయొక్క నృత్యగీతములను నటనగీతాదులను స్త్రీపురుషులతోఁగూడ నానావిధములయిన యుత్సవాదులను మంగళకృత్యములను హాస్యకరములయిన కర్మములను అయోధ్యాపట్టణమునందలి వారందఱును విడిచిపెట్టిరి. మఱియు నదిమొదలుకొని యొక్క సంవత్సరకాలము సప్తద్వీపవాసులును రామదండభయమువలన శుభకార్యములనునిలిపిరి. మఱియును,లోకములో నెవ్వఁడును నవ్వకయుండె. మఱియును లోకములోనివారందఱును దేవపూజాదికమునుఁగూడ విడిచిపెట్టిరి. అప్పుడు దేవేంద్రుఁడు బ్రహ్మయొద్దకుఁబోయి యావృత్తాంతమును సర్వమును దెలిపె. అంతట బ్రహ్మదేవుఁడు దేవేంద్రుఁడు మొదలగువారితో నిట్లనియె. ఓదేవోత్తములారా! మీరుభయమును పొందకుఁడు. నేను దగినయుపాయముచేత మీకు హితమును చేసెదనని చెప్పి యాదేవతలనుబంపె.పిమ్మట నాబ్రహ్మదేవుఁడు బ్రహ్మలోకమునకుఁబోయి యయోధ్యాపట్టణ సమీపమునందున్న యశ్వత్థవృక్షముయొక్క మధ్యయందుఁ బ్రవేశించి వచ్చుచుఁ బోవుచున్న జనులను పరిహసించుచుండె.ఇంతలోపల కట్టెలమోపును మోపికొని వచ్చుచున్న యొకపురుషుఁడా యశ్వత్థముచేయుచున్న పరిహాసమునువిని యత్యధికముగ నవ్వె. పిమ్మట నాపురుషుఁడు పట్టణములోనికిఁబోయి కట్టెల నమ్ముచు నశ్వత్థవృక్షము చెప్పిన మాటలను దలఁచుకొని పకపకనవ్వె.అట్లునవ్వుటను రాజదూతచూచి వానినివారింపఁజాలక రామసభలోనికిఁబోయి యావృత్తాంతమును జెప్పఁబోవుచుఁ దానుగూడ నవ్వె. వాఁడు నవ్వుటనుజూచి సభలోని వారందఱును నవ్విరి. మఱియు నప్పుడు శ్రీరాముఁడును పకపకనవ్వె. అంతట శ్రీరాముఁడు నేనేల నవ్వితిని. లోకములోని వారునవ్విన యెడల దండింతునని నేనాజ్ఞను చేసితినిగదా? నన్ను దండించువాఁడెవ్వఁడు. పురజనులందఱును నన్నుఁబరిహాసింపరా? నానడత బాగుగనుండలేదు. కావున నేనుచేసినశాసనము యుచితముగ నుండలేదని తలఁచి మరలనవ్వె. తనకుఁగలిగెడు నవ్వును దానేనిలిపికొనలేకపోయె. అంతట నాశ్రీరాముఁడు పురజనులతోనిట్లనియె. ఓపురజనోత్తములారా! మీరందఱును ముందుగనేలను నవ్వితిరి. మీరందఱునునవ్వి నాకును నవ్వునురప్పించితిరి. ఇట్లుచేయుటకు కారణమేమనినవిని యాపురజనులిట్లనిరి.

ఓరఘుకులోత్తమా! నీదూతయొక్క హాస్యమును జూడఁగానే మాకు నవ్వుకలిగినదనిన శ్రీరాముఁ డాదూతనుబిలిచి యిట్లనియె. ఓరీ! భటుఁడా! నీవునవ్వుటకు గారణమేమని నవిని యాభటుఁడు భారవాహకుని వృత్తాంతమునుఁ దెలిపె. అంతట శ్రీరాముఁడు దూతలనుబంపి యాభారవాహకుని రప్పించి యిట్లనియె. ఓరీ! భారవాహకా! భయమునుపొందక నీవునవ్వుటకు దగిన కారణమును చెప్పుమనినవిని యాభారహారవాహకుఁడు గడగడ వణకుచు నిట్లనియె. ఓరఘుకులోత్తమా! నేను మార్గమున వచ్చుచుండఁగా నీయయోధ్యాపట్టణ సమీపమున నొకయశ్వత్థ వృక్షమును చూచితిని ఆ యశ్వత్థవృక్షము హాస్యమును చేయుచుండె. ఆహాస్యము జ్ఞప్తికివచ్చి నేను రాజసన్నిధియందు నవ్వితిననిన విని శ్రీరాముఁడు మిగులనాశ్చర్యమునుపొంది యాభారవాహకునిమాటలు నిజములగునో కానివో తెలిసికొనిరండని దూతలనుబంపె. అంతట రామదూతలు బయలువెడలిపోయి యాయశ్వత్థ వృక్షమును జూచిరి. అప్పుడాయశ్వత్థ వృక్షమును జూచియు పరిమితమగు నవ్వుకలవారై యతివేగముగ శ్రీరామునిదగ్గరకువచ్చి యశ్వత్థ వృక్షముయొక్క హసితమును శ్రీరామునకు దెలిపిరి. ఆవృత్తాంతమునువిని శ్రీరాముఁడునుండ మిగుల నాశ్చర్యమును పొందినవాఁడై, ఆహాలోకులు నాయాజ్ఞ నతిక్రమించుటకు పుట్టినదుశ్శకునముగఁ దలఁచి దూతలతో నిట్లనియె. ఓదూతలారా! మీరతివేగముగాఁ బోయి నాయాజ్ఞకు భంగమును చేసిన యశ్వత్థవృక్షమును ఛేదించిరండనియె. అంతట ననేకవేలరామదూతలుపోయి కుఠారపాణులై యాయశ్వత్థవృక్షమును ఛేదింప నిశ్చయించిరి. అప్పుడు నవ్వుచున్న యాయశ్వత్థవృక్షమునుఁజూచి యత్యాశ్చర్యముకలవారయ్యును రామాజ్ఞచేత నావృక్షమును ఛేదించుటకు యత్నించిరి. ఆసమయమునందు ఆయశ్వత్థవృక్షము తననుఛేదించి వారలను దనఫలములచేత శరీరము బ్రద్దలగునట్లు కొట్టె. అంతట రామదూతలాబాధకు దాళఁజాలక కోలాహలమునుచేయుచు రామునిదగ్గఱకుఁబోయి యావృత్తాంతమును స్పష్టముగ దెలియఁబరచిరి. ఆవృత్తాంతమును విని శ్రీరాముఁడత్యాశ్చర్యముకలవాఁడై మరల ననేకవేలదూతలనుఁబంపె. వారునుపోయి మునుపటివారివలెనే కొట్టఁబడి యేమియును జేయఁజాలక పరుగిడివచ్చి యావిషయమును శ్రీరామునకుఁ దెలిపిరి. అంతట శ్రీరాముఁ డధికకోపము కలవాఁడై సేనాసమేతముగ సుమంత్రునిబంపె. అప్పుడు సుమంత్రుఁడు శ్రీరామునకు నమస్కరించి సేనాసమేతముగ బయలువెడలిపోయి యాయశ్వత్థముయొక్క ఫలరూపములగు ఱాళ్లచేతఁ గొట్టఁబడి యేమియును జేయఁజాలక పోయె. అనంతరమందా దెబ్బలకు దాళఁజాలక సుమంత్రుఁడు మూర్ఛనుపొందె. అట్లు సుమంత్రుఁడు మూర్ఛనుపొందుటను జూచి యయోధ్యాపట్టణమునందలి వారందఱును నత్యాశ్చర్య భయములనుపొందిరి. ఆవృత్తాంతమును విని శ్రీరాముఁడు శత్రుఘ్నునిబంపె. అప్పుడా పట్టణమునందలి స్త్రీలు మొదలగు వారందఱును మేడలమీఁద నెక్కి యాకౌతుక

మును జూచుటకు యత్నించిరి. మఱియు నట్లుచూచుచుండ దమలో రామా యశ్వత్థవృక్షమేయని యొకరికొకరు తర్జనితో జూపుకొనుచుండిరి. అట్లు రామాజ్ఞచేత శత్రుఘ్నుఁడు సైన్యసమేతముగ బయలువెడలిపోయి తనసేనయంతయును నశ్వత్థవృక్షముచేతఁ గొట్టఁబడి మూర్ఛనొందుట కత్యాశ్చర్యమునుపొందె. మఱియు నప్పుడు కుశలవాదుల సూతులందఱును గొట్టఁబడి మూర్ఛనొందిరి. అంతట నెల్లవారును మూర్ఛనుబొందిరి. పిమ్మటఁ గొందఱు భటులుపోయి యావృత్తాంతము శ్రీరామునకుఁ దెలిపిరి. ఆవృత్తాంతమును సర్వమునువిని శ్రీరాముఁడుకూడ మిగుల భయముకలవాఁడై తనమనస్సునం దిట్లని యాలోచించె. ఈవిషయమునందుఁ జక్కఁగ విచారింపవలయునుగాని విచారింపక ప్రవర్తించుట యుచితముకాదని తలఁచె. మఱియు నిట్లుజరుగుటకు కారణమేమియో కలదనియును, కావున నీవిషయమును పురోహితుఁడగు వసిష్ఠునినడుగవలసినదనియును, తలఁచె. అట్లుతలంచి మానుషభావము నవలంబించి పురోహితుఁడగు వసిష్ఠునిరప్పించె. అంతట నావసిష్ఠమునివరుఁడు రామాజ్ఞచేత సభలోనికివచ్చె. అప్పుడు వసిష్ఠమునివరుఁ డెదురుగఁబోయి తోడ్కొనివచ్చి మిగుల శ్రేష్ఠమైన యాసనమునొసంగె. పిమ్మట శాస్త్రోక్తప్రకారముగ వసిష్ఠమహామునిని పూజించి జరిగినవృత్తాంతమును సర్వమును దెలిపె. ఆవృత్తాంతమును సర్వమునువిని వసిష్ఠమహాముని యిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీచరిత్రమును సర్వమును ప్రబంధరూపముగ రచించిన వాల్మీకిమునివరుని నడిగినయెడలఁ దెలియఁగలదనియె. అంతట నాశ్రీరాముఁడు గురువచనానుసారముగ వాల్మీకిమునివరుని పిలిపించె. అంతట వాల్మీకిమునివరుఁడుకూడ రామాజ్ఞానుసారముగ శీఘ్రముగ శ్రీరాముని దగ్గరకుఁబోయె. అప్పుడు శ్రీరాముఁ డెదురుగఁబోయి వాల్మీకిమునివరుని దోడ్కొనివచ్చి యుచితాసనమునఁ గూర్చుండఁబెట్టి శాస్త్రోక్తప్రకారముగఁ బూజించి జరిగినవృత్తాంతమును సర్వమును దెలియఁజేసె. అంతట వాల్మీకిమునివరుఁడు నవ్వి శ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీవు సర్వమును దెలిసినవాఁడవు. ఏమినిమిత్తముగ నన్నునడిగెదవు. ఓరామచంద్రా! నీవు మానుషభావము నవలంబించి నన్నడిగినయెడలఁ జెప్పెదను వినుము. నీవుహాస్యమును విడిచిపెట్టితివి. నీభయముచేత సకలజనులును హాస్యకరములయిన కర్మములను విడిచిపెట్టిరి. మఱియును, వివాహాది కౌతుకకార్యములును, సచ్చరిత్రాదులును, మంగళోత్సాహ గీతములును, యజ్ఞాదిసత్క్రియలును, సంవత్సరోత్సాహములును, భూలోకమునందు విడిచిపెట్టఁబడెను. ఇందువలన నుత్సాహదేవతలును, కర్మాంగదేవతలును, ఇంద్రాదిలోకపాలురును, తమపూజ లోపించిపోవుటకు దుఃఖించి బ్రహ్మదేవునిదగ్గరకుఁబోయి యావృత్తాంతమును సర్వమును జెప్పిరి. అంతట బ్రహ్మదేవుఁడా వృత్తాంతమును వినియును నీవద్దకువచ్చి యేమియును జెప్పఁజాలక యశ్వత్థవృక్షమునందుఁ బ్రవేశించె. అట్లుప్రవేశించి యిప్పటికిని దేవతలకు హితమును

చేయుటకొఱకు నశ్వత్థవృక్షమునందుఁ బ్రవేశించియున్నాఁడు. అట్లుప్రవేశించి యావృక్షమును ఛేదించుటకువచ్చిన వారిమీఁద జ్వాలనురువ్వుచున్నాఁడని యామునివరుఁడుచెప్పిన వాక్యములనువిని శ్రీరాముఁడు మిగులఁ గోపముకలవాఁడై యిట్లనియె. ఓమునికులోత్తమా! నేనిప్పుడే బయలువెడలిపోయి బ్రహ్మదేవుని బలమును పరీక్షించెదను. శ్రీరాముఁడు తనశాసనమును మరలించుకొనువాఁడుగాఁడని చెప్పి రథమునుదెమ్మని యాజ్ఞాపించె. అంతట నామునివరుఁడు సవినయముగ నిట్లనియె. ఓరఘుకులోత్తమా! క్రోధమును విడిచిపెట్టుము. నావాక్యమును వినుము. నీవు సచ్చిదానందరూపుఁడవు. నీవానంద చరిత్రలుకలవాఁడవని నేనువర్ణించితిని. నీవా విషయమును సర్వమును యజ్ఞసమయమునందు పుత్రులవలన వింటివి. నీచరిత్రను వినినమాత్రముచేతనే ప్రతిమానవుఁడును ఆనందరూపుఁడగును. లోకులు నవ్వకసుఖకరములయిన కథలనువినరు. కావున నికమీఁదట నీచరిత్రను పఠించువారును వినువారును లేకపోదురు. మఱియు నోరఘుకులోత్తమా! ఇంకొక్కవిషయమును చెప్పెదను. నీచరిత్రమును శతకోటి పరిమితి కలదానినిగాఁ జేసితిని. ఈచరిత్రములోని విషయములనుగ్రహించియే వ్యాసమునివరుఁడు పదునెనిమిదగు మహాపురాణోపపురాణములనునిర్మించె. మఱియు నితరులగు మునులును శాస్త్రములను రచించిరి. మఱియు నికమీఁదఁగూడఁ గొందఱును శ్రీరామాయణ సారమును గ్రహించి యనేకవిధములయిన ప్రబంధములను రచింతురు. నీవు నావాక్యమును వినకపోయిన యెడల సీతాపరిణాదికమును దెలుపునట్టి యిరువదినాలుగువేల రామాయణమునుమాత్రము పఠింతురుగాని మిగిలిన రామాయణము నెవ్వరునుపఠింపరు. యుద్ధమును ప్రాతఃకాలమునందును శోకము నపరాహ్ణకాలమునందును రతిని రాత్రియందును వినవలయును. ఆనందరామాయణమును మాత్రము సర్వకాలములయందును వినవలయును. మఱియు నోరఘుకులోత్తమా! యుద్ధమును దెలుపునది భారతమనియును, రతిని దెలుపునది భాగవతమనియును, ఇరువదినాలుగువేల గ్రంథమగు రామాయణమును శోకమును దెలుపునదియనియును, చెప్పఁబడినది. ఇఁకమీఁదఁ గలుగఁబోవునట్టి నీవరముచేత ముందుగానే నేను నూఱుకోట్లపరిమితికల రామాయణమును రచించితిని. అట్టిరామాయణములో తొమ్మిది కాండములనియును పదిరెండు వేలనియును నూటతొమ్మిది సర్గములనియును చెప్పఁబడిన యానందరామాయణము భూలోకమునందుండఁగలదు. ఓరఘుకులోత్తమా! మిగుల మనోహరమైనదియును, నూటయెనిమిది సర్గములు కలదియును, మేరుసమన్వితమును నీకీర్తిని పరిపాలించునట్టిదియును, అయిన నీకీర్తిని లోకములో నెవ్వఁడును ఖండింపఁడు. మఱియు నోరఘుకులోత్తమా! తొమ్మిదికాండముల పరిమితికలదియగు నీరామాయణము సూర్యచంద్రు లున్నంతవఱకును నుండఁగలదు. మఱియు నోరఘుకులోత్తమా! కలియుగమునందలి మానవులు అల్పాయుష్యము కలవారును మందమతులును

అగుటచేత నాగ్రంథమును వినుటకు సమర్థులగుదురు. కావుననే వ్యాసమునివరుఁడు రామాయణకథను సంగ్రహముగ నక్కడక్కడ రచించె. ఓ రఘుకులోత్తమా! వాల్మీకాదికాండముల పరిమితికల యీయానందరామాయణము శాశ్వతముగనుండు నట్లు వరమునిమ్ము! ఓరఘుకులోత్తమా! హాస్యమును విడిచిపెట్టిన యెడల లోకమంతయును దుఃఖమయమైన దగును. కావున నేనొక్కయుపాయమును చెప్పెదను వినుము. జనులందఱును దంతములు తెలియకుండ నవ్వుటచేత లక్ష్మి కలుగుననియును, దంతములను కనఁబరచి నవ్విన యెడల దారిద్ర్యము కలుగుననియును, ఆజ్ఞనొసంగుము. మఱియు నధికముగ నవ్వినపుడు ముఖమున కడ్డముగ వస్త్రమును బెట్టుకొనక పోయిన యెడల దారిద్ర్యము కలుగునని యాజ్ఞనొసంగుము. ఇట్లు సేసితివేని నీయాజ్ఞ యప్రతిహతముగఁ జెల్లనదగును. మఱియు నోరఘుకులోత్తమా! హాస్యము లక్ష్మీసూచకమనియును, సౌఖ్యమును గలుగఁజేయునట్టిదియనియును, చెప్పఁబడుచున్నది. కావున హాస్యముకంటె శ్రేష్ఠమైనది యీభూలోకమునం దేదియును లేదు. ఎవనిగృహమునం దానుది నవ్వుమోముకలదియై యుండునో వానియింటియందు లక్ష్మి నివసించు నని శాస్త్రములు చెప్పుచున్నవి. ఎవనియింటియందలి యాఁడది కోపయుక్తమైన ముఖము కలదై యుండునో అట్టి వానిగృహమునుండి లక్ష్మి లేచిపోవును. ఏపురుషుఁ డెప్పుడును నగుమోము కలవాఁడై యుండునో యాపురుషుఁడు ధన్యుఁడనియును, ఏపురుషుడు నగుమోము లేనివాఁడగునో యాపురుషుఁడు నింద్యుఁడనియును, చెప్పఁబడుచున్నది. కోపముకలవానిని మునులందఱును నిందించుచున్నారు. కావున నో రఘుకులోత్తమా! నావాక్యమును గౌరవింపుము. బ్రహ్మదేవుఁడు గర్వమును పొందినవాఁడుగాఁడు. నీవుతండ్రివని బ్రహ్మదేవునకుఁ జక్కఁగఁ దెలిసియే యున్నది. బ్రహ్మదేవుఁడువచ్చి నిన్ను శరణమును పొందునట్లు చేసెదనని వాల్మీకి మునివరుఁడు చెప్పిన వాక్యమును విని శ్రీరాముఁ డిట్లనియె. ఓమునికులోత్తమా! నీవు చెప్పినట్లు చేసెదను. బ్రహ్మ నిక్కడకు రప్పింపుమనియె. అంతట నావాల్మీకి మునివరుఁడు శిష్యునినొక్కని బంపి యశ్వత్థవృక్షమునుండి బ్రహ్మదేవునిరప్పించె. ఆసమయమునందు శత్రుఘ్నుఁడు సకల సైన్యసమేతముగ వచ్చి రాముని పార్శ్వమునందు నిలిచియుండెను. మఱియును రాముని పుత్రులుగూడ వచ్చి తండ్రియొద్దనిలిచిరి. మఱియును రామాజ్ఞానుసారముగ నాభారవాహకుఁడు విడిచి పెట్టఁబడియె. ఆసమయమునందు దేవేంద్రుఁడు కురిపించినయమృతవర్షమువలన సుమంత్రాదులు మేల్కనిరి. అంతట నాసుమంత్రాదులు రాముని దగ్గరకువచ్చి నమస్కరించి పార్శ్వభాగమునందు నిలిచిరి. అంతట నింద్రుఁడు దేవతలతోఁగూడ శ్రీరామునిదగ్గరకు వచ్చి నమస్కరించె. ఆసమయమునందు బ్రహ్మదేవుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! నాయపరాధమును క్షమింపుము. మేమందఱమును సర్వకాలములయందును నీ

చేతనే పరిపాలింపఁ దగినవారము. తొల్లియును నీవు మాకుహితము చేయుటకే భూలోకమునం దవతరించితివి. మఱియు ననేకములయిన యవతారముల నవలంబించి యనేకులగు శత్రువులను సంహరించితివి. మత్స్యరూపమును ధరించి వేదమును దొంగిలించిన శంఖుఁడను రాక్షసుని సంహరించితివి. అటులనే మాకు నమృతమునిచ్చుటకు సముద్రమునందు మునుఁగుచున్న మందరాచలమును కూర్మరూపముధరించి వహించితివి. వరాహరూపముధరించి హిరణ్యాక్షుని సంహరించితివి. మఱియును జలమునందు మునిఁగిన భూమిని వరాహరూపముతో లేవఁదీసితివి. భక్తుఁడగు ప్రహ్లాదుని వచనానుసారముగ నారసింహావతారము నవలంబించి హిరణ్యకశిపుని సంహరించితివి. దేవేంద్రుని రాజ్యమునుహరించిన బలిచక్రవర్తిని వామనరూపముతో పాతాళలోకమునకుఁ బంపితివి. అన్యాయమును మెండుగఁ జేయుచున్న రాజులను పరశురామావతారము నవలంబించి యిరువదియొక్క పర్యాయములు సంహరించితివి. ఇప్పుడీరామరూపముతో రావణకుంభకర్ణాదులను వధించితివి. ఇట్లు మాకు నానావిధములయిన యుపకారములను చేసితివని నవిని వసిష్ఠమునీంద్రుఁడు సర్వమును దెలిసినవాఁడైనను సకలజనులకును దెలియుటకొఱకిట్లనియె.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండే పూర్వార్ధమునందలి,
పదిమూడవసర్గము ముగిసెను.

---

* వాల్మీకిమునివరుఁడు స్వజన్మత్రయము వర్ణించుట. *

శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! అంతట వసిష్ఠమహాముని బ్రహ్మదేవునితో నిట్లనియె. ఓదేవోత్తమా! శ్రీరాముఁడు తనగణములనే రెండుపర్యాయము లుద్ధరించెననియును, ఇంకొక్క పర్యాయ మింకమీఁదనుగూడ నుద్ధరించుననియును, చెప్పితివికదా? ఆగణము లెవ్వరు. వారికి దేవశాపమెట్లు కలిగెను. ఆవృత్తాంతమును సర్వమును దెలుపుమనిన బ్రహ్మదేవుఁ డిట్లనియె. ఓ మునికులోత్తమా! నీవు సర్వమును నెఱుఁగుదువు. అయినను దెలిసికొందమనియెడు తలంపుతో నన్ను నడుగుచున్నావు. తొల్లి మహావిష్ణువగు శ్రీరాముఁడు వైకుంఠమునందు లక్ష్మీదేవితోఁగూడ శయనించియుండె. ఆసమయమునం దశ్వినీకుమారులగు నిరువురు దేవవైద్యులు శ్రీమహావిష్ణువును చూచుటకు విచ్చేసిరి. అప్పుడు ద్వారపాలకులగు జయవిజయులను వారు ఎదురుగవచ్చి యిట్లనిరి. ఓ దేవోత్తములారా! విష్ణుదేవుఁ డిప్పుడు రహస్యస్థలమునందున్నాఁడు. కావున నిది చూడఁదగిన సమయముగాదనిన విని యాయశ్విని దేవత లిట్లనిరి. ఓద్వారపాలకులారా! ఇప్పుడే మేము శ్రీమహావిష్ణువును జూడఁదలఁచియున్నారము. మేమువచ్చి ద్వారమునందు నిలచియున్న సమాచారమును విష్ణుదేవునకుఁ దెలుపుఁడనిన విని యా

ద్వారపాలకులు మరల నిట్లనిరి. ఓ దేవోత్తములారా ! శ్రీమహావిష్ణు విప్పుడు లక్ష్మితోఁగూడ నేకాంతమునందున్నాఁడు. కావున మేమిప్పుడక్కడకుఁ బోఁగూడదని మూఁడుపర్యాయములు చెప్పిరి. అప్పుడు ఆయశ్వినీదేవతలు క్రోధమూర్ఛితులై యిట్లనిరి. ఓ ద్వారపాలకులారా ! మావచనమును మీరు వినకపోతిరి. మఱియును మూఁడుపర్యాయములు మావాక్యమును నిరాకరించితిరి. కావున మీరు మూఁడుపర్యాయములు భూలోకమునందుఁ బుట్టుదురని శపించిరి. అంతట నాద్వారపాలకులును కోపవ్యసనములు కలవారై యిట్లనిరి. ఓ దేవోత్తములారా ! నిష్కారణముగ మమ్ముశపించితిరి. కనుక మీరును నొక్కపర్యాయము భూలోకమునందుఁ బుట్టుదురనిరి. ఈవిధముగ వారు పరస్పరశాపములను పొంది హాహాకారములను చేయుచుండిరి. అంతట నధికమైన కోలాహలధ్వని కలిగె. ఆకోలాహలధ్వనిని విని శ్రీమహావిష్ణువు అక్కడకుఁ బరుగిడివచ్చె. ఆవృత్తాంతమును సర్వమును నాయిరుతెగలవారును శ్రీమహావిష్ణువునకుఁ దెలిపిరి. మఱియు నానల్వురును శ్రీమహావిష్ణువు ననేకవిధములఁ బ్రార్థించియిట్లనిరి. ఓ దేవోత్తమా! మాకుశీఘ్రముగ విముక్తిగలుగునట్లుచేసి మమ్ముల గృతార్థులనుగాఁ జేయుమనిరి. అంతట శ్రీమహావిష్ణువువిని వారలతో నిట్లనియె. మీకు నాయందలి భక్తితో జన్మముకావలసియున్నయెడల నేడుజన్మములమునపిమ్మట నాదగ్గరకువత్తురు. నాయందు విరోధమునపేక్షించినయెడల మూఁడుజన్మముల నాకడకువచ్చిచేరుదురు. ఈరెండువిధములలో మీకిష్టమైనవిధము నపేక్షింపుఁడనిన విని యిట్లనిరి. ఓ దేవోత్తమా! చిరకాలము నిన్నువిడచియుండఁజాలము. కావున మేముమూఁడుజన్మములచేతనే నీయొద్దకువచ్చెదమనినవిని నారాయణుఁడు మీ యిష్టానుసారముగనే చేయుఁడని చెప్పి వారలను బంపె. అంతట నో వసిష్ఠమునివర్యా! మొదటిజన్మమునందు జయవిజయులు హిరణ్యాక్ష హిరణ్యకశిపులై పుట్టిరి. ఆయిరువురిని వరాహ నారసింహ రూపములతో నారాయణుఁడగు నీరాముఁడేవధించె. అంతట నాజయవిజయులు రావణ కుంభకర్ణులై పుట్టిరి. ఆయశ్వినీదేవతలు ఐరావణమైరావణులై పుట్టిరి. ఈనల్వురును నీశ్రీరాముని హస్తమువలననే మరణమునుపొందిరి. ఇఁకమీఁదట నా జయవిజయులు శిశుపాల దంతవక్త్రులై పుట్టుదురు. ద్వాపరయుగమునందు శ్రీకృష్ణరూపముతో నీరాముఁడే యాశిశుపాల దంతవక్త్రులను వధింపఁగలఁడు. ఈవిధముగ నాజయవిజయులు మూఁడు జన్మములయొక్క యంతమందు నారాయణ సాన్నిధ్యమును పొందుదురు. ఆయశ్వినీదేవతలు ఐరావణ మైరావణ జన్మానంతరమందు మునుపటివలె స్వర్గమునందుఁ బ్రవేశించియున్నారని యాబ్రహ్మదేవుఁడు వసిష్ఠమునియడిగిన ప్రశ్నమునకు సమాధానమును చెప్పి మఱియునిట్లనియె. ఓమునికులోత్తమా! ఈరాముఁడు ద్వాపరయుగమునందు కృష్ణావతారమునవలంబించి కంస జరాసంధాది రాక్షసుల ననేకుల వధింపఁగలఁడు. మఱియు నీరాముఁడే కలియుగమునందు బుద్ధావతారమునవలంబించి

ధారులనందఱను జయింపఁగలఁడు. మఱియు నో మునికులోత్తమా! కలియుగముయొక్క అంతమందు వర్ణసంకరమగుటచేత నీరాముఁడే కల్క్యవతారము నవలంబించి పాపాత్ములనందఱను సంహరించు నని శ్రీరాముని ననేక విధములఁ బ్రార్థించి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! మాకు మేలును గలుగఁ జేయుటకే పదియవతారములనేగాక యింకను ననేకావతారములనవలంబించితి వనియెనని చెప్పి యా రామదాసు మరలనిట్లనియె. శిష్యోత్తముఁడవైన యో విష్ణుదాసా! ఈవిధముగ స్తోత్రమునుచేయుచున్న బ్రహ్మదేవునిఁ గౌగిలించుకొని శ్రీరాముఁడు తగినసింహాసనమునందుఁ గూర్చుండ నియమించి యిట్లనియె. ఓబ్రహ్మదేవా! నీనిమిత్తముగ నేనుసకలజనులును నవ్వవచ్చునని యాజ్ఞాపించితిని. సకలజనులును సుఖముగనుండురుగాక. అయినను వాల్మీకిమునివరుఁడు చెప్పినవిధముగ నథోముగనవ్వుట యుచితముకాదనియెదననిన దేవతలందఱును పరమానందమునుపొందిరి. అంతట నారామచంద్రుఁడు వాల్మీకిమునివరునితో నిట్లనియె. ఓమునికులోత్తమా! నేనవతరించకమునుపే నీవు నాచరిత్రమును రచింపఁగలిగితివి. నీకు నాచరిత్రమునుఁ బోధించినవాఁ డెవ్వఁడు. నీవు పూర్వజన్మమునం దెవ్వఁడవు. నీవు పూర్వజన్మమునం దేమిపుణ్యమునుచేసితివి? ఈవిషయమును సర్వమును నాకుఁదెలుపుమనిన విని మునిశ్రేష్ఠుఁడగు వాల్మీకియిట్లనియె. ఓమునికులోత్తమా! నీవు చక్కనిప్రశ్నమునుచేసితివి. ఈవిషయమును సర్వమును సావధానమనస్కుఁడవై వినుము. ఓ రఘుకులోత్తమా! నీనామమహిమనువినుటచేత నేను బ్రహ్మర్షిత్వమునుపొందితిని. నాపూర్వజన్మవృత్తాంతమును చెప్పెదను వినుము. ఓరఘుకులోత్తమా! పంపాతీరమునందు శంఖుఁడను నొకమహాబ్రాహ్మణుఁడుకలఁడు. అతఁడు గురువువలన సిద్ధినిపొంది గోదావరి నదియొద్దకుఁబోయి యక్కడ స్నానమునుచేసి యక్కడనుండి భీమరథినిదాటె. అనంతరమందు మిగుల భయంకరమైన యరణ్యమునకుఁబోయెను. మఱియు నాయరణ్యము నిర్జలమును నై యుండె. అట్లుపోయి మధ్యాహ్నసమయమున నయ్యరణ్యమునఁ బ్రవేశించె. అప్పుడొకబ్రాహ్మణుఁడు దురాచారముకలవాఁడును, వ్యాధుఁడును, చాపధరుఁడును, శరుఁడును, సకలభూతములయందును దయలేనివాఁడును, రెండవయముఁడనఁ దగినవాఁడును నై యుండె. అట్టి దుష్టబ్రాహ్మణుఁడు కుండలధారియును దీక్షితుఁడును, సూర్యునితో సమానుఁడును అగు నాశంఖుఁడను బ్రాహ్మణునిఖడ్గముచేత భయపరచి యతనికుండలాదికమును గ్రహించె. మఱియు నతనివస్త్రములు ఛత్రమును కమండలమునుఁ గూడఁగైకొనియె. అంతట నాశంఖుఁడను బ్రాహ్మణుఁడు గులకరాళ్ళు మొదలగువానిచేత వావిలమైన మార్గమునందుఁబోవుచు నెండవేడిమికిఁ దాళఁజాలక తృణములచేతఁ గొంతసేపు పాదములను గప్పుకొనుచుండె. మఱికొంతసేపు కట్టువస్త్రముచేతఁ బాదములనుఁ గప్పుకొనుచుండె. ఇట్లు నానావిధములయిన కష్టములనుపొందుచు హాహాకారముగనుఁ నల్పుచు హాహాకారములనుఁ జేయుచుండె. అంతఁ గొంతసేపటికి

మధ్యాహ్నసమయమయ్యె. ఆసమయమునందావ్యాధునకు పాదరక్షలనిత్తమని యెమ్మతలంపుకలిగి యతనియొద్దకువచ్చి యిట్లనియె. ఓబ్రాహ్మణోత్తమా! చోరధర్మము నవలంబించి నీద్రవ్యమును సర్వమునుగ్రహించితిని. వ్యాధులగువారు పథికుల ద్రవ్యములనుహరించుట సహజధర్మమైయున్నది. కావున నేనుగ్రహించితిని. అయిన నిప్పుడు పాదరక్షలను నీకుసమర్పించెదను. ఇట్లుచేయుటచేత పాపాత్ముఁడనైన నాకు నధికమయిన శ్రేయస్సుకలుగును. నీపాదరక్షలు జీర్ణములై యున్నవి. నాపాదరక్షలు మిగుల దృఢములును నూతనములును నై యున్నవి. అనిచెప్పి తనపాదుకల నొసంగె. అంతట నాశంఖుఁడనుబ్రాహ్మణుఁ డాపాదుకలనుగ్రహించి యధికమైనసంతోషమునుపొందె. పిమ్మట నోవ్యాధుఁడా! సుఖవంతుఁడ వగుమనియె. మఱియు నోవ్యాధుఁడా! పూర్వజన్మమునందలి పుణ్యవశముచేత నీకిప్పుడు శుభకరమైన బుద్ధి పుట్టినదనినవిని యావ్యాధుఁడిట్లనియె. ఓబ్రాహ్మణోత్తమా! పూర్వజన్మమునందు నేనేమి పుణ్యముచేసితినో చెప్పుమనినవిని యాశంఖుఁడిట్లనియె. ఓవ్యాధజనోత్తమా! భయంకరమైన యాతపము నన్నుబాధించుచున్నది. ఇక్కడనిలుచుటకు నీడ యైనను లేదు. కావున మఱియొకచోటునకుఁ దీసికొనిపొమ్ము? అట్లయినయెడల నీ వృత్తాంతమును సర్వముచెప్పెద ననినవిని యావ్యాధుఁడు కృతాంజలియై యిట్లనియె. ఓమునికులోత్తమా! ఇక్కడకు సమీపమున నొకమడుగుకలదు. అక్కడ నొక్కకపిత్థవృక్షముకలదు. ఆవృక్షమునందంతటను ఫలములధికముగనున్నవి. అక్కడకురమ్ము? వచ్చి ఫలోదకముల ననుభవించి తృప్తినిపొందుమనియె. అంతట నాశంఖుఁడనుమునివరుఁడు వ్యాధునితోఁగూడ నచ్చోటునకుఁబోయె. పోయి మిగుల మనోహరమగు సరోవరమునుఁజూచి యా మధ్యాహ్నకాలమునందు నిర్మలమైన యా సరోవరమునందు స్నానమునుచేసి వస్త్రములఁ నుదికికట్టుకొని మాధ్యాహ్నికక్రియలను నెరవేర్చుకొని దేవపూజాదికమును నెరవేర్చె. అనంతరమాదు స్వస్థచిత్తుఁడై వ్యాధుఁడుదీసికొనివచ్చిన ఫలమూలాదికము ననుభవించి యుదకపానముచేసి యా వృక్షచ్ఛాయ యందుఁగూర్చుండి యావ్యాధునితోనిట్లనియె. ఓరీవ్యాధుఁడా! నీ పూర్వజన్మవృత్తాంతమును చెప్పెదను వినుము. నీవు పూర్వజన్మమున శాకలనగరమునందు వేదపారగుఁడవగు బ్రాహ్మణుఁడవై యుంటివి. మఱియు నప్పుడు స్తంభుఁడను నామధేయముకలవాఁడవును శ్రీవత్సగోత్రమునందుఁ బుట్టినవాఁడవును నై యుంటివి. నీకప్పుడొక్కవేశ్యాంగన యిష్టురాలై యుండె. దాని సాంగత్యదోషముచేత నిత్యకృత్యములనువదలి శూద్రునివలె మూర్ఖమార్గము నవలంబించితివి. అట్లుసకలసదాచారములను విడిచినవాఁడవును మూఢుఁడవును, పరిత్యక్తక్రియుఁడవును, అయిన నీకు భార్యయొక్కతెకలదు. అది మిగులఁ గాంతికలదియును, పతివ్రతయును నై యుండె. ఆపతివ్రత వేశ్యాసమేతుఁడవగు నీకు పరిచర్యనుఁజేయుచు నీవేశ్యకుఁగూడ సకలోపచారములను నీకుఁ జేయువిధముగనే చేయుచుండె. మఱియు నాపతి

వ్రతి యీ యిరువురికిని క్రిందఁబరున్న దియును, అయ్యిరువురి యొక్క యును వాక్యములయందు దాసక్తికలదియును నై యుండె. మఱియు నప్పుడప్పు డావేశ్యాంగన వలదనిచెప్పినను వారికి హితముగు కార్యమునందు సంచరించుచుండె. ఈవిధముగ వేశ్యాసమేతుఁడగు భర్తకు శుశ్రూషను చేయుచుండఁగానే చిరకాలము గడచిపోయె. అంతట నొక్కనాఁ డాబ్రాహ్మణుఁడు వ్యాధికలిగియుండఁగా తిలమిశ్రితములయిన నిష్పావములను భుజించె. అట్టి యపథ్యాన్నమువలన ముందుగ నీమన విరేచనములు కలిగె. అనంతరమందు మిగుల భయంకరమగు భగంధరరోగము గలిగె. అట్టి రోగముచేత నీవు దివారాత్రములు విడువక దహింపఁబడితివి. అట్టికాలమున నీగృహమునఁగల విత్తమును సర్వమునుగ్రహించి యింటనుండి బయలువెడలిపోయి మఱియొకపురుషుని పరిగ్రహించె. అంతట నీవు దీనవదనుఁడవును వ్యాధిబాధచేతఁ బీడింపఁబడినవాఁడవును వ్యాధిచేత వ్యాకులమైన మనస్సుకలవాఁడవును, నై భార్యతో నిట్లనిపలికితివి. ఓదేవీ! వేశ్యాస్త్రీతోఁగూడ మిగుల కఠినుఁడనై నీకనేకపకారములనుచేసిన నన్నుఁ గాపాడుము. పావనురాలవైన యోసుందరీ! నీకుఁ గొంచెమైనను నే నుపకారము చేసినవాఁడను గాను. మఱియు నోయంగనామణీ! "శ్లో॥ యోభార్యాంప్రణతాంపాపోనానుమన్యేతమూఢధీః। సషండోభవతీత్యత్ర దశజన్మనిసప్తచ" (తనకు విధేయురాలై సంచరించుచున్న భార్యను పరిగ్రహించి సుఖపరుపని పాపాత్ముఁడు పదునేడు జన్మములవఱకు నపుంసకుఁడై పుట్టును.) మహానుభావురాలయిన యోయంగనామణీ! దివారాత్రములయందు నేను దుష్కార్యములనుచేసి సజ్జనులచేత నిందింపఁబడితిని. మఱియును పాపస్వభావముచేత పతివ్రతవగు నిన్నవమానించితిని. మఱియును, సర్వకాలములయందును కఠినముగ మాటలాడువాఁడనై నాక్రోధముచేత దహింపఁబడితి ననియె. ఈవిధముగ మాటలాడుచున్న నీతో పతివ్రతయగు నయ్యంగన కృతాంజలియై యిట్లనియె. ఓ కాంతుఁడా! నీవు దైన్యమును పొందకుము. నన్ను గుఱించి సిగ్గునుఁగూడఁ బొందఁగూడదు. నీయందు నాకుఁగొంచెమైనను కోపము లేదు. ఓ ప్రాణనాథా! "శ్లో॥ పురాకృతానిపాపాని దుఃఖానిభవంతిహి । తానియాంతు తేసాధ్వీ నవ్రీడాకాంతమాంప్రతి" (పూర్వజన్మమునందలి పాపములు దుఃఖములై పరిణమించుచున్నవి. అట్టిదుఃఖములను సహించు స్త్రీపురుషు లుత్తములనఁబడుదురు.) నేను పూర్వజన్మమునందుఁ జేసినపాపమునకుఁ దగినఫలము ననుభవించుచున్నదానను. కావున నేను విషాదదుఃఖములను పొందుదానను గాదనిచెప్పి యాభర్తకు పరమభక్తితో నుపచారములను చేయుచుండె. మఱియు నాయంగనామణి తనదు పుట్టినింటనుండి ధనమును దెప్పించి బంధువులు మొదలగువారిని సత్కరించుచు భర్తను మహావిష్ణువునుఁగాఁదలఁచి యుపచారములను సలుపుచుండె. మఱియును భర్తయొక్క వ్రణములయందుఁ బుట్టుపురుగులను నఖములచేతఁ బయలునకుఁ దీసివైచుచు దివారా

త్రములయందు నిద్రాదులనుకూడ ననుభవింపక యుపచారములను చేయుచుండెను. ఇట్లు చేయుచు నా భర్త మిగుల నారోగ్యము కలవాఁడయ్యెనేని నాదు రక్తమాంసాదులను చండికాదేవికి సమర్పింతుననియె. మఱియును నేను బ్రదికియున్నంతవఱకును శనివారమునం దుపవాసమును చేసెదననియె. మఱియును విఘ్నేశునకు మహిషసహితముగ మోదకాదులను నివేదింతును. తైలాభ్యంగస్నానమును విడిచిపెట్టి నేను సర్వకాలములయందును భూతలమునందు శయనించెదను. ఘృతమధురములను భుజింపక విడిచిపెట్టెద ననియె. ఇట్లు అనేకములయిన వ్రతముల నవలంబించెదనని చెప్పుచుండఁగ మహానుభావుఁడగు దేవలుఁడనుమునివరుఁ డచ్చోటునకు వచ్చెను. వచ్చి నేను వైద్యుఁడననియె. అంతట నీభార్య యావైద్యునివలన నీరోగము శాంతిని పొందుననితలఁచె. అట్లుతలఁచి యామునివరున కాతిథ్యమునీయ నిశ్చయించి భర్తతో నిట్లనియె. ఓ ప్రాణనాథా! నీవాజ్ఞనొసంగిన యెడల నీమునివరున కాతిథ్యమునొసంగెదననియె. అప్పుడు నీవందుల కంగీకారమును పొందితివి. అంతట నయ్యంగనామణి సంతోషముకలదై యామునివరుని షోడశోపచారములచేతఁ బూజించె. పిమ్మట నమ్మునివరుని పాదోదకమును శిరస్సునందు ధరించి మిగిలిన పాదోదకమే యౌషధమనితలఁచి నిన్నుఁ బానముచేయుమనియె. అంతట నమ్మునివరునకు దివ్యాన్నములచేత సంతోషమునుఁ గలిగించె. పిమ్మట మరునాఁటి ప్రాతఃకాలమున నామునివరుఁడు గ్రామాంతరమునకుఁ బోయె. పిమ్మటఁ గొన్ని దినములకు నీకు సన్నిపాతరోగముకలిగె. అంతఁ గొంతసేపటికి నీవు మరణమును పొందితివి. అప్పు డాయంగనామణి తనవలయములను విక్రయించి యధికముగ చందనమును దెప్పించి చితిని సిద్ధపరచి నిన్నుఁగొనిపోయి చితియందు సమంత్రముగఁ బెట్టించె. అంతటఁ దానును సహగమనమును చేయఁదలఁచి నీమీఁద సర్వావయవములను సర్వావయవములతోఁ జేర్చి పరుండి రామునియందుంచఁబడిన మనస్సుకలదయ్యె. పిమ్మట నగ్నిచేత చితిని దగులఁబెట్టించి భర్తవగు నీతోఁగూడ పరలోకమునకుఁబోయె. నీవు మరణకాలమునందు వేశ్యయందు ప్రియముకలవాఁడవై యావేశ్యను స్మరించుచు దేహమును విడిచిపెట్టితివి. తొల్లి యాబ్రాహ్మణునకు పానకమును నీభార్యచేత తృష్ణాశాంతికొఱకిప్పించిన పుణ్యవిశేషముచేత నీకిప్పుడు సద్బుద్ధికలిగె. ఇట్లు సద్బుద్ధికలవాఁడవై నాకీకాలమునందు పాదరక్షల నొసంగితివి. మఱియును తొల్లి యాబ్రాహ్మణుని పాదోదకమును శిరస్సునందుఁ జల్లుకొనుటవలనఁ గలిగిన పుణ్యవిశేషముచేత నీయరణ్యమునందు నాతోసంభాషించునట్టి పుణ్యముకలిగె. తొల్లిటిజన్మమున నీవుసన్నిపాతరోగము కలిగినకాలమున నీభార్యయొక్క యంగుళిని నమలిన దోషముచేత నిప్పుడు మాంసమును భుజించువాఁడవైతివి. ఆవేశ్యాంగనయేయిప్పుడు భిల్లస్త్రీయై నీతో రమించుచున్నది. ఓరీ! వ్యాధుఁడా! నీ పూర్వజన్మవృత్తాంతమిట్టిది. ఆపుణ్యపాపములను నేను దివ్యదృష్టిచేతఁజూచి నీకుఁదెలిపితిని. ఇఁకమీఁదట జరుగఁబోవు వృత్తాంత

మును నీకుఁ దెలిపెదను. శృణువను పేరుకల యొక మునివరుఁడు ఒకానొక సరస్సునం దన్నపానాదులను విడిచిపెట్టి ఘోరమైన తపస్సును జేయును. అట్లు తపస్సును చేసి యా తపస్సుయొక్క యంతమందు నేత్రములను దెఱచిచూచును. ఆసమయమునం దత నివీర్యము నొక్క నాగకన్య ధరించును. అంత నా నాగకన్యయందు నీవు జనింతువు. అట్లుపుట్టినపిమ్మట నిన్నుఁ గిరాతులు పాలింతురు. అందువలన నీవును కిరాతుఁడ వగుదువు. అయినను ఇప్పుడు నీవు పాదరక్షలనిచ్చుటవలనఁ గలిగినపుణ్యముచేత నీకు నేఁడు ఋషులతో సాంగత్యము కలుగును. మఱియు నా మునుల యనుగ్రహమువలన నీవు వాల్మీకి యను నామధేయముకల మునివగుదువు. అనంతరమందు నీవు రామకథను దివ్యమైన ప్రబంధమునుగా రచింతువని యెనని చెప్పి యా వాల్మీకిమునివరుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఈవిధముగ జెప్పినపిమ్మట నాశంఖుఁడను బ్రాహ్మణుఁడు తనవస్త్రాదులనుఁ గైకొని మిగులసంతోషముకలవాఁడై గౌతమీ తీరమునకుఁ బోయె. అంతట నా నాఁ డఘుఁడు ఆబ్రాహ్మణవచనానుసారముగ నావనమునందే చిరకాలము నివసించియుండె. మఱియును వైశాఖమాసమునందుఁ జేయఁదగిన వ్రతములను వనమునందలి పుష్పఫలాదులచేతఁ జేయుచుండె. అంతట నావ్యాధుఁ డనగు నేను వ్యాధజన్మాంతమందుకృణుఁ డను వానికిఁ బుత్రుఁడనై పుట్టితిని. అట్లు పన్నగిజఠరమునందుఁ బుట్టి కిరాతులచేతఁ బెంపఁబడి కిరాతుఁడనై దొంగతనము మొదలుగాఁగల దుష్కృత్యములను జేసితిని. మఱియు నప్పుడు నేను ధనుర్బాణధరుఁడనై సర్వకాలములయందును జీవులకంతమును గలుగఁజేయుచుంటిని. మఱియు నొకశూద్రస్త్రీని పెండ్లిచేసికొని దానియందనేకులగు పుత్రులనుఁ గంటిని. వారందఱును నావలెనే దుష్కృత్యములను చేయుచుండిరి. అంతట నొక్కనాఁ డా యరణ్యమున ప్రజ్వలించుచున్న యగ్నితో సమానులును మహానుభావులును నగు నేడ్వురుమునులు వచ్చుచుండిరి. అప్పుడు నేను వారలఁ జూచి వారివస్త్రాదుల నపహరింపవలయునని యెడు తలంపుతో వారివెంటనంటి నిలుఁ వుఁడు నిలువుఁడని కూతలను బెట్టితిని. అంతట నామునివరులు నన్నుఁ జూచి యో బ్రాహ్మణాధమా! నీ వేల నీవిధముగ నాయాసమును పొందుచున్నావనిన విని నేను పుత్రదారాదులను పోషించుటకొఱకిట్టి దుష్కృత్యములను చేయుచున్నానని నుడివితిని. అంతట నామునివరులో వ్యాధుఁడా! నీవు దినదినమును చేయునట్టి పాపమును నీ భార్యాదులు పంచుకొనియెదరా? లేదా? అని యడిగిరమ్మ. అంతవఱకును మేమిక్కడనే యుందుము. ఈ మాటను దప్పితిమేని స్వర్ణస్తేయ సురాపాన గురుదారాగమన బ్రహ్మహత్యాదుల వలనఁ బొందునట్టి పాపమును పొందుదుమనిరి. అట్లు వారు శపథమును చేసిన పిమ్మట నేను నమ్మకము కలవాఁడనై నా గృహమునకుఁ బోయి యావిషయమునుఁ గురించి పుత్రదారాదుల నడిగితిని. అంతట వారందఱును నొక్కపెట్టున మేము నీపాపమును పంచుకొనువారముఁ గామనిరి. ఆమాటనువిని నేను మిగుల వ్యసనము కలవాఁడనై దయాపూర్ణులగు నమ్మునివరు

లున్న చోటునకుఁ బోతిని. పోయి యామునులనుఁ జూచిన వెంటనే పరిశుద్ధమైనయంతఃకరణము కలవాఁడనైతిని. అంతట ధనురాదికమును విడిచిపెట్టి యా మునివరులకు సాష్టాంగదండప్రణామములనుజేసి యో మునికులోత్తములారా! నరకార్ణవమునందు మునిగిన నన్నుఁగాపాడుఁడని యనేక విధములఁ బ్రార్థించితిని. అట్లు క్రిందఁబడి మొరలిడుచున్న నన్నుఁజూచి యామునివరులు ఓవ్యాధుఁడా! లెమ్ము లెమ్మనిచెప్పి మఱియు నిట్లనిరి. ఓ ద్విజుఁడా! ఇఁకమీఁదట నీకు మేలుకలుగును. సజ్జన సాంగత్యము సఫలమైనదగును. మేమొక్క మంత్రము నుపదేశించెదము దాని చేతనీవు మోక్షమును పొందెదవనిచెప్పి తమలో దామిట్లనిచెప్పికొనిరి. ఈపాపాత్మునకు సద్బుద్ధిని నేర్పఁగూడదు. అయినను దీనుఁడై శరణమును పొందుచున్నాఁడు కాఁబట్టి మోక్షమార్గము నుపదేశించి కాపాడఁదగిన వాఁడయ్యెనని నిశ్చయించిరి. ఓరఘుకులోత్తమా! ఆమునివరులీవిధముగ నిశ్చయించి నీనామమును తలక్రిందుగ నాకుపదేశించి యిట్లనిరి. ఓరీ! కిరాతుఁడా! ఏకాగ్రమనస్కుఁడవై మరా యని విడువక జపమును జేయుమనిరి. మఱియును, మేము మరల నిక్కడకు వచ్చువఱకును నిక్కడనే నిలిచి జపమునుచేయుమని చెప్పి యామునివరులు దమయిష్టానుసారముగఁబోయిరి. అంతట నేనామునివరు లుపదేశించినవిధముగ నేకాగ్రమనస్కుఁడనై నీనామమును జపించుచు సకలములయిన బాహ్యవిషయములను మరచిపోతిని. ఆమునివరులు నా తపస్సునకు సాక్షిగ నొకదండము నక్కడ స్థాపించి పోయిరి. ఇట్లు చిరకాలము గడచిన పిమ్మట నిశ్చలరూపుఁడను సర్వసంగరహితుఁడను అయిన నామీఁద నధికమైన పుట్ట యొక్కటి పెరిగె. ఆదండము నాకెదుట మిగుల రమ్యమైన వృక్షమయ్యె. అంతట వేయియుగములు గడచిపోయె. అప్పుడు తొల్లిటి ఋషులక్కడకు వచ్చిరి. వచ్చి యో వ్యాధుఁడా! లేచిరమ్మని నన్నుఁబిలిచిరి. అంతట నేను ఆవల్మీకము నుండి (ఆపుట్టనుండి) బయలునకు వచ్చితిని. అప్పుడమ్మునివరులు నీవు వల్మీకము నుండి వచ్చుటచేత నీవు వాల్మీకి యను నామధేయముకల మునివరుఁడ వగుమనిరి. ఇట్లుచెప్పి యా మునివరులందఱును దివ్యమార్గము నవలంబించి పోయిరి. ఓ రఘుకులోత్తమా! నీనామ మహిమమువలన నేనిట్టివాఁడనైతిని. తొల్లి యొక్కనాఁడు బ్రహ్మదేవుఁడు కైలాస పర్వతమునకుఁ బోయి పరమేశ్వరుఁడు చెప్పుచున్న వేద వాక్యముల వలన నీచరిత్రమును వినియె. పిమ్మట నాచరిత్రమును బ్రహ్మదేవుఁడు వాల్మీకిమునివరునకుఁ జెప్పె. ఆనారదమునివరుఁడు నీ చరిత్రమును నాకుపదేశించె. ఆసమయమునందయ్యరణ్యమున నొకవ్యాధుఁడు క్రీడించుచున్న క్రౌంచపక్షిద్వయములో స్త్రీపక్షిని సంహరించె. అంతట పురుషపక్షి శోకించుచుండె. అప్పుడు నా ముఖమువలన ఛందోబద్ధమగునొకవాక్యము శ్లోకరూపముగ బయలువెడలె. ఆశ్లోకము ముప్పదిరెండక్షరములు కలదైయుండె. అంతట నీబ్రహ్మదేవుఁడు నావద్దకువచ్చి నీచరిత్రమును సంక్షేపముగ నాకుఁబోధించెనని చెప్పి రాముఁడడిగిన ప్రశ్నమునకు సమాధా

నము సెప్పితివనియె. మఱియు నో రామచంద్రా! ఈవిషయమును సర్వమును నీవెఱుఁగిన
వాఁడవైనను ఈజనులందఱును దెలిసికొనుటకు నావలన వింటివనియె. అంతట నా
సభలోని బృహస్పతి శ్రీరామునితో నిట్లనియె. ఓ రఘుకులోత్తమా! ఆనందరూపుఁడ
వగు నీయొక్క యేచరిత్రము గానము చేయఁదగినది. నామాద్యవర్ణములచేత శబ్ద
మాత్రము గానము చేయఁబడుచున్నది. లౌకికములును వైదికములును అయిన ప
దునాలుగు కకారాది క్షకారాంతములయిన ముప్పదినాలుగగు హల్లులును శుభక
రములయిన మంత్రములని మానవులచేతఁ గీర్తింపఁబడుచున్నవి. అయినను ఓర
ఘుకులోత్తమా! అన్ని వర్ణములును నీనామాద్యవర్ణములయ్యేయున్నవి. ఈచరాచ
ర ప్రపంచమంతయును నీనామాద్యవర్ణములచేత వ్యాప్తమైయున్నది. చరాచరము
ల నామములన్నియును నీనామములే యైయున్నవి. అయినను యిందలిజనులకుఁ
దెలియుటకొఱకు పంచాశద్వర్ణములలో నొక్కొక్కటియును నాదియందుఁగల నీదు
పంచాశన్నామములను చెప్పెదనని యిట్లనియె. " శ్లో॥ అనంత, ౧ ఆనందమయ, ౨
శ్చేష్టాపూర్తఫలప్రదః। ౩ ఈశ్వరశ్చ, ౪ తథోత్కృష్ట, ౫ శ్చోర్ధ్వరేతా, ౬ ఋ
తంభరః ౭ ౠముక్షశ్చ ౮ ఌకశ్చైవ ౯ ౡపకం ౧౦ శ్చైకపవచ ౧౧ ఐశ్వర్యద
౧౨ శ్చోజదశ్చ ౧౩ తథైవౌదార్యచంచురః ౧౪ అంతరాత్మా ౧౫ చార్థగర్భ ౧౬
స్తథైవకరుణాకరః ౧౭ ఖడ్గీచ ౧౮ గతిదశ్చైవ ౧౯ ఘనశ్యామ స్తథైవచ ౨౦ జ
ప ౨౧ శ్యామితాశేష దుష్కృతశ్చ తథైవహి ౨౨ ఛత్రీ ౨౩ జగన్మయశ్చైవ
౨౪ ఝషరూపీ ౨౫ ఞాతేశ్వరః ౨౬ టణత్కారిధను ౨౭ ష్ఠానబంధః ౨౮ డమ
రుసత్కరః ౨౯ ఢుణ్ఢునితపాపశ్చ ౩౦ ణకర్ణశ్చతథైవహి ౩౧ తపోరూప ౩౨ స్థ
బశ్చైవ ౩౩ దక్షో ౩౪ ధన్వీతథైవచ ౩౫ నష్టోద్ధారణధీరశ్చ ౩౬ తథైవపరమేశ్వ
రః ౩౭ తథాపరశురామశ్చ ౩౮ తథాబలివరప్రదః। ౩౯ భగవాన్ ౪౦ మధుఘాతీచ
౪౧ తథాయజ్ఞఫలప్రదః ౪౨ రఘునాథశ్చ ౪౩ లక్ష్మీశో ౪౪ వరిష్ఠశ్చతథైవహి ౪౫
శరణ్యః ౪౬ షడ్గుణైశ్వర్య సంపన్నశ్చ తథైవహి, ౪౭ సర్వేశ్వరో ౪౮ హయగ్రీ
వః ౪౯ క్షేమీ ౫౦ నామానితేత్వితి " అనియకారాదులు మొదటఁగల్గిన యేబది
నామములఁజెప్పి మఱియు నిట్లనియె. ఓ రఘు! ఈపంచాశద్వర్ణములచేతనే లోకమం
తయును వ్యాప్తమైనది. మఱియు నోరఘుకులోత్తమా! సువర్ణముచేత ఘటమని
యును పవర్ణముచేత పటమనియును చెప్పఁబడుచున్నది. ఇటులనే సకల పదార్థ
ములును పంచాశద్వర్ణములచేతనే చెప్పఁబడుచున్నవి. కావున నోరఘుకులోత్త
మా! నీనామములిన్నియని నేను నిర్ణయింపఁజాలను ఆదిశేషుఁడుకూడ నీ నామా
వళిని చెప్పఁదలఁచి కుంఠితుఁడయ్యె. అయినను వాల్మీకియను నామధేయము కల
యీమునివరుఁడు నీకృపచేత నీచరిత్రమును శతకోటి పరిమితిగల గ్రంథమునుఁగా
జేసెననియె యనిచెప్పి రామదాసు మరల నిట్లనియె. శిష్యోత్తముఁడవైన యో విష్ణు
దాసా! బృహస్పతి యీవిధముగాఁజెప్పి దేవతల చేతను శ్రీరామునిచేతను అధిక

ముగఁ బూజింపఁబడెను. అంతట బ్రహ్మాదిదేవతలందఱును తమతమలోకములకుఁ బోయిరి. పిమ్మట వాల్మీకియును తనయాశ్రమమగు చిత్రకూటమునకుఁబోయెను. అదిమొదలుకొని మంగళార్థములయిన కర్మములయందు మాత్రమే జనులు నవ్వుదురు. మఱియును స్త్రీలతోఁ గ్రీడించునపుడు నవ్వుదురు.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండోత్తరార్థమునందలి
పదునాల్గవసర్గ ముగిసెను.

✷ రామరాజ్యముయొక్క విస్తారమునువర్ణించుట ✷

అంతట రామదాసు శిష్యుఁడగు విష్ణుదాసుతో మరల నిట్లనియె. ఓ శిష్యోత్తముఁడవైన యో విష్ణుదాసా! రాముఁడు రాజ్యమునుచేయుచున్న కాలమునందు సర్వజనులును సర్వకాలమునందును సంతోషమును పొందుచునేయుండిరి. లోకములో నెవ్వఁడును కలహించువాఁడు లేడు. దొంగతనము నిందభయము అనునవి యేవియును లోకమునందు లేకయున్నవి. రాజ్యమునందు శత్రుత్వమును కొంచెమైనను లేదు. ఋషులందఱును నానావిధ ధనాంబరాదులచేతఁగూడ సంతోషమును పొందుచుండిరి. ధర్మకార్యములన్నియును జక్కఁగ జరుపఁబడుచుండెను. సర్వకాలములయందును పొలములలో సస్యములు మనోహరములై యుండెను. మఱియును గోవులు మిగుల సమృద్ధములయి తృణాదులచేత సంతసించి యత్యధికముగ క్షీరములను పిదుకుచుండెను. దేవాలయములయందు సంతతోత్సాహములుఁ జరుగుచుండెను. అన్నిగ్రామములయందును యజ్ఞములుఁ జరుఁగుచుండెను. అందఱును ధనవంతులై యుండిరి. ఉద్యానవనము మొదలగు సకలవనములును నానావిధములయిన పుష్పఫలాదులచేత మిగుల మనోహరములై యుండెను. సరస్సులయందు సర్వకాలములయందును పద్మములు ప్రకాశించుచుండెను. మానవులలో నెవ్వఁడును దంభాహంకారాదుల నవలంబించువాఁడు లేకయుండెను. నదులన్నియును జక్కనిప్రవాహములు గలవయ్యెను. ప్రజలందఱును విషమగతిలేనివారై యుండిరి. అధర్మము లేశమయినను జరుఁగకయుండెను. ధనములచేత నంధుఁడగువాఁ డెవ్వఁడునులేడు. సకల జనులును శ్రేష్ఠములగు నన్నాదులను భుజించుచుండిరి. రాజకీయులలో నెవ్వఁడును అన్యాయము నాచరించువాఁడు లేడయ్యెను. మఱియు నారాముఁడు రాజ్యమును చేయుచుండఁగా జాడ్యము జలమునందును, బలరాహిత్యము స్త్రీలనడుములయందును దప్ప మఱియెక్కడను లేకయుండెను. కఠినహృదయములుకలవారు స్త్రీలుదప్పఁ దక్కినవా రెవ్వరును లేకయుండిరి. కుష్ఠురోగము మొదలగు రోగములు ఔషధములయందుఁదప్ప గోమానవాదులయందు లేకయుండెను. రత్నములయందుఁ దప్ప మఱియెక్కడను వేధించుట లేదు. శూలములు దేవతావిగ్రహములయందే కాని యితరమునందుఁ గనఁబడవయ్యెను. సాత్త్వికభా

వమువలనఁ గలిగెను కంపముతప్ప భయమువలనఁ గలుగు కంపమే లేకయుండెను. కామజ్వరముతప్పఁ దక్కిన జ్వరమే లేకయుండెను. కాలుష్యమునకుఁ దప్ప మఱియేని కిని దారిద్ర్యము లేకయుండెను. దుర్లభత్వము పాతకమునందుఁ దప్ప మఱియెక్కడను లేకయుండెను. మఱియును, మత్తత గజములయందును, యుద్ధము తరంగముల యందును, దానహాని గజములయందును, కంటకములు వృక్షములయందును, విహారములు జనములయందును, తప్ప మఱియెక్కడను లేకయుండెను. మఱియును, గుణము లేకపోవుట బాణములయందును, బంధము పుస్తకములయందును, స్నేహత్యాగము పాశుపతజనమునందును, దండహస్తసన్న్యాసులయందును, మార్గణములు ధనుస్సులయందును, మాత్రము కలిగియుండెను. భిక్షుకులు బ్రహ్మచారులును, మలధారులు క్షపణకులును, చపలవ్యాపారముకల జంతువులు తుమ్మెదలును నై యుండెను. రాముఁడు రాజ్యమును పాలించుచుండఁగ నిట్లు సకల సద్గుణములును గలిగియుండెను. మఱియు నిర్విఘ్నముగ ప్రతాపవంతుఁడును ధర్మజ్ఞుఁడును అగు సీతారాముఁడు నిర్ద్వంద్వముగ నయోధ్యాపట్టణమును పరిపాలించుచుండెను. శ్రీరాముఁడు దుష్టులయొక్క హృదయములయందును నేత్రములయందును సూర్యునివలెఁ దాపమును గలుగఁజేయుచుండెను. సాధుజనుల హృదయములకును నేత్రములయందును శ్రీరాముఁడు పూర్ణచంద్రునివలెఁ బ్రకాశించుచుండెను. శ్రీరాముఁడు ధనుర్ధారియయ్యేని శత్రువులు నిలువక పలాయితులగుదురు. ఆరాముఁడు ధర్మరాజువలె ధర్మాధర్మములనెఱిఁగి రాజ్యమును పాలించుచుండెను. లోకములను గాపాడుటచేత నెల్లవారు శ్రీరాముని జగత్ప్రాణుఁడని పొగడుచుండిరి. సర్వజనులకును సమృద్ధిగ ధనమును గలుగఁజేయుటవలన కుబేరుఁడై యుండెను. శత్రువులకు శ్రీరాముఁడు రుద్రుఁడై యుండెను. విశ్వేదేవులు శ్రీరాముని సర్వకాలములయందును శ్రీరాముని స్తోత్రముచేయుచుండిరి. మఱియును, శ్రీరాముఁడు తనదు సుగుణములచేత దేవతలకు సంతోషమునుఁ గలుగఁజేయుచుండెను. విద్యాధరులు శ్రీరాముఁడు సర్వవిద్యాధరుఁడని పొగడుచుండిరి. గంధర్వులు శ్రీరాముఁడు గర్వరహితుఁడని గానము చేయుచుండిరి. నాగులు శ్రీరాముఁడు నాగులకంటె బలవంతుఁడని పొగడుచుండురు. దనుజులుకూడ శ్రీరాముని ననేకవిధములఁ బొగడుచుండిరి. గుహ్యకులు శ్రీరాముఁడు గుహ్యచరితుఁడని పొగడిరి. ఓరఘుకులోత్తమా! దేవతలమగు మేమందఱమును నిన్ను ననేకవిధముల స్తోత్రమునుఁ జేయుచున్నారమని యింద్రాదిదేవతలా శ్రీరాముని ననేకవిధముల స్తోత్రమును చేయుచుండిరి. ఈవిధముగ శ్రీరాముఁడు నానావిధములయిన సంపదలుగలవాఁడై లోకమును పరిపాలించుచుండెను. ఇట్లు శ్రీరాముఁడు పుత్రమిత్రాదులతోఁ గూడుకొనినవాఁడై ధర్మమునుదప్పక రాజ్యమును పాలించుచుండెను. ప్రజలందఱును మిగుల సంతోషము కలవారును బలముకలవారును నై యుండిరి. సకల వృక్షములును జక్కఁగ ఫలించునట్టివి యై యుండెను. సకల

జనులును ఏకపత్నీవ్రతస్థులై యుండిరి. మఱియును, సకల వృక్షములును పుష్పఫలాదులతో నిండి సర్వకాలములయందును సౌఖ్యమునుఁ గలుగఁజేయునట్టివై యుండె. అధ్యయనమును చేయని బ్రాహ్మణుఁడును శూరుఁడుకాని క్షత్రియుఁడును, ధనమును సంపాదింపఁ దెలియని వైశ్యుఁడును, ద్విజశుశ్రూషను చేయని శూద్రులును, ఆపట్టణమునందు లేకయుండిరి. మఱియును రామరాజ్యమునందు బ్రహ్మచారులు వ్రతమును విడువక సంచరించుచుండిరి. మఱియును, బ్రహ్మచారులు సర్వకాలములయందునుఁ గురుకులాధీనులును, వేదములను గ్రహించుటయం దాసక్తికలవారును నై యుండిరి. మఱియు సర్వజాతులవారుఁ దమతమజాతి ధర్మములను విడువక సంచరించుచుండిరి. మఱియు నా రామరాజ్యమునందు సంతానహీనుఁడును ధనహీనుఁడును నగువాఁ డెవ్వఁడును లేకయుండె. మఱియును, విరుద్ధధర్మములను సేవించువాఁడును, అకాలమునందు మరణమును పొందువాఁడును నెవ్వఁడును లేకయుండె. శఠులు, వాచాటకులు, వంచకులు, హింసకులు, పాషండులు, భండులు, రండలు, శౌండికులు, అనుదుష్టులు రామరాజ్యమునందు లేకయుండిరి. ఆపట్టణమున సకల స్థలములయందును శ్రుతిఘోషములును శాస్త్రఘోషములును వినఁబడుచుండె. సర్వస్థలములయందును సుందరములయిన యాలాపములను మంగళగీతములను వినఁబడుచుండె. మఱియును, నలుదిక్కులయందును, వీణావేణుప్రవాదములును, మృదంగమధురస్వనములు వినఁబడుచుండె. మఱియు నాపట్టణమునందు సోమపానముతప్పఁ దక్కిన పానగోష్ఠి లేకయుండె. పురోడాశభక్షణకంటె నితరమైన మాంసభక్షణము లేకయుండె. సకలజనులును ధర్మమును చేయువారలే కాని తస్కరులెవ్వరును లేకయుండిరి. పుత్రులుఁ దండ్రులపాదములను దేవతలకుఁ బూజించునట్లు పూజించుచుండిరి. మఱియు నెల్లవారును ఉపవాసము, వ్రతము, తీర్థము, దేవతారాధనము అనువాని నాచరించుచుండిరి. స్త్రీలందఱును భర్తృపాదములకుఁ బ్రణమిల్లి పూజలను సలుపుచుండిరి. భృత్యులందఱును తమతమ యజమానులపాదములకుఁ బూజలను సల్పుచుండిరి. హీనజాతివారు అధిక జాతివారిని సుగుణసంపదచేతఁ బొగడుచుండిరి. మఱియు నెల్లవారును తపోవంతులును విద్వాంసులును జితేంద్రియులును జ్ఞాననిష్ఠులును శివలింగములను పూజించువారును నై యుండిరి. మఱియును, బ్రాహ్మణులందఱును శాస్త్రోక్తప్రకారముగ స్నానమునుచేయుచుండిరి. వాపీకూపతటాకాదులు శుద్ధోదకములచేత సర్వకాలములయందును నిండియుండె. ఆరామరాజ్యమునందు సంపద చలనము లేనిదై యుండె. రాముని రాజ్యమునందు నాలుగుదంతములుకల యేనుఁగు లనేకములుఁ గలిగియుండె. కైలాసపర్వతమునందు శ్రేష్ఠమైన వృషభ మొక్కటియే యుండెనుగాని రామరాజ్యమునందు మిగుల శ్రేష్ఠములయిన వృషభము లనేకములుండె. స్వర్గలోకమునందు సహస్రాక్షుఁ డొక్కఁడేయుండెను. రామరాజ్యమునందు సహస్రాక్షములుకల చామర

ములనేకములుండెను. స్వర్గమునందు సురాపానమొక్కటియే కలిగియుండెను. అయోధ్యాపట్టణమునందలి ప్రతిగృహమునందును నానావిధములయిన రసములను పానము కలిగియుండెను. స్వర్గమునందలి వారు సుధాపానముచేత సంతోషమును పొందుచుండిరి. రామరాజ్యమునందలి వారు దయితాధరపానముచేత సంతోషమును పొందుచుండిరి. లోకములో సముద్రమునందుమాత్రమే మర్యాదకలిగియుండెను. రామరాజ్యమునందు బాలురుకూడ మర్యాద నతిక్రమింపకుండిరి. మఱియు నారామరాజ్యమునందలి పౌరజానపదాదులందఱును నానావిధములయిన గజములనెక్కి తిరుగుచుండిరి. పూర్వము బాలురను ముద్దులనుబెట్టుకొనుచుండిరి. రామరాజ్యమునందెల్లవారును స్త్రీలను ముద్దును పెట్టుకొనుచుండిరి. మఱియు నెల్లవారును నానావిధములయిన క్రీడలను సల్పుచుండిరి. ఇట్టి రామరాజ్యవృత్తాంతమును వినినను పఠించినను నానావిధములయిన మంగళములు కలుగుచుండును.

ఇట్లని రాజ్యకాండోత్తరార్ధమునందలి పదునైదవసర్గ ముగిసెను.

---

* శ్రీరాముఁడు రాజనీతిని చెప్పుట. *

అంతట నారామదాసు మరలఁ దనశిష్యుఁడగు విష్ణుదాసునితో నిట్లనియె: ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! అంతట నొక్కనాఁడు శ్రీరాముఁడు నిజపుత్రులగు కుశలవులను భరతలక్ష్మణశత్రుఘ్నులనుబిలిచి యేకాంతమునందుఁ గూర్చుండఁబెట్టుకొని రాజనీతిని బోధింపఁదలఁచి యిట్లనియె. ఓవత్సా! కుశుఁడా! మీకందఱికిని రాజనీతినిఁ బోధించెదను. సావధానచిత్తము కలవారై వినుఁడు. ఓకుశుఁడా! నేను వైకుంఠమునకు పోయినపిమ్మట నీవు పృథివీపాలుఁడ వగుదువు. చిరకాలము సుఖముగ జీవింపఁదలఁచినరాజు అసత్యము నాడఁగూడదు. రాజగువాఁడు అధికమైనకామము కలవాఁడును అధికమైన క్రోధముకలవాఁడును కాఁగూడదు. మఱియును, రాజగువాఁడు పరదారాగమనమును విడిచిపెట్టవలయును. దయాసత్యశౌచార్జవశాంతులను అవలంబించి మధురప్రియవచనములు కలవాఁడు కావలయును. బ్రాహ్మణులయందును, గోవులయందును, యతులయందును భక్తికలిగి యుండవలయును. ఈయేడును శుభగుణములని యార్యులచేతఁ బొగడఁబడినవి. మఱియును, నిద్ర, అలసత, మద్యపానము, ద్యూతము, వారాంగనల సంయోగము, అతిక్రీడ, అధికముగ వేటాడుట అనునేడును రాజునకు పాపమునుఁ గలుగఁజేయునట్టి దుర్గుణములై యున్నవి. రాజగువాఁడు ప్రజలను పుత్రులనుఁ గాపాడినవిధముగఁ గాపాడవలయును. లోకమునందుఁ గలిగెడుఫలమునందాఱవభాగమును గ్రహింపవలయును. భూమియందుఁ జరుగునట్టి ప్రతివిషయమును చారులవలనఁ దెలిసికొనుచుండవలయును. పరరాజ్యములయందు నానావిధవేషధారులగు తనదూతలనుంచి వారివలన శత్రుకృత్యములను దెలిసికొనవలయును. పరులదూతలయందించుకైనను నమ్మ

కము పెట్టఁగూడదు. సామదానభేదదండములను కాలముఁ గనిపెట్టి యుపయోగింపవలయును. తగినకాలమునందు యుక్తిచేతఁ దన కార్యమును నెరవేర్చుకొనవలయును. తన మనస్సునం దాలోచించెడు కార్యమును బరులకుఁ దెలియనీయఁగూడదు. మంత్రి మొదలగువారితో నాలోచించి సకలకార్యములను జేయవలయును. ప్రతిమాసమునందును ధనాగారమును పరిశీలించి యాదాయవ్యయములను మిగుల జాగరూకతతోఁ దెలిసికొనవలయును. సర్వకాలములయందును అన్నికార్యములయందును సేవకులను నమ్మఁగూడదు. ప్రతిసంవత్సరమును పరిఖాప్రాకారాదులనుఁ బరిశీలించి చక్కఁబెట్టుచుండవలయును. నాలుగుమాసముల కొకపర్యాయము మార్గములనుజూచి వచ్చుచుండవలయును. గజతురగములను పదునైదుదినముల కొకపర్యాయము పరిశీలించుచుండవలయును. మాసముదినముల కొకపర్యాయము వస్త్రములను పరిశీలించుచుండవలయును. పశువులను మూడుదినముల కొకపర్యాయము విచారించుచుండవలయును. ఆఱుమాసముల కొక్కపర్యాయము సీమాచారజనులను పరిశీలించుచుండవలయును. జానపదులను ప్రతిదినమునందును విచారింపవలయును. ప్రతిమాసమునందును సైన్యమును విచారింపవలయును. ప్రతినెలకును పుష్పవాటికలను పరామర్శము సేయవలయును. సంవత్సరమునకైనను, ఆరుమాసములకైనను, మూడుమాసములకైనను ఒకపర్యాయము సైన్యముతోఁ గూడ రాష్ట్రమునందు సంచరించి వచ్చుచుండవలయును. దేవతలు బ్రాహ్మణులుఁ గురువులు యతులు మొదలగువారికి సంతోషమునే సర్వకాలములయందునుఁ గలిగింపవలయునుఁగాని వ్యసనమును గలిగింపఁగూడదు. ఆదాయవ్యయములను స్వయముగఁ బరీక్షించుచుండవలయును. ఆదాయమునందలి నాల్గవభాగముకంటె నధికముగఁగాని తక్కువగఁగాని వ్యయపరుపఁగూడదు. ఒకానొకప్పుడు ఆదాయమునందలి మూడవ భాగమునుకూడ వ్యయముచేయవలయును. మంత్రులతో నిష్టముగ నుండవలయునుఁగాని కోపముకలవాఁడై యుండఁదగదు. మంత్రుల నధికముగ వృద్ధినిఁబొందించుట అధికముగ క్షీణింపఁజేయుట అధికముగఁ గోపముకలవారినిగఁజేయుట అనుకృత్యములు తగినవి కావని యెఱుఁగవలయును. మఱియును, ఆకరములు, (గనులు) పట్టణములు, దుర్గములు, పర్వతవాసులు, అరణ్యవాసులు, సింధుద్వీపవాసులు, వేరువేరు పథములయందు నివసించువారు, సింధుతీరనివాసులు, నానాదేశనివాసులు, వర్షాంతరమునందున్నవారు ద్వీపాంతరవాసులు మొదలగువారితో స్నేహమును చేయుచుండవలయును. పరరాష్ట్రములయందలివృత్తాంతమును గుప్తరూపులును, యతివేషధారులును నగువారిచేతఁ దెలిసికొనుచుండవలయును. ప్రతిసంవత్సరమునందును అధికారులను మార్చుచుండవలయును. ఒక్కనినే పాలకునిగా చిరకాల మొక్కచోట నుంచఁగూడదు. పరులసైన్యమునకును తనసైన్యమునకును గల తారతమ్యమును విచారించుచుండవలయును. పరరాష్ట్ర

మునందలి తన దూతలవలన సర్వకాలములయందును దెలిసికొనుచుండవలయును. పరులదూత తన రాజ్యమునందుఁ గనఁబడినను వానినిఁ దండింపఁగూడదు. పరుల దూతకు సన్మానాదులనుఁజేసి పంపవలయును. తనసీమయందు రక్షకులుగా నుండు దూతలను మాటిమాటికిని శిక్షింపవలయును. మఱియును పరులఁ దూతలను మీ రెట్లు విడిచితిరని యడుగవలయును. అనంతరమందిఁకమీఁదఁ జాగ్రత్తకలిగి యుండ వలసినదనియును అట్లుగానియెడల నధికముగ దండింతుననియును దెలియవలయును. మఱియును, తనకు ముందరనడుచువాఁడు పార్శ్వభాగములయందు నడుచువారు, పశ్చాద్భాగమునందు రక్షకుఁడై దిరుగువాఁడును, సేనాపతి, మంత్రి, తనకు ప్రతి నిధిగ నున్నవాఁడు, సూతుఁడు, చామరహస్తుఁడు, సమీపవర్తియగుదూత మొద లగువారిని సర్వకాలములయందును సంతోషమును పొందించుచుండవలయునుఁ గాని కోపముకలవారినిగాఁ జేయఁగూడదు. దేశకాలబలకోశ నిజోత్సాహములను పరిశీలింపవలయును. ఇటులనే శత్రువులయొక్క దేశబలాదులనుఁగూడ నాలోచింప వలయును. మఱియును, తనదు మిత్రులను తనదు మిత్రుల మిత్రులను, తనదు శత్రువులను, తన శత్రువుల శత్రువులను, తనదు శత్రువుల మిత్రులనుకనిపట్టి ప్రవ ర్తింపవలయును. మఱియును, తనరాజ్యములోని తనవారలను, పరులవారిని విచా రించి తెలిసికొనవలయును. మఱియును, తనదు శత్రువులకు సంబంధించిన వారు వీరని చక్కఁగఁ దెలిసికొనవలయును. శత్రువుల శత్రువులతో జాగరూకతతో మై త్రినిఁ జేయవలయును. శత్రు మిత్రుల యొక్కయును, తనయొక్కయును, బలాబల ములను విచారించి తెలిసికొనవలయును. మఱియును, పరరాజ్యమునందలి నదులు, దుర్గములు మొదలగువానిని దెలిసికొనవలయును. తాను బయలువెడలి పోవునట్టి మార్గ మెంతగ నితరులకుఁ దెలుపఁగూడదు. సేనానివేశమును ఉత్తరాభిముఖ ముగ నుంచవలయును. మఱియును, దా నేమార్గమునఁ బోదలఁచెనో యామా ర్గమునందు ధ్వజములను నాటింప వలయును. మఱియును, యంత్రములు, ఆయుధములు, వాహనములు, సేనలు మొదలగు వానిని వృద్ధిని పొందింప వలయును. ధాన్యాదులను మెండుగ సంగ్రహింపవలయును. రాష్ట్రము, దు ర్గము, పట్టణము, నిర్జలప్రదేశము మొదలగువానియందు జలాశయములను మెండు గనిర్మింపవలయును. ప్రాకారము, దుర్గము, ఉదకము మొదలగువానికొఱకు చేసెడు వ్యయము వ్యయముకాదని యెఱుగవలయును. ధర్మముకొఱకుఁ జేసినవ్యయము పరజన్మమునందుఁ బొందుటకు దాచిపెట్టికొనిన ధనమని యెఱుఁగవలయును. మఱి యును, "శ్లో॥ ఆపదర్థే ధనంరక్షే ద్దారాన్రక్షే ద్ధనైరపి । ఆత్మానంసతతంరక్షే ద్దారైరపి ధనైరపి" (ఆపదవచ్చినపు డుపయోగించు నని యెడుతలంపుతో ధనమునుఁగాపాడవ లయును. అట్టిధనముచేత భార్యనుఁగాపాడవలయును. అట్టిధనముచేతను, భార్యచేత ను, తననురక్షించుకొనవలయును.) అని తెలిసికొని వర్తింపవలయును. ద్రవ్యమును

సంపాదించునపుడు పాదముద్రామితికల ద్రవ్యముకూడ నధికమైన దెయనితలంచి సంపాదింపవలయును. వ్యయకాలమునందు కోటిపరిమితికల ద్రవ్యమునుకూడ నధికమైనదానినిగాఁ దలఁపవలయును. తనపట్టణమునువదలి బయలునకుఁబోవునపుడు సైన్యమును విడిచిపోఁజనదు. ఏకాకియై యెందును సంచరింపఁగూడదు. పాదచారియైనడువఁగూడదు. మాటిమాటికిని పరగృహములకుఁబోఁగూడదు. ద్వారపాలుఁడు, జలదుఁడు, రజకుఁడు మొదలగువారిని నమ్మఁగూడదు. ధౌతవస్త్రములను పరిశీలించి ధరింపవలయును. తాంబూలమునుఁ జక్కఁగఁబరీక్షించి భుజింపవలయును. ఇతరులు దెచ్చి యిచ్చుజలమునుఁజూచి పానముచేయవలయును. పరులు దెచ్చియొసంగునట్టి ఫలములను పరీక్షింపక భుజింపఁగూడదు. మానవులను దూరముగనుంచి మాటలాడవలయునుగాని సమీపమునకురప్పించి మాటలాడఁగూడదు. ప్రతిదినము నందును సభలోనికి రెండు పర్యాయములు పోవలయును. అర్ధయామమునకంటె నధికకాలము సభయందుండఁదగదు. రాజగువానిని ద్వేషించువానిని నగరమునుండి వెడలగొట్టవలయును. రాజగువాఁడు సభయందు పాదములను చాచుకొని కూర్చుండఁగూడదు. మఱియును, జానువులనుఁ బాహువులచేతఁ బంధించికూర్చుండఁగూడదు. సభయందధికముగ నవ్వఁగూడదు. సభలోనికి మలినములయిన వస్త్రములతోఁ బోఁగూడదు. గాయకులు, గణకులు, వైద్యులు, గాయకులు, వందులు, నటులు, పండితులు, ధర్మశాస్త్రజ్ఞులు, తార్కికులు, వైదికులు, బ్రాహ్మణులు మొదలగు వారిని దానమానములచేత సన్మానింపవలయును. నాపికుని నమ్మక యతనికి ధనాదుల నిచ్చి సంరక్షింపవలయును. ప్రజలను గౌరవింపవలయునుగాని వ్యర్థముగదండింపఁగూడదు. ప్రజలు దుఃఖమును పొందునటుగాని కార్యములనుఁ జేయఁగూడదు. రాజద్వారమునందలిదూతలు నటబంధము మొదలగునవి లేకుండునట్లు ప్రవర్తింపవలయును. మంత్రులు మొదలగువారు ముందుగ రాజునకు నమస్కారమును చేసిన పిమ్మటఁ దమతమ యాసనములయందుఁ గూర్చుండునట్లు చేయవలయును. రాజునకెదురుగ నితరులు నవ్వుట, తుమ్ముట, ఆవలించుట మొదలగు కార్యములను చేయఁగూడదు. ప్రతిమానవుఁడును హస్తపాదములను రాజునకుఁ గనఁబరుపఁగూడదు. రాజగువాఁడు సర్వస్థలములయందును నుమియఁగూడదు. రాజసన్నిధియందు పెద్దగ మాటలాడఁగూడదు. కంచుకమునువదలి రాజభటులు సభయందుఁ గూర్చుండఁగూడదు. రాజగువాఁడు వేటయందు ధేనువునుజంపఁగూడదు. గర్భవతియగువాడు లేడిని వధింపఁగూడదు. నిద్రనుపొందుచున్నదియును, ఉదకమునుఁ ద్రాగుచున్నదియును, అగుజంతువును వేటయందు వధింపఁగూడదు. నమ్మినదియును, రక్షకమును, గోరినదియును అగుమృగమును వధింపఁగూడదు. క్రీడించుచున్న మృగాదులమీదఁ బాణ ప్రయోగమును చేయఁగూడదు. ఎనిమిది దిక్కులయందును సీమాచారులను ముందుగ నియమించి పిమ్మట వేటనుఆడవలయును. రాత్రులయందు

మిత్రులతోఁగూడ నూరకుండవలయును. రాత్రులయందు కంబళినిగప్పుకొని రాజగృహమునకు వెలుపట సంచరింపవలయును. పురద్వారమునందలి యర్గళాదులను జక్కఁగఁ బరిశీలింపవలయును. జనులు చెప్పునట్టి శుభాశుభవచనములనుఁ దప్పక వినవలయును. ఇట్లుకాదేని హితుఁడగు వానినిబంపి జనులయొక్క శుభాశుభములను దెలిసికొనివచ్చునట్లు చేయవలయును. ప్రతి రాత్రియందును నీవిధముగ సర్వజనులును చెప్పుకొనునట్టి వాక్యములను వినవలయును. సభయందున్నవారితో కలహమును చేయఁగూడదు. అణుమాత్రముగనైన ముందుగ మాటలాడఁగూడదు. రాజగువాఁడు సభముందు శిరస్సును తనహస్తములతో గోకికొనఁగూడదు. శత్రువుల యుత్కర్షనువిని ధైర్యమును విడువఁగూడదు. యుద్ధమునుండి పలాయనమును చేయఁగూడదు. శత్రువులకుఁ దన పృష్ఠభాగమును జూపఁగూడదు. రాజగువాఁడు పడవమీఁదనుండి నదులను దాటఁగూడదు. మఱియేమనిన సేతువునుఁ గట్టించి నదులనుఁ దాటవలయును. ఏనుఁగలమునందైనను నదులు మొదలగువానిని పుత్రాదులతోఁగూడ నోడచేత దాటఁగూడదు. హట్టమధ్యమునందును, చతుష్పథ మధ్యయందునను నివసింపఁగూడదు. పుత్ర భార్యాదులను గొట్టఁగూడదు. తనదు ముద్రలేని కాగితమును పట్టణమునుండి బయలునకుఁ బోనియ్యఁగూడదు. ముద్రాపత్రము మీఁదఁ దప్ప మఱిదేనిమీఁదను తనయాజ్ఞను బ్రకటింపఁగూడదు. అరణ్యమునందును, మార్గములయందునుఁ దొంగలు సంచరింపకుండునట్లు చేయవలయును. ముండనమును జేసికొనక తీర్థములను సేవింపఁ గూడదు. పర్వకాలములయందు గృహమునందే స్నానమును చేయఁగూడదు. ధనుర్బాణములను పాదములతో స్పృశింపఁగూడదు. బ్రాహ్మణులతో గ్రీడార్థముగనైనను కలహమును చేయఁగూడదు. ద్వారదేశమునందు నిలిచియుండఁగూడదు. మార్గమునందు నిలిచియుండఁగూడదు. రాజగువాఁడు దుఃఖమును పొందఁగూడదు. స్త్రీలు మొదలగువా రుదకమును దెచ్చెడుమార్గమునందు నిలువఁగూడదు. ధాన్యమును ఎక్కువ వెలలకమ్మకుండునట్లు వ్యవసాయకులను శిక్షింపవలయును. దేశమునందు ధర హెచ్చైనపుడు దేశక్షేమముకొఱకు పన్నునుఁగొంచెము తగ్గింపవలయును. శౌర్యమునుఁజూపక యౌదార్యమునుఁ జూపవలయును. దొంగతనమును చేసిన వారియొద్దనుండు ద్రవ్యమును గ్రహించినపిమ్మట విడువక వారిని కారాగృహమునందుంచవలయును. సుఖముకొఱకుఁగా రాజగువాఁడన్యాయము నాచరింపఁగూడదు. పరులును అన్యాయమును చేయకుండునట్లు శిక్షింపవలయును. ఆర్తులగువారు చెప్పునట్టి విషయమును సర్వమును శ్రద్ధతో వినవలయును. ఆర్తులగువారిని దయచేత దగ్గరకురప్పించి చక్కఁగ విచారింప వలయును. వైద్యుఁడు, గణకుఁడు, నటుఁడు, పండితుఁడు, వైదికుఁడు, వీరుఁడు, గాయకుఁడు, ధర్మాత్ముఁడు, అగు వారలనవమానింపఁగూడదు. యజ్ఞము, దానము, జపము, హోమము, సంధ్యాధ్యానము, శివార్చనము, స్నానము, పురాణశ్రవణము మొ

దలఁగువాని నధికభక్తితో నాచరింపవలయును. మాంద్యమును గలుగఁజేయునట్టి వస్తువులను సేవింపఁగూడదు. కృచ్ఛ్రాదికము నాచరింపఁ గూడదు. పాదచారియై యాత్రను జేయఁగూడదు. ఏకాదశీదినమునం దుపవాసమును జేయవలయును. రాజగువాఁడు నిర్జలోపవాసమునుగూడఁ జేయఁగూడదు. బ్రాహ్మణుఁడు యాచించిన వస్తువు నీయవలయును. రాజులు బ్రాహ్మణులనే దేవతలనుగాఁ దలఁపవలయును. కారాగృహవాసులను సంతోషకాలమునందు విడుదలఁజేయవలయును. రాజగువాఁడు తనయాజ్ఞ భంగమయ్యెనేని తనదుశిరస్సే కొట్టఁబడినదని యెన్నవలయును. తనదూతల నవమానించిన యెడలఁ దననే యవమానించినట్లు తలఁపవలయును. ఓ కుశుఁడా! నేనిప్పుడు చెప్పినది నీచర్యనుఁదప్పక యాచరించుచుండుమని శ్రీరాముఁడు కుశునకుఁ దెలిపె.

ఇట్లని రాజ్యకాండమునందలి పదునాఱవసర్గ ముగిసెను.

✷ కుశ కన్యా స్వయంవరవర్ణనము. ✷

అంతట రామదాసు మరలనిట్లనియె. శిష్యోత్తముఁడవైన యో విష్ణుదాసా! అంతట నొక్కనాఁడు శ్రీరాముఁడు కుశునిపుత్రికయగు హేమయనుదానికి స్వయంవరమహోత్సవమును బ్రకటింపఁజేసె. అనంతరమందు నానాద్వీపదేశాదులయందలి రాజులనందఱఁ బిలిపించె. ఏమ్మట సకలరాజులును దివ్యవేషములతోఁగూడ నేగుదెంచిరి. అప్పుడు దేవతలు, గంధర్వులు, మునులు, విద్యాధరులు, నాగులు, కిన్నరులు మొదలగువారందఱును నేగుదెంచిరి. అంతట కుశపుత్రికయగు హేమను దివ్యాలంకారములచేత నలంకరించి సభలోనికిఁ దీసికొనివచ్చిరి. ఆసమయమునం దాహేమ నవరత్నమాలికను చేతియందుఁబెట్టుకొని సువర్ణమైన శిబిక నధిష్ఠించియుండె. అట్లు వచ్చి యాసభయందలి రాజులను రాజపుత్రులనుజూచె. ఆసమయమునం దాకన్నియయొక్క భ్రూచాపమునుండి బయలువెడలిన కటాక్షములనియెడు బాణముల చేత నిర్భిన్నహృదయులై యారాజులందఱును దమను దాము మఱచిరి. ఇంతలో వల రాత్రియయ్యె. ఆరాత్రియందు అవంతీనాథుని పుత్రుఁడగు చిత్రాంగదుఁడను రాజకుమారుఁడు కార్యాంతరమందు వ్యగ్రులై యున్న యాకుశుని పుత్రికను అపహరించె. ఆసమయమునందు రామాదులుకూడ కార్యాంతరములయందుఁ బ్రవేశించియుండిరి. అప్పు డాచిత్రాంగదుఁడు మోహనాస్త్రముచేత సకల రాజులకును మోహమును గల్పించి సువర్ణచ్ఛాయవంటి ఛాయకల యాహేమను రథముమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని క్రోసెడు దూరముపోయి యక్కడ స్థిరచిత్తుఁడై యిట్లనియోచించె. కుశపుత్రికయగు నీహేమను దొంగతనముగ నపహరింపఁ దగినదియగునా? అని యోచించుచుండె. ఇంతలోవల నయోధ్యాపట్టణమునం దంతటను హాహాకారము లతిశయించె. అతి బలవంతుఁడును ఉగ్రబాహువనకుఁ బుత్రుఁడును నగు

చిత్రాంగదుఁడు హేమను అపహరించెనని తెలిసికొని సభలోని రాజులందఱును ఖిన్నమానసులై లేచిరి. ఇంతలోపల నెల్లవారును మోహనాస్త్రముచేత ముక్తులై చిత్రాంగదునితో యుద్ధమును జేయుటకొఱకుఁ దమతమసైన్యములతో గూడ బయలువెడలిరి. ఆసమయమునం దుగ్రబాహు వేమియునుఁబలుకక పుత్రకౌతుకమునుఁజూచుచుండె. ఇంతలోపల సకల రాజులునుపోయి యాచిత్రాంగదుని రథమును జుట్టుకొనిరి. అట్లు చుట్టుకొని నానావిధాస్త్రములను బ్రయోగించిరి. ఆసమయమునందుఁ జిత్రాంగదుఁడగు వీరుఁడా రాజులమీఁద వాయువ్యాస్త్రమును బ్రయోగించె. ఆవాయువ్యాస్త్రముచేత నారాజులను వాహనములతోఁగూడ నాకాశమునందుఁ ద్రిప్పె. అంతట రామానుమతమునుపొంది లవుఁడు మొదలుగాఁగల యేఁగురువీరులు బయలు వెడలిపోయిరి. ఆబాలురందఱునుఁ దమతమ రాజ్యములనుండి స్వయంవరోత్సవముకొఱకు నేగుదెంచిరి. అంతట నాయంగదాదులు తమతమసైన్యములతోఁగూడ ఘోరమైన యుద్ధమునుజేసిరి. ఆ సమయమునందు మిగుల భయంకరమైన యుద్ధముజరిగె. అప్పుడు చిత్రాంగదుఁడు తనదు బాణసముదాయముల చేత వారి శస్త్రములనన్నింటిని ఛేదించె. పిమ్మట నిజబాణ సముదాయములచేత యూపకేతువును విరథునిగాఁజేసె. మఱియు నిటులనే సుబాహు పుష్కరులను విరథులనుగాజేసె. మఱియునుఁ తక్షకాంగద చిత్రకేతువులఁగూడ విరథులనుగాజేసె. ఆసమయమునందు లవుఁడు అదియంతయును జిత్రకేతువుయొక్క తపస్సునకు దగిన ఫలమనితలఁచి మిగులఁ దీక్ష్ణములయిన బాణములనుఁ బ్రయోగించి యాచిత్రాంగదుని ధనుస్సునుఛేదించె. పిమ్మట మఱియొకబాణమును బ్రయోగించి యుగ్రబాహువుయొక్క పుత్రుని వ్యాకులునిగాఁజేసె. ఆసమయమునం దుగ్రబాహువు మిగుల వేగము కలవాఁడై లవునితోఁగూడ యుద్ధమునుజేయుటకు నేగుదెంచె. అంతట లవుఁడు వానినిగూడఁ దనదుబాణములచేత విరథునిగాఁజేసె అప్పుఁడు వీరుఁడయిన యుగ్రబాహువు మఱియొక రథమునధిష్ఠించె. పిమ్మట బాణవర్షమునుగురిపించి లవుని మూర్ఛితునిగాఁజేసె. అట్లు లవుఁడు మూర్ఛను పొందినతోడచే యధికమైన హాహాకారము కలిగె. అంతట నాయుగ్రబాహువుతో యుద్ధమును జేయుటకు కుశుఁడు బయలు వెడలివచ్చె. అట్లు కుశుఁడు యుద్ధమునకు వచ్చుటనుఁ దెలిసికొని యంగదాదులు మరల రథారూఢులై మరల నాయుగ్రబాహువుతో యుద్ధమును జేయుటకు యత్నించిరి. అప్పుడాయుగ్రబాహువు వారల నందఱను మరల విరథులనుఁగాజేసె. అప్పుడుకుశుఁడు కోపోద్దీపితుఁడై తీక్ష్ణములయిన బాణములను బ్రయోగించి యాయుగ్రబాహుని విరథునిగాఁజేసె. మఱియు నాయుగ్రబాహువు ధనుస్సునుఛేదించె. ఆసమయమునం దుగ్రబాహువు మిగుల వ్యాకులుఁడును భయమును బొందినవాఁడును నయ్యె. అంతట నా కుశుఁడా యుగ్రబాహువును బట్టుకొని దుందుభులను మ్రోగించె. పిమ్మట నతనిపుత్రునిఁగూడఁ బట్టుకొని యాయిరువురిని

శ్రీరామునిదగ్గరకుఁ దోడ్కొనిపోయెను. అప్పుడు శ్రీరాముఁడతని స్నేహితునిగా దలఁచి విడిచిపెట్టించెను. అంతట శ్రీరాముఁడగస్త్యమహాముని చూచుచుండఁగ వీరకంకణమును కుశునకిప్పించెను. ఆవీరకంకణముచేత కుశుఁడు మునుపటికంటె నధికముగఁ బ్రకాశించుచున్నవాఁడై యగస్త్య మహామునికి నమస్కరించి యిట్లనియె. ఓమునికులోత్తమా! ఈకంకణమును నీవెట్లు పొందితివనిన విని యగస్త్యమునివరుడిట్లనియె. ఓ రామనందనా! తొల్లిదేవేంద్రుని శత్రువులనేకులు సముద్రమునందు దాగియుండిరి. అంతట దేవేంద్రుఁడు మొదలగువారువచ్చి నన్ను ననేకవిధములఁ బ్రార్థించిరి. అప్పుడు నేనాసముద్రోదకమును సర్వమును చులకముచేత గ్రహించి పానముచేసితిని. అంతట దేవేంద్రుఁడు తనశత్రువుల నందఱఁజంపి మరల నన్ను సముద్రమును జలముచేత నింపుమని ప్రార్థించెను. పిమ్మట నేను సముద్రోదకమును సర్వమును మూత్రద్వారమువలన మరల విడచిపెట్టితిని. అప్పుడు సముద్రుఁడు నాకీకంకణమును సమర్పించెను. నేనీకంకణమును తొల్లి శ్రీరామునకు సమర్పించితిననిన విని కుశుండిట్లనియె. ఓ మునికులోత్తమా! లవుని జీవనోపాయమును దెలుపుము. ఇప్పటి యుద్ధమునందు మా లవుఁడు మూర్ఛితుఁడై క్రిందఁబడియున్నాఁడనిన విని యా యగస్త్యమహాముని యిట్లనియె రామనందనా! తొల్లిమార్గమునందు భరతుఁడు మూర్ఛనొందినపుడు ముద్గలాశ్రమములోని సంజీవినీ లతల వలన జీవించెను. కావున నిప్పుడు లక్ష్మణునిబంపి సంజీవినీ లతలను దెప్పించి యా లవుని బ్రతికింపుము. ఇట్లు కాదేని హనుమంతునిరప్పించి యాముద్గలాశ్రమమునకుఁ బంపి సంజీవినీ లతలను దెప్పించి బ్రతికింపుమనియె. ఇవ్విధముగ నాయగస్త్యమహాముని చెప్పినవాక్యములను వినినతోడనే హనుమంతుఁడు బయలువెడలిపోయి ముద్గలాశ్రమములోని సంజీవినీ లతలను దీసికొనివచ్చి సేనాసమేతుఁడగు లవుని జీవింపఁజేసె నసినవిని విష్ణుదాసుఁడిట్లనియె. ఓ గురువర్యా! రామదాసా! సంజీవినీ లతలు సమీపమునందలి ముద్గలాశ్రమమునందుండఁగా జాంబవంతుఁడు హనుమంతుని ద్రోణాచలమునకుఁ బంపుటకు గారణమేమి? ఈసంశయమును బోఁగొట్టి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమనిన విని యారామదాసుఁడిట్లనియె ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! తొల్లిగరుత్మంతుఁడు తల్లిని విడచిపెట్టించుటకు స్వర్గలోకమునకుఁబోయి యమృతకలశమును దీసికొనివచ్చినపుడు ఆకలశమునుండి యొకయమృతబిందువు క్రిందఁబడియె. అట్టియమృతబిందు ప్రభావమువలనను ముద్గల మునివరుని తపః ప్రభావమువలనను ఆయాశ్రమమునందలి లతలు సంజీవినీ లతలయ్యె. ఈవిషయమును జాంబవంతుఁ డెఱుగఁడు. కావున హనుమంతుని ద్రోణాచలమునకుఁబంపె. ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! పవిత్రమైన తొల్లిటికథను జెప్పెదను, వినుము. అంతట లవుఁడు మొదలగువారందఱును మూర్ఛనుండి దేరి యయోధ్యాపట్టణమునకుఁ బోయి రామాదులకును నగస్త్యమహామునికిని నమస్కరించి శ్రీరాముని కగ్రభాగము

నందు నిలిచియుండె. ఆసమయమునందు లవాదులను జూచుటచేత పట్టణములోని వారందఱును మిగుల సంతోషమునుబొందిరి. అట్లు హనుమంతుని చేత జీవింపఁజేయఁబడిన లవునిఁజూచి యాలింగనము చేసికొని యధికముగ సంతోషపడెను. అనంతరమందు రాముఁడు రత్నమయములయిన కంకణములను హనుమంతునకిచ్చె. అంతట హనుమంతుఁడు పరమానందమును బొందినవాఁడై యాకంకణములచేత మనుపటికంటె నధికముగఁ బ్రకాశించె. అనంతరమందు శ్రీరాముఁడు లవునకు మఱియొకకంకణమును సమర్పించె. అది యగస్త్యముని వరునిచేతఁ దొల్లియీయఁబడె. ఆకంకణముచేత లవుఁడుకూడ నధికముగఁ బ్రకాశించె. అంతట నాలవుఁడగస్త్యమునివరునకు నమస్కరించి యిట్లనియె. ఓయగస్త్యమునివర్యా ! ఈకంకణము నీకెట్లు లభించెననిన విని యాయగస్త్యమహాముని యిట్లనియె. ఓరామనందనా ! లవా ! తొల్లి నేనొకనాఁడు దండకారణ్యమునందలి సరస్సులో స్నానముచేయుటకు దండకారణ్యమునకుఁ బోతిని. పోయి యాసరస్సునందు స్నానమునుజేసి నిత్యకర్మముల ననుష్ఠించి యక్కడ క్షణమునేపునివసించితిని. అట్లునేను నివసించియుండఁగ స్వర్గలోకవాసియొకఁడు దివ్యవిమానము నధిష్ఠించి నూర్గురుస్త్రీలచేతఁబరివేష్ఠింపఁబడిదివ్యమాల్యాంబరములను ధరించినవాఁడై యచ్చోటునకు నేగుదెంచె. మఱియును, ఆదేవుఁడు దివ్యగంధాదులచేత నలంకరింపబడియె. ఆదేవోత్తముఁడువిమానారూఢుఁడై వచ్చునంతలోపల ఆమడుగునుండి మిగుల శ్రేష్ఠమైనదియును, సుగంధసహితమును అయిన యొకశవముఁ బయలువెడలివచ్చె. అంతట నాదేవుఁడావిమానమునుండి దిగి యాశవమును ఛేదించి యామాంసమును సర్వమునుభుజించె. పిమ్మట నామడుగులోని జలమును పానముచేసి మరల విమానము నధిష్ఠించె. అంత నాశవము మరల సరోవరమునందు మునిఁగిపోయె. అప్పుడు ఆదేవుఁడు మరలఁ బయలువెడలిపోవుటకు యత్నించె. ఆసమయమునందు నేను మృదుమధురవచనములతోనిట్లంటిని. ఓదేవోత్తమా ! క్షణము నేపిక్కడనుండుము. నేనుచూచినకౌతుకమునకు కారణమునుజెప్పుము. స్వర్గలోకవాసియగు నీకు శవాహారముకలుగుటకు కారణమేమి? అనియడిగిన విని యాస్వర్గలోకవాసి యిట్లనియె. ఓబ్రాహ్మణోత్తమా ! నీవు నావిషయమునుఁ జక్కఁగఁజూచితివి. ఈవిషయమును సర్వమునుజెప్పెదను. సావధానచిత్తుఁడవై వినుము. తొల్లిసుదేవుఁడను విదర్భదేశాధిపతి యొకఁడు కలఁడు. అతనికి శ్వేత సురథులను నిరువురు పుత్రులుకలరు. ఆయిరువురిలో నేను శ్వేతుఁడనై యుంటిని. నేనుఆజన్మమునందు దానమును చేయనివాఁడనై యుంటిని. మఱియు నేనుగొంతకాలము రాజ్యమును పరిపాలించి సంతానరహితుఁడ నగుటచేతనారాజ్యమును నాతమ్ముఁడగు సురథునకిచ్చి నేను తపోవనమునకుఁ బోతిని. అంతటనే నీమడుగునందు స్నానముసుచేయుటకు మునిఁగితిని. అంతట మరణమునుపొంది నాతపోబలమువలన స్వర్గలోకమునకుఁబోతిని. మఱియును, నాతపోబల

మువలన స్వర్గలోకమునందు సకలసంపదలను అనుభవించితిని. అట్లు సకలసంపదలును కలవాడనయ్యును. భుజించుటకుఁ దగినపదార్థ మేదియును లేనివాఁడ నైతిని పిమ్మట నేను దేవేంద్రునిఁ దగ్గరకుఁబోయి నాకుభక్షించుటకుఁ దగినపదార్థమేదియును లేదు. సకలభోగములు గలవు. అన్నిభోగములును గలిగి యుండుటవలనఁ బ్రయోజన మేమియు లేదు. నేనేమిచేయుదుననిన దేవేంద్రుఁడు నవ్వుచు నిట్లనియె. ఓయీ ! క్షత్రియుఁడా ! నీవు రాజ్యమదము కలవాఁడవై భూలోకమునందు దానముఁ జేసినవాఁడవుగావు. దానముచేయక యేదియు నే లోకమునందును లభింపదు. కావున నీవు ప్రతిదినమును శరీరముపడియున్న సరోవరమునకుఁ బోయి నానావిధములయిన భక్ష్యాదులచేతఁ బెంపఁబడిన నీమృతశరీరమును భుజించుచుండుము. ఆశరీరము చిరకాలము నీకాహారమగుననియె ఈవిధముగ నింద్రుఁడు చెప్పినమాటనువిని మరల నేనిట్లనియడిగితిని. ఓదేవోత్తమా ! నాకు దివ్యాన్నములు లభించునట్టి యుపాయమునుఁ దెలుపుమని యనేకవిధములఁ బ్రార్థించితిని. అంతట నాదేవేంద్రుఁడు మరల నాతోనిట్లనియె ఓరాజోత్తమా ! ఇప్పుడుఁ దండకారణ్యము నిర్మానుష్యమై యున్నయది. వింధ్యపర్వతముయొక్క యభివృద్ధిని పోగొట్టుటకొరకు దేవతలచేతఁ బ్రార్థింపఁబడి భార్యతోఁగూడ దక్షిణదిక్కునకుఁ బయలువెడలి కాశీపట్టణమునువిడిచి యాదండకారణ్యమునకువచ్చి నీకళేబరముపడియున్న సరస్సునందు స్నానమునుజేసిక్షణముసేపక్కడనివసించును. అప్పుడునీవా యగస్త్యమునివరునకు నీమృతకళేబరహస్తమునందున్న కంకణమునుఁ దానముసేయుము. అట్లుదానముసేయుటచేత అది మొదలుకొని దివ్యాన్నము లభించుననియె అంతటనదిమొదలుకొని నేనిక్కడకువచ్చినాకళేబరమును భుజించుచుంటిని. మఱియునింతవరకును నిక్కడ నెవ్వఁడునుకనఁబడక పోయె. ఇప్పుడు నాయదృష్టవశముచేత కనఁబడిన నిన్నేయగస్త్యమహామునినిగాఁ దలఁచుచున్నాను. ఇప్పుడు నీచేతఁ దరింపఁ జేయఁబడితిని. కావున నా కంకణమును గ్రహింపుమనినవిని యగస్త్యమునివరుఁ డిట్లనియె. ఓరామనందనా ! లవుఁడా ! ఆరాజోత్తముఁడు ఈవిధముగఁ జెప్పి యాకంకణమును నాకు నొసంగె. అదిమొదలుకొని యాశవశరీరముఁ బయలునకురాక పోయె. మఱియు నదిమొదలుకొని యతనికి స్వర్గలోకమునందే నానావిధములయిన దివ్యాన్నములు లభించుచుండె. మఱియు నో లవుడా! ఈవిధముగ లభించిన కంకణమును శ్రీరామునకు సమర్పించితిని. అరాముఁడు ఈకంకణమును నొసంగెనని చెప్పి యారామదాసు మరలనిట్లనియె. శిష్యోత్తముఁడవైన యో విష్ణుదాసా ! ఈవిధముగ నగస్త్యమహాముని చెప్పినవాక్యమును విని లవుఁడు మరలనిట్లనియె. ఓ మునికులోత్తమా ! దండకారణ్యము విపినమగుటకు కారణమేమి? అనినవిని యగస్త్యమహాముని యిట్లనియె. తొల్లివింధ్యపర్వతముయొక్క దక్షిణదేశమునందు ఇక్ష్వాకు వంశమునందుఁబుట్టిన దండుఁకుడను రాజేం

ద్రుఁ డొక్కఁడు కలఁడు. వాఁడు సర్వకాలములయందును పాపకర్మరతుఁడై యుండె. అంతనొక్కనాఁ డా రాజేంద్రుఁడు వేటాడఁదలఁచి తనసైన్యముతోఁగూడ నరణ్యమునకుఁబోయె. అట్లు పోయినపిమ్మట నాయరణ్యమునం దొక్కమృగమైనను కనఁబడకపోయె. పిమ్మటఁ గొంతసేపటి కొకమృగము కనఁబడఁగా తురగారూఢుఁడై యామృగము వెంటనంటిపోయె. అట్లు ఏకాకియై పోవుచుండఁగా గొంతసేపటి కామృగము కనఁబడకపోయె. అంతట నతఁడు అధికముగఁ దృష్ణకలవాఁడై యొకమడుగుదగ్గరకుఁబోయె. పోయి యాసరస్సునందలి స్వచ్ఛమగు జలమును పానముచేసి యాసరస్తీరమునందు నివసించె. పిమ్మట నక్కడనున్న తన గుర్వాశ్రమము దెలియక దానికి సమీపమునందున్న భృగుమహర్షి యొక్క యాశ్రమమునకుఁబోయె. పోయి యక్కడనున్న యొకయంగననుఁజూచి కామమోహముచేత పీడింపఁబడియె. అనంతరమందా చంద్రానను రతికొఱకనేకవిధములఁ బ్రార్థింపఁగ నా చంద్రాస్య యిట్లనియె. ఓరాజోత్తమా ! నేను నాయధీనమందే యున్నదానను గాను. ఇప్పుడు నేను నాతండ్రియగు భృగుమహర్షి యొక్క యధీనురాలనై యున్నదానను. నీగురువగు భృగుమహర్షి బయలునకుఁబోయి యున్నాఁడు. ఓరాజేంద్రా! నీవు నన్ను నపేక్షించినయెడల నీగురువగు భృగుమహర్షిని బ్రార్థించి యతని యనుమతమును బొంది నన్ను భార్యనుగాఁ గైకొని సుఖము ననుభవింపుమనియె. ఈవిధముగ నాయంగన చెప్పిన మాటలను వినియును ఆదండుఁడు కామపీడితుఁడై బలాత్కారముగ నాయంగనతోఁగూడ సుఖము ననుభవించి తనపట్టణమునకుఁబోయె. అనంతరమందు రజస్వలకానిదియగు యాయంగన తండ్రివచ్చినపిమ్మట నావృత్తాంతమును సర్వమును వ్యసనమును బొందుచుఁ దెలియఁజెప్పె. ఆవృత్తాంతమును సర్వమును విని దోసిలియందు జలమును గ్రహించి క్రోధారుణిత లోచనుండై దండునితోఁగూడ దండరాజ్య మంతయును క్షణములోపల నూరామడ వఱకును దగ్ధమై పోవుఁగాత, యని శపించె. మఱియును నూరామడవఱకునుగల యీభూమియంతయునుఁ బలరహితమైనదియగుఁగాక యనియె. మఱియును చరాచరజంతువులన్నియును నశించుననియె. ఇవ్విధముగ నామునివరుని శాపవచనములను విని యాబాలిక మిగుల వినయము కలదై యీశాపమున కవధినికలుగఁజేయుమని ప్రార్థింపఁగ నమ్మునివరుఁ డగస్త్యమునివరుఁ డిక్కడకు వచ్చినపిమ్మట నిక్కడ జలాదులు కలుగుననియె. అట్లుదండుని శిక్షవలన నీయరణ్య ముత్పన్నమగుటచేత దీనికి దండకారణ్యమని నామధేయము కలిగె. మఱియును నాభృగుమహర్షి శ్రీరాముఁ డీదండకారణ్యమునందు ప్రవేశించి నదిమొదలుకొని క్షేత్రాదులు కలుగుననియె. మఱియు నదిమొదలుకొని జనులు గూడ నీయరణ్యమునందు సంచరించుదురు. మఱియు నదిమొదలుకొని రామక్షేత్రమని చెప్పఁబడును. ఇట్లు ముని రాముల యనుగ్రహమువలన నీ దండకారణ్యము మిగులఁ బావనమైనదియును, లోకములోని సకలపుణ్యక్షేత్రములకంటె నధికమగు

పుణ్యక్షేత్ర మగును. మఱియును దండకారణ్యముతో సమానమైన దేశమెందును లేకపోవుననియె. అట్లుచెప్పి యాబాలిక విధ్యుక్తప్రకారముగ నొకమునికిచ్చియా భృగుమహర్షి దండకారణ్యమునువదలి తపస్సునుజేయుటకొఱకు హిమాలయమునకుఁబోయె. అంతట నాభృగుమహర్షియొక్క శాపమువలన నాదండరాజ్యమంతయును దగ్ధమయ్యె. ఇప్పుడు శ్రీరాముఁ డక్కడకుఁ బోయినదిమొదలుకొని యాదండకారణ్యము మునుపటివలెఁ జరాచర జంతుజాలములచేత నిండియున్నది. ఓల వుఁడా! నీవడిగినవిషయమును సర్వమును దెలిపితినని యాయగస్త్యమహాముని చెప్పెనని చెప్పి రామదాసు మరలనిట్లనియె. శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! ఈవిధముగ నగస్త్యమహాముని చెప్పిన వాక్యములనువిని లవుఁడు పరమసంతోషమును బొందె. పిమ్మట శ్రీరామునకు నమస్కరించి శ్రీరాముని సేవయందు మిగుల నాసక్తి కలవాఁడయ్యె. అనంతరము శ్రీరాముఁడు కుశుని పుత్రికను చిత్రాంగదునకిచ్చి వివాహమును జేసె. కోటిసమ్మితమగు ద్రవ్యమును అల్లునకును కూతునకును నరణమునిప్పించె. అప్పు డయోధ్యాపట్టణమునందు అత్యధికమైన యుత్సవముజరిగె. పిమ్మట శ్రీరాముఁడు ఉగ్రబాహువు మొదలుఁగాగల బంధువులను వసిష్ఠాదిమునివరులను దమతమ నివాసములకుఁ బంపె.

ఇట్లని శ్రీమదానందరామాయణ రాజ్యకాండమునందలి పదునేడవసర్గ ముగిసెను.

❋ బ్రాహ్మణులకు రామనాథపురమును దానముసేయుట. ❋

శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! అటుపిమ్మట శ్రీరాముఁడు సీతామహాదేవికినానావిధములయిన సంతోషములనుఁ గల్పించుచుండె. అయోధ్యాపట్టణమునందు రామాజ్ఞలేక యెవ్వఁడును శస్త్రములను ధరించుటలేదు. రామాజ్ఞను పొందక రామరాజ్యమునందుఁ బ్రవేశించువాఁడెవ్వఁడును లేకయుండె. మఱియును, రామానుమతమునుబొందక నొక్కఁడును అయోధ్యాపట్టణమువిడిచిపోవుటయును లేదు. మఱియు నోశిష్యోత్తమా! భూలోకమునందలివారందఱును రామముద్రాంకితమైన పత్రమునుగైకొని గమనాగమనములను జేయుచుండిరి. ఓశిష్యోత్తమా! రామముద్రాస్వరూపమును జెప్పెదను. సావధానచిత్తుఁడవై వినుము. తిర్యగూర్ధ్వములయందు పదునైదు రక్తరేఖలను కల్పింపవలయును. నాలుదిక్కులయందును ముందుగ పచ్చనిరేఖను నిర్మింపవలయును. అటులనే రెండవపంక్తికూడ శుభ్రమైనదై యుండవలయును. అనంతరమం దీశాన్య దిక్కుమొదలుకొని మూఁడవరేఖ యుండవలయును. మఱియు నికమీఁగటఁ జెప్పఁబోవుపదములను నల్లనివానినిగాఁ జేయవలయును. ఉత్తరదిక్కునం దారంభమునుజేసి దక్షిణదిక్కునందు సమాప్తినిపొందింపవలయును. ముద్రను పశ్చిమాభిముఖముగ స్థాపింపవలయును. కర్తయగువాఁడు తూర్పుముఖముగ గూర్చుండవలయును. షష్ఠ సప్తములయందు

ప్రథమద్వితీయ చతుర్థములను మొదట లెక్కించి పిమ్మట అష్టమనవమైకాదశములను లెక్కింపవలయును. అనంతరమందు నాల్గవ పంక్తియందు చతుర్థ షష్ఠ సప్తములను లెక్కింపవలయును. పిమ్మట నైదవదానికి పదునొకండు మొదలు కొని లెక్కింపవలయును. అనంతరమం దాఱవదానికి ప్రథమద్వితీయ చతుర్థ షష్ఠ సప్తమ నవమైకాదశములను లెక్కింపవలయును. మఱియు నేడవది తెల్లనిదై యుండవలయును. ఆయేడవదానియందు ప్రథమద్వితీయచతుర్థ షష్టనవమైకాదశములను లెక్కింపవలయును. తొమ్మిదవదానికి మొదటిది నల్లనిదై యుండవలయును. మఱియును. పిమ్మట ప్రథమద్వితీయా చతుర్థషష్ఠ సప్తమద్వాదశములను లెక్కింపవలయును, అనంతరమందు పదియవదానికి చతుర్థ షష్ఠ సప్తమద్వాదశములను లెక్కింపవలయును. మఱియును, పదునొకండవదానికి ప్రథమద్వితీయ చతుర్థ షష్ఠసప్తమాష్టమ నవమములను లెక్కింపవలయును. పిమ్మట పదిరెండవదానికి మొదటిది నల్లనిదై యుండవలయును. మఱియు అనంతరమందు ప్రథమద్వితీయ చతుర్థషష్ఠ సప్తమాష్టమనవమ దశమద్వాదశములను లెక్కింపవలయును. పదిమూడవదియంతయును నల్లనిదై యుండవలయును. ఈవిధముగఁ దెలిసికొని సర్వమునుపూరింపఁ జేసి రామరాజని స్పష్టమగునట్లు తెల్లనివర్ణములను రామనామమును చూపవలయును. (ఈయక్షరవిన్యాసక్రమము దేవనాగరలిపి క్రమము ననుసరించి చెప్పఁబడినదని యెఱుఁగవలయును.) శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! ఈవిధముగ ముద్రాంకితమైన శిలను శ్రీరాముఁడు బ్రాహ్మణుల కాదరముతో నొసంగెను. ఆశిలయిప్పటికిని భూమియందు రామనాథపట్టణమునఁ గలదు దానిని విని విష్ణుదాసు మరలనిట్లనియె. ఓగురూత్తమా! స్వీయముద్రాంకితమైన శిలను శ్రీరాముఁడు రామనాథపురమునందు బ్రాహ్మణులకు దానము చేయుటకు కారణమేమి? నీవుచెప్పినవిషయము మిగుల నాశ్చర్యమును గలిగించుచున్నది. కావున నీవిషయమును సర్వమును దెలిపి నన్ను గృతార్థునిగాఁ జేయుమనినవిని రామదాసుఁడిట్లనియె. తొల్లి శ్రీరాముఁడు బ్రాహ్మణులు కోరినవస్తువులను దానముచేయుననివిని బ్రహ్మపురమునందలి దాక్షిణాత్య బ్రాహ్మణులు అయోధ్యాపట్టణమునకుఁ బోయిరి. అసమయమునందు శ్రీరాముఁడు గంధర్వరాజ గృహమునందు భోజనమును జేయుటకుద్యుక్తుఁడయ్యె. అనంతరమందు స్నానదానాది వ్రతములనాచరించి సీతామహాదేవి బంధువులు పుత్రులు మొదలగువారితోఁగూడ భోజనముచేయుటకుఁ దగిన యాసనమునందుఁ గూర్చుండె. అప్పుడు గంధర్వరాజు శ్రీరాముని మిగుల నాదరముతోఁ బూజించె. అంతటమిత్రభార్యలచేత భోజనపాత్రములయందు సమృద్ధిగ వడ్డింపఁబడియె. అట్లు సకల పదార్థములను వడ్డించినపిమ్మట శ్రీరామాదులు భుజించుట కుద్యుక్తులైరి. ఆసమయమునందుదాక్షిణాత్యులగు బ్రాహ్మణులువచ్చి శ్రీరాముఁడు గంధర్వరాజనగరము నందున్నాఁడనివిని యక్కడకుఁబోయిరి. అట్లు పోయి

గంధర్వరాజ ద్వారమునందున్న దూతలతోఁ దామువచ్చిన వృత్తాంతమును శ్రీరామునకుఁ దెలుపుఁడనిరి. అంతట నాదూతలు బ్రాహ్మణాగమన వృత్తాంతమును శ్రీరామునకుఁ దెలిపిరి. ఆవృత్తాంతమునువిని శ్రీరాముఁ డధికసంతోషముతో బయలువెడలి యాబ్రాహ్మణుల కెదురుగవచ్చి నమస్కరించి గంధర్వరాజ గృహములోని కాబ్రాహ్మణులను దోడ్కొనిపోయి తగిన యాసనములనిచ్చి కూర్చుండనియమించె. పిమ్మట వారినందఱను భోజనముకొఱకు స్నానముచేయుఁడని విన్నవించె. అప్పుడా బ్రాహ్మణులందఱును తమలోఁ దామిట్లని యాలోచించిరి. మనము మన యభీష్టమును భోజనమునకుముందే యాచింపవలయునని వారిలోఁ గొందఱనిరి. అందుమఱికొందఱు శ్రీరామునకు యాచకులకు బ్రాహ్మణుల యభీష్టమును దీర్చుట స్వభావగుణము గనుక ఇప్పుడేమియును విచారింపనక్కరలేదనిరి. ఇవ్విధముగ వారిలోవారు మాటలాడుకొనుచుండఁగ శ్రీరాముఁడు వారితో నిట్లనియె. ఓముని శ్రేష్ఠులారా ! మీయభిప్రాయమును నేను దెలిసికొంటిని. మీరందఱును రాజ్యేచ్ఛచేత నిక్కడకువచ్చితిరి. ఈస్వల్పకార్యమునకు మీరందఱును మిగుల శ్రమనుబొందితిరి. ఇంతటి శ్రమమును పొందనేల ? మీశిష్యులలో నొక్కనిబంపినను మీయభీష్టమును దీర్చియుందుననియె. ఈవిధముగ నాబ్రాహ్మణులతోఁ జెప్పి యనంతరమందు లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా ! నేనిప్పుడు బ్రహ్మపురరాజ్యమును బ్రాహ్మణులకు సమర్పించితిని. కావున నాచేత బ్రహ్మపురరాజ్యము బ్రాహ్మణులకీయఁబడినట్లు శిలయందు నానామములు వ్రాయింపుమనియె. ఆవచనములనువిని లక్ష్మణుఁడు మీయాజ్ఞానుసారముగఁ జేసెదనని చెప్పి ఱాతిపని చేయువారలంపించి శిలను దెప్పింపుఁడని యాజ్ఞాపించె. అంతట నాశిల్పకు లతిశీఘ్రముగఁబోయిరి. ఇంతలోపల నాబ్రాహ్మణులు శ్రీరామునితో నిట్లనిరి. ఓరఘుకులోత్తమా! ముందుగ నాహారమునుభుజించి పిమ్మట శిలను లిఖింపఁజేయుము. లేఖనకర్మమునందు మిగులఁ ద్వరపడుటకుఁగారణమేమి? పాత్రములయందు భోజనపదార్థములు వడ్డింపఁబడియున్నవి. మేమును క్షుధార్తులమైతిమనినవిని శ్రీరాముఁడు మిగులనాదరతో నానావిధములగు ఫలభారములనురప్పించి యాబ్రాహ్మణుల నోరిలనుంచి మృదుమధుర వచనములతో నవ్వుచునిట్లనియె. ఓబ్రాహ్మణోత్తమా ! ఈఫలమును సుఖముగ ననుభవింపుఁడు. శిలయందు వ్రాయఁదగిన విషయమును వ్రాసిముగించి నాకుముద్రనువైచినపిమ్మట మనమందఱమును అశనాదికమును భుజింతము మఱియు నోబ్రాహ్మణోత్తములారా ! "శ్లో॥ క్షణంవిత్తం క్షణంచిత్తం క్షణికంచస్వజీవితం। యమోతినిర్ఘృణస్సోస్తి ధర్మం శీఘ్రమతశ్చరేత్ " (ధనము క్షణములోపల నశించిపోవును. చిత్తము క్షణములోపలమారును. జీవితకాలముకూడ క్షణములోపలముగించును. యముఁడు మిగులఁగ్రూరుఁడు. కావున ధర్మమును శీఘ్రముగఁజేయవలయును.) అను విషయము మీరెఱిగినదేకాని వేఱుఁగాదు. మఱియు నోమునికులోత్తములారా !

నూరుపనులనువిడచి ముందు భుజింపవలెయును. వేయిపనులున్నను విడచి ముందు స్నానమునుఁజేయవలయును. మహోత్సవమునైనను విడచి దానమునుఁజేయవలయును. కోటికార్యములున్నను విడచిశివభజనము నొనరింపనగును. లోకమునందు గీతలను వినుటకు కోటివిఘ్నములువచ్చును. గంగాస్నానమునుఁజేయఁబోవుటకు పదికోట్లవిఘ్నములు కలుగును. ఓబ్రాహ్మణపుంగవులారా ? దానధర్మములకు నూరుకోట్ల విఘ్నములువచ్చును. కావున దానముఁజేయుటకు త్వరపడవలయును. ఓవిప్రవర్యులారా ? నిద్రపట్టునపుడును, నిద్రమేల్కొనునపుడును, భోజనమునకుఁ బూర్వమునందును, భోజనమయినపిదపను, ప్రతిక్షణమునందును బుద్ధిమారుచుండును. కనుక ప్రథమక్షణమునఁబుట్టినబుద్ధి యుత్తరక్షణమున మారుచుండును. అందునంజేసి దానమునిచ్చు సంకల్పము కలిగిన యప్పుడె ఆ కార్యమునెరవేర్పవలయును. ఇది నాయభిమతము అనిఁజెప్పునంతలో రాతిపనివాండ్రుగండకీనదియందుఁ బుట్టిన నలుచదరపు తొమ్మిదిమూరల ప్రమాణముతో నొప్పుదివ్యశిలనుఁదెచ్చిరి.

❋ శ్రీరామచంద్రుఁడు బ్రాహ్మణులకు బ్రహ్మపురమును దానమునిచ్చుట. ❋

అందు స్ఫుటాక్షరములతో "త్రేతాయుగమున సప్తద్వీప పరిపాలకుండును, సూర్యవంశమునఁబుట్టినవాడును, దశరథరాజపుత్రుఁడునగు రామరాజు బ్రహ్మపురరాజ్యమును బ్రాహ్మణులకు దానమునుగానిచ్చెను. ఈనేనిచ్చిన దానమును ప్రపంచమున వాయువు విసరు నంతకాలమువరకును, నా పేరుతో రామకథలోకమున నుండువరకును, సూర్యుఁడుప్రకాశించువరకును, శాశ్వతముతో నుండుగాత. మధ్యనాయాకాలములలో రాగల రాజవర్యులారా? మీరలందరును నాచేనివ్వఁబడిన సద్ధర్మసేతువును పరిపాలించుటకొరకు యాచించుచున్నాడను." అనునర్థముకల రెండున్నర శ్లోకములను శిలయందుఁజెక్కించియాశిలపైననాంజనేయుని చేతిలోని ముద్రికను వేయించె. నతనిబరువుచేత నచ్చట'రాజా రామ' యనిరామనామము ముద్రాపితంబయ్యె. రామనాథునిచే నివ్వఁబడినందున రామనాథపురమని పేరుకలిగినది. మొదటనాపురమునకు బ్రహ్మపురమని పేరుకలిగియున్నను రామనాథపురమనియే రెండవపేరు కలదాయెను. మరియు నాశిల యెంతతూనికఁగలదో? అంతతూనిక బంగారమునెత్తిపెట్టి పిదప రామచంద్రుఁడుసీతాదేవితోఁకూడి యాశిలనుఁబూజించిబ్రాహ్మణులకు దానమునుఁజేసి యనంతర మాంజనేయునితో "నీవుభోజనమైనపిదప నీశిలనుపుష్పకవిమానముననుంచిబ్రాహ్మణులనందరిని పుష్పకవిమానమునెక్కించితీసుకపోయిబ్ర

హ్మపురమునఁ జేర్పుము" అనియాజ్ఞాపించి కంబుకంఠుఁడనునచ్చటి యేలికకు "నీవునిరంతరముబ్రాహ్మణులకు సహాయుఁడవయ్యెదము" అనిబత్రికవ్రాయించెను. అంతబ్రాహ్మణులందరును వేలకొలది యాశీర్వాదములనుఁ జేసిరి. పిదపనాబ్రాహ్మణులతోఁ డగూడి శ్రీరామచంద్రుఁడు భోజనముఁ జేసెను. యనంతరమావిప్రోత్తములందరు పుష్పకవిమానము నెక్కినయనంతరము వాయునందనుఁడు శిలనందునిచి తాను బ్రాహ్మణాను మంతంబునసం దెక్కి వారినందరిని బ్రహ్మపురంబుఁ జేర్చె. ఇటులనే శ్రీరామచంద్రుఁడు సప్తద్వీపములయందును దానములను వేలసంఖ్యతోఁ జేసెను. వాటిని లెక్కింప నెవ్వరికినిదరముగాదు. మరియు కాలాంతరమునందు రామనాథపురవాసులు దుష్టరాజులభయమువలన నాశిలను తటాకమునఁ బడవేయుదురు. అందువలననావిప్రులు కష్టముల ననుభవింతురు. మరియు కొంతకాలమునకు అట్టి దశతో దుఃఖించుచుండు బ్రాహ్మణులనుఁ జూచి యాంజనేయుఁడు ఆశిలను తటాకమునుంచి బయటవేయును. అనిచెప్పినదానిని విష్ణుదాసుఁడు విని రామదాసుఁ జూచి స్వామీ ? బ్రాహ్మణోత్తములకేమి కష్టము కలుగును. వారేలచావనెన్నింతురు" అనియడుగ రామదాసు చెప్ప నుపక్రమించెను.

ఇకమీఁద కలిలో నొకదుష్టరాజు పుట్టి యాబ్రాహ్మణులరాజ్యము నపహరింపనెంచి వారిని తొందరపరచి "రామరాజు మీరలకు దానమునిచ్చి యుండినట్లయిన నారాముని దానపత్రమును నాకుఁ గనుపరపుఁడు. అట్లు కనుపరుపరేని నీవరకుమీరలెంతద్రవ్యమునీరాజ్యమున ననుభవించితిరో? దానినంతయును నాకివ్వవలయును. అట్లు మీరలీకపోతిరేని బ్రాహ్మణులపాలికి యమసదృశుఁడనగు నేను మిమ్ములనందరిని సంహరించెదను" అనిబ్రాహ్మణులను నిగ్రహించును. అప్పుడామాటలను వారువిని భయభ్రాంతత నాలోచించి వారు "ఒక నెలలోపల దానపత్రమును తెచ్చిచూపెదము" అనిగడువును వేడుకొనిన వల్లెయనియంగీకరించి యాదుష్టరాజు యూరకవాని యూరికిఁబోయెను. పిదపనాబ్రాహ్మణులా తటాకోదకము బయలుకు పోవుట కాచెరువునకు నూరుగండ్లు కొట్టి దారులనేర్పరచిరి. అట్లుఁ జేసియును దాని యంతముఁ దెలియదయ్యె. నీరయప్పటి యట్లనిండియుండె. బ్రాహ్మణులందరునిట్టి కష్టముఁ జూచి మాసాంతమున తమకందరకును మరణమని నిశ్చయించుకొని శ్రీరామచంద్రదేవునిధ్యానమొనరించుచు ఆతటాక పరిసరభాగమున నిరాహారులై నిలచి చివరకాచెరువునంబడి ప్రాణత్యాగమును చేసుకొన సర్వసిద్ధముతోనుండిరి. అట్టియ

డ వారిభార్యలును పుత్రులునుకలతపడి గందరగోళమున నుండవారిని సమాధానప
రచిపంపి తామాతటాకమున స్నానములఁ జేసి యనేకదానములంజేసి యుత్తరాభి
ముఖులయ్యత్తటాకమునకు నేడు ప్రదక్షిణముల నాచరించి చేతుల జోడించి
యుచ్చైస్స్వరములతో “ఓజానకీవల్లభుడవగు శ్రీరామచంద్ర ప్రభూత్తమా? నీవు
మాకిచ్చినభూదానపత్రమువలన మాకీకష్టదశఁకలిగినది. అన్నములేనివారలమైతిమి
అంతయును నీవేచూడుము. నీవిచ్చినభూములనన్నిటిని మాపూర్వులనుభవించి

ఆంజనేయుఁ డవతరించి బ్రాహ్మణరాజ్యమును స్థాపించుట.

యుండిరి. అదంతయు నిప్పుడ సంఖ్యాతంబగుట ప్రాణములం బరిత్యజింపనునుద్యు
క్తులమైతిమి. ” అనిఁజెప్పుచు కన్నుల మూసికొని మరణప్రయత్నముతో తమఇ
ష్టదేవతను ధ్యానించుచుండునట్టి తరుణమున తమయింటనుండు దేవమందిరమున
నుండు శిలాప్రతిమవలన మహామహిమఁగల యాంజనేయుఁ డుద్భవించి “ ఓబ్రా
హ్మణోత్తములారా ? ఇప్పుడు మీరలు ప్రాణపరిత్యాగమునుఁ జేయజనదు.
శ్రీరామచంద్ర దేవుని దాసుఁడనాంజనేయుఁడనువాడ. మిమ్ములగాపాడనిచ్చుటకు
వచ్చితిని” అని దీర్ఘస్వరముతో చెప్ప వాయుపుత్రునివచనమును విని వారందరు
నధికాశ్చర్యము నంది కన్నులవిచ్చి ముందరనున్న యంజనీసూను నవలోకించిపర్వత
సమానాకారుఁడును, పచ్చనివెంట్రుకలచే నలంకరింపఁబడినవాడును, భయంకరస్వ
రూపుఁడును, ముసలిరూపముకలవాడును, దీర్ఘబాహువులఁగలవాడును, రామనా
మమునుచ్చరించువాడును, నైనయాంజనేయుని బ్రాహ్మణులందరునుఁజూచి నమ
స్కరించి తమఁకుఁగలిగినఁబన్నములను విన్నవించుకొనిరి.

అంతనాహనుమంతుఁడాతటాకమునునుండుశిలాశాసనమునుబయటఁ దీసియా
శిలనుతానేమోసికొని బ్రాహ్మణులందఱు తనవెంటరాబయలుదేరి దుష్టరాజుకడకేగి
యాశాసన శిల నారాజునకుఁజూపిన నారాజు రామముద్రాంకితంబగు నాశిలంజూచివి
స్మయచిత్తుఁడయ్యెను. పిమ్మటనాంజనేయుఁడప్పుడు బ్రాహ్మణులందునిలచిధ్యానించు
చుండిన తటాకముననొక శూలమునాటించి యారాజునాశూలాగ్రమునకొర్తవేయిం
చెను. అంతనాదుష్టరాజును విడిపించుటకు వచ్చిన రాజభటులనందరిని తోకతో నేల
బడఁగొట్టి సంహరించెను. బ్రాహ్మణులకుఁగల హృత్తాపము(మనోవేదన)పరిహారమై
నందున యాకొలనికని మొదలు హృత్తాపశమన మనుపేరఁబ్రసిద్ధినందెను. ఆతటాక
తీరమున నాంజనేయుఁడు శ్రీరామచంద్రుని యౌదార్యమును లోకులకు తెలి

పింప యుదారరాఘవేశ్వరుఁడను పేరుతో నొకలింగమునుఁ బ్రతిష్ఠించెను. మరియు నుదారరాఘవుఁడను పేరుతో శ్రీరామప్రతిమ నొక్కదానినచ్చట బ్రతిష్ఠించెను. ఆతటాకంబున స్నానాదులొనరించు మానవులకు తాపత్రయంబులు తొలింగిపోవును. పిమ్మట వాయునందనుఁడు అపరిమితానందముతో బ్రాహ్మణులంజూచి యోవిప్రవర్యులారా? మీరలీశిలను భూమిలోనొక గుహనేర్పరచి దానియందుస్థాపింపుఁడు. అట్లుచేసితిరేని మీరలేవిషయమునకును భయమునొంద పనియుండదు. ఎల్లప్పుడును నేను మీసన్నిధానముననే యుందును. వెరపులేక శ్రీరామచంద్రు నిస్మరింపుచుండుఁడు. అని యనుగ్రహించి యథాప్రకారమున లీనుఁడయ్యెను. అంత నావిప్రులు నదేరీతియాశిలను భూగృహమునస్థాపించి యత్యంతానందముతో వారి వారియిండ్లకుఁజనిరి. ఆదిమొదలు వారిరాజ్యమెవ్వరిచేత నపహరింపఁబడకయ్యెను. ఓవిష్ణుదాసా? రామోపుకథను జ్ఞానదృష్టిచే నెరింగిన వాఁడనగుటచే నీకుఁజెప్పితిని. ఇప్పటికి నచ్చట బ్రాహ్మణులు రాజ్యమునేలుచున్నారు. ఎప్పుడెప్పుడే యేరాజులు వచ్చినను నారు శ్రీరామాజ్ఞను పాలించుచుందురు. ఇట్లు శ్రీరామచంద్రుఁడు బంధుమిత్రపుత్రులతోఁ గూడి నానావిధ కౌతుకంబుల నయోధ్యయందు లోకులకుఁ జూపుచుండెను.

ఇట్లు ఆనందరామాయణమునందలి ఏడవకాండయగు రాజ్యకాండమునందు
బ్రాహ్మణోత్తమునకు రామనాథపురరాజ్య ప్రదానమను
పదునెనిమిదవసర్గ ముగిసినది.

పందొమ్మిదవసర్గము.

శ్రీరామచంద్రుని దినచర్యాభివర్ణనము.

ఓవిష్ణుదాసుఁడా? శ్రీరామచంద్రుఁడు లోకశిక్షణమునకుఁజేసిన దినచర్యను నీకుఁ జెప్పుచున్నాడను. వినుమని రామదాసుఁడు చెప్పుచున్నాడు.

అపరరాత్రియందు వందిమాగధుల దివ్యగీతంబులనువిని నిదురచాలించి సీతతోఁగూడి నవవాద్యంబులన్విని యానందించుచు లోకశంకరశంకరదేవుని, లలితాపరాంబికను హృదయారవిందమున నను సంధానముఁజేయుచు పిదప మహాగురువగు ధశరథునిధ్యానించి దేవతలస్మరించి పుణ్యక్షేత్రతీర్థనదీ దేవతాదులను ధ్యానించిఁ దనతల్లులకు మ్రొక్కి పిదప తనకు నమస్కరించుచుండు సతీమణియగు జానకీదేవిని తనచేతులలేవనెత్తి యామెహస్తమును చేతితోఁబట్టుకొని మంచము దిగి దాసీదాసపరివృతుఁడగుచు బయలుకువచ్చి యావశ్యశౌచకృత్యములనెరవేర్చి

యింటనయినను, సరయూనదియందైనను, స్నానమాచరించును. సరయువునకు వెడలవలసినపుడు పల్లకినెక్కి నదీపరిసర భూములవరకు వచ్చి యచ్చటదిగి నదికిచేరి నదియందుఁ బ్రవేశించి ఫలదక్షిణాతాంబూలాదుల నదీదేవికర్పించి మ్రొక్కి విధివిధానముతో విప్రోత్తములు వేదఘోషములఁ జెప్పుచుండ ప్రాతస్స్నానమాచరించి ప్రాతస్సంధ్యావందనమును, బ్రహ్మయజ్ఞమును నెరవేర్చి పిదప కాల్యకరణీయము నొనరించి బ్రాహ్మణులకు నిత్యదానములనిచ్చి రథసారథిస్నానముఁ జేసికడిగి బంగారము వెండి రత్నములు మొదలగు నమూల్యవస్తువులచే పనితనముచేయఁబడి మెరయు రథము నాయత్తపరుపఁదాని నధిరోహణముఁ జేసి యింటికిఁ జేరి యగ్నిహోత్రముఁ జేసి ఆదరముతో శివపూజఁ జేసి తనతల్లులగు కౌసల్యసుమిత్రకైకలకు మ్రొక్కుచుండును. పిదప సీతతోఁ గూడి కామధేనువును, కల్పవృక్షమును, పారిజాతమును, పుష్పకవిమానమును, చింతామణిని, కౌస్తుభమును ప్రతిదినముఁ బూజించుచుండును. మరియు ప్రతిదినమును, అవిసి, మఱ్ఱి, బిల్వము, రావి, తులసి, జమ్మి, మోదుగు, దూర్వము, రేల మొదలగు వృక్షములం బూజించుచుండును. సూర్యునిఁ బూజించి నమస్కరించి పిదప ద్వారదేవతను పూజఁజేసి గోవులు, ఆబోతులు, గుఱ్ఱములు, ఏనుగులు, రథములు, ఆయుధములు, బ్రాహ్మణులు మొదలగువారికి నమస్కరించి యనంతరము కోష్ఠగృహములు, ధనగృహములు, పాకమందిరములు మొదలగువాటినిఁ బూజించి పిదప సింహాసనము తెల్లగొడుగు. వింజామరములు కిరీటము మొదలగు మంగళప్రదవస్తువులనుఁ బూజించి యనంతరము పరంపరాగతమగు సింహాసనము నర్చించి దీపము అద్దము పుస్తకములు మొదలగు శుభవస్తువులనుఁ బూజించును. మరియు బ్రాహ్మణులలో పూజనంది యధికుఁడగు తనగురువునుఁ బూజించి యాగురువునున్నతాసనమునందు గూర్చుండఁ నియమించి పుత్రులు, బంధువులు, భార్య, పండితులు మొదలగువారు తనను బరివేష్టింప తాను సభయందుకూర్చుండి యాగురునివలన సత్కథలతోనిండిన పురాణములను వినుచుండును. పిమ్మట సీతాదేవి తనను ప్రార్థింప రాముఁడు బ్రాహ్మణ బృందముతోఁ గూడి స్థిరమనస్సుతో ఫలహారమునుఁ జేయుచుండును. పిదప కామధేనువు, కల్పవృక్షము, చింతామణి మొదలగువాటివలన నపక్వముగా సమర్పింపఁబడిన పదార్థములను సీతామహాదేవి యగ్నిపక్వమునుఁ జేసిన పక్వాన్నములను భుజించి తాంబూ

❋ శ్రీరామసన్నిధికి వైద్యదైవజ్ఞాదులు వచ్చుట. ❋

లమునంగీకరించి వస్త్రాద్యాభరణాదుల నలంకృతుఁడగుచు నాయుధములను ధరించును. అంతలో వైద్యదైవజ్ఞలు వచ్చినవారిలో వైద్యుఁడు రామాజ్ఞ రత్నముద్రాంకిత దక్షిణహస్తమును తనచేతఁ బట్టి యంగుష్ఠమూలమునందు జీవసాక్షియగు ధమనీనాడి సూక్ష్మదృష్టినిఁ బరీక్షించి రామచంద్రుని చెవిలో నిన్నటిరాత్రి దేవర స్త్రీలోలత శ్రమించినట్లు కనుఁబడుచున్నది యనిఁ జెప్పనవ్వుచు నా వైద్యునకు దక్షి

❋ శ్రీరామసన్నిధి దైవజ్ఞుఁడు పంచాంగముఁ జెప్పుట. ❋

ణతాంబూలములనిచ్చి పంపుచుండును. పిదప దైవజ్ఞుఁడువచ్చి పంచాంగమునువిప్పి శ్రీరామసన్నిధియందుండి ముందు గణేశప్రార్థనము, త్రిమూర్తి స్తవము, దేవ స్తవము, నవగ్రహ స్తవములు, మొదలగువాటిచేత దేవతలం బ్రార్థించిమంగళముచేయు గాక యనిదీవించిపిదపతిథివారనక్షత్రయోగకరణములనువినుటవలనసంపదాయుష్య పాపపరిహార సంభోగకార్యసిద్ధులుఁగలుగును కనుక దైవజ్ఞునివలన పంచాంగమువి నవలయును. రామచంద్రప్రభూత్తమా? మంగళము, స్వామీ ? యవధరింపుము. నేటిదినము వసంతచైత్ర శుక్ల దశమీ భాను వాసర పుష్య నక్షత్రైంద్ర యోగ బవ కరణ పంచాంగశుద్ధిగలదు. దేవరకు సంకత్సార, కర్కాటకమున చంద్రుఁడు. చిరకాలము రాజ్యము నేలుచుండుదు. అందరును సుఖించెదరుగాత. ఎవ్వరు నాప దనొందవలవదు. అనుసర్గముఁగల శ్లోకములంజదివిన పిదప దైవజ్ఞునికి దక్షిణాతాం బూలంబులనిచ్చి మొ్రక్కి పంపుచుండును. పిదప పువ్వులమాలికలఁగట్టి తెచ్చు మాలాకారుఁడు క్రొత్తవెదురుగంపపువ్వులసరములపంపి తెచ్చిరామునిముందరనర్పిం ప శ్రీరామప్రభుఁడు సభనుండువారలందరకు తగురీతి స్వయముగానిచ్చి తనపుత్రు లకు కుసుమమాలికల శిరోభూషణముగ నలంకరించి తానును అలంకరించికొనును. అంతట వెంట్రుకలదువ్వెచిక్కునుతొలగించువాఁడువచ్చి బంగారుశలాకలనిలుపుటద్ద మును ముందరనుంచిన రామచంద్రుఁ డుతనముఖమండలముఁ జూచిసంతసించును. అం తపరిమళముగల యగరుధూప పరిమళించు ధూపద్రవ్యమును తెచ్చి ప్రభునిమ్రోల నుంచి వెనుకకుఁబోయి భటులతోకలసి యుండును. అంతనా రామప్రభుఁడు పల్లకి నెక్కి బయలుదేరి రెండవయావరణమునకు రా నచ్చట మాగధులువచ్చి సూర్య వంశపురాజుల పూర్వచరితముల వర్ణించుచుండ నా రామచంద్ర ప్రభుఁ డానందించు చుండును. పిదప వందులువచ్చి కైవారములం చేసి రావణవధాది యద్భుతచరిత్ర ములపొగడుచుందురు. చారణులుగానముల నభినందింపఁజేయుదురు. నానావిధశృం గారవాద్యముల సంతసింపఁజేయుదురు. వేశ్యాంగనలు నాట్యమాడుదురు. ఇతరులి తర వినోదములం జూపుచుందురు. నవమంగళవాద్యముల మ్రోయింతురు. పిదప రాఘవప్రభువర్యుఁడా నందించుచు మూఁడవ యంతరాళమున కరుదేర నచ్చట నలంకృతంబులగు గజ, తురగ, శిబిక, రథాదులం బరికించి యచ్చోటువాసి నాలవ యావరణమున కేగి యచ్చట ప్రభుఁనిదర్శనమునకు వచ్చిన మిత్రులను, పౌరులను రాజులనుచూచి మర్యాదలకుఁదగినట్లభినందించుచు నచ్చోటువాసి యైదవయంతరాళమున కేతెంచి పువ్వులతోటలను, పుష్పకవిమానమును శస్త్రధా రులగు ననేకవేల సేనలనుదర్శించి యారవయంతరాళంబుఁజేరి గుర్రములనెక్కి తమ కుమ్రొక్కులిడుచున్న లెక్కలేని యాశ్వికసైనికులఁజూచి మన్నించుచు యేడవప్రా కారంబుఁగడచి యయ్యంతరాళంబున శిబికనవరోహణముఁజేసి మితపరివారముతో

నిజసభాభవనముం బ్రవేశించి తెల్లగొడుగుచే నలంకరింపఁబడిన తన దివ్యసింహాసన

❋ శ్రీరాఘవప్రభుఁడు సింహపీఠి నధివసించి రాజ్యపాలనముఁ జేయుట. ❋

మునకుఁ బ్రదక్షిణముఁజేసి దానికి మ్రొక్కి పిదప పడిగట్లమీఁదుగా నెక్కి సూర్యవంశపురాజులందరు నధివసించు పరంపరాగత సింహపీఠి నధివసించుటచే నలంకరించును. అట్టి తరుణము నందు లక్ష్మణుఁడు వెనుకనిలిచి తెల్లగొడుగును, భరతుఁడు కుడిప్రక్క నిలచి చామరమును, శత్రుఘ్నుఁ డెడమప్రక్క తాళవృంతమునుఁ బట్టుచుందురు. హనుమంతుఁడు పాదుకలఁ బట్టి నిలుచుండును. సుగ్రీవుఁడు వాయవ్యభాగమున యుదకకలశమును, విభీషణుఁ డీశాన్యమున దర్పణమును, అంగదుఁ డాగ్నేయమున తాంబూలపాత్రమును, జాంబవంతుఁడు నైఋతియందు వస్త్రపేటికను,ధరించినిలచియుందురు. సకలరాజులును రామచంద్రునియెదుట కేలుమోడ్చి నిలచియుందురు. ఉభయపార్శ్వములయందు మునులున్నతపీఠికల సుఖాసీనులయ్యుందురు. ముందర వారవనితలు నాట్యములాడుచుందురు. మల్లులు దూతలు మొదలగువారు సభ ముందరనిలచి యుందురు. శ్రీరామచంద్రుని పుత్రులు రామాంతికమున కూర్చునియుందురు. మరియు నెవ్వరెవ్వరు పౌరులలో ముఖ్యులో? వారందరునుతగు స్థానములయందుందురు. మంత్రి సత్తముఁడగు సుమంత్రుఁడు రామచంద్రసన్నిధి గూర్చుండును. ఇట్టిసమయమున శ్రీరాముఁడు సభలోనుచితకార్యముల నన్నిటిం బరామర్శించుచు సముచితకార్యములయందు తమ్ములను పుత్రులనియోగించి కొంతదడవు వినోదములం బరికించుచు రాజపద్ధతి ననుసరించి సింహాసనమున వతరించి నిజమందిరమునకు దయచేయును. జానకిమంగళవాద్యపు మ్రోతలను విని జలపాత్రముతో నెదుర్కొనవచ్చిచూచును. అప్పుడు శ్రీరాముఁడు సప్తప్రాకారములనుండువారి నందరిని సముచితకార్యములయందుండనియోగించి పుత్రానుజులతోఁడ తనయింటఁ బ్రవేశించును. అప్పుడు సీతారమణీమణిని శ్రీరామప్రభుఁడుఁజూచును. ఆసీతారమణియు రామునిఁజూచి సిగ్గుతోనుండినముఖముతో నెదురుగావచ్చి కడకంటి చూపులచేతను రాముని మోహము నందించుచు సకలాభరణభూషితయగు మోహినియాయను నట్లుండు సీతంజూచుచుసీతాదత్తజలంబుల పాదప్రక్షాళనాదులం జేయించుకొని లక్షణుఁడుఁ దగు రీతి వారివారి నిలయములకుబంపి సీతచేయిబట్టుకొని సీతారమణిగృహముం బ్రవేశించి బయటఁ తానుజూచినదియు, వినినదియు నంతయు సీతకెరుగించి సంతోషమునందించి పిదపలక్ష్మణాదులంబిలపించి స్నానాది మాధ్యాహ్నిక కృత్యముందీర్చి పితృతర్పణముఁజేసి శంకరునిఁబూజించి నైవేద్యాద్యుపచారముల నర్పించి వైశ్వదేవబలి హరణాదులఁ జేసి యతిథులనుఁ యతులను బ్రాహ్మణులనుఁబూజించి వారందరితోఁడ సీతారమణీమణి యొడ్డించిన పాత్రమునయందు భుజింపనారంభింప గోడంగ్రు విసనక్రలవీచుచుండ నానందముతో భుజించి బ్రాహ్మణులకు తాంబూలదక్షిణలనొసంగి వారికిసెలవు

నిచ్చి యనంతరము దాను నూరడుగులనడచి శయనగృహంబు జేరును.

అంత సీతయు చుభుజించి శ్రీరామభద్రుని సేవించుచుండ నాపురుషోత్తముండు నిద్రించును. పిదప సీతయు శయనింపవారిని యిరువురిని దాసీజనము కొంతవడి సేవింప సుఖసుప్తిజెంది నిదురచాలించి చతురంగసారికాదిక్రీడలవినోదించి యచ్చోటు వెడలి ద్రాక్షపందిరియందుండు జలయంత్రాది విశేషములంజూచుచు పంజరంబులనుండు వివిధపక్షి విశేషంబుల విలోకించుచు ప్రాసాదాగ్రమున నెక్కి యూరియొక్క వీధులంబరికించి యచ్చోటువాసి పసుల కొట్టములం బ్రవేశించి యచ్చటనుండు గోవులనన్నిటిని తిలకించి పిదప రాఘవేంద్రుండు సీతారమణి నంతిపురమునకంపును. అచ్చోటునను లక్ష్మణాదులువచ్చి మ్రొక్కి నిలువ వారితోడంగూడి గజతురగాదిశాలలంజూచి రథశాలకేతెంచి సారథియలంకరించి యాయత్తపరచిన రథమునెక్కి సప్తప్రాకారములమెల్ల నగడచి యష్టమ ప్రాకారంబునందు కలశతఘ్నులు మొదలగు యుద్ధపరికరములనవలోకించి యచ్చోటువాసి నవమప్రాకారావరణముఁబ్రవేశించి యచ్చటయాయుధపాణులై గజతురగాదులనెక్కి వరుసగానిలచియున్న పురరక్షకులఁబరికించి సరయూనదీతీరముఁచేరి యచ్చట నందరితోడ నోడనెక్కి జలవిహారముఁజేసి పిదప యథాప్రకారము సభకేతెంచి దివ్యసింహాసనారోహణముఁజేసి రాజకార్యముల విమర్శించి యందరి నుచితరీతిఁబంపి సాయంసమయమగుటయు సంధ్యోపాసనాది శివపూజనాంత క్రియలనాచరించి రాత్రిఁబంధుమిత్రాది పరివారముతో యభ్యవహారమొనరించి పల్లకినెక్కి దేవాలయంబులను అచ్చటచ్చటఁజరుగుచుండు నుత్సవనృత్తగీత వాద్యవినోదములనుఁజూచుచు కొంతసేపు తనపరివారముతో కాలముఁగడిపి పదిగడియలయిన వెనుక నంతిపురంబుఁబ్రవేశింప జానకీదేవి దివ్యాలంకృతయగుచు రతిశాల పూల పాన్పునలంకరించియుండ శ్రీరాఘవేంద్రుండచ్చటకుఁజేరి యందు సీతాసమేతుండగుచు సురతసౌఖ్యంబులఁదేలుచు దేశకాలస్థితి ననుసరించి లీలామానుషనటనలం గడుపుచుండ సీతారమణి యొకరాత్రి సుఖకేళిందేలి లజ్జించుచు శ్రీరామప్రభునితో నాప్రాణప్రియుఁడా? తమరు చెప్పుమనియనుజ్ఞనిచ్చిన నేనొకదానినడిగెదను అనిప్రశ్నింప నగుటను నాజ్ఞనివ్వ నాయేలినవాఁడా? నాకు కుశుఁడు జన్మించినపిదప నెందుకుగర్భముఁగలుగలేదు. దీనికేదగు కారణము ననుగ్రహింపవేడెదనని యడుగ నందుకు శ్రీరాఘవచంద్రుఁడు ఓరమణీ మతల్లీ? మంచిప్రశ్నఁజేసితివి. జెప్పెదవినుము. ఏవేలబహుపుత్రుల నభిలషించెదవు. సద్వంశమున ననేకులుఁబుట్టఁదగదు. ఒకప్పుడెవ్వడైన నొకనిదురాచారమువలన కులము కళంకితమగును కావున నేను బహుపుత్రులఁగోరను. నాయిచ్ఛలేక నీకునుగర్భముఁగలుగఁజాలదు. కులము ప్రకాశింపఁజేయు పుత్రునొక్కనినే గోరనగును. పురుగులవలె దుష్టులెందరుఁబుట్టిన నేమి ప్రయోజనము. ఒకవేళ దేహమునకు రెండు కన్నులు వలెను. రెండు భుజముల వలెను. సూర్య చంద్రులరీతి, నేనును లక్ష్మణుఁడు

వలెను నిరువురుపుత్రులుండినఁజాలును. కావున నీకును నిరువురుపుత్రులుకలరు. ఇఁక మీఁదట నీకు సంతతికలుగుట యుచితము కాదనినవిని సీతామహాదేవి మరలనిట్లనియె. ఓరఘుకులోత్తమా! నాపుత్రికయొక్క తైన్యమును కలుఁగఁబోవుటకు కారణమేమి? అనినవిని శ్రీరాముఁడు మరలనిట్లనియె. ఓసీతా! నీయందుఁగలిగిన నాపుత్రిక నీభూలోకమునం దెవ్వనికిచ్చి వివాహమును చేయుదును. ఈలోకమునందు నాకుసమానుఁడును సప్తద్వీపములకును అధిపతియును అగువాఁ డెవ్వఁడుకలఁడు. నేనెవ్వనిపాదములనుకడిగి దానమునుచేయుదును. కావున నోజానకీ! నాకు కన్యయందుఁగూడ కోర్కెకలుగ లేదు. కుశాదమపుత్రికలనే నీవుపుత్రికలనుగా నేలతలఁపఁగూడదు. ఓసీతా! నీవీభూలోకమునందు మోహము నేలపొందుచున్నావు? నీవిప్పుడు త్రైలోక్యజననియనుమాటను మఱచిపోతివి? ఈలోకమునందలి స్త్రీరూపమంతయును నీయంశమువలనఁ బుట్టినదనియును, పురుషస్వరూపమంతయును నాయంశమువలనఁ బుట్టినదనియును, నీవిప్పుడు మరచిపోతివి? ఓసీతా! కులమును తరింపఁజేయునట్టి పుత్రుఁడొక్కఁడేచాలును. దుర్గుణములుకలపుత్రులు పురుగులతోసమానులు. అట్టిపుత్రులనేకులుండుటవలనఁ బ్రయోజనమేమి? ఓసీతా! నీక నేకమంది పుత్రులు కలుగకుండునట్లు నేనుజేయుటకు మఱియొక కారణమును జెప్పెదను వినుము. నేనీవిషయమును వినోదార్థముగఁ జెప్పెదను. నీవు వేరువిధముగఁ దలఁపకుము. అనేకమంది పుత్రులుకలిగినయెడల స్త్రీలకు తారుణ్యము (యౌవనము) తగ్గిపోవునని తలఁచి నీకు బహుమందిపుత్రులుకలుగకుండునట్లుచేసితిని. ఓసీతా! నీవుబహుమందిపుత్రులనుకోరితివేని నేను కృష్ణావతారమున ద్వారకాపురమున నీకుఁ బదిమందిపుత్రుల నిచ్చెదను. మఱియు నపుడొక్కకన్నియనుగూడనిచ్చెదను. అప్పుడు బహుమంది పుత్రులుకలుగుటచేత నీతారుణ్యముపోవును. కావున నప్పుడు నేను పదునారువేల నూటయెనమండ్రుభార్యలను పరిగ్రహించుదును. ఇంతయగాక యింకను నెనిమిది మంది భార్యలపరిగ్రహించెదను. కాఁబట్టి నేనాభార్యలతో సురతక్రీడల ననుభవించెదననియె. ఈవిధముగ సీతామహాదేవి చెప్పిన వాక్యములనువిని సీతామహాదేవి నవ్వుచు మిగులసంతోషముకలదై యిట్లనియె. ఓరాముఁడా! నీచేతనిదిపొందఁబడి వది నన్నురంజింపఁజేయుమనియె. ఇవ్విధముగ సీతారాములు ప్రసంగించుచు సుఖనిద్రను జెందిరి.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండమునందలి
పందొమ్మిదవసర్గ ముగిసెను.

❋ అన్నియవతారములలో రామావతారము మిగులగొప్పదనుట. ❋

శిష్యోత్తముఁడవైన యో విష్ణుదాసా! అంతట నొకనాటి ప్రాతఃకాలమునందు లవుఁడు వసిష్ఠమహామునితో నిట్లనియె. ఓమునికులోత్తమా! నేనొక్కవిష

యమునిన్నడిగెదను చెప్పుము. వాల్మీకిమునివరునివలననే సర్వమును తెలిసికొంటిని.
అయినను సకలలోకములను దెలియవలయునని తలఁచుచున్నాను. గతరాత్రియందు
మేమందరమును నిద్రించుచుండఁగ నొక్కధ్వనివినఁబడియె. అట్టి ధ్వనికలుఁగుటకు
గారణమేమి ? ఓగురూత్తమా ! ఈసందేహమును పోఁగొట్టుమనినవిని వసిష్ఠమహా
ముని లవునితోనిట్లనియె. ఓరఘునందనా ! తొల్లిరావణాసురుఁడు అనేకములయిన
బ్రహ్మహత్యలనుజేసె. ఆరావణునిదేహ మిప్పటికిని లంకాపట్టణము నందు కాల్పఁ
బడుచున్నాఁడు. అట్టిరావణుఁడు రామునిహస్తమువలనమృతుఁడై ముక్తినిపొందె.
మఱియు నారావణుఁడు సర్వకాలములయందును రామునిగుఱించి విచారించుచుం
డుటవలనతనదు సకలపాపములను పోఁగొట్టుకొనియె.ఆరావణుఁడు తనదుదేహము
తో దేవతలకు నమస్కారమునుఁ జేసినవాఁడుగాఁడు. దేవాలయమునం దెన్నఁడును
సమ్మార్జనాదికమునుగూడఁ జేసినవాఁడుకాఁడు.భక్తితో తీర్థయాత్రలనుగూడ నా
చరించినవాఁడుగాఁడు. నిష్కాముఁడై తపస్సును నాచరింపలేదు. శీతోష్ణాదులను స
హించినవాఁడుగాఁడు. అట్టిరావణునిదేహము నేటికిని లంకాపట్టణమునందు దహిం
చుచున్నది. అట్టియగ్నిజ్వాలలవలన భస్త్రధ్వనివంటిధ్వని యిక్కడకుగూడ వినఁ
బడుచున్నది. పగటికాలమునందుఁ గలిగెడు జనులయొక్క ధ్వనివలన నాశబ్దము
వినఁబడకపోవుచున్నది. హనుమంతుఁడు నేటివఱకును కాష్టభారశతమును గొనిపో
యి యారావణుని చితియందు వైచుచున్నాఁడు. రావణునిదేహమువలన చేసిన
పాప మెప్పుడునశించునో అప్పటికి వానిదేహము భస్మమైపోవును. ఓలవుఁడా! అట్టి
ధ్వనివినఁబడుటకు మఱియొక కారణమును చెప్పెదనువినుము. రావణాసురుఁడు దేహ
మునుచాలించునపుడు నాస్మరణమును సకలదేశములవారును జేయునట్లు వరమునివ్వ
ుని రావణుఁడుయాచింపఁగా శ్రీరాముఁడు నీశరీరము దగ్ధమగువఱకును సకలదేశ
ములయందును జ్వాలలయొక్కధ్వని వినఁబడుచుండును. అంతవఱకును ఇది రావణ
శరీరము కాలుచుండుటవలనఁ గలిగెడుధ్వనికదా? అని యెల్లవారును నిన్నుస్మరిం
తురనియె. ఇవ్విధముగ శ్రీరాముఁడు చెప్పినపిమ్మట రావణుఁడు శ్రీరామునియందు
లయముపొందెనని వసిష్ఠమహాముని చెప్పినవాక్యమునువిని లవుఁడు సందేహరహి
తుఁడై వసిష్ఠమహామునికి నమస్కారమునుచేసి నిజమందిరమునకుఁబోయె. ఓశిష్యో
త్తమా! విష్ణుదాసా! శ్రీరాముఁ డొక్కసీతా బంధు పుత్రమిత్రాదులతోఁగూడ గృ
హమునందు నివసించియుండి గురుఁడగు వసిష్ఠమహాముని మొదలగుమునివరులతో
నిట్లనియె. ఓమునికులోత్తములారా! ఓబంధుజనులారా! ఓపుత్రులారా! ఓసీతా!
ఓమంత్రులారా ! ఓతల్లులారా ! మీరందఱును నేనుఁజెప్పెడి వచనమును వినుఁ
డు. ఈయవతారమునందు నేను సీతతోఁగూడ సుఖముల ననుభవించిన విధము
గ నితరావతారములయందు భుజించుటలేదు. నేననేక నూరుల యవతారములను
ధరించితిని. నానావిధములయిన కార్యములనుచేసితిని. ఆకార్యము లిన్నియని

గణనచేయ నెవ్వరును సమర్థులుగారు. ఈయవతారమునందు సుఖముల ననుభవించినవిధముగ నితరావతారములయందు అనుభవింపలేదు. తొల్లి మహాసముద్రమునందు శంఖాసురుఁడను మహాదైత్యుఁడు కలఁడు. వాఁడు కృతయుగమునందు వేదముల నన్నింటిని హరించె. అట్టిశంఖాసురుని సంహరించుటకు నేను మత్స్యావతారము నవలంబించితిని. పిమ్మట నాయవతారముచేతనే క్షణములోపల వానిని సంహరించి వెంటనే మరల విష్ణురూపమును ధరించితిని. తిర్యగ్జంతుయోనియం దవతరించుట నింద్యకృత్య మగుటయేగాక యట్టిజంతువులవలన సుఖమేమి కలదు ? ఏమియును లేదు. కావున నేనాయవతారమునుచిరకాలమవలంబించియుండలేదు. అంతట గొన్నిదినములకు సముద్రమును మథించుచుండఁగ మందరపర్వతముసముద్రమునందు మునిఁగిపోవుటచేత కూర్మరూపమునుధరించి యాపర్వతమును పృష్ఠభాగమునందు ధరించితిని. అనంతరమందు కొన్నిదినములకు భూమి యందు మునిగిపోవుచుండఁగఁ జూచి క్రోడరూపమునుధరించి భూమినిలేవనెత్తి యావరాహరూపము చేతనే హిరణ్యాక్షునివధించితిని. పశుజన్మమునందు సుఖము లేదనితలఁచి యంతటితో నాయవతారమును జాలించితిని. అంతట సకలలోకములనుబాధించుటయేకాక పుత్రుఁడగు. ప్రహ్లాదునికూడ నానావిధములచేత హింసించుచున్న హిరణ్యకశిపుని వధించుటకు మిగుల భయంకరమును క్రోధయుక్తమును అయిన నృసింహావతారము నవలంబించితిని. ఆయవతారమునందుఁగూడ నేను సుఖమనుభవించిన వాఁడనుగాను. అంతట బలిచక్రవర్తిని బంధించుటకొరకు వామనావతారము నవలంబించితిని. పిమ్మట నాబలిచక్రవర్తిని పాతాళలోకములఁకు బంపితిని. అంతట మునిదేహముచేత సుఖమునసుభవించుటకు వీలులేదని తలఁచి శీఘ్రముగ నాయవతారమును చాలించితిని. అనంతరము బ్రాహ్మణకులమునందు పరశురామావతారము నవలంబించి యిరువదొక్కపర్యాయములు క్షత్రియులనువధించి భూలోకమును రాజరహితముగఁజేసితిని. మఱియు నాయవతారమునందే మహావీరుఁడగు కార్తవీర్యార్జునుని సంహరించితిని. పిమ్మట మునిరూపముతోనున్న దేహమునకు సుఖములేదని తలఁచి తపస్సునుజేసితిని. గాని సుఖమునవలంబించిన వాఁడనుగాను. ఈవిధముగ నారుయవతారముల నవలంబించితిని. ఇఁకమీఁదటద్వాపరయుగమునందు నేను గోకులమునందు కృష్ణావతారము నవలంబించెదను. ఆయవతారమునందుఁగూఁడ నేను సుఖముల నిప్పుడనుభవించినవిధముగ సుఖముల ననుభవించువాఁడనుగాను. మఱియు నాయవతారమునం దవలంబించినదిమొదలుకొని నాతల్లితండ్రులు కారాగృహమునందుఁ బ్రవేశించిరి. కావున బాల్యమునందు నేను మాతాపితృహీనుఁడై యుందును. మఱియును బాల్యమున పరుఁడగు నందునిగృహమున నివసింపవలసివచ్చును. గోపవేషము నవలంబించి గోపృష్ఠమునందుఁ దిరుగుచుండువానికి సుఖమేమికలదు. దేవపత్నీవరమువలన పరస్త్రీగమనము చేయు

దును. మఱియు నాయవతారమునందు స్త్రీలనుగోవులను నాగములనుచంపుదును. మఱియు నానావిధములయిన చౌర్యములను చేయుదును. మఱియును, మథురాపట్టణమునందు మేనమామయగు కంసునితోఁగూడ నేనుఁగునుజంపుదును. మఱియును మథురాపట్టణమునందు దాసితోఁగూడ సంయోగమును చేయుదును. గోపికా స్త్రీల నిష్ఠురములకు పాత్రుఁడనగుదును. మఱియు నింతయగాక కాలయవనాదులవలన పరాభవమునుపొందుదును. మఱియును, "శ్లో॥ నపరాభవతో దుఃఖం కించిదస్తి జగత్త్రియే" మూఁడులోకములయందు పరాభవముకంటె అధికమైన దుఃఖమేదియును లేదు) మఱియును, శత్రుకృతబాధను సహింపలేక సముద్రమునందు స్వల్పకాలమునివసించి యుండవలసివచ్చును. మఱియునారాజ్యమునందునాకు రాజ్యముకలుగనేరదు. రాజ్యములేక పఱుల యాజ్ఞానుసారముగ సంచరించువానికి సుఖమేమికలుగును. మఱియు నాజన్మమునందు నాకు ఛత్రాదిరాజచిహ్నదులు కలుగనేరవు. అనేకమంది స్త్రీలకొక్కటిగనే దేహమైయుండును. అట్లుండుటచేత నేను ముందుగనెవతెను తృప్తినిపొందించి పిమ్మట నెవతెకు తృప్తిని కలుగచేయుదును. ప్రతియామదియును తనకుముందుగ సుఖముకావలయునని కోరును. కావున నేను సర్వకాలములయందును ఆ స్త్రీలను రంజింపఁజేయుటయందు మిగుల వ్యగ్రచిత్తుఁడనై యుందును. ఇంతయగాక తెల్లవారువఱకును సంచరించుచున్నను నా భార్యలయిండ్లకన్నిటికిని బోవుటకువీలులేదు. ఈవిధముగ తెల్లవారువఱకును దిరుగవలసియే వచ్చుటచేతనాకు నిద్రనుపొందుట కవకాశమించుకైనను గలుగనేరదు. ఇచ్ఛకలమానవుఁడు దుఃఖమును పొందవలసివచ్చును. "కర్తావ్యాబహావ పత్న్యో ద్రష్టవ్యంతత్ఫలంతతః" (ముందుగ ననేకమందిస్త్రీలను పెండ్లియాడి పిమ్మట దానిఫలమును చూడవలయును.) ఇవ్విధముగ విచారింపఁగ నాకు ద్వాపరయుగమునందును సంతోషము గలుగనేరదు. అంతటితో నాకుశాపమువలన అవతారసమాప్తియును అగును. పిమ్మటకలియుగమునందు దైత్యులు యజ్ఞములయందాసక్తి కలవారగుటను చూచినేను మోహమును గలుగఁజేయునట్టి బుద్ధరూపమును ధరింతును. అంతట నేను మృదుమధుర వచనములచేత నారాక్షసులకు యజ్ఞమునందాసక్తిలేకుండునట్లుచేసి కొంచెముకాలము సుఖముగనుందును. మఱియు నప్పుడు నేను మౌనమునవలంబించి మలినుఁడను కేశలుంచకుఁడనునై సకల జనులకును ఉపదేశమును చేయువాఁడనగుదును. మఱియునెల్లవారికిని అహింసవ్రతమును బోధించి హింసను చేయకుండునట్లు చేయుదును. ఆజన్మమునందు శిరస్సున పేలు మలినము మొదలగునవి కలిగియుండును. కనుక మిగుల దుఃఖము కలవాఁడనగుదును. అంతటఁ గొన్నిదినములకు మరల కలిరూపమును ధరింతును. ఆకలియందువర్ణశంకరమగుటచేత నేనవతారమును పొందవలసివచ్చును. కావున నప్పుడవతరించి క్షణములోపల దుష్టులనందఱ వధింపఁగలను. మఱియునాయవతారము నవలంబిం

చి భూలోకమునందుఁ జిరకాలముందును. కావున నాయవతారమునందు సుఖము లేశమైనను కలుగనేరదు. అంతటఁ గొన్ని దినములకు మరల కృతయుగము కలుగును. అదిమొదలుకొని మరల మునుపటివలె నవతారముల నవలంబించియుందును. ఓ మునికులోత్తములారా! విచారింపఁగ తొమ్మిది యవతారములయందును సుఖము కలుగనేరదు. కావున నీయవతారమునందే నాయిచ్ఛానుసారముగ సుఖముల ననుభవించుచున్నాఁడను. కాఁబట్టి సకలావతారములలో నీరామావతారమువంటి యవతారము లేదు. ఈయవతారమునందు నేనుసప్తద్వీపాధిపతియును,సీతాప్రియుఁడనునై యుందును. మఱియు నీయవతారమునందు మహావీరులగు నీపుత్రు లిరువురు కలిగియుండిరి. ముల్లోకములను జయించునట్టి తమ్ములు మువ్వురుకలరు. మఱియు నీయవతారమునందు కామధేనువు మొదలుగాఁగల సప్తరత్నములుకలవు. ఇంతయుగాక సాక్షాద్వేద రూపుఁడగు వసిష్ఠమునివరుఁడు నాకుగురుఁడై యున్నాఁడు. పుణ్యదేశమగు నార్యావర్తదేశమునందలి యయోధ్యాపట్టణము నాకిప్పుడు నివాసస్థానమైయున్నది. మఱియు నీయవతారమునం దనేకములయిన రాజ్యభోగాదులు నాకుఁగలవు. నాకంటె నితరుఁడగు రాజీభూలోకమునం దెవ్వఁడును లేఁడు. ఈయవతారమునందు నేనొక్కబాణముచేతనే వాలిమొదలగువారిని వధించితిని. మఱియు నీవతారమునందు సీతయొక్కతెయే నాశయ్యయందు పరుండును. మఱియు నోమునికులోత్తములారా! ఈయవతారమునందు నాయాజ్ఞ ముల్లోకములయందును అప్రతిహతముగ నెరవేరుచుండును. మఱియు నీయవతారమునందు నాకు పుష్పకవిమానము యానమైయున్నది. ఆంజనేయుఁడు దూతయైయున్నాఁడు. సుగ్రీవవిభీషణులు పరమమిత్రులు కోదండసదృశమైన చాపముకలదు. ఈయవతారమునందు మిగుల శ్రేష్ఠమగు సూర్యవంశమునందుఁ బుట్టితిని. కౌసల్య తల్లియైయున్నది. నేను తల్లిదండ్రులకు స్వాధీనుఁడనై యుంటిని. మఱియు నీయవతారమునందు సకలగుణసంపన్నురాలగు నామె యత్తయైనది. పరమపావనుఁడగు జనకుఁడు శ్వశురుఁడు. విశ్వామిత్రుఁ డుపాధ్యాయుఁడు. లక్ష్మణుఁడు మంత్రియయ్యెను. స్నానపానాదులకుపయోగించునట్టిది సరయూనదియయ్యె. అంగదాదులు పార్శ్వచరులైరి. మిగుల గొప్పదియును నాలుగుదంతములు కలదియును నగు నేనుఁగువాహనమైయున్నది. నాకుబ్రాహ్మణేచ్ఛాపూరణమే వ్రతమైయున్నది. మందిరము వైకుంఠతుల్యమైయున్నది. ఈలోకములో నేరాజునకును నమస్కారము జేయుటకు నాశిరస్సువంగ లేదు. ఈవిధముగ నేనీయవతారమునం దనేకములయిన సుఖముల ననుభవించివాఁడనైతిని. మఱియు నీభూలోకమునందుఁ గోరఁదగినసుఖము నాకొక్కటియును లేదు. కావుననే యీయవతారము పూర్ణరూపమైయున్నది. ఇదివఱకుఁ గలిగిన యవతారములును ఇఁకమీఁదటఁ గలుగఁబోవు నవతారములును ఈయవతారములతో సమానములయినవి కావు సీతాలక్ష్మణులతోఁగూడ అరణ్యమునందు నేనాచరించిన [illegible]

ములు లోకోపకారము కొఱకనియును, భూభారహారణము కొఱకును తెలియఁదగి యున్నవి. లోకముల కుపదేశించుటకొఱకు నేనుపదేశించిన కృత్యములను చెప్పెదను. వినుఁడు. మిగుల శ్రమముకలిగినను పితృవచనములను పరిపాలింపవలయునని లోకులకుపదేశమును జేయుటకొఱకు నేను పితృవాక్యానుసారముగఁ దపసినై యరణ్యమునకుఁ బోతిని. మఱియును, నేను గోప్రద్రిక్తుఁడనై కైకేయీమంథరలను వధింపకయూరకుంటిని. ఆసమయమునందు నాకుశక్తిలేకకాదు. మఱి యేమనిన స్త్రీవధనుచేయుట మహాపాతకమని లోకుల కుపదేశించుట కూరకుంటిని. మఱియును, సవతి తల్లియొక్క మాటనుగూడ స్వంత తల్లియొక్క వచనము పాలించినవిధముగఁ బాలింపవలయునని లోకులకుఁదెలిపితిని. మఱియును, బంధువులను హింసింపఁగూడదనియును, పరులరాజ్యమును గోరఁగూడదనియును, తెలిపితిని. మఱియు నో మునికులోత్తములారా! మానవులు రాజ్యాసక్తులును భోగాసక్తులును కాఁగూడదని తెలిపితిని. మఱియును, మాతృపితృ సుహృత్పుత్రాదులయందు స్నేహముంచరాదని తెలుపుట కరణ్యమునకుఁబోతిని. మఱియును, సుఖదుఃఖములను సమానములైన వానినిగా తలఁపవలయునని బోధించితిని. సుఖమువచ్చినపుడు సంతోషమునుపొందుటయును దుఃఖమువచ్చినపుడు వ్యసనమును పొందఁగూడదనియును తెలిపితిని. రాజ్యసౌఖ్యమునువదలి సర్వకాలములయందును క్లేశములనే యనుభవించి కామాదిశత్రువుల నారుగురినివధింపవలసినదని లోకుల కుపదేశించితిని. మఱియు నో మునికులోత్తములారా! స్త్రీసంబంధమును సర్వకాలములయందును పొందఁగూడదనియును, ఏకాకినై తపస్సును ఆచరింపవలసిదనియును, లోకుల కుపదేశించుటకొఱకు నేనరణ్యమునందు సీతను విడచియుంటిని. ఆర్తులను గాపాడవలసినదని తెలుపుటకొఱకు సుగ్రీవవిభీషణులను గాపాడితిని. దుష్టులనుశిక్షింపవలశినదని తెలుపుటకొఱకువాలిరావణులనువధించితిని. కీర్తినిసంపాదింపవలసినదని బోధించుటకొఱకు సముద్రమును బంధించితిని. పరిశుద్ధవస్తువని తనమనస్సునకు నిశ్చయముగఁదెలిసియున్నను లోకుల యభిప్రాయానుసారముగ సంచరింపవలసినదని తెలుపుటకొఱకు సీతను పరిత్యజించితిని. మఱియు నేకపత్నీవ్రతమును తెలిపితిని. ఇంతయగాక యనేకములయిన రాజ్యకార్యములనుదెలిపితిని. లోకులకు సన్మార్గము నుపదేశించుటకొఱకే అశ్వమేధాది యజ్ఞములను జపహోమాదులను ఆచరించితిని. ఓమునికులోత్తములారా! ఇట్లుగాదేని లోకాతీతుఁడను, అవాప్తసర్వకాముఁడను అయిన నాకీకృత్యములతోఁ బ్రయోజనమేమి? ఓ మునికులోత్తములారా! నేను సర్వకాలములయందును ఆనందమయుఁడను, సుఖరూపుఁడను, సకలజంతువులకును సుఖమునిచ్చువాఁడను, అయిన పరాత్పరుఁడను. ఇట్టివాఁడనయ్యును. నన్నుసేవించువారి యభీష్టములను దీర్చుటకొఱకు నేనీయవతారము నవలంబించితిని. ఓ మునికులోత్తములారా! నాయవతారములలో రెండవతారములు జలచరావతారములై యున్నవి. మఱి రెండవతా

రములు వల్కల ధారణయోగ్యములయినవి. ఒకయవతారము గోపబాలకవేషము కలది. రెండవతారములువనచార్యయోగ్యములయినవి. ఒకయవతారము మలినవస్త్రములుకలది. ఒకయవతారము క్షణము నిల్పునట్టిది. ఈయవతారము లన్నియు ను నాకు రామావతారమువలె సుఖదాయకములుగావు. ఈరామావతారము సకలావతారములలో నుత్తమమైనది. మఱియు నుపాసకజనులకు మిగులఁబ్రియమైనది. మఱియు నీయవతారము సకలమంగళములను కలుగఁజేయునట్టిదై యున్నది. మఱియు నీరామునిచరిత్రములు మిగుల రమ్యములయినవియును, పాతకములను పోఁగొట్టునవియునునై యున్నవి. మఱియు నీయవతారమునందలి చరిత్రములు శ్రవణమాత్రముచేతనే ముక్తినిఁకలుగ జేయునట్టివై యున్నవి. సర్వకాలములయందును రాముని సర్వజనులును సేవించుదురు. ఈయవతారమునందలి భక్తులు నాకుమిగుల ప్రియులై యుందురు. ఓ మునికులోత్తములారా! ఈరామావతారమునందు దోషముల నారోపించునట్టిజనులు నాకు శత్రుత్వమును చేసినవారగుదురని శ్రీరాముఁడు చెప్పెనని చెప్పి రామదాసు మరలనిట్లనియె. ఓ శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! శ్రీరాముఁడు ఈవిధముగఁజెప్పి మునికులోత్తములను పూజించి వారలనందఱ యథాస్థానములకుఁబంపి సీతామహాదేవికిమిగులసంతోషమును కలుగఁజేసె.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండమునందలి
యిరువదవసర్గ ముగిసెను

రామదాసికి వరదానమునుచేయుట.

శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! అంతట నొక్కనాఁడు సప్తద్వీపములయందును నివసించునట్టి రాజభార్యలుమొదలుగాగల స్త్రీలందఱును చైత్రస్నానమును నెపముచేత సీతామహాదేవినిజూచుటకయోధ్యాపట్టణమునకు వచ్చిరి. అట్లు తనను దర్శించుటకువచ్చిన స్త్రీలనందఱను గౌరవించి మందగామినియగు సీతామహాదేవి దివ్యాలంకార వస్త్రాదులచేత నాస్త్రీలనందఱఁ బూజించె. అంతట నాస్త్రీలనందఱను తగిన యాసనములయందుఁ గూర్చుండఁబెట్టి తానును తగిన యాసనమునందుఁ గూర్చుండి రామునిచరిత్రల నన్నింటిని చెప్పె. అట్లు శ్రీరామచరిత్రలనువిని యాస్త్రీలందఱును ఓసీతామహాదేవీ! నీపాణిగ్రహణమహోత్సవమును చెప్పుమనినవిని సీతామహాదేవి సిగ్గుచేత వంపఁబడిన మోముకలదై తనచెలికత్తియయగు తులసినిచెప్పుమనినఁ దులసియిట్లనియె. ఓపుణ్యాంగనలారా! మీరందఱును సీతాపరిణయమహోత్సవ చరిత్రమునువినుఁడు. సీతాపాణిగ్రహణ చరిత్రము మంగళదాయకమై యున్నది. మీకు సంతోషము కలుగుటకొఱకు సంగ్రహముగఁ జెప్పెదను. శ్రీరాముఁడు లక్ష్మణసహితుఁడై విశ్వామిత్రమునివరుని యాశ్రమమునకుఁబోయి రాక్షసబలమునుజంపి యామునివరుని యజ్ఞమును సమాప్తి

పొందించి మిథిలానగరమునకు వచ్చుచు పాపఫలము ననుభవించుచున్నదియును, గౌతమభార్యయునగు నహల్యను పాపమునుండి తరింపఁజేసె. అంతట లక్ష్మణ విశ్వామిత్రులతోఁగూడ నయోధ్యాపట్టణమునకుఁబోయి క్రిందఁబడియున్న శివుని విల్లునుజూచి విశ్వామిత్రుని యనుమతమునుపొంది యాధనుస్సును మూఁడుఖండము లుచేసె. పిమ్మట సీతామహాదేవిచేత వేయఁబడినమాలికను కంఠమునందు ధరించె ను. అంతట శ్రీరాముఁడు బంధువులనురప్పించి సీతామహాదేవిని పరిణయంబయ్యె. అట్లు వివాహము చేసుకొని సీతాదులతోఁగూడ నయోధ్యానగరమునకు వచ్చునపుడు మార్గమధ్యమునందు దురహంకారియగు పరశురాముని భంగపఱచె. ఓనారీమణులా రా! మీరడుగుటచేత సర్వమంగళదాయకము సీతాపరిణయవృత్తాంతమునుసంగ్రహముగఁ దెలిపితిననియె. అంతట నాస్త్రీలందఱును మిగుల సంతోషముకలవారై రి. అప్పుడు ఆస్త్రీలందఱును సీతామహాదేవిముందుగఁ బూజించిరి. పిమ్మట సీతామహాదేవి యాస్త్రీలనందఱను దగినవిధముగఁ బూజించె. అట్లు సీతచేతఁబూజింపఁబడి యా స్త్రీలందఱును సీతామహాదేవికి నమస్కరించి చైత్రస్నానముల నాచరించి తమతమ దేశములకుఁ బోయిరి. అంతట నొక్కనాఁడు శ్రీరాముఁడు కొలువుదీరి గురుఁడగు వసిష్ఠమహామునివలన పురాణకథలను వినుచుండఁగ లవుఁడు వసిష్ఠమునివరునితో నిట్లనియె. ఓ గురూత్తమా! పుస్తకముల యందంతటను అనఁగా ప్రతిపత్రమునందును శ్రీకారము భిన్న భిన్నముగ వ్రాయఁబడుచున్న ది. రామయను నక్షరద్వయము వేరొకచోట వ్రాయఁ బడుచున్నది. అట్లువ్రా యుటకుఁ దగినకారణమును చెప్పు మనిన వసిష్ఠమునివరుఁ డిట్లనియె. ఓ వత్సా! నీవు లోకులకు సందేహమును కలుగఁజేయునట్టి విషయమును గుఱించి చక్కఁ గఁ బ్రశ్నమునుచేసితివి. వ్యాసమునివరుఁడు, శ్రీరామచరిత్రమును పదునెనిమిది మహాపురాణములనుగాను ఉపపురాణములనుగాను నియమించె. ఇతరులగు మునులు షట్ఛాస్త్రములచేత వివరించిరి. శ్రీరామచరిత్ర మిక్కుటముగలదని తెలియఁజేయుటకొఱకు ప్రతిపత్రములయొక్కయును మొదటియందు శ్రీకారమును తుదను రామయను నక్షరద్వయమును లోకులు వ్రాయుచున్నారని యెఱుఁగవలయును. ఈహేతువుచేత శ్రీకారము నొకచోటను రామ యను నక్షరద్వయమును మఱియొకచోటను వ్రాయుచున్నారని తెలియవలయును. మఱియు నీవిషయము బాలురకుఁ జక్కఁగఁ దెలియుటకొఱకు శ్రీరామయను నక్షరత్రయమును మఱియొకచోట వ్రాయుచు న్నారని యెఱుఁగవలయును. ఓలవుఁడా! అజ్ఞానముచేతఁ గాని భ్రాంతిచేతఁగాని తప్పుగవ్రాయుదుమేమోయను తలంపుచేత వ్రాయునదియంతయును శుద్ధముగనుండవలయు ననియెడు తలంపుతో శ్రీరామయని ముందుగ వ్రాయుచున్నారనియును తెలిసికొనుమనియె. ఈవిధముగ గురుఁడు చెప్పిన వాక్యములనువిని లవుఁడు సందేహములేనివాఁడై మిగుల సంతోషమునుపొందె. అంతటనొక్కనాఁడు శ్రీరాముఁడు

శ్రీరాముఁడు సుగుణయను దాసికి రాధవై సుఖింపుమన్లు వరమునిచ్చుట.

మంచముపైఁ గూర్చుండి తాంబూలముసేయుచు దోషదూషితంబగు మొదటి తాంబూలరసము నుమియుటకై నిష్ఠీవనపాత్రము (తమ్మపడగ) ను దగ్గరఁ గనుఁ గొనకున్న నపుడుఁ జెంతనున్న సుగుణయను పేరఁబరగు నొకదాసి శ్రీరాముఁడు తమ్మపడగకై నిరీక్షించునని యాతని భావం బెఱింగి పాత్రము దూరముగనుండుటఁ గనుఁగొని తనరెండుఁ జేతులను దోయిలిగాఁ బట్టి యారాముని చే నుమియఁబడిన తమ్మరసము నొగిలియనియుఁగూడఁ దలఁపక నిద్యాది భగవద నుగ్రహంబున లభించిన మహాప్రసాదంబని యతిత్వరితంబుగ నద్దానిం ద్రావె, అంత, నా శ్రీరాముఁడ ద్దాసిభక్తి కృత్యంబునకు నెంతయు మంతనంబున సంతసంబంది యోదాసీ? నీమనంబునఁదోఁచిన దెద్దేని వరంబు వేఁడుమిచ్చెదనన నద్దాసి యోరామచంద్రా? ఈయవతారంబునఁ దమ కేకపత్నీవ్రత మొండుఁ గలదుఁ గదా? గాన మఱియొక జన్మమందైనఁ దమ సంగమము నాకు లభించునట్టుల వరముఁ దయసేయుఁడని ప్రార్థించు నద్దాసి వాక్యముల నా రఘుసత్తముఁ డాకర్ణించి దయార్ద్ర హృదయారవిందుఁ డగుచు యో కాంతా? రాబోవుద్వాపరయుగంబున దుష్టుల శిక్షింపను శిష్టుల రక్షింపనుఁ గృష్ణరూపినై గోకులంబున నవతరింపఁ బోవుచున్నాఁడను, అపుడు నీవుఁగూడ రాధయను పేరఁ బరగి యొకగోపకునికిఁ బత్నివై యచ్చట విలసిల్లెదవు. అయ్యవసరంబున నాతోఁడఁ బలువిధములగు క్రీడావిశేషంబులఁ దృప్తిఁగాంచెదవు ఎల్లగోపికల లోపల నీవె యెల్లవిధములఁ బ్రియతమురాలవై విలసిల్లెదవని యనుగ్రహింప నవ్వరంబంది యద్దాసి మిగుల సంతుష్ట చిత్తయయ్యెను. ఓవిష్ణుదాసా? వినువారల వీనులఁ దేనెల సోనల నింపునదియు, మిగుల విచిత్రతరంబగు నదియు నగు శ్రీరాముని దివ్యచరిత్ర మింకొకటిఁ గలదు. దానిఁ జెప్పెద నాకర్ణింపుము.

సపరివారుండగు శ్రీరాముఁడు రూపద్వయమంది దన మహిమఁ జూపుట.

ఒకానొక సమయంబున రఘువీరుఁడు పుత్రమిత్ర బంధుమంత్రి వర్గంబుచేఁ బరివేష్టితుండై పేరోలగంబున నుండుతఱి, తరుణవయస్కుండగు నొక బ్రహ్మచారి యొకచేతఁ గమండలువును మఱియొకచేతఁ గఱ్ఱయును ధరించి పైనమృగచర్మముఁ గప్పికొని కాషాయవస్త్రంబులఁ గట్టికొని శుచివ్రతియై దన సన్నిధి కరుగుఁదేర వానిఁజూచి శ్రీమంతుఁడగు శ్రీరాముఁడు గద్దియనుండి డిగ్గి యెంతయు వినయంబున నాతని నెదుర్కొని దండప్రణామంబు లాచరించి యుచితాసనంబునఁ గూర్చుండఁబెట్టి యథాక్రమంబుగ నర్ఘ్యాది సపర్యలొ

వచ్చి ధేనువు నుపాయనంబుగ నొసంగి యావిప్రవటువుతో శ్రీరాముఁడిట్లు వలికె, ఓవిప్రోత్తమా? ఇప్పుడు తమదర్శనముచే నేను ధన్యుండనైతిని. తా మెందు నిమిత్తమిచ్చోటికిఁ దయచేసితిరో యాసంగతి నాజ్ఞాపింపు డని యడుగ నందు కావిప్రుఁడు ప్రభువరా? శ్రీవాల్మీకి మహాముని యాజ్ఞచే నిచ్చోటి కరుదెంచితి నెందుకన? నమ్మునిపుంగవుఁడగు వాల్మీకి యొకమహాయజ్ఞమును సేయంబూని యున్నాఁడు. దానికి మిమ్ముఁ బిలచికొని యరుగుటకై వచ్చినాఁడను. నేడే సుముహూర్తము గావున నీవు సీతతోఁడను బంధువులతోఁడను సమస్త పరివారములతోఁడను, బయలుదేరుము. రాజేంద్రా! యని జెప్పుచుండ నింకొక బ్రహ్మచారి విశ్వామిత్రాశ్రమమునుండి యేతెంచెను. శ్రీరాముఁడు వానిఁగూడ పూర్వమువలెనే గద్దియనుండి డిగ్గి యెదుర్కొని ప్రణామంబులా చరించి యుచితాసనాసీనుఁ గావించి యర్ఘ్యాద్యాది సపర్యలఁ బూజించి యోవిప్రవరా? తామిచ్చటికేల దయచేసితి రాజ్ఞాపింపుడన? యందునకతఁడు. ఓ శ్రీరామచంద్రా? విశ్వామిత్ర మహాముని యాశ్రమమునుండి వచ్చినాఁడను నమ్మునీంద్రుఁడు గొప్పయజ్ఞంబు సేయ సమకట్టి మిమ్ముఁబిలచికొని రమ్మని నన్నాజ్ఞాపించె, నాచే తాము సమస్త పరివారములతోఁడను సత్వరము బయలు వెడల వలయునని జెప్పగా! నాబ్రహ్మచారు లిరువురి వాక్యముల విని వినోదముగ వదనారవిందమున మందహాసము జిందులుద్రొక్క నాయిరువురి బ్రహ్మచారులతోఁడను అట్లేకానిమ్మని యుత్తరంబిచ్చెను. అంత జనులందఱొండొరు లిట్లు మాటలాడికొనుచు నాశ్చర్యపడిరి. వీరిరువురితోఁడ శ్రీరాముఁడెట్లు రెండు యజ్ఞంబులకుఁ బోవును? అనికొందఱును వనంబున స్త్రీలకనేక రూపంబులఁ గానంబడలేదా యట్లే యిప్పుడుఁగూడ రెండురూపంబులఁ దాల్చి మనకు దర్శనంబొసఁగునని కొందఱును. పూర్వము తాను లంకనుండియు నెచ్చటనోయున్న భరతునకు దర్శనం బొసంగి జనులకందఱకు భిన్నరూపంబులుగ దర్శనంబొసఁగె. నట్లే నిప్పుడును రెండురూపంబులఁ దాల్చి రెండు యజ్ఞంబులకు నరుగునని కొందఱును. ఇదియేమి యాశ్చర్యము! పరమాత్మ యగు రామునకేది యశక్యంబగు నని కొందఱును బలుకుచుండి రిట్లుండ లక్ష్మణునితో శ్రీరాముఁడు, నేడే భోజనానంతరము ప్రయాణముగావలయుఁ గావున సేనలనెల్ల సిద్ధము సేయింపుము. మంగళవాద్యములు మ్రోగునుగాక యనియాజ్ఞాపించిన నట్లే లక్ష్మణుండు సేనాపతుల కుత్తరు వొసఁగ వారు బ్రయాణ సన్నద్ధులై యుండిరి, డేరాలు వెడలెను. మంగళవాద్యంబులు మ్రోగె. సేనలు సర్వసన్నద్ధంబు లయ్యె, అంత నా రఘువీరుఁడు సీతాదేవి యంతఃపురంబునకుఁ జని యామెకీవృత్తాంతముఁ దెలిపి యామెతోఁడ భోజనశాల కేగెంచి బ్రాహ్మణోత్తములతోఁడం గూడి విందారగించెను. పిదప, ప్రయాణసమయంబున, సీతాదేవి, ఊర్మిళ, శ్రుతకీర్తి,

మూఁడవి. మొదలగు నృపకాంతలను గజంబులమీఁదను. పౌరకాంతలను పుష్ప
కంబునందును. తాను, లక్ష్మణాదు లేనుంగులమీఁదను నెక్కి వెడలునపుడు,
వారాంగనలు నాట్యంబొనర్చిరి. భేరీమృదంగాది మంగళ వాద్యంబులు సెల
గెను. వందిమాగధులు శ్రీరామ కల్యాణగుణగణంబుల స్తోత్రము సేయసాగిరి.
నటులు సుస్వరముగ గీతములం బాడిరి. ఇట్లు కొంతదూర మేతెంచి పటగృ
హంబులఁ బ్రవేశించి యారాత్రియంతయు నచ్చోటనే గడపి మరునాఁ డుదయ
యమున స్నానకృత్యమొనర్చి నిత్యవిధులం దీర్చికొని గజారూఢుఁడై రెండుక్రో
సుల దూరమేగ నచట రెండుమార్గములు దనకంటికిఁ గనుఁబడెను. అపుడు
తానొకఁ డగుటచే రెండు మార్గంబులయందు నేగవలనుపడమి చూపఱుల
కాశ్చర్యంబుఁ గలుఁగునటుల సీతతోఁడను సైన్యముతోఁడను. పుత్రమిత్ర బంధు
పరివారముతోఁడను దాను రెండు రూపంబుల ధరించి రెండుత్రోవలఁ బోసా
గెను. అపుడు జనులందఱు రెండుపుష్పక విమానంబులును. యిద్దఱు బ్రహ్మ
చారులలో నొక పథమందొకఁడు మఱియొక పథమం దొకఁడునుఁ బోవుచుం
డుటఁ గాంచి యెంతయు విస్మయాంబుధి తరంగంబుల నోలలాడుచుండిరి యిట్లు
యాశ్రీరామునియొద్దనుండు శునక కిశోరముఁగూడ రెండురూపములం ధరించెను.
ఇట్లు సీతారాములు వాల్మీకి విశ్వామిత్రాశ్రమంబుల నొక్కపరియె నిరీక్షిం
చుచు నాశ్రమంబులం బ్రవేశించి ఋషివర్యులచే ప్రత్యుత్థానాది సకల మర్యా
దల నొంది వారియజ్ఞంబులు పరిపూర్ణమగు వరకు నచ్చటవసించి యథాపూర్వ
ముగా నయోధ్యకు నాబ్రహ్మచారులతోఁడ వెడలిరి. ఇట్లు మార్గము ననుస
రించి యెల్లరు నేగుచుండ పూర్వమెచ్చోట రూపద్వయము సిద్ధించెనో నచ్చట
వచ్చునప్పటికత్యాశ్చర్యకరంబుగ నెల్లరకు నొక్కరూపంబు సిద్ధించె. పుష్ప
కంబొండయ్యె. సైన్యంబొక్కటయ్యె, రూపద్వయము నొందియున్న, బ్రహ్మ
చారులిరువురు నేకైకరూపమునుఁ బొందిరి. అంతయునొక్కటిగా నెంతయువింత
గలిఁగించె. అంతనా శ్రీరామచంద్రుఁడు నిజరాజధానియగు నయోధ్యఁ బ్రవే
శించి నానావిధ వాద్యరవంబులు ఘోషించుచుండ. వారాంగనలు నాట్య
క్రియలు సలుపుచుండ పురస్త్రీలు యుప్పరంపు చప్పరంబులనుండి కుసుమం
బుల వర్షించుచుండ, మాగధులు స్తోత్రంబులు సేయుచుండ. నటాదులు గా
నాది కృత్యంబుల సలుపుచుండ పురమార్గంబుల నానావిధ యుత్సవంబులఁ
గాంచుచు రాజమందిరంబును నిజాగమనంబుచే నలంకరించె. సీతాదేవియును
ఊర్మిళాదులతోఁడ దన యంతిపురంబునకరిగె, విష్ణుదాసా ? ఇట్లు శ్రీరామునిచే
నమానుషంబులగు మహాకౌతుకంబు లనేకములు చూపంబడినవి. వానినన్నిఁ
టిని వాల్మీకి మహాముని విస్తరంబుగ యభివర్ణించి యున్నాఁడు. అందు సారాం
శంబులను గ్రహించి సంగ్రహంబుగ ప్రభువానతిఁ జెప్పుచున్నాఁడ. ఎప్పుడు

శ్రీరామాజ్ఞనుఁ బొందిఁ జెప్పుచున్నాఁడనో అప్పుడు నీవు ధన్యుండవు" శ్రీరామచంద్రుండు పుణ్యంబగు, మనోహరంబైన యానందదాయకం బగు దనచరిత్రంబును యభివర్ణించుటకు నాకాజ్ఞ నొసంగియున్నాఁడు. మన యిరువురి సంవాదమును మునుపె తన కాలమున గతవిషయంబుఁ బోలె విరచించిన నావాల్మీకి మహామునియు ధన్యుండు, అట్లు శ్రీరామావతారమునకు ముందే దచ్చరిత్రంబును సమగ్రంబుగ నభివర్ణించి రహస్యంబుగ దాచియునిచిన వాల్మీకితో సాటి యగు కవిమఱియొకఁడు లేడు ఇఁకఁ జనించడు.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండము
నందలి యిరువదొకటవ సర్గముగిసెను.

శ్రీసీతారాములకు భూరికీర్తి పుష్పఫలాదులనంపుట

శ్రీరామదాసుఁడు. విష్ణుదాసుండను విప్రునితో, ఓవిష్ణుదాసా ? వినుము, ఇప్పుడు శ్రీరామునియొక్క విలాసంబగు వినోదంబైన మనోహరచరిత్రం బభివర్ణించెదను; ఒకప్పుడు శ్రీరాముఁడు బంధుమిత్రపుత్ర మంత్రిజానపదాది సకలపరివారములతోఁడ సభను సుఖాసీనుండై యుండ భూరికీర్తి యను మిత్రుఁడు కమలాది పుష్పంబులచేతను ద్రాక్షాది ఫలంబులచేతను నిండించినపెట్టెల వేలకొలఁదిగా భటులచేత నిచ్చిపంపెను. వారువానిఁదెచ్చి శ్రీరాముని సన్నిధియందర్పించిరి. శ్రీరాముఁడు వానినన్నింటిని సీతాదేవికడ కంపెను. మిగుల సంతసంబునఁ జెలులతోఁడఁ గ్రీడాగారంబునఁ గ్రీడించుచున్న సీతాదేవి వానిఁ జూచి యందొక కరండంబుఁ దెఱచి చూడ యందు మనోహరంబగు పుష్పంబులు గానంబడినవి. యప్పుడు సీతాదేవి వానిలో నొకతామర పుష్పంబు నెత్తికొని రాఘవుని కర్పించకమునుపే పలుమారు వేడుకతో నాఘ్రాణించెను. పిదప నా కరండంబు నట్లే మూసియుంచి పెట్టెల నన్నింటిని గదులలోఁ బదిలపఱచెను. సభాసీనుండగు శ్రీరాముఁడు యాసీతాదేవి యొనర్చిన వృత్తాంతంబునుఁ దనదివ్యజ్ఞానదృష్టి నెఱిఁగి పలుమాఱు దనమదిని పతి యనుభవింపకమునుపు ఏవస్తువునేని సతియనుభవింపరాదు. ఇట్లుండ, సీతాదేవి చేసినపని తగదు. నేననుభవింపక మునుపే తామరపుష్పంబు నాఘ్రాణించె. దీనిఁజూచి యిఁకమీఁద స్త్రీలందఱు సీతాదేవి సూపిన మార్గము ననుసరించెదరు గాననిందుకుఁ దగినటుల శిక్షింప నగునని మనంబున నిశ్చయించి యంత నేమియు నెఱుంగనివానిఁబోలె నప్పటి యట్లనంతఃపురంబున కేగెను. పూర్వమువలెనే సీతాదేవితో వివిధవినోదక్రీడల నానందించుచు సీతాదేవిని మిగుల రంజిలఁజేసెను, అంత నాజానకి యాపెట్టెల దెప్పించి శ్రీరాముని యెదుటనుంప నతఁడు వానిఁజూచి వారివారికిఁ దగినటులఁ దమ్ములకుఁ దల్లులకుఁ, బుత్రులకు, మిత్రులకు, మంత్రులకు, మునులకుఁ, బురజ

నులకు, సేవక దాస్యాది పరివారంబునకు, ౧౦,౫,౭,౫, ఇటులఁ బంపించి సీతాదేవికి నూఱులకొలఁది యొసంగి తానుఁగూడ నొకపెట్టెనుండి యిరువదిమూఁడు ఫలంబుల భక్షించి, అదేలాగున పద్మంబులు మొదలగు నవకుసుమంబుల ననేకంబుల విభజించి సీతాదేవి కొసంగి దానుం గొన్నిఁటిఁ జేకొని, సీతావృత్తాంతము దా నెఱుంగనివాని విధంబున నటింపుచు నయ్యుదంతంబును మనంబున నిమిడ్చికొనియుండుతఱి నొకానొక సమయంబున జానకి యేకాదశియం దుపవాసవ్రతమాచరించి మరునాఁడు మజ్జనంబాడి బృందావనము చెంతఁ జేరి తులసీపూజ యొనర్చి నామెకుఁ బ్రదక్షిణము సేయు నపుడు యంతకు పూర్వదినంబునుండి నిరాహార యగుటం జేసి శ్రమాన్వితయై ప్రదక్షిణం బొనర్చుట మాని యచ్చోటనే తిన్నగ చుట్టుఁదిరిగెను. ఆసమయంబున దనపైఁట చెఱఁగుఁదాఁకుటచే తులసీవృక్షమునుండి పత్రంబొకటి క్రింద రాలెను. శుభకరమగు నాతులసీ పత్రంబు రాలుటఁగాంచి. సీతాదేవిదనలో ద్వాదశియం దీపత్రము రాల్చుట మిగుల యధర్మము గదాయని లోలోన భయమందుచు జాగ్రత్తతో నాపర్ణము నచటనే యెత్తిపెట్టి వినయ సంభ్రమములు దండడిగొన నాతులసీదేవికిఁ బ్రదక్షిణం బొనర్చి తద్దయుఁ బ్రార్థించి యంతఃపురంబున కేగి. భర్తృసౌఖ్యంబునుచుండెను. యీలోపల నారదుండు "పాలయమాం దీనం రాఘవ పాలయమాం దీనం" అను ౧౫ అక్షరములుఁ గల సకల పాపక్షయకరం బగు గీతరత్నమును వీణపై సుస్వరముగ మాటిమాటికి మిగుల భక్తిరసంబున నోడలు పరవశముగాఁ బాడుకొనుచు నచ్చటి కేతెంచిన నపుడు రాఘవ్రుఁడు మునీంద్రు రాక దన పూర్వపుణ్యకృతం బని లోఁదలంచుచు సీతతోఁడ నభ్యుత్థానాది సత్కృతుల నొనర్చి యుచితంబగు నాసనంబునఁ గూర్చుండఁబెట్టి స్వాగతం బడిగి యర్ఘ్య పాద్యాచమనంబుల నొసంగి గంధాక్షతలఁ బూజయొనర్చి గోవు నొసంగి హేమపాత్రంబున విందారగింపఁజేయ సమకట్టి బంగరుపళ్లెరంబు ముందిడి యోగిరం బిడుటకై సీతాదేవి నాజ్ఞాపింప నాసీతయు సంతసిల్లి యాకామధేనువునుండి శ్రేష్ఠము లగు భోజనపదార్థములనొంది యాపదార్థముల పళ్లెరముననిడఁ గరకంకణంబులు గల్లుగల్లుమని మ్రోయ పాదనూపురంబులు హంసస్వనంబులఁ బురణింప వైళము వడ్డింపఁబోవ నారదుండు సీతారాముల నవలోకించి యోరాజీవాక్షా. రామా ? నేనీ సీతాదేవిచే వడ్డింపంబడు భోజనపదార్థంబుల గ్రహించుట లేదు అని గట్టిగఁ జెప్ప సీత యెంతయు భీతిల్లి యూఱకుండెను. అపుడు శ్రీరాముఁడును సర్వజ్ఞుఁడై స్వయంప్రభువుగా నుండినను తెలియనివానివలె సంభ్రమముతో నారదుఁ గాంచి మునీంద్రా ? ఎందుకిపుడు భుజింపవు ? కారణముఁ జెప్పుము అని వ్యగ్రుఁడై యడిగెను. అందుకు మునీంద్రుఁడు రఘునాథా ? నీవెఱుఁగవా ? చెప్పెద వినుము, ద్వాదశినాఁడు తులసీపత్రం

బును ఛేదించుట యనుపాపంబొనర్చె నందుచే నీమె పాపాత్మురాలయ్యె. ఓశ్రీరామ ప్రభూ? నామాటయందు నమ్మకముండదేని నీవేపోయి బృందావనమున విలోకింపుము. యథార్థముఁదెలియును. సంక్రమణ కాలంబులయందును, చతుర్దశియందును, ద్వాదశియందును, వ్యతీపాతాదికాలంబులయందును, పర్వంబులయందును, సూర్యచంద్రగ్రహణంబులయందును, సంధ్యాకాలమందును, శుక్రవాసరంబునను, మంగళవారంబునను, అపరాహ్ణంబునను, జాతాశౌచ మృతాశౌచంబులలోను, తులసిఁ ద్రుంచువారు విష్ణుమూర్తిశిరంబును నఱికిన పాపంబునొందుదురనియు, ద్వాదశినాఁడు తులసిని, కార్తిక మాసంబున నుసిరికను కతిరించినవాఁడు నరకము నొందును. స్త్రీపురుషులెవరైన నకాలమునందు తులసీపత్రమునొక దానినిఁ ద్రుంచిన వారిపాపము బ్రహ్మహత్యతో సమమైనది, అని స్మృతులున్నవి" పురుషులకే యిట్టిదోషంబులు వ్యాపించుచుండ నిఁక స్త్రీలబ్రదుకెంత? కావున నీమెచే వర్జింపఁబడిన పదార్థంబులఁ భుజింపనేనొల్లనని జెప్ప, నంతనా శ్రీరామభద్రుఁడు "స్వామీ? మీరె ఈసీతనుఁ బవిత్రురాలుగ జేయనర్హులు గాన వ్రతము లాచరించుటయో శ్రేష్ఠంబులగు దానంబులు విప్రుల కొసంగుటయో యెద్దియో దగినఁ బ్రాయశ్చిత్తము నిశ్చయించి కర్తవ్యము నాజ్ఞాపింపుమనిఁ బ్రార్థింప, నమ్మునివరుండు, ఓశ్రీరామచంద్రా? బ్రహ్మహత్యాది పాపములకుఁ బ్రాయశ్చిత్తము లనేకములుమహర్షులచేఁ జెప్పంబడినవి గాని, ద్వాదశియందు తులసీపత్రమును ఛేదించిన పాపమునకుఁ బ్రాయశ్చిత్తమునుఁ జెప్పియుండలేదు. నాకునుఁ దెలియదు. అయినను, నాకొకటిఁ దోచుచున్నది, ఈమె పాతివ్రత్య మహిమంబుచే నీపత్రంబును మరలఁ జెట్టునతుకుకొనున ట్లొనర్చినఁ జాలును, ఇదియె నింమకుఁదగిన యుపాయంబనియు దీనిచే నీమె పరిశుద్ధురాలుఁ గాగలదనియుఁ జెప్ప నారాముండు సీతాదేవి నవలోకింపనంత. సీతాదేవి, ఓబ్రహ్మపుత్రా? మీరువినోదంబుగఁ జూచుచుండుఁడు. నాపాతివ్రత్య మహిమంబుచే నిప్పుడే యా తులసీ పత్రంబు వృక్షంబున సంలగ్నంబగున ట్లొనర్చెదనని యన్నపాత్రంబును పాకస్థానమున నునిచి కాలియందు నూపురంబులు మ్రోయ బృందావనము దగ్గరకువచ్చెను నారదుండు శ్రీరాముఁడు మొదలగువా రందఱు వచ్చిరి ఊర్మిళా, చంపికాది స్త్రీలును, లక్ష్మణలవకుశాదిపురుషులును యేతెంచిరి. అప్పుడు సఖులతోఁడ నుండు సీతాదేవి భక్తితోఁ దులసిని స్తోత్రముసేసి "యోతులసీ? మంగళాంగీ? నావాక్యంబును వినుము. పరిశుద్ధమగు పాతివ్రత్యంబు నాయందు నిండియుండిన నీపత్రంబుమరల నీయందెప్పటియట్ల సంలగ్నంబుగాఁగలదు" అనిపలికి ముందుఁ జూచుచుండె. అందఱును మిగుల శ్రద్ధతోఁ బరికించుచుండిరి గాని నాపత్రము సంధించక పోయెను. అంతనామె మోమ్ము వెలవెలఁ బోవ వ్యాకులిత చిత్తయయ్యె, ఇవ్వినోదమునుఁ

జూచుటకై, దేవగంధర్వ యక్షనాగకిన్నరాదులు, గుహ్యకులు, ఋషులు మొదలగువారంద ఱరుగుదెంచిరి. అంతనారదుఁడు చింతాక్రాంతయగు సీతాదేవిని రహస్యంబునకుఁ బిలచి యిందుకు కారణమునుఁ జెప్పెద వినుము. పతివ్రతయగు నాతికి పతిని వదలి పుష్పగంధాదులనైన నాఘ్రాణించుట తగదు. నీవు తామర పుష్పము నాఘ్రాణించితివి. యందుచే రాముని మాయయిట్లు ప్రవర్తిల్లుచున్నది. యీతులసీ పత్రంబుల బడుటకుఁగూడ నారామునిసంకల్పమే కారణంబు "నీవస్త్రము చెఱఁగుచేతఁ బత్రము రాలినకారణముంబట్టి నిన్ను శిక్షించుగోర్కె నారాముని యంతరంగంబున యుంటనే నెఱింగి నీయందు దోషంబునిరూపించితి " క్షమింపుము " నాయెడఁ గోపింపకుము. రాముఁడు నిన్ను శిక్షింపకఁబోయిన నిట్లే భోగాసక్తిచే స్త్రీలందఱునుఁ బతిని విడనాడి భోగంబులనందుచుందురు. కావున నిప్పుడు నామాట వినుము. మరల బృందావనమువద్దకిఁ బోయి ప్రార్థించి తులసీ? పతికి సమర్పింపక యంతకుమునుపే పద్మపరిమళము నాఘ్రాణించుటఁ దప్పఁ బాతివ్రత్యమును క్రమముగఁ బాలించిన దాననై యుండిన, నీపత్రమువృక్షమున సంధిల్లునుఁ గాత యని ప్రతిజ్ఞ సేయుము. వెంటనే యాపత్రమట్లు సంధిల్లును. కావున నచ్చటికి వెడలుము. చింతింపకుము, అని సమాధానబరచి నారదుఁడు సీతాదేవినిఁ బిలచికొని బృందావనమువద్దకు మరల వచ్చెను. పిదప సీతాదేవి తులసికి నమస్కరించి దేవతలు, ఋషులు జనులందఱునుఁ జూచుచుండ " పతికి సమర్పింపకనే పద్మాఘ్రాణముఁదప్ప " పాతివ్రత్యమునుఁ బాలించిన దాననైన నీతులసీపత్రముసంధిలుగాత, యని ప్రతిజ్ఞ సేసెను, అంత నాపత్రము యందఱుఁ జూచుచుండ వృక్షంబున సంధించెను. దేవతలు బొగడిరి. విప్రులు మంగళాశీర్వచనంబులు సేసిరి. దుందుభులు మ్రోగినవి. దేవత లాకసంబున విమానంబులనుండి కుసుమ వర్షంబుల వర్షించిరి. అందఱును జయజయధ్వనుల కోలాహలం బొనరించిరి. అప్పుడు శ్రీరామచంద్రస్వామి హాసన్ముఖియగు నాసీతాదేవిని యాలింగనముఁ జేసికొని కమలనేత్రయగు యోసీతా? ఇదినిన్ను శిక్షించుటగాదు. సామాన్యస్త్రీలందఱకుఁ దెలివి గలుగుటకైఁ జేసినట్లు భావింపుము. ధర్మమునిలిపి దుష్టులను శిక్షించి సాధువులను రక్షించుటకేఁ గదా? నాచేనిట్టి యవతార మంగీకరింపఁబడియె, వనితలిట్లు పాతివ్రత్యమును బాలింపవలయుననుటకై యట్లొనరించితిని. నీవు చింతింపకుము. అని సమాధానపరచి పంపించి, సురాదులనందఱిని యుచిత సత్కారంబుల గౌరవించెను. జానకీదేవి దివ్యాన్నంబుల పసిఁడి పళ్లెరంబుల నిడికొని ముఖారవిందమున చిరుచెమటఁ గ్రమ్ముచుండ వైళమ వడ్డింప నారదాదులందఱు భుజించి సంతుష్టులై చందన తాంబూలాదికముల గ్రహించిరి. అంతనారద మహాముని పరమాత్మయగు శ్రీరామబ్రహ్మమునిట్లు స్తుతించె.*

శ్రీనారదమునికృత పాపఘ్న పద్యనవకమ్.

శ్రీరామం మునివిశ్రామం జనసద్ధామం హృదయారామం । సీతారంజన సత్యసనాతన రాజారామ ఘనశ్యామం ॥ నారీసంస్తుత కాళిందీనుత నిద్రాప్రార్థిత భూపాలం । రామంత్వాం శిరసాసతతం ప్రణమామిచ్ఛేదిత సత్తాలమ్॥౧॥

నానారాక్షస హర్తారం శరధర్తారం జనభర్తారం । వాలీమర్దన సాగరబంధన నానాకౌతుకకర్తారం ॥ పౌరానందద నారీతోషద కస్తూరీయుత సత్ఫాలం । రామంత్వాం శిరసాసతతం ప్రణమామి చ్ఛేదిత సత్తాలమ్॥ ౨॥

శ్రీకాంతం జగతీకాంతం స్తుతసద్భక్తం బహుసద్భక్తం । హృదయేప్సితపూరకపద్మాక్షం నృపవర్యం భూజాకాంతం ॥ పృథ్వీశేశం విశ్వామిత్ర సువిద్యాదర్శిత సచ్ఛీలం। రామంత్వాం శిరసాసతతం ప్రణమామిచ్ఛేదితసత్తాలమ్॥౩॥

సీతారంజిత విశ్వేశం వరపృథ్వీశం సురలోకేశం । గ్రావోద్ధారణరావణమర్దన తద్భ్రాతృకృత లంకేశం ॥ కిష్కింధాకృత సుగ్రీవం ప్లవగోద్వృందాధిప సత్ఫాలం । రామంత్వాం శిరసాసతతం ప్రణమామి చ్ఛేదిత సత్తాలమ్॥ ౪॥

శ్రీనాథం జగతాంనాథం జగతీనాథం నృపవరనాథం। భూదేవాసుర నిర్జరపన్నగ గంధర్వాదిక సన్నాథం । కోదండోద్ధృత తూణీరాన్విత విగ్రహాధికకృత భూపాలం । రామంత్వాం శిరసాసతతం ప్రణమామిచ్ఛేదిత సత్తాలమ్॥ ౫॥

రామేశం జగతామీశం జనబుద్ధీశం నతలోకేశం । వాల్మీకికృత సంస్తవహర్షిత సీతాలాలిత వాగీశం ॥ పృథ్వీశం హృతభూభారం నతయోగీంద్రం జగతీపాలం। రామంత్వాం శిరసా సతతం ప్రణమామిచ్ఛేదిత సత్తాలమ్॥ ౬॥

చిద్రూపం జితదుర్భూపం నతసద్భూపం నతసద్భూపం । సప్తద్వీపజవర్షజకామిని సంసీరాజిత పృథ్వీశం ॥ నానాపార్థివ నానోపాయన సమ్యక్తోషిత సద్భూపం । రామంత్వాం శిరసా సతతం ప్రణమామిచ్ఛేదిత సత్తాలమ్॥ ౭॥

సంసేవ్యం మునిభిర్గేయం కవిభిస్తవ్యం మునిహృదిధార్యం । నానాపండిత తర్కపురాణజ వాక్యాదిషు కృతసత్కావ్యం ॥ సాకేతస్థిత కౌసల్యాసుత గంధాద్యంకిత సత్ఫాలం । రామంత్వాం శిరసాసతతం ప్రణమామిచ్ఛేదిత సత్తాలమ్॥౮॥

భూపాలం ఘనసన్నీలం నృపసద్బాలం కలిసంకాలం । సీతాజాని వరోత్పల లోచన మంత్రీమోచిత సత్కాలం ॥ శ్రీసీతాకృత పద్మాస్వాదన సమ్యక్శిక్షిత తత్కాలం । రామంత్వాం శిరసాసతతం ప్రణమామిచ్ఛేదిత సత్తాలమ్॥౯॥

హేరాజన్ నవభిశ్శ్లోకై ర్భువిపాపఘ్నం నవకంరమ్యం । మేబుధ్యాకృతముత్తమ నూతన మేతద్రాఘవమర్త్యానాం ॥ శ్రీపౌత్రాదిక సుక్షేమప్రదమస్మాత్సద్వర తశ్చాలం। రామంత్వాం శిరసాసతతం ప్రణమామిచ్ఛేదిత సత్తాలమ్॥౧౦॥

నారద మహామునిచే జేయంబడిన
శ్రీరామ స్తోత్రము

లోకమునకు తేజస్స్వరూపుఁడును హృదయమునకు నెమ్మదినిచ్చువాఁడును మునులకు విశ్రాంతిస్వరూపుఁడును రాజులలో రమ్యుఁడును మేఘశ్యామల కోమలగాత్రుండును, దేవతాస్త్రీలచేతను, యమునచేతను, నిద్రాదులచేతను స్తోత్రము సేయంబడినవాఁడును, జానకీరమణుఁడును, సత్యస్వరూపుఁడును, పురాణపురుషుండును సాలంబుల భేదించినవాఁడును, నగు శ్రీరామమూర్తీ! నిన్నుఁగూర్చి శిరంబుచే నమస్కరించుచున్నాను, (సప్తసాలవృక్షంబుల భేదించుటను ప్రతిపద్యాంతమునను జెప్పుటచే సప్తవ్యసన నివారకుండను భావమును వర్ణించెననిఁ దేటపడుచున్నది) శరములధరించి సకల రాక్షసులను సంహరించి జనులను రక్షించి వాలిసంహారము సముద్రసేతుబంధనము మొదలగు నానావిధ కౌతుకములఁ జూపి లోకానందకరంబుగ కస్తూరీతిలకాద్యలంకారములనంది. లక్ష్మీపతియును లోకపతియునై సద్భక్తులు గలవాఁడును, కోరికల నీడేర్చుచు, పుండరీక సుందర లోచనుఁడు రాజరాజనఁబడి, విశ్వామిత్రముని విద్యలనేర్పును జూపినవాఁడై, సమస్తలోకపాలకుఁడును, అహల్యనుద్ధరించిన వాఁడును రావణునిమర్దించి విభీషణునికి రాజ్యమునొసఁగిన వాఁడును వానరబృందముల రక్షించి సుగ్రీవునికి రాజ్యాభిషేక మొనరించినవాఁడును, లక్ష్మీనాథుఁడును జగత్పతియును దేవ గంధర్వాది పరిపాలకుఁడును, ధనుర్ధారి యగుటచే కోదండరామమూర్తి యనంబడినవాఁడై, విశ్వేశ్వరుండును రామేశ్వరుండును బుధ్యంతర్యామియును సర్వలోక వంద్యుఁడును, వాల్మీకిసారస్వతిసంపత్స్వరూపుఁడును, సీతాదేవిచే లాలింపఁబడినవాఁడును, దష్టనిగ్రహంబుచే జగత్పరిపాలకుఁడును, జ్ఞానస్వరూపుఁడును, లోకపాల వందితుఁడును, దష్టనృప నిగ్రహుఁడును, సద్రాజ పూజితుఁడును, సమస్తకవీంద్ర సంస్తుతుఁడును, మునుల హృత్కమల భావితుఁడును, సమస్త పండితులచేతను సర్వశాస్త్రంబులచేతను స్తుతింపఁబడినవాఁడును, సర్వకావ్యంబుల వర్ణితుఁడును, అయోధ్యావాసియును, కౌసల్యా సుతుండును ఊర్ధ్వ పుండ్రచందనాద్యలంకృతుఁడును, దురితపరిహారకుఁడును, నృపబాలకాకారుఁడును, మేఘశ్యామలుఁడును, కువలయాక్షుండును, తన మంత్రముచేత మృతిని దొలఁగించువాఁడును, కలినిగ్రహుండును నగు.

ఓ శ్రీరామా? నీవు సీతా పద్మాఘ్రాణ నిమిత్తమున పాతివ్రత్యధర్మమును జూపితివి. సాలభేదనుండగు శ్రీరామా? నీకు బ్రణమిల్లెదను. నీ వరరూపమగు ననుగ్రహముచేతనే దురితహరంబగుటచే పాపఘ్న మను నీపద్యనవకంబు నాచే నిప్పుడే నిర్మింపఁబడినది. ఇయ్యది సర్వజనులకు పారాయణ పఠనశ్రవణాదులచే పుత్రపౌత్రాదిసంపదలు, యోగక్షేమంబుల నిచ్చి రక్షించుచుండును

గాక, ఇది నీవరంబు, అని యిట్లు లక్ష్మీనాధుండును భక్తవత్సలుండును, నగు శ్రీరాముని స్తుతించి నమస్కరించి శ్రీరామునాజ్ఞ నొంది నారదుం డానందముతో వెడలెను. దేవతలు, మహర్షులు వారివారి నివాసంబుల కరిగిరి, శ్రీరాముం డిట్లు మాయామానుషవిగ్రహ రూపముతో ననేక వినోదంబులను జూపుచుండె. వానిని విస్తరించి వర్ణించుట కెవరితరము, శ్రీరామాజ్ఞచే వానిలో నతని ప్రేరణ చేత జ్ఞాపకము వచ్చుచుండు వానిని నీకభివర్ణించి చెప్పుచున్నాను వినుము. ఓవిష్ణుదాసా? యని శ్రీరామదాసుఁడు మరల యిట్లు సచ్చిదానందస్వరూపుఁడైన పరమాత్మయగు శ్రీరాముని దివ్యకథలను నిరూపించుచున్నాఁడు.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండమునందలి
ఇరువది రెండవసర్గ సంపూర్ణము.

---

* శ్రీమదానంద రామాయణ పఠనముచే దూతుఁడు మంత్రియగుట.

శ్రీరామచంద్రస్వామి సీతతోఁడను బంధువులతోఁడను సమస్తపరివారంబులతోఁడను సుఖంబుగ సంపూర్ణైశ్వర్యమున నఖండ సామ్రాజ్య పరిపాలనము సేయుచు యానందించుచుండగా. నొకప్పుడు, దూత యొకఁడువచ్చి పద్మలోచనుండవగు శ్రీరామచంద్రస్వామీ? నేనిఁక నిట్లు కొలువులో నుండను, తపము నాచరించెదను నాకాజ్ఞనొసంగుము. పోయెదను. అని ప్రార్థించి, శ్రీరామాజ్ఞఁ గైకొని, నిజమందిరంబునకరిగి, శుచియై తొమ్మిది రాత్రులలో శ్రీమదానందరామాయణ పఠనవ్రతము నాచరించి యంత వెలుపల వెడలెను. అంతలో నొక్కదేశమున రాజుమృతి నొంద నచ్చటి ప్రజలు రాజపుత్రుండు బాలుఁడగుటచే మంత్రినిరాజ్య కార్యనిర్వాహణమున కాలోచించిరి. అప్పుడు కొందఱీతఁడహర్హుఁడనియు, మఱికొందఱీతఁడర్హుఁడుకాడనియుఁ బలువిధంబుల వివాదంబులఁ జేయుచు, నెట్టకేలకు, పట్టపేనుఁగు కరంబున పుష్పమాలిక నిచ్చి పంపుదము, అది యెవనిమెడను వేయునో వాఁడుతగునని నిశ్చయించిరి. అంత దానినలంకరించి పూజించి పుష్పరత్నమాలికను దానికరంబున నిడిపంపిరి. మంగళవాద్యములు మ్రోగెను. అంతనా భద్రగజము పలుదేశంబుల నతిక్రమించి క్రమముగ నయోధ్యకేతెంచి అంగడిబజారున వచ్చుచుండిన దూతుఁడను వాని కంఠమునకలంకరించెను. అచ్చటిపౌరులు దానివెంటనే వినోదవిలోకనాసక్తులై వచ్చుచుండి యద్దాని కాశ్చర్యమంది యాదూతుని నాయేనుఁగుమీఁద నెక్కించుకొని పత్నీపుత్ర పరివారముతోఁడ వారిదేశమునకుఁ గొంపోయి వానిని తమదేశమునకు మంత్రినిగా నియోగించుకొనిరి. రాజ్యకార్యంబుల నాతఁడు జాగరూకుఁడై సుఖంబుగనుండె, నయ్యదిలోకంబున కెంతయు నద్భుతంబయ్యె.

ఆనందరామాయణ పారాయణానందముచే జనులిహపర సౌఖ్యంబులనొందుటచే యమలోకము పాడగుట.

పిదప నావృత్తాంతమును వేలకొలఁదిదూతలొండొరులు జెప్పికొని వివిధదేశంబులలో నంతటను నయోధ్యయందును రాజసేవకులు కొలువుమాని నిజనివాసంబులకుఁ జని కొందఱు పారాయణముఁ జేసియు, కొందఱు పురాణము వినియు, కొందఱు సంకీర్తన మొనరించియు, కొందఱు పఠించియు కొందఱర్థవిచారముఁ జేసియు, నిట్లు నిరంతరంబును ఆనందరామాయణానందసాగరమగ్నులయిరి. ఇట్లు లోకంబునసంఖ్యాతంబుగా ప్రజలు యానందరామాసక్తులై యుండునపుడు, ఎవనికి ధనముగల్గె? ఎవనికి సంపదవచ్చె? ఎవఁడు రాజ్యము నేలె? ఎవఁడు గృహములనందె? ఎవఁడు గ్రామాధికారియయ్యె? ఎవనికి మంచి కృషిదొరకె? ఎవనికి మంచివృత్తిదొరకె? సుఖజీవన మెవ్వనికయ్యె? స్వర్గమున కెవ్వఁడరిగె? పాతాళమున కెవ్వఁడరిగె? ఏయే లోకంబుల కెవరెవరరిగి రనునది దెలియక పోయెను. వరుసగా కొందఱు ఇంద్రాద్యష్ట దిక్పాలకలోకంబుల కరిగిరి. సూర్యచంద్రలోకంబులకుఁ జనిరి సత్యవైకుంఠ కైలాసలోకంబులకుఁ గూడఁ బోవుచుండిరి. ఇట్లు వారువారు జేసికొనిన పుణ్యానుగుణంబుగ సద్గతుల నొందుచుండిరి. లోకమున నెచ్చటను సేవకుఁడు దొరకడయ్యె. శ్రీరాముని సైన్యములోనుండు వారలుఁగూడ కొందఱు ప్రభునాజ్ఞనొందియు, కొందఱు దమంతట సెలవుఁగైకొనియు సర్వసైన్యంబులుగూడ నిళ్లకు పోయినవి. యెచ్చటను నొక్కఁడయినను ద్వారపాలకుఁడు గానఁబడఁడయ్యె. ఇట్లుండ నొకప్పుడు సామంతరాజులు శ్రీరామదర్శనలాలసులై సైన్యంబులఁ బిలిపింపగా నెచ్చట నున్నవి? ఒకడైనను లేడు, అంతనందఱును యెుక్కఁడోయని విస్మయచిత్తులయి శ్రీరామదర్శనమునకుఁ బత్నీపుత్రులతోఁడ నేగుదెంచిరి. శ్రీరాముఁడు వారిని బిలుపింప లక్ష్మణునితో సైన్యంబు లేవియన నతఁడు శూన్యంబులుగ నున్నవనెను. అందుకు రాముఁ డచ్చెరువొంది బంధుమిత్రుల నంపి వారిని రప్పించెను, వారును వచ్చి శ్రీరామునికి నమస్కరించి సభలో సుఖాసీనులయిరి. అప్పుడా రాజులు దమ సమాచారము విన్నవింపగా శ్రీరాముఁడు వారికి నిజసేనల వృత్తాంతము నెఱింగించి చిఱునగవునవ్వుచు, వశిష్ఠునిఁ బిలిపించి స్వామీ? ఈసేనల వృత్తాంతము చిత్రముగనున్నది? ఎచ్చటి కరిగెను? ఏమాయెను? నాకుఁ దెలుపవలయునని ప్రార్థింపగా నందుకు నానశిష్ఠుండు నగుచు. ఓ శ్రీరామచంద్రా! నీవు సర్వజ్ఞుఁడవు, తెలియదా? చెప్పెదను వినుము వాల్మీకి ముని నీదివ్యచరితంబును శతకోటి ప్రవిస్తరంబుగా నభివర్ణించెఁగదా? అందు తొమ్మికాండలుఁ గలిగినదియు పావనంబైనదియు నగు యానందరామాయణ పఠన శ్రవణాదులచే సర్వసైనికులుఁ గృతార్థులగు చుందురు. కొందఱు నీ పరమపదము నొందిరి. కొందఱు

పుణ్యలోకంబులఁ జేరిరి. సైనికులు శేరైరి. నవకాండాత్మకంబగు యానంద రామాయణంబును బఠించి హీనవర్ణమువారగు దూతలుఁగూడ ముక్తులగుచుందురు. శ్రీమదానంద రామాయణమునందలి సారకాండశ్రవణముచే సంసారభయ నాశనంబును, యాత్రాకాండంబుచే సమస్తతీర్థయాత్రా ఫలలాభంబును, యాగకాండముచే సర్వయజ్ఞఫలావాప్తియును, విలాసకాండముచే నప్సరస్త్రీవిలాస లాభంబును, జన్మకాండముచేఁ బుత్రాదిలాభంబును, వివాహకాండశ్రవణంబున మనోహరకాంతారత్నలాభంబును, రాజ్యకాండముచే బ్రభుత్వంబును, మనోహర కాండముచే సర్వమనోరథసిద్ధియును, పూర్ణకాండముచే పూర్ణంబగు నీపదంబును గల్గుచున్నది. ఇట్టి నీ దివ్యచరితంబగు యానందరామాయణమును విని యందఱు సచ్చిదానందాత్మకంబగు నీ రూపమునందు లీనులై యున్నారు. ఈవృత్తాంతమును నీ వడుగుటచే నేఁ జెప్పితిని. ఇఁకమీఁద నేమి చేయఁదగునో చేయుము. అని శ్రీరామచంద్రునితో వశిష్ఠుఁడు చెప్పెను. అప్పటికి నానాదేశగతులగు నరు లందఱును వివిధంబులగు దేవతలయొక్క పుణ్యలోకంబులకు వెడలిరి. యముని పట్టనంబు పాడువడియె. అంత నంతకుఁడు చింతించి సత్యలోకమున కరిగి బ్రహ్మతో మొరవెట్టెను. అతం డంతకుని వెంటఁగొని కైలాసమునకేగి యా పరమశివునికి నన్ని వృత్తాంతములఁ దెలిపిన, అంత నా పరమేశుఁడు పార్వతి తోడను పరివారముతోఁడను వృషభారూఢుఁడై వెడలి శ్రీరామునిసభ కేతెంచెను.

* శ్రీరాముని సన్నిధికి శివాదులు వచ్చుటచే.
యానందరామాయణమహిమంబపారంబగుట *

శ్రీరాముఁడు నప్పరమేశ్వరుని రాక నెఱింగి గద్దియనుండి డిగ్గి యెదుర్కొని తీసికొనివచ్చి సింహాసనంబునఁ గూర్చుండఁబెట్టి సపర్యలొనర్చి యట్లే బ్రహ్మాది దేవతల సత్కరించెను. అప్పుడు చతుర్ముఖుఁడు రామునితో రాజీవాక్షుం డగు రామచంద్రస్వామీ! ఈ యముఁడు పనిలేక తడఁబడుచున్నాఁడు. అందఱు నానందరామాయణ పఠనాదులచే విమానంబులెక్కి పుణ్యలోకంబుల కరుగుట చేత నాకాశమున నవకాశము లేదయ్యె. నెల్లరు పునరావృత్తి రహిత శాశ్వతమగు పరమపదము నొందుచుండుటచే పుడమి శూన్యంబయ్యె. ఏమి చేయనగు నని యడిగెను. అందుకు నవ్వి శ్రీరాముఁడు శత్రుఘ్నునంపి వాల్మీకిమహామునిని బిలిపించి, మునీంద్రా! ఈ సమాచారమున కేమి సెలవొసంగెదవన నందు కమ్ముని మహాప్రభూ! పుడమిని నా కవిత్వమునకు నాశము లేనట్లును, నీమనంబునఁ దోచినట్లును జేయఁదగు. నిగ్రహానుగ్రహంబుల కీవె సర్వశక్తుండవు అని వాల్మీకి చెప్ప నట్లేయని శ్రీరామచంద్రస్వామి ఏడుజన్మంబులలో నెవ్వఁడు నన్నారాధించిన పుణ్యము నార్జించిపెట్టునో యాతనికొక్కనికే యానందరామా

యణ చరిత్రమునందు అభిరుచి గలుఁగునుఁగాక. తక్కినవారికొకప్పుడును గలుఁగ నేరదు. అని వరమిచ్చెను. అంత నందరానందించి యానందరామునికి మ్రొక్కి తదాజ్ఞనొంది వారివారిలోకంబుల కరిగిరి. కావున, ఓయి విష్ణుదాసా! శతకోటి ప్రవిస్తర రామచరితంబున నియ్యానందరామాయణంబు యత్యంతానందప్రదం బని శ్రీసాంబమూర్తి లోకము ననుగ్రహించెను. కలిద్వాపరయుగంబులలో నెవ్వరు నెఱుంగరు. సప్తజన్మార్జిత పుణ్యసంపాదనలేక నెవ్వనికిని యీ యానంద రామాయణమునందభిరుచి గలుఁగ నేరదు ఈ యానందరామాయణపఠనాకులు గలిఁగినచోట మేఘములు వర్షించుచుండురు. పూర్వము శ్రీరాముని వాక్యము వలనపుడమియందు నిప్పుడు సప్తజన్మార్జిత పుణ్యముగలిగి వేయింటికొకఁ డానందరామభక్తుండై దీనిఁ బఠించును.

ఇట్లని యానంద రామాయణాంతర్గత రాజ్యకాండమున
దిరువదిమూఁడవ సర్గ సంపూర్ణము.

---

* శ్రీరాముఁడు యమదూతలను బఱమొత్తి సుమంత్రుని విడిపించుట *

ఒకప్పుడు సభాసీనుండై యుండెడు శ్రీరాముని సన్నిధానంబునకు సేవకుఁడు వచ్చి మ్రొక్కి రవివంశభూషణుండగు రాజరాజగు యో శ్రీరామచంద్రా? వృద్ధుండును నీమంత్రియునైన సుమంత్రుఁడు స్వర్గమున కేఁగెను వానిపత్నులు సహగమనంబునకై సీయనుజ్ఞ నడుగుచున్నారు అని విన్నవించెను. అంతనా రామభద్రుఁడు చింతాక్రాంతుండై వెంటనే సుమంత్రుని యింటికి వెడలి వానిజన్మపత్రమునుఁ దెప్పించి అందులో నిప్పటికి ౯౯౯౯ సంవత్సరములు ౧౧ నెలలు ౨౧ దినములు గడచినవి పదివేలకు తొమ్మిది దినములు కొఱవగానున్నవని దెలిసి, పిదప వశిష్ఠమహర్షితో గురూత్తమా? కృతయుగమున ౧౦౦౦౦౦ సంవత్సరంబులు. త్రేతాయుగంబున ౧౦౦౦౦ సంవత్సరములు, ద్వాపరంబున ౧౦౦౦ సంవత్సరములు, కలియుగమున ౧౦౦ సంవత్సరములు ఆయుః పరిమితియని యెఱింగియుండ నారాజ్యమున నది యసత్యమయ్యె, యముఁడు నన్నులక్ష్యపెట్టక నింకనాయుష్యము తొమ్మిది దినంబులుండినను నేడేసుమంత్రునికి మరణమునిచ్చెను గావున నాయమునిఁ బట్టిదెచ్చెదను సుమంత్రునిఁ బ్రతికించెదను. చూడుము నాపరాక్రమమును అని చెప్పి వెంటనే కోదండపాణియై గరుడవాహనారూఢుండై యమునిసంయమినీపురంబునకు వెడలి దారిలో సుమంత్రుని లింగదేహమునుబంధించి కొనిపోవుచుండు యమదూతలను బాణంబులచే హతమొనర్చెను సుమంత్రుని విడిపించెను అప్పుడు యమదూతలు శ్రీరామునితో స్వామీ? నీకు మే మేమపరాధ మొనరించితిమి మమ్మునేల దండించితివి అనియడిగిరి అందుకు శ్రీరాముఁడు ఓరిదూతలారా? మీనికి ఆయుష్య

మింకను తొమ్మిదిదినములుండగా మీరేలవీనిఁ బట్టితెచ్చితిరి ? తొమ్మిది రోజులు గడచినవెనుక నేనిట్లడ్డగించనుగదా ? యని యూరడించఁగా వారుస్వామీ రఘునాథా ! ఈసుమంత్రునియొక్క జన్మము మిక్కిలి యపూర్వమైనది ఇతఁడు పుట్టినపుడు మాతృయోనినుండి చేతులుతలవెలువడి పిదప పదియవరోజు నమాతృభాగ్యవశమున తక్కినయంగంబులు వెలువడి జన్మించెను అప్పుడు విద్వాంసులు మంచిమంత్రములచే రక్షించినందున నితనికి సుమంత్రుడనిపేరు గలిగినది. కావున వీనిజన్మమున శీర్షోదయమాదిగ పదివేలాయుష్యము ముగిసినది. ఇట్టి సందిగ్ధ జన్మమున మాతప్పేమి ? వ్యర్థముగా శిక్షించితివని మందలించిరి ” అందుకు రాముఁడు మీరుజెప్పిన సమగ్రజన్మదినమే ఇతఁడుపుట్టిన దినము అదిమొదలుకొనియే ఆయుష్యమును గణింపవలయును. జ్యోతిశ్శాస్త్రిజ్ఞులునట్లే చెప్పెదరు సంపూర్ణజన్మదినమే ఉత్సాహదినంబు, కావున నింకతొమ్మిది దినములాయుష్యమున్నది గనుక మీరు వెళ్లి మరల పదియవనాఁడు వచ్చి తీసికొని పొండు. అప్పుడు నేనువచ్చి మిమ్మునిషేధించను అనియాజ్ఞాపింపగా నంత వారు ఒడలువిరిగి కన్నీరుమున్నీరుగాఁ బాఅనూరకె యంతకుని యంతికంబున కరిగిరి.

* చచ్చిబ్రతికిన సుమంత్రుఁడు దానధర్మంబు లాచరించుట. *

పిదప శ్రీరామచంద్రుండు సుమంత్రునితోఁడ పౌరనారీ నీరాజనంబులఁ గారవం బందుచు పౌరుల యుత్సవంబులతోఁడవచ్చి సుమంత్రునియింటి కేతెంచెను. అచ్చటస్థూలదేహప్రవిష్టుఁడైన సుమంత్రుఁడు సంతోషసాగర నిమగ్నులైన నిజపరివారములతోఁడ శ్రీరామస్వామికిం బ్రణమిల్లి పూజించెను, సత్కృతుఁడైన శ్రీరాముఁడు నిజమందిరంబునకరిగెను. అచ్చట వారందఱు యానందిత హృదయారవిందులైరి, సుమంత్రుండు నిజాయుఃపరిమితి తొమ్మిదిదినంబులనుకొని ప్రతిదినంబును శ్రీరామాజ్ఞను సారముగా పుణ్యలోక సంపాదకంబులైన దానాదికము లాచరించుచుండె.

దూతలమొరవిని యముఁడయోధ్యపై దండెత్తుట

అచ్చట యమదూతలు యేడ్చుచు యమునిసాన్నిధ్యమున తలగుడ్డలు క్రిందఁబారవైచి యిదియేమిపాడుపని ? నీయధికారమధమంబయ్యె తొమ్మిది దినము లాయువున్నదని శ్రీరాముఁడు మమ్మునందఱనొక్కుమ్మడి నురుముగావించెను సుమంత్రునిగొంపోయెను, యిదిచూచినీకు సిగ్గులేదా? మేము బ్రతుకనేరము కుయ్యోమొఱ్ఱోయనిరి, యముఁడు వీరిమొఱనువిని మండిపడి, మీరూగడిల్లుఁడు ఇదిగో నేనురాముని బంధించి శిక్షించెదను సైన్యంబులు సిద్ధముగుగాక, ఇంద్రునిఁగొంచెము సాహాయ్యము గోరెదనని సమాధానపరచి వారిని బంపి, తాను ఇంద్రుని సమ్ముఖమునకుఁజని యాతనికీవృత్తాంత మెఱిఁగించిన

నందుకు నింద్రుండు. ఓరీ వెఱ్ఱివాఁడా? ఏమి భ్రాంతుడవైతివా? విష్ణుమూర్తి తోఁడ నాయుద్ధము జేయనెంచెదవు? లెస్సగానున్నది శ్రీరాముని నీవేమిచేయ గలవు చక్కఁగా నింటికి పొమ్ము పొమ్ము, యాతనికి వెఱచిగదా నేను కల్ప వృక్షంబుల నర్పించితినని బుద్ధిఁజెప్పెను. అంత నూరకుండక నంతకుండు నాకు యుద్ధసహాయులుగా రండని అగ్ని మొదలగు దిక్పాలకులను నవగ్రహపతులను ధ్రువుని బ్రహ్మను చివరకు సప్తద్వీపగతమహారాజులనందఱినిఁ బ్రార్థించెను, అందఱు నింద్రునివలె శ్రీరాముని జోలికిఁబోవలదని యితని పలుకు నాద రింపక పోయిరి, పిదప యముఁడు అత్యంతక్రోధమునొంది తానే తనసైన్యంబుల తోఁడ మహామహిషారూఢుఁడై వెడలి, నవప్రాకారంబులచేతను నవద్వారం బులచేతను నవరత్నకవాటంబులచేతను భాసిలుశతఘ్న్యాది యంత్రంబులు గల్గి యభేద్యంబై సరయూ సంవృతంబై యొప్పుచుండెడు కోటి సూర్య ప్రకాశమానంబగు నయోధ్యా పట్టణంబును ముట్టడించెను.

శ్రీరామాజ్ఞచే లవుఁడు రణమున యమునిఁ బరుగెత్తునట్లొనర్చుట

అంత శ్రీరామభద్రుఁడు యముఁడయోధ్య నాక్రమించుట నెఱింగి యమునితో రణక్రీడ నాచరించుటకై లవుని నాజ్ఞాపించెను. అంత నతఁ డట్లేయని రథారూఢుఁడై రణదుందుభులు మ్రోగుచుండ నూరికి వెలుపల వచ్చి యమునితో ఘోరయుద్ధమున కారంభించె. లవుని యమ్ముల దెబ్బల కోర్వఁజాలక యముని సైనికులు నేలఁ గూలిరి. ఇట్లు సైనికులందఱు నాశంబయ్యిరని యముఁడు కోపా టోపమునొంది తుముల యుద్ధమున కారంభించి లవుని దెబ్బలచే మఱికొంత కోపము బెంపొంద తీక్ష్ణ నారాచంబులఁ బ్రయోగించి లవుని సారథినిఁ జంపి రథమును మకుటమును ధనువును బలంబులను నిర్మూలము గావించె. అందుచే లవుఁడు ఆక్రోశావేశమునొంది మఱియొక రథము నెక్కి యమునితోఁడ దారుణ రణము నాచరించుచుండె అప్పుడాకసమున దేవతలీ కౌతుకమును జూడఁగోరి విమానంబుల నెక్కి నొక్కుమ్మడిఁ జూచుచుండిరి. లవుఁడు యముని మహిమం బును మూర్ఛనొందించి తీక్ష్ణబాణంబులచే నేలం గూలఁజేయు నతఁడా దెబ్బలకోర్వఁ జాలక యమదండమునే ప్రయోగించెను. అంత లవుఁడు అనివార్యంబగు యమ దండము వచ్చుట నవలోకించి జంకుకళంకులేక బ్రహ్మాస్త్రమును బ్రయోగింప నా బ్రహ్మాస్త్రము యమదండమును మ్రింగి యముని వెంబడింపఁగా నాయముఁడు వికలుఁడై పలాయనవ్రతమతివేగముగ నారంభించెను.

సూర్యుఁడు లవుని వేడి బ్రహ్మాస్త్రముం ద్రిప్పించి సమాధాన పరచుట

అక్కాలంబున సూర్యుఁడు త్వరపడి రెండుమూర్తులుగ నవతరించి యొక టిని దనలోకమున నిలిపి, మఱియొకమూర్తితో రథము నెక్కి త్వరగా లవుని సాన్నిధ్యంబునకు వచ్చి నాయనా! యముని రక్షింపుము. నీవు ప్రయోగించిన

బ్రహ్మాస్త్రము నుపసంహారముఁ జేయుము. నీవే సమస్తాస్త్రముల నెఱింగిన ధీరుండవు. నీవు నాయంశమున జన్మించినవాఁడవు. ఈ యముఁడు నాపుత్రుఁడు, నీకగ్రజుం డగువాని నెట్లు జంపనెంచెదవు. ఒకఁడు మూర్ఖుఁడైన నుఱియొకఁడు సమాహితుఁడు గాక నందఱును మూర్ఖులు కాఁదగునా? ఉత్తములు రణమున శత్రువునైనను, బరుగెత్తినవానిని రక్షించెదరు. అని మధురవచనంబులచే బ్రార్థించెను. అంత లవుఁడు నట్లేయని బ్రహ్మాస్త్రము నుపసంహరించెను. పిదప శ్రీసూర్యదేవుఁడు యముని వెంటదీసికొని శ్రీరామసన్నిధికి వచ్చుతఱి యాకసమున వేల్పులు కుసుమంబుల వర్షించిరి. వాద్యములు మ్రోగె. గోపురాట్టాల సౌధంబుల నిల్చి యందఱును వీరిని మాటిమాటికి విలోకించుచుండిరి. కిన్నరాదులెన్ని యోగతులం బాడిరి. లవునిమీద పురస్త్రీలు పూలవానఁ గురిపించిరి. ఇట్లు లవుఁడు విజయియై పౌరాంగనల నీరాజనంబుల నందుచువచ్చి తండ్రియగు శ్రీరాముని చరణారవిందంబుల వ్రాలి ప్రణమిల్లెను. అప్పుడు శ్రీరాముఁడు సూర్యుని రాక నెఱింగి గద్దియనుండి డిగ్గనెదురుగా నేగి రవికి నమస్కరించి చేలూత నొసఁగి సింహాసనంబున గూరుచుండఁబెట్టి షోడశోపచారంబుల నర్చించి ప్రార్థించెను.

* శ్రీరాముఁడు సూర్యుని సంమానించి, యముని మన్నించుట *

నీవు మా కులపతివి. లవుఁడు సేసిన యపరాధమును క్షమింపుము. అని వేఁడ నందుకు సూర్యుఁడు రఘునాథా! నీదగు నాభికమలమునుండి చతుర్ముఖబ్రహ్మ వెలువడెను. మరీచ్యాది నవబ్రహ్మ లతనినుండి జనించిరి. ఆ మరీచికి పుత్రుఁడు కశ్యపుఁడు, అతనికి పుత్రుఁడ నేను. నీ మనుమని మనుమఁడుగా నున్నాఁడను. ఈ యముఁడు నా పుత్రుఁడు నీతనిచేఁ జేయఁబడిన యపరాధమును మన్నించి రక్షింపుము. అని ప్రార్థించి నిజాసనమునఁ గూర్చుండెను. మఱియు యమునిచే శ్రీరామునికి నమస్కారమును జేయించెను. అంత నందఱు దేవతలు వచ్చి శ్రీరామునకుఁ బ్రణమిల్లిరి. శ్రీరాముఁడును వారినందఱను దగినట్లు సత్కారములచే గౌరవించెను. అప్పు డింద్రుండు, శ్రీరాము నాజ్ఞచే నమృతవర్షముఁ గురిపించెను. యా సుధాధారలచే రణరంగహతులగు సైనికులు వాహనంబులతోఁడ నందఱును మరల జీవించిరి. అంత నా శ్రీరాముఁడు యమునితో నేను రాజ్యమేలుచుండు నంతవఱకు నందఱికి పూర్ణాయుష్యము గల్గియుండవలెను. ఎవ్వనికైనను నీవు ఆయుష్యము పూర్తియయినపిమ్మటనే గ్రహింపఁదగును. అని యాజ్ఞాపించెను.

* సుమంత్రుఁడు వైకుంఠమునకుఁ బోవుట *

పిదప మఱియవరోజు రాగానే సుమంత్రుఁడు పత్నులతోఁడ స్నానమ్ముఁ జేసి శ్రీరామునికి నమస్కరించి నారాముని సన్నిధియందు ప్రాణముల విడిచెను. వాని పత్నులుగూడ పతిపరాయణలై ప్రాణముల విడిచిరి. అందఱు పొగడు

చుండఁగా దేవకాంతలచే సమ్మానింపఁబడి యా సుమంత్రుఁడు నిజాంగనలతోఁడ దివ్యదేహములధరించి విమానము నెక్కి విరాజిల్లెను. ఆహా! శ్రీరామసాన్నిధ్యమున మృతినొందుటచే సమస్తదేవబృందములచేతను పరివృతుఁడై బరగె. అంత సూర్యదేవుఁడు యమునితోఁడ నిజలోకమున కరిగెను. సుమంత్రుఁడు నిజకాంతలతోఁడ వైకుంఠమున కరిగెను. దేవతలు నాకమునకుఁ జనిరి. శ్రీరాముఁడు సుమంతునిచే వానితండ్రి యగు సుమంత్రునికి నుత్తరక్రియలఁ జేయించి వానినే సుమంత్రుని స్థానమున నునిచెను.

శ్రీరాముఁడు భేరీవేయించి లోకులకు ధర్మంబుల నెఱింగించుట

పిమ్మట శ్రీరాముఁడు లక్ష్మణునితోఁడ భూమియందు ఏనుఁగమీఁద నొక పతాకధ్వజశోభితంబగు భేరిని స్థాపించి సాటింపఁజేయుమన లక్ష్మణుఁడు వల్లెయని దూతలకాజ్ఞాపించెను. పిదప దూతలు ఏనుఁగులనెక్కి సప్తద్వీపములయందు భేరీలను వాయించుకొనుచు శ్రీరాముని యుత్తరువును ఇట్లు సాటింపఁదొడంగిరి, ఓ జనులారా! ఎచ్చటనేని జనుఁడు అల్పాయుష్యంబున మృతుండయ్యెనేని వానిని శ్రీరాముని సాన్నిధ్యమునకు దీసికొనిరావలయు. ప్రతిగ్రామంబునను ప్రతిగృహంబునను వేరువేరుగా పురాణగాథలఁదెలుపువారల నుంచుకొనవలయు. నిత్యనైమిత్తికకర్మల నెప్పుడుగాని వదలందగదు. బ్రాహ్మణుల నవమానింపఁదగదు. ఎవ్వనితోనైనను విరోధము సేయరాదు. దేవతలకును పితృలకును హవ్యకవ్యములనెల్లపుడొసంగుచుండవలయు, దోంగల దండింపనగు, దురాచారములను వాని నాచరించువారినిఁగూడఁ జక్కగ శిక్షింపవలయు, తల్లిదండ్రులకు నెల్లపు డభివాదనంబు సేయ దగు, నిరంతరము వేదంబులఁ బూజించవలయు, ధర్మంబుల సంతత మాచరించవలయు, చైత్రస్నానము, అయోధ్యయందుగాని, ఇతర రామతీర్థంబులయందుగాని జేయుచుండవలయు ప్రతి రామతీర్థంబులయందును దానాదికముల నాచరించవలయు, ద్వారకయందెల్లపుడును వైశాఖస్నానమాచరించవలయు, పంచనదము గల కాశీక్షేత్రమందు కార్తికస్నానంబును, ప్రతి సంవత్సరము ప్రయాగయందు మాఘస్నానంబును, చాతుర్మాస్యాది వ్రతంబులును నాచరించవలయు ప్రతి గృహమునందునుతులసిని బూజించవలయును. అతిథి నొకప్పుడును నిరాకరింపఁగూడదు. యాచించిన బ్రాహ్మణునియాసను వ్యర్థముసేయఁజనదు, కోరినయెడల సర్వస్వమునైనను బ్రాహ్మణుల కీయఁదగు, గృహమందుగాని గ్రామమందుగాని కలహమెచ్చటను ఎప్పుడునుఁ గలుగకూడదు, గురువును బూజించుచుండవలయు, గురువాక్యముల వినుచుండవలయు, ఎల్లపుడును ప్రాతస్స్నానముఁ జేయుచుండవలయు, అగ్నులయందు యథావిధిగ హోమముఁ జేయుచుండవలయు, శంకరుని మంత్రంబును జపించుచుండవలయు, ఎల్లపుడమ్మహేశ్వరుని ధ్యానించుచుండవలయు, ఏకాంతముగ తపమాచరించవలయు, ఇరు

పురిలో నధ్యయనము సేయందగు, మువ్వురుచేరిపాడుచుండవలయు, పుణ్యకాలంబులయందు తీర్థంబులందప్ప నింటియందు స్నానమాడవలదు. మార్గము నడచునపుడు నలువురుచేరి నడచుచుండవలెను, పరదారలకోరుటగాని కంటితోనైనం జూచుటగాని యెప్పుడైనం జేయరాదు. ఇతరులసంపద నొకప్పుడును గోరగూడదు. వైద్యులతోడను, జ్యోతిష్కులతోడను ద్వేషింపరాదు, వారల ప్రతిపురమునందునుబోషించుచుండవలయును, వేశ్యాగమనముం జేయరాదు, దాసీగమనము జేయఁజనదు. సతతము నిత్యకర్మల యథాకాలముల నాచరించుచుండవలయును, గురుజనంబుల నవమానింపరాదు, పరులను నిందింపరాదు. తోటలలో జలాశయముల నిర్మింపవలయు, మార్గములయందు వృక్షముల నిరుప్రక్కలం బెంపవలయు. ధర్మసత్రంబులచ్చటచ్చట నిర్మింపవలయు, వస్త్రవిహీనయగు మగువంజూడం జెల్లదు, ప్రతిగ్రామంబునందును ప్రతివనములయందును ప్రతిగృహములయందును ధర్మముగ నన్నసత్రంబుల నెలకొలుపవలయు, ప్రతివనములయందును, ప్రతిమార్గములయందును రక్షకభటుల నిలుపవలయు, రాత్రులయందు బయనంబు సేయు పథికులకెంత మాత్రము భయంబుగలుగకూడదు, వైశ్యులవలనం దప్ప ఇతరులవలన పన్నుం గైకొనంగూడదు, పాదములకు పాదుకలం దొడిగికొని దివ్యతీర్థము, గురువు, ఆవులదొడ్డి, తులసితోట, హోమముసేయు గృహములు, మొదలగు పూజ్యస్థలంబుల కేగఁజనదు, వేదాదిగ్రంథ పారాయణంబులను వాని ఫలంబులం గోరక నిష్కామంబుగా జేయించంజను, యతులను ప్రతివారును నమస్కరించవలయు, ప్రతిగృహమునందును వారికి భిక్షసేయందగు. యతుల కెల్లపుడు కమండలువు, కౌపీనము, పాదుకలు, వంశదండములు, నీయందగు, సుభాషణములవారిని సంతోషపెట్టుచుండవలయు, కులస్త్రీలనెప్పుడును దుఃఖపెట్టరాదు, పగలునిద్రించరాదు. హరివాసరములయందు భుజింపఁగూడదు, కృష్ణపక్ష చతుర్దశనాడు పగలుపవసించి రాత్రియందు విష్ణ్వగ్రమున శివపూజను వివిధ మహోత్సవంబులచేం జేయందగు, కృష్ణాష్టమినాం డుపవాసమొనరించిదేవాలయములందు భక్తితోడ బలిదానాదికములను వివిధపక్వాన్నంబులను నివేదింపవలయు, గోవులను, గుఱ్ఱములను, ఏనుఁగులను. యాదరముతోడ విప్రులకు దాన మాచరించవలయు, ప్రతిగృహమునందును గోవులను బ్రాహ్మణులనుం బూజింపవలయు, వసంతకాలమునందు చందనము, గొడుగులు, విసనకఱ్ఱలు, పానకము, జలకుంభము, పాదరక్షలు, పెరుగు, మజ్జిగ, నిమ్మకాయలు, మొదలగు వస్తువుల విప్రులకు దానంబొనరింపవలయు, కార్తికమున దీపదానము, రాత్రిజాగరణము సేయవలయు, తులసీసేవయును, ధాత్రీప్రదక్షిణంబును జేసి భోజనముసేయందగు, విష్ణుమందిరంబులనెల్లపుడు గీతనృత్యాదులం జేయించవలయును, శివాలయంబుల కార్తిక పూర్ణిమయందు నేతితోదడిపిన వత్తులచే

జ్వాలాతోరణస్వాహాహోత్సవములఁ జరుపవలయు, మాఘమాసంబున చిత్రకంబళ్లు కత్రులు దానము సేయవలయు, చైత్రమాసంబున తాంబూలములను అరటిపండ్లను దానము సేయందగు, దోసపండ్లు, చందనము, పెరుగు, మజ్జిగ, మొదలగు శ్రమదీర్పు వస్తువులు, అర్ఘ్యము, కస్తూరీ, జాజికాయలు, ఏలకులు, పచ్చకర్పూరము, మొదలగునవి వైశాఖమాసంబున దానము సేయందగు. కాలిగోళ్లు నంటరాదు, పాదముమీఁద పాదముంచి పండరాదు, రెండుచేతుల చేతను తలగోకికొనరాదు, బ్రాహ్మణులచేఁ దప్ప నితరులచే పన్నుఁగైకొనవలయు. రాజ్యంబును దండనంబును నొకప్పుడును యుపేక్షించరాదు. ఆత్మీయులను, బోషింపఁదగిన వారలను బూజింపఁదగినవారలను, బాలించుచుండవలయును, మిత్రులను సంతోషపెట్టుచుండవలయు, స్నేహితులకు కోపము వచ్చునట్లొనర్పఁగూడదు, ఎప్పుడును శత్రువులయందు నమ్మికఁ జేయరాదు, దానములు సేయుతఱి లోభితనము సేయరాదు, దరిద్రసూచకమగు జూదమెప్పుడును నాడరాదు మద్యపానము సేయువారిమాటల వినఁగూడదు, తీర్థయాత్రల సేయవలయు, కృచ్ఛ్రాదికర్మల నాచరింపవలయు, శ్రావణమాసంబున కోటిలింగార్చనయు, నిత్యలింగార్చనయు నాచరింపవలయు, లఘురుద్ర, మహారుద్ర, అతిరుద్రాది విధివిధానంబులచేఁ బరమేశ్వరునారాధింపవలయు, గ్రంథములను దానము సేయవలయు, దేవాలయములయందు గాని గృహములయందుగాని భగవంతుని సంకీర్తన మొనర్పవలయు, సాధువులను బూజించవలయు, సూర్యునర్చించవలయు, ప్రతిగ్రామమునందును యాంజనేయుని ప్రతిమను జేయించి స్థాపించి, సిందూరముచేతను దైలముచేతను దడపి పూజించవలయు, చవితినాఁడు గణపతిని బూజించవలయు, నెల్లపుడు ఆత్మతత్వ విచారమొనరించుచుండవలయు, స్తోత్రపాఠంబులఁ జదువవలయు, భగవద్గీతను వినవలయు వేదపఠనముఁ జేయించవలయు గణపతిని మోదకాది యుపహారంబులచే నర్చించవలయు, ఎల్లపుడు శాంతిసూక్తములు, పుణ్యంబగు పురుషసూక్తము, శ్రీసూక్తము, మొదలగునవి పఠించుచుండవలయు, ఎప్పుడును ధర్మమునాచరించుచు పుణ్యమునార్జించు కొనవలయు, దుష్టబుద్ధిని విడిచి పాపమును వర్జించవలయు, ఆయుష్యము చపలమైనదనియు, యముడు క్రూరుడు, నరకమునఁ గలుగుబాధ ఘోరమైనదని హృదయమునందు దెలిసికొనవలయు, బాల్యముగతించె, తారుణ్యము మాయమయ్యె ముసలితనము ముగియుచువచ్చె, యమశిశువు స్మరించుకొనుడు, తాత, ముత్తాత, తల్లి, తండ్రి, గతించిరి తానుగూడ నట్లేగదా ? యనుకొనుడు, దంతములూడినవి. నేత్రములు గానరావు. తోలుముడతలు వడుచున్నది, వెంట్రుకలు నెఱసినవి, మృత్యువొకటి ముందునిలచియున్నది. గాన దానధర్మములయెడ నావకాశము సేయుంజనదు. ధనమును పోట్టునుజల్లినట్లు దానము సేయవలయు దానిని రక్షింపవలను. అని శ్రీరామదూతలు; సప్తద్వీపములయందును ద్వీపాం

తరములందును జనులాదటఁ వినునట్లు భేరీమృదంగ స్వనంబుల సాటించిరి అనం
తరమయోధ్యఁజేరి శ్రీరామస్వామికి దమవృత్తముఁ దెలిపిరి. అంత శ్రీరాముఁడు
పరమానంద భరితుండయ్యె, ఇట్లు పుడమియందు రామునిచే నొనర్పఁబడిన చరి
త్రము లనేకములు గలవు వానిని వర్ణించుట కెవరి దరము ఓవిష్ణుదాసా? మనోహ
రంబగు రాజ్యకాండము నిరువదినాలుగు సర్గలుగా వర్ణించి జెప్పితిని. ఇది మిక్కిలి
మంగళప్రదంబు. ఏరాజులు ఈరాజ్యకాండమును భక్తిచేఁ బఠించుచుందురో వారి
కెన్నటికిని రాజ్యభ్రష్టము గలుఁగనేరదు. మిగుల పుణ్యమైనదియు మిక్కిలి మంగళ
దాయకంబగు నీరాజ్యకాండమును పుడమిలో నెవ్వరు వినుచున్నారో వారు
శుభములను బొందుదురు. ఈరాజ్యకాండమును నలువదేడురోజులు దీక్షవహించి
ప్రతిదిన మొక్కొకసర్గ వృద్ధిగాను మరలనొక్కొకసర్గ క్షయముగాను పఠనాను
ష్ఠానముఁ జేయుదురో వారు రాజ్యము నెన్నటికిఁ గోలుపోరు. రాజ్యలాభము
నొందుదురు. రాజ్యకాండ పఠనమువలన యుద్ధమందును వాదమందును జయము
గలుగును. శత్రువులు శరణాగతులగుదురు. రాజ్యముగోలుపోయినవారు మరల
రాజ్యాధికారములు గలిగి సుఖించెదరు. ఆనంద రామాయణము త్తమంబు. అందు
రాజ్యకాండంబు త్తమోత్తమంబు. చిత్రంబు, సుఖప్రదంబు, పవిత్రంబు, నగు దీనిని
యాదరంబున రాజ్యమేలువారుగాని, ఇతర యధికారములందుండువారలుగాని,
సర్వులును భక్తిచే వినుచుండవలయును, వ్రతాదులయందును, వివాహాదిశుభ
కార్యములయందును పఠనీయంబు, పుణ్యకాలములయందు పఠించినవారికి సమస్త
సౌఖ్యములుఁ గలుగును. దీనిం బఠించినను వినినను సమస్త సుఖములనొంది
యంతమందు దివ్యవిమానారూఢులై శాశ్వతమగు వైకుంఠమును బొందెదరు,
ఇయ్యది శ్రీరామచంద్రుని చరిత్రాత్మకంబును పరమ పావనంబును, మంగళ
దాయకంబును విచిత్రకరమైనదియు, మహాత్ములకైన భక్తిశ్రద్ధలచే శ్రోతవ్యంబు
రమణీయంబు.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండము
సంపూర్ణము.

శ్రీ

శ్రీ ర స్తు.

శ్రీపార్వతీ పరమేశ్వర సంవాదరూపంబును
శ్రీమద్వాల్మీకి మహర్షి ప్రణీతంబునయిన

శ్రీమదానందరామాయణము.

మనోహరకాండ - ప్రారంభము.

విష్ణుదాసుఁ డిట్లడిగెను. "ఓగురూత్తమా! నాకు తత్వము నుపదేశించుచున్నావు గావున నడిగెదను. పూర్వము మహాత్ముఁ డగు నారదునిచే వాల్మీకికి వేదవాక్యములచే సంక్షేపరామాయణము నుపదేశింపఁబడె నని జెప్పియుంటివి. శ్లోకరూపంబగుదానిని నాకుపదేశింపుము" అనిన విష్ణుదాసునికి రామదాసుఁ డుపదేశించుచున్నాఁడు. బాగుగ నడిగితివి వినుము! నారదునివలన వేదవాక్యములచే నేచరిత్రమును వాల్మీకి వినెనో? దానినే శతకోటిప్రవిస్తరంబగు తన కవిత్వమునందు మును నూరుశ్లోకములు గలిగినదియును బాపములఁ దొలఁగించు నదియు నగు శ్రీరాముని చరిత్రమును రచించెనని నుడివియుంటి నట్టి మనోహరంబగు రఘురామాయణంబును నీ కిప్పుడుఁ జెప్పుచున్నాఁడను.

* కవిత యను గొమ్మనెక్కి మధురంబగు రామరామ యను మధురాక్షరములఁ గూయుచున్న వాల్మీకి యను కోకిలను నమస్కారము చేయుచున్నాను. కవిత యనువనమున సంచరించు వాల్మీకిముని యనుసింహముయొక్క, రామకథ

యను నాదమును వినిన నెవఁడు పరమునందఁడు? (అందఱును పరమాత్మను బొందుదురని భావము) శ్రీరామచరిత్ర యను నమృతాబ్ధిని సంతతము పానము సేయుచుఁ దృప్తి నందక యుండు పాపరహితుఁడగు నమ్మునికి మ్రొక్కెదను. సముద్రమును ఆవు యడుగును దాటినట్లు లంఘించి దుష్టరక్కసులను దోమలను నలిపినట్లు నాశ మొనర్చినట్టియు శ్రీరామాయణమను మహామాలయందు నాయకరత్నముఁ బోలు యాంజనేయుని నమస్కరించుచున్నాఁడను. శూరుఁడును సీతాదేవి దుఃఖమును దొలఁగించినవాఁడును. కోఁతులలో మేటియు, అక్షునిఁ జంపినవాఁడును. లంకకుఁ జేటొనర్చినవాఁడును, అంజనాదేవి కొడుకగు హనుమంతునకు నమస్కారము, సముద్రసలిలమును విలాసముగ దాటి సీతా దుఃఖాగ్నిచేతనే లంకను గాల్చిన యాంజనేయస్వామికి యంజలిబద్ధుఁడనై మ్రొక్కుచున్నాఁడను. మనస్సుయొక్కయు వాయువుయొక్కయు వేగము గలిగినట్టియు, జితేంద్రియుఁడగునట్టియు బుద్ధిమంతులలో శ్రేష్ఠతముఁడును. కోఁతుల బృందమునకుఁ బ్రధానుఁడును, శ్రీరాముని దూతయునగు, యాంజనేయుని శిరముచేఁ బ్రణమిల్లుచున్నాఁడను. శుభములొసఁగి యానందింపఁ జేయువాఁడును, చల్లని కాంతి గలవాఁడును, ప్రపంచకర్తయు, రఘురాజులలో నుత్తముఁడును, ప్రపంచరక్షకుఁడును ప్రకృతిరూపిణియగు సీతకు భర్తయైన రామునికొఱకు నమస్కారము. పాపములఁ బోగొట్టునట్టియు, ప్రపంచమును ధరించినవాఁడును, పుట్టుక లేనివాఁడును, ప్రపంచమే తనస్వరూపముగాఁ గలిగినవాఁడును హేయగుణ రహితుఁడును, సత్వగుణ స్వరూపుఁడును, అష్టైశ్వర్య సంపన్నుఁడునగు పరమాత్మ వెలయుగాత, ఇట్లు మంగళాచరణం బొనరించి " వాల్మీకి తపోవిశేషముచే పాపరహితుఁడై వేదాంత పరమార్థముఁ దెలిసికొనఁగోరి మహాశ్రోత్రియుఁడును, బ్రహ్మనిష్ఠాగరిష్ఠుఁడునగు నారదుని భక్తితో నిట్లడిగెను, నారదా? ఈభూలోకమున ప్రశస్తములైన గుణములు గలిగినవాఁడును, పరాక్రమము గలవాఁడును. సమస్త ధర్మముల నెఱిఁగినవాఁడును. ఒరులు జేసినమంచిని మఱువనివాఁడును, కులాచారము వదలనివాఁడును, ఎల్లప్రాణులయందును హితమును జేయువాఁడును. ధైర్యముఁ గలవాఁడును, కోపమును జయించినవాఁడును, శ్రేష్ఠమగుకాంతి గలవాఁడును, అసూయ సేనివాఁడును యుద్ధములయందు దేవాసురాదులకు భయమును గలిగించు శౌర్యము గలవాఁడును, నైనవాఁడు, యెవఁడున్నాఁడు? ఈగుణములు గల గొప్పవానిని దెలియవలెనని మిక్కిలి కోరికయున్నది నీవట్టివాని నెఱుఁగఁ గలవు కావుననాకుఁ దెలియజేయుము, అనిన? మూఁడులోకముల యందలి విషయముల నెల్ల నెఱిఁగిననారదుఁడు వాల్మీకియొక్క మాటనాలకించి సంతసించినవాఁడై తానుజెప్పఁబోయెడి వాక్యమును వినుమని యిట్లనియె, ఓవాల్మీకిమహా

మునీ ? నీవడిగిన గుణములు ఎల్లరకు నుండునవియ కావు సాధారణుల యందుం డుట యరుదు. అట్టి గుణములతోఁ గూడిన మహాపురుషుని నిశ్చయించి జెప్పెదను సావధానముగా వినుము, ఇక్ష్వాకువంశమున జనించినవాఁడగు శ్రీరాముఁడు మిక్కిలి ప్రసిద్ధుఁడు మనుష్యుల కందఱికిఁ దెలిసినవాఁడుగదా ? అతని గుణములఁ జెప్పెదవినుము. అతఁడు మనస్సును నిగ్రహించినవాఁడు, లోకముల జయించు శక్తి గలవాఁడు, తనంతఁ బ్రకాశించు శక్తిగలవాఁడు, సర్వలోకములను తనయధీనముఁ జేసికొన్నవాఁడు, ఎల్లవిషయములఁ దెలిసికొనునట్టి తెలివిగలవాఁడు, మర్యాదల నెఱిఁగి వర్తించువాఁడు. మంచివాక్కులు గలవాఁడు, సమస్తైశ్వర్యములు గలవాఁడు, విరోధులను జులకనగా హింసించువాఁడు, మఱియు, నున్నతము లయిన భుజశిరంబులు గలవాఁడు, బలిసిన భుజములు గలవాఁడు, శంఖము వంటి కంఠము గలవాఁడు, ఉన్నతములగు చెక్కిళ్లమీఁది భాగములు గలవాఁడు, విశాలమైన ఱొమ్ముగలవాఁడు గొప్పవిల్లు గలవాఁడు, పైకిఁదెలియని జత్రువులు గలవాఁడు, మంచినొసలుగలవాఁడు, మంచినడకగలవాఁడు, సమానమైన ఎత్తుగలవాఁడు, ప్రశస్తమగు పరాక్రమముగలవాఁడు, పద్మములవలె వెడల్పుగల నేత్రములు గలవాఁడు, ఎల్ల అవయవములందును అందము గలవాఁడు, మంగళకరములగు లక్షణములు గలవాఁడు, ఆశ్రితులను రక్షించువాఁడు, ప్రతిజ్ఞ తప్పనివాఁడు, ప్రాణులకు మేలుసేయుటయందాసక్తుఁడు, ప్రశస్తమగు కీర్తిగలవాఁడు, ఎల్లవిషయముల నెఱిఁగినవాఁడు, ఆశ్రితరక్షణ చింతగలవాఁడు, బ్రహ్మతో సమానుఁడు, సర్వసంపదలుగలవాఁడు, ప్రపంచమును బోషించువాఁడు, శత్రువులను నిరసించువాఁడు, ప్రాణివర్గముల రక్షించువాఁడు, వర్ణాశ్రమ ధర్మములఁ గాపాడువాఁడు, ధర్మములను జక్కగాననుష్ఠించువాఁడు, తనయాశ్రితులను బంధుగులను రక్షించువాఁడు, వేదములు, వేదాంగములు అనువాని రహస్యార్థములను జక్కగా నెఱింగినవాఁడు, సర్వశాస్త్రములయొక్క అర్థమును బాగుగా నెఱిఁగినవాఁడు, కొంచమైనను మఱపులేనివాఁడు, నేర్పుగలిఁగిన బుద్ధివిశేషము గలవాఁడు, సకల జనులకును బ్రీతిని గలిగించువాఁడు, కీడుసేసినవారికి మేలుసేయువాఁడు, ఆపదలు సంభవించినను చలించని మనస్సుగలవాఁడు, ఎల్లపనులయందును మిక్కిలి నేర్పుగలవాఁడు, నదులచేత సముద్రముబోలె సజ్జనులచే నెల్లప్పుడును సేవింపఁబడువాఁడు, ఎల్లకాలములయందును నొకటేరీతిగ నుండువాఁడు, కౌసల్యకు ఆనందమునుగలిగించు కుమారుఁడైనట్టి రాముఁడు, ఎల్లమంచిగుణములతోఁ గూడినవాఁడు, గాంభీర్యమందు సముద్రుఁడు, ధైర్యమున హిమవంతునితో సమానుఁడు, వీర్యమున విష్ణుదేవునితో సమానుఁడు, చంద్రునివలె చూచుటకు ప్రియమైనవాఁడు, కోపమునఁ బ్రళయ కాలాగ్నికి సమానుఁడు, ఓర్పునభూమికి సాటియైనవాఁడు, ఈవియందు కుబేరునితో సమానుఁడు, సత్యమున ధర్మదేవతవలెనుండు

వాఁడు. ఇట్టి మంచిగుణములతోఁ గూడినవాఁడును, సార్థకమైన పరాక్రమము గలవాఁడును, తన నల్వురికొడుకులలో బెద్దవాఁడును, తనయొక్కయు బ్రజలయొక్కయు నాదరమునకుఁ బాత్రుఁడైన రామచంద్రుని, దశరథమహారాజు తన రాజ్యమునందలి జనులకు మేలుసేయందలంచి యువరాజుగాఁ జేయుటకుఁ దలపెట్టెను, తరువాత దశరథుని భార్యలలో నొక్కతెయు రాజునకు మిక్కిలి ప్రియురాలగు కైకేయి, యనురాణి యీరాముని పట్టాభిషేకమునకుగాఁ జేయఁబడు ప్రయత్నములఁ జూచి పూర్వముతాను రాజువలనఁ బొందిన రెండువరములలో నొకదానికి, రాము నడవి కనుపుటను, రెండవదానికి తనకొమరుఁడగు భరతునికిఁ బట్టాభిషేకముఁ జేయుటను గోరెను, దశరథమహారాజు సత్యవాక్య నిరతుడగుట వలన ఇచ్చినవరమును కాదనలేక ధర్మమునకు లోఁబడి కైక గోరినవరము ప్రకారము శ్రీరాముని యడవికిఁ బంపెను. శూరుఁడైనను శ్రీరాముఁడు కైకకుఁ బ్రియమును గలిగించునట్టి తండ్రియొక్క ఆజ్ఞచొప్పున వనమునకుఁ బోయెదనని తన ప్రతిజ్ఞను నెఱవేర్చుకొనువాఁడై యడవికేగెను, అట్లు వనమునకేగుచున్న రామునితోఁ గూడ తమ్ములలో నెల్ల మిక్కిలి ప్రియుఁడును అడఁకువగలవాఁడును, సుమిత్రకొడుకగు లక్ష్మణుఁడను తమ్ముఁడు తానునుంచి సోదరుఁడగుటను వెల్లడించుచు నరణ్యమునకుఁ బోయెను, రామునకుఁ బ్రియయగు ప్రేయసియు, ప్రాణములతో సమానురాలును, ఎల్లప్పుడు ననుకూలవతియు, జగన్మోహనరూపయు, సర్వసౌభాగ్య చిహ్నములతోఁ గూడినదియు, యువతులలో నెల్ల నుత్తమురాలగు దశరథుని కోడలగు సీతాదేవియును చంద్రుని రోహిణివలెనే వనముకేఁగు రాము ననుసరించి వెళ్లెను. వనమునకు వెడలుచున్న రాముని యాపట్టణమునందలి జనులును తండ్రియున్న కొంతదూరము వెంబడించి సాగనంపిరి. ఇట్లు వెడలుచున్న రాముఁడు గంగానదీ ప్రాంతముల శృంగిబేరపురమునందు బోయఱేఁడగు గుహుని మిత్రునిగాఁ జేకొని యాగుహునితోఁడను లక్ష్మణునితోఁడను సీతతోఁడను గూడినవాఁడై రథసారథియగు సుమంత్రుని రథమునిచ్చి వెనుకకుఁ బంపెను, ఆసీతారామ లక్ష్మణులు ఒకవనమునుండి మఱియొక వనమును గడచి యనేక నదులను దాఁటి క్రమముగాఁ జిత్రకూట పర్వతమును జేరినవారై భరద్వాజ మహాముని యొక్క యనుజ్ఞచొప్పున నచట నాకులు తీఁగలు మొదలగు వానితో నొకచక్కని యిల్లుఁగట్టుకొని మహాభోగాపహులైన యాముగ్గురును ఆయడవియందుఁ దిరుగుచు దేవతలో గంధర్వులో యనఁ దగినట్లు వేషములనూని సుఖముగా నుండిరి, రాముఁడు చిత్రకూటమును జేరఁగానే దశరథుఁడు పుత్రశోకముచేఁ బీడింపఁబడి రామునిగూర్చి దుఃఖించుచు ప్రాణములఁ బాసెను, శదరథుఁడు మరణమునుఁ బొందినవెనుక భరతుఁడు గొప్పబలము గలవాఁడైనను వసిష్ఠమహాముని మొదలగు వారలు తన్ను రాజ్యమున నియోగించినను

రామునియందలి గౌరవముచేతఁ దా రాజుగా నొప్పుకొనలేదు, భరతుఁడు రాము
నికిఁ జెందవలసిన రాజ్యమును దా గోరక రామునకే సమర్పింపఁ దలఁచి తనతల్లి
కారణమున వనమున కేగిన రాము ననుగ్రహముఁగలవానిఁగా జేయుటకొరకు
వనమున కేఁగెను, సాధుభావముగల భరతుఁడు వనమున కేగి రామునిఁ గలసికొ
నినవాఁడై రాజ్యముఁ గొనుమని యాతనిఁ బ్రార్థించెను, జ్యేష్ఠుఁడుండగా కని
ష్ఠుఁడు రాజ్యమునకుఁ దగఁడని నీకుఁ దెలియును రాజనీతియందాఱితేరిన నీవు
తగుదువుగాని రాజ్యమునకు నేను తగను, అని, భరతుఁడు రామునితోఁ బలి
కెను రాముఁడు, అందఱకుఁ బ్రీతిఁగలిఁగించు వాఁడైనను గొప్పదాతయైనను,
ఆశ్రితులకు సుముఖుఁడైనను, గొప్పకీర్తి గలవాఁడైనను, గొప్పబలము గల
వాఁడై ఎవరేది వేఁడినను అడిగినవారి కోరికెలనెల్ల దీర్చువాఁడైనను, తండ్రిమా
టను నెరవేర్పవలసిన వాఁడగుటవలన నందాక భరతునికోరిక ప్రకారము రాజ్య
ము నంగీకరించకపోయెను, వదలక వేఁడుచున్న భరతునకు తనకుబదులుగా రా
జ్యాసనమం దునుచుమని తనపాదుక లొసఁగి పలుమాఱుచెప్పి యాయన నింటికి
మరలించెను. ఇట్లు, తన కోరిక నెఱవేఱక నే భరతుఁ డిల్లుజేరి శ్రీరాముని పాదు
కలకు కైంకర్యమును జేయుచు ముందు రాముఁడు రాగలఁడను నమ్మకముచేత నంది
గ్రామముననే రాజ్యమును జేయుచుండెను. భరతుఁడు వెడలగానే ప్రతిజ్ఞాభంగభయ
మును వదలి శాంతిగలవాఁడును, సత్యమైన ప్రతిజ్ఞ గలవాఁడును, ఇంద్రియనిగ్ర
హము గలవాఁడును నగు రాముఁడు యచ్చటనేయున్న యెడల పురజనులుగాని భర
తుఁడుగాని మరల వచ్చి నిర్బంధింతురనితలఁచి యాచిత్రకూటమును వదలి తదేక
చిత్తముగలవాఁడై దండకారణ్యమునఁ బ్రవేశించెను. కమలములంబోలు కన్నులుఁ
గల రాముఁ డా మహారణ్యమునుజొచ్చి విరాధుఁడను రక్కసునిఁ జంపి తర్వాత
నచటనుండు శరభంగుఁడు, సుతీక్ష్ణుఁడు, అగస్త్యుఁడు, అతనితమ్ముఁడు సుదర్శనుఁడు,
అనుమునులను భక్తిచేదర్శనముఁ జేసికొనెను. రాముఁ డగస్త్యుని యుపదేశము
వలన సంతసించినవాఁడై ఇంద్రుఁడిచ్చిన ధనస్సును, ఖడ్గమును, తఱుఁగని యమ్ముల
పొదులను బుచ్చుకొనెను. శరభంగుని తపోవనముననున్న రాముని దగ్గరకు ఋషు
లందఱునువచ్చి వనమందుఁగల రక్కసులను జంపుమని వేడిరి. రాముఁడు, రాక్ష
సులకు నెలవైన దండకాటవియందు ఆమునులు చెప్పినట్లు చేసెదనని యంగీకరిం
చెను. దండకారణ్యమందున్న ఋషులతో రాముఁడు తప్పక రాక్షసులనుజంపెద
నని ప్రతిజ్ఞచేసెను. అచ్చటనేయున్న ఆరాముని చేత జనస్థానమందుండి వచ్చినదియు,
రావణుని చెలియలగు శూర్పణఖ ముక్కుచెవులు గోయఁబడెను. పిదప శూర్ప
ణఖ మాటలను విని యుద్ధమునకు వచ్చిన ఖరుఁడు, త్రిశిరస్కుఁడు, దూషణుఁడు
మొదలగు రక్కసులను, వారితోఁ గలసివచ్చిన వారినిఁగూడ యుద్ధమునఁ
జంపెను. రాముఁడు దండకారణ్యమున నుండఁగా జనస్థాననివాసులగు పదునా

లుగువేల రాక్షసులం జంపెను. పిదప రావణాసురుఁడు తన దాయాదులెల్లను రామునిచేఁ జంపఁబడిరని విని యాతని సాధించుటకుఁగా మారీచుఁడను రాక్షసుని తనకు సహాయపడుమని కోరెను. మారీచునిచేత నారావణుఁడు బలవంతుఁడగు రామునితో నీకుఁ బంతం దని బహువిధముల వారింపఁబడెను. విధిప్రేరితుఁడగు రావణుఁడు మారీచుఁడు చెప్పినమాటను లెక్కసేయక మారీచునిఁ దోడుకొని రామచంద్రుని యాశ్రమమును జేరెను. ఆరావణుఁడు మాయలమారియగు నామారీచునిచేత రామలక్ష్మణులను బహుదూరము తొలఁగ దీసికొనిపోవునట్లు చేసి తన కడ్డమువచ్చిన జటాయువను గ్రద్దను జంపి రామునిభార్యయగు సీతాదేవిని నపహరించెను. చావమోదఁబడిన జటాయువును జూచియు సీత నెవఁడో యపహరించెనని వినియు దుఃఖముచే తపింపఁ జేయఁబడి పరవశములయిన యింద్రియములు గలవాఁడై రాముఁ డేడ్చెను. రాముఁడా శోకాగ్నితోడనే జటాయువున కగ్నిసంస్కారమును జేసి అడవియందు సీతను వెదకుచు భయంకరమైన వికారరూపముగల కబంధుఁడను రక్కసునిజూచెను. రాముఁడా కబంధుని జంపి వానినిగూడ దహనముగావించెను. పురుషోత్తముని చేత మరణమును బొందికబంధుఁడు స్వర్గమున కేగెను. ఆకబంధుఁడు స్వర్గమునకుఁ బోవుచు ఓ రాముఁడా? నీవు సర్వసంగవిముక్తురాలును, ధర్మములనడపునదియు, ధర్మములయందు నిపుణురాలగు శబరియను బోయజాతి స్త్రీని కలసిమాటలాడుమని రామునకుఁ జెప్పెను. గొప్ప తేజస్సుగలవాఁడును శత్రుఘాతుకుఁడైన రాముఁ డా శబరిని జూచుటకు వెళ్లెను. దశరథకుమారుఁ డగు శ్రీరామచంద్రుఁడు శబరియను బోయవనితచేతఁ జక్కగ పూజింపఁబడెను. రాముఁడు పంపయను కొలనుగట్టున హనుమంతుఁడను వానరునితోడఁ జెలిమిఁ జేసెను. రాముఁడాంజనేయుని మాటవలన సుగ్రీవునితోఁ గూడ స్నేహమును జేసెను, మహాబలశాలియగు రాముఁడు సుగ్రీవునికొఱకు నాంజనేయునికొఱకును జన్మము మొదలు తన యావచ్చరిత్రమును అట్లే సీత యొక్క చరిత్రమును జరిగినది జరిగినట్లు చెప్పెను. సుగ్రీవుఁడును రాముని వృత్తాంతమంతయు విని సంతసించి యగ్నిసాక్షికముగ రామునితో మైత్రిఁ జేసెను. పిదప సుగ్రీవునిచేత రామునికొఱకు తన యన్నయగు వాలితోఁ దనకుఁ గల విరోధ ప్రకారమంతయు స్నేహముచేతఁ జక్కఁగాఁ దెలుపఁబడెను. అప్పుడు రాముఁడు వాలినిఁ జంపెదనని సుగ్రీవునితోఁ బ్రతిజ్ఞను జేసెను. ఆఋశ్యమూకమందుండి సుగ్రీవుఁడు రామునికి వాలియొక్కబలమునంతయుఁ జెప్పెను. సుగ్రీవుఁడు రాముని బలమును గూర్చి వాలితో నెదురుకొనుబలము వీనికిఁ గలదా లేదా యని సందేహించుచుండెను. సుగ్రీవుఁడు రాముని బలమెంతయో దెలియుకొఱకు అత్యున్నతమై కొండను బోలియున్న వాలిచేఁ జంపఁబడిన దుందుభియను రాక్షసునియొక్క మృతకళేబరమును రామునకుఁ జూపెను. రాముఁడు దుందుభియొముకను జూచి

నవ్వి దానిని కాలిబొటనవ్రేలితో పదియామడలదూరమున బడునట్లు రువ్వెను. రాముఁ డింకను సుగ్రీవునికి నమ్మకముఁ గలిగించుటకొఱకు ఒక గొప్ప బాణము చేత నేడు మద్దిచెట్లను ఒకకొండను రసాతల లోకమునుఁ గూడ భేదించెను. ఆపిదప రాముని బలమునుజూచి నమ్మకము గలవాఁడై మిగుల సంతసించి సుగ్రీవుఁడు రాముని వెంటఁదీసికొని కిష్కింధకు వెడలెను. తర్వాత బంగారువన్నె గలవాఁడును కపిశ్రేష్ఠుఁడైన సుగ్రీవుఁడు కిష్కింధఁజేరి సింహనాద మొనర్చెను. ఆపెద్ద ధ్వనినివిని వాలి వెలుపలికి వచ్చెను. వాలి బయలుదేఱునప్పుడు పోవలదని వారించు భార్యయగు తారను ఎట్లో సమాధానపఱచి యుద్ధమునకు వచ్చెను. ఆవచ్చుచున్న వాలిని రాముఁడు యుద్ధమందొక బాణముచేఁ జంపెను. రాముఁడు సుగ్రీవుఁడు కోరినట్లు వాలినిఁ జంపి కిష్కింధా రాజ్యమందు సుగ్రీవునినే నిలిపెను. అనంతరమందు సుగ్రీవుఁడు వానరులందఱను బిలచి సీతను వెదకుటకై దిక్కులమీఁదఁ బంపెను. అనంతరమందా కోఁతులలో నొకఁడును మహాబలవంతుఁడునగు హనుమంతుఁడు "సీతను రావణుఁ డపహరించెను సముద్రమును దాఁటి కనుఁగొనవచ్చు" నని చెప్పిన సంపాతి మాటనుబట్టి నూఱామడ వెడలుపుఁగల యుప్పునీటి సముద్రమును చెంగున దాఁటెను, ఆంజనేయుఁ డట్లు సముద్రమును దాఁటి రావణునిచేఁ బాలింపఁబడిన లంకాపట్టణమును జొచ్చి యచ్చట రావణుని కోటయందలి తోఁటలో సదా రామధ్యానమును జేయుచున్న సీతామహాదేవినిఁ జూచెను. ఆంజనేయుఁ డానవాలుంగరముం జూపి సీతాదేవిని నమ్మించి రాముని కుశలవార్తను జెప్పి యారామను ఊఱడించినవాఁడై ఆతోఁటను తోఁటవాకిలిని ధ్వంసము జేసెను. హనుమంతుఁడు సేనాపతుల నైదుగురను మంత్రికుమారుల నేడ్వురను శూరుఁడగు నక్షుని జంపి రావణుని కొడుకగు నింద్రజిత్తు చేతిలోఁ గట్టుబడియెను, హనుమంతుఁడు బ్రహ్మవరమువలన బ్రహ్మాస్త్రము తనను వదలినదని తెలిసియు త్రాటఁగట్టి లాగుచున్న రాక్షసులను గొంతసేపు సైఁచి పిదప సీతను విభీషణుని యిల్లును దప్ప మిగిలిన లంకనంతయు గాల్చి రామునకు సంతోషవార్తం జెప్పుటకొఱకు మరల సముద్రమును దాఁటి వచ్చెను. ఆంజనేయుఁడు రాముని దగ్గరఁ జేరి ప్రదక్షిణముఁ జేసి "చూచితిని సీత" నని, యథార్థముగాఁ జెప్పెను. అనంతరము సుగ్రీవునితోఁ గూడుకొని రాముఁడు దరికిఁ జేరి దక్షిణసముద్రమును తీక్ష్ణములైన బాణములచే క్షోభమునొందించెను. అంతట సముద్రుఁడు నిజరూపమును జూపించెను. రాముఁ డతని యుపదేశమును బట్టి సముద్రమునందు నళునిచేత వంతెన గట్టించెను. రాముఁ డాదారిని లంకకేఁగి రావణుని యుద్ధమున జంపి సీతనుగ్రహించి, పరగృహవాసముచే దూషింపఁబడిన సీతను గ్రహించినందుకు చాల సిగ్గుపడెను. ఆకారణమువలన రాముఁడు సీతనుగూర్చి పలువురెదుట 'పరపురుషుని యింట నుంటివిగాన నీవు నాకుఁ

దగవు, అని కఠినమైన యొకమాటను బలికెను. ఆమాట కోర్వలేనిదై సీతాదేవి యగ్నిలోఁ బ్రవేశించెను. పిదప నగ్ని చెప్పినమాటవలన సీత నిర్దోషురాలని యెఱింగి రాముఁడు సంతసించిన వాఁడై యెల్లదేవతలచేతఁ బూజింపఁబడినవాఁడై వెలింగెను. రాముఁడు జేసిన యీరావణవధరూపమగు మహాకార్యమునకు చరాచరములతోఁడను దేవఋషి సంఘములతోడను గూడిన ముల్లోకములును సంతసించినవి, రాముఁడు పూర్వము సముద్రతీరమందు వాఙ్మాత్రమునఁ జేసినదిగాక లంకలోఁ గూడ విభీషణునకుఁ బట్టాభిషేకముఁ జేసి యప్పటికి ప్రతిజ్ఞ నెఱవేర్చుకో గలిగినందులకు మిగుల సంతసించెను. రాముఁడు దేవతలవలన నిష్టములను బొంది కోఁతులను మిత్రులను వెంటదీసికొని పుష్పకమను విమానము నెక్కి అయోధ్యకు వెడలెను. రాముఁడు పుష్పకముతో భరద్వాజమహామునియొక్క ఆశ్రమమును జేరి అచటనుండి భరతునికడకు ఆంజనేయునిఁ బంపెను. రాముఁడు సుగ్రీవ విభీషణాదులతో మరలఁ బుష్పకమెక్కి యిష్టకథలను జెప్పుకొనుచు నందిగ్రామమునకు వెడలెను. రాముఁడు తమ్ములతోఁ గూడి నందిగ్రామమున జడలు వదిలి సీతతోఁగూడి మరల రాజ్యమునం దభిషేకింపఁబడెను. రాముఁడు రాజైనవెంటనే లోకమంతయు గగుర్పాటుగలదియు, సంతసించినదియు, కోరిక దీరి తృప్తిఁబొందినదియు, సంతోషమున నుబికినదియు, ధర్మములయందాసక్తి గలదియు, పీడ, రోగము, క్షామము లేనిదియునై సుఖించెను. రాముఁడు రాజై యుండఁగా నెవరును కొడుకులచావును జూడరైరి స్త్రీలు విధవలుగాక పతివ్రతలై యుండిరి. రాముఁడు రాజ్యమును జేయు నాసమయమునందు ప్రజల కగ్నిభీతి లేదు. అల్లే నీళ్లలోఁబడి చచ్చుటవలన భయము లేదు. ఇంకను గాలివలన జ్వరమువలన ఆకలివలన దొంగలవలనఁ గలిగెడి భయము లేకుండెను. రాముని రాజ్యమునందు పట్టణములు దేశములు ధనములతోడను ధాన్యములతోడను నిండి యుండెను. జనులందఱును కృతయుగమునందువలె నెల్లప్పుడు సంతోషముతోఁ గూడియుండిరి. గొప్పకీర్తిగల రాముఁడు నూఱులకొలఁది యశ్వమేధయాగములను సంపూర్ణదక్షిణలు గలవానిగఁ జేసి పదివేలు కోటులు గోవులను మితిలేనిద్రవ్యమును బ్రాహ్మణులకొసఁగి బ్రహ్మలోకమున కేఁగును. రాముఁడు రాజకులములను ఒకయింటికి నూఱింట్లుగా వృద్ధిఁజేయగలఁడు బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులను నాలుగు జాతులవారిని దమతమ ధర్మములందు నిరతులనుగాఁ జేయఁగలఁడు. రాముఁడు పదునొకండు వేలేండ్లు రాజ్యమును జేసి బ్రహ్మలోకమును జేరును. పవిత్రమైనదియు పాపహారమైనట్టియు పుణ్యమైనదియు వేదతుల్యమునగు నీ సంక్షేపరామాయణము నెవఁడు చదువునో వాఁడన్ని పాపములచేతను విడువఁబడును. ఆయుర్వృద్ధికరమైన యీరామాయణమును చదువువాఁడు కొడుకులు మనుమలు బంధుగులు మొదలగువారితోఁ

గూడి సుఖించినవారై దేహమునువిడిచి స్వర్గలోకములో పూజింపఁబడును. ఈరామాయణమును చదువువాఁడు బ్రాహ్మణుఁడేని విద్యలయందు నిపుణుఁడగును. క్షత్రియుఁడేని చక్రవర్తియగును, వైశ్యుఁడేని వాణిజ్యలాభమును బొందును శూద్రుఁడైనను యోగ్యతను బొందును అని యిట్లు ఏది బుద్ధిమంతుఁడగు నారద మహాముని చేత వేదవాక్యములతో వాల్మీకి మహామునికొఱకు నుపదేశింపఁబడెనో నద్దానిని యా వాల్మీకి నూఱుశ్లోకములుగ లఘు రామాయణంబను పేర కబ్బ మొనరించె. దానిని నీకుఁ జెప్పినాఁడను. నయ్యది వినినమాత్రంబుననే పుణ్యప్రదంబయినది. దీని నాధారంబుగ జేసికొని బ్రహ్మచే నొసఁగబడిన వరముచే వాల్మీకి మహాముని శతకోటి రామాయణమును రచించెను.

ఇట్లని శ్రీమదానంద రామాయణము నందలి మనోహరకాండము నందు లఘురామాయణమను మొదటి సర్గ సంపూర్ణము.

శ్రీరాముఁడు పౌరులు మొదలగువారికి జ్ఞానోపదేశమును జేయుట

శ్రీరామదాసుఁడు చెప్పుచున్నాఁడు. అంనతరమం దొకానొకప్పుడు, పౌరులు మొదలగువారు సభామధ్యమందు రత్నసింహాసనా రూఢుఁడగు శ్రీరాముని పరమాత్మయని యెఱింగి, వినయభావముతోఁ గూడుకొనిన వారలై ఇట్లడిగిరి, మహారాజునగు యో శ్రీరామచంద్రా ? విషయములందుఁ గూడికొనిన మనస్సు గలమాకు యేయుపాయంబున జ్ఞానము గలుఁగఁగలదో యామార్గము నుపదేశింపుము, యనిన వారిమాటలనువిని శ్రీరాముఁడు మందహాసము గలవాఁడై ఎల్లప్పుడును మీరు యుపదేశములను వినుచుండలేదా ? ప్రతి యామము నందును నాదూతలచేతఁ జేయఁబడుచుండునుగదా ? గడచినరోజులను పోనిండు. నేటిరాత్రియందు నాదూతలచే సాటింపఁబడు ధర్మములను మీరందఱును సావధాన స్వస్థచిత్తము గలవారలై బుద్ధిపూర్వకముగావిని మీామనంబులయందు విచారించి పిమ్మట నన్నడుగవలసిన దెద్దేని యుండిన నడుగవలయునని శ్రీరాముఁడు పౌరులకుఁ జెప్పగా, వారందఱు వారివారి మందిరముల కరిగి భుజించి తమతమ స్త్రీలతోఁగూడ పర్యంకములందుఁ బవ్వళించి దూతవాక్యముల వినఁగోరి స్వస్థమయిన చిత్తము గలవారలై రాత్రియందు నిదురింపక జాగరూకులై యుండిరి. అంత, రాత్రి ఒకటిన్నరజాము గడచినపిమ్మట శ్రీరాముని దూతలిట్లు సాటింపఁదొడంగిరి, శ్రీరాముని దూతలు శస్త్రములను దండములను ధరించినవారలై వాహనములనెక్కి ఏనుఁగులపైనఁ దుందుభులను సమస్త వాద్యములను నిడికొని దీపములను వెలిగించికొని, రాజమార్గము లందంతటను ధ్వనులను జేయుచు, ఓజనులారా ? వినుడు, మోహముచే నిదిరించుచున్నారేమి ? ఈనిద్ర మంచిదికాదు, ఎప్పుడువిమి యనర్థము రాగలదో ? స్వస్థమైన మనస్సుగలవారై

మామాటలను వినుడు, ఈయయోధ్యకు తొమ్మిది ద్వారములు గలవు అందొకటి లఘువయినది ఇట్లుండునపుడు రామరాజ్యమునందు భయములేదను కారణముచేత ద్వార రక్షకులు తలుపులు మొదలగువానిని మూయుదురో మూయరో ? ఓజనులారా ? ద్వారములయందు సంకిళ్లుగాని తలుపుగడియలుగాని లేవు, నల్లనివాఁడును గొప్పవాఁడును నగుదొంగయొకఁడు దక్షిణపు దిక్కున నున్నాఁడని వినఁబడుచున్నది, ఇప్పుడు వాని నెవ్వఁడును చూచియుండలేదు, ఇట్లుండగా, రోగశాంతి కొఱకును, శత్రుశాంతికొఱకును నుపేక్షింపరాదు, ఈయయోధ్యయందు నగరవాసులఁబోలె వానిదూతలు మాఱువేషములుగల వారలై సంచరించుచున్నారు గదా ? మనమెప్పుడును వారి నెఱుఁగుటలేదు, కోటలోనికి శత్రుదూత యొకఁడొచ్చినయెడ వాఁడు క్షణమాత్రమున దుర్గమును భేదించి దుర్గపాలురఁ జంపివేయును, అట్లు మనమెల్లప్పుడు వినుచుందుముగదా ? అందుచేత నీయూరిలో యమునిదూతలు వేలకొలఁది వివిధవేషంబుల ధరించినవారలై యున్నారు, ఇట్లున్నను, ఈరాజు చిరకాలము బ్రదుకుఁగాక, మనకియ్యయోధ్యయందు భయముజనించదు, వాని బలమెవ్వఁడు చెప్పఁగలఁడు, ఈదూతలచే నావృతుఁడగునట్టియు, ఆత్మారాముఁడగు ప్రభువునకు కర్తవ్యమేమి గలదు? వారిలో భయమనునది దుర్బలురగు మీకునెల్లప్పుడుఁ గలదుగదా ? లోకమున జనులు దుర్బలుఁడగు మేకపిల్లను బలియిచ్చుచున్నారు, గాని, బలవంతుఁడగు సింహమును బలియిచ్చుటలేదు, కావున, దుర్బలురగు మీరు రాత్రియందు నిద్రించెదరేమి ? మీలో భేదము నెప్పుడు గల్పించి ఆదొంగ మిమ్ము నెపుడు పట్టుకొనిపోవునో ? ఆకాలము తెలియదుగాన నిద్రమంచిదిగాదు, మీరు నెమ్మదియగు మనంబు గలవారలై నిద్రనువదలి యహర్నిశంబులును ఈపురంబున నెల్లప్పుడును కవచములను ధరించి తీక్ష్ణమగు ఖడ్గములఁబూని స్వసన్నిధానంబున ధైర్యముగలవారలై యుండఁదగును, మఱవవలదు, ఈయయోధ్యయందు యెవడు జాగరూకుఁడై యుండునో వానికి నెన్నటికీ దొంగవలన భయముగలుగదు, ఈమాయుపదేశముల నెన్నటికిని మఱవవలదు. ఓజనులారా ? మామాటకివి సావధానముగా వినుఁడు, అనియిట్లు శ్రీరాముని సేవకులు పురమునందంతటనుఁ జాటించి వాద్యములను మ్రోయించుకొనుచు పట్టణమంతయు ముమ్మారులు చాటించి శ్రీరాముని సన్నిధిఁ జేరిరి, ఇట్లు చాటింపఁ బడినందున పౌరులందఱు జ్ఞానముచేత తెలివినొందినవారలై వారిలో వారు తత్త్వవిచారములఁ జేసికొని మరునాఁడుదయమున పౌరులు మొదలగు జనులు శ్రీరాముని సాన్నిధ్యంబునకు వచ్చి నాతనికి మ్రొక్కి సంతోషముతో నిండిన మనస్సుగలవారలై శ్రీరాముని గూర్చి యిట్లు పలికిరి, తెల్ల తామరలవంటి సుందరమైన కన్నులుగల యోశ్రీరామచంద్రా ? నీదూతలు చేయు జ్ఞానోపదేశములను ఎల్లప్పుడును వినుచుందుముగాని, యీవాక్య

ముల యర్థమును విచారించక కాలమునుగడపితిమి, గడచినరాత్రియందు మాత్రము నీయానతిచేత నీదూతలచే నుపదేశింపఁబడిన శుభమైన వచనములను బాగుగవిని తత్త్వమును విచారించి సుజ్ఞానమును బొందితిమి, ఇఁక నీయుపదేశమక్కఱలేదు, యన, నా శ్రీరాముఁడు వారితో చిరునగవునవ్వుచు నిట్లనియె, ఓపౌరులారా? మీరు చెప్పినది బాగుగనున్నది, కాని, గడచినరాత్రి మీరేమివినిరి? ఏమిదెలిసికొనిరి? ఏమితత్త్వవిచారమును జేసిరి? యావిషయముల నొకసారి నాయెదుట చెప్పఁగోరుచున్నాఁడనన, నాపౌరులు శ్రీరాముని వాక్యములనువిని ముదంబున నిట్లు విన్నవించిరి. వినుము, యో శ్రీరామా? మాకు దెలిసినదానిని జెప్పుచున్నారము, మోహమనునదియే రాత్రి, భ్రాంతియనునదియే నిద్రయనఁబడును. ఈభ్రాంతియనునది మంచిదిగాదు, అనర్థకరమగు మృత్యువు మ్రింగివేయును, అయోధ్యయనునది యిద్దేహంబు, ఈదేహమునగల నవరంధ్రములే నవద్వారములనఁబడును, ఆద్వారములలో లఘుద్వారమనునది మస్తకమున యుండు బ్రహ్మరంధ్రము, దంతములు మొదలగునవియే ద్వారరక్షకులు, పెదవులు రెప్పలు మొదలగునవి ద్వారకవాటములు, పంచప్రాణములను నైదుగురు దూతలీదేహమను పురమునందు సంచరించుచుందురు, ఆత్మయే రాజు, జీవుఁడును, ఇంద్రియాధిదేవతలే దేహమను నగరమునఁ బౌరులు, యముఁడనువాఁడే గొప్పదొంగ, వాతపిత్తశ్లేష్మములు మొదలగునవియు వానివలనఁ గలిగెడు వ్యాధులును, ఆయముని సేవకులుగా యుండి నగరవాసులవలె యున్నారు, ఈజీవాదులు మిగుల దుర్బలులు వారికి వానివలనగలుగు భయములు జేకూరును, గాన, భ్రాంతులై మోహమున మునిఁగి పోవలదు, మృత్యువేకాలమున నెప్పుడువచ్చునో? తెలియదు. అందువలన భ్రాంతిమంచిదిగాదు, వైరాగ్యమను తీక్ష్ణమగు వాఁడిగల జ్ఞానమనునదియే మహాఖడ్గము, మంచిస్వభావమనునదియే కవచము, నీయందు దృఢమైన భక్తియే ధైర్యము, ఆత్మజ్ఞానముచే నెవ్వఁడు జాగరూకుఁడై యుండెడినో వానికెన్నటికిని భయముగలుగదు. జ్ఞాననిష్ఠయే సావధానమనఁబడును, వచనములే వాద్యంబులు, ఇవియే సాధుబోధనంబులు. వానినెల్లప్పుడు హృదయముననిలిపి సూక్ష్మబుద్ధిచే నవలోకింపవలయు, మోహము నశించుటయే ప్రభాతకాలమగుట, నీయెదుటనిలువఁబడుటయె సాక్షాత్కారము, నీవేయాత్మవు, ఈసభయే యాత్మారాముని నిలయంబు, నీయెదుట నీసన్నిధి యందుండు మేమందఱము ముక్తులమై యున్నారము, మేమిప్పు డడుగవలసిన దేమియున్నది? నీవు యుపదేశించవలసిన దేమియున్నది, నిన్ను స్మరించిన మాత్రముననే ముక్తిని బొందుచున్నారుగదా? నీసన్నిధియందుండు మేము ముక్తులము, ఇంకను సంశయములేదు, అని పౌరులు జెప్పగావిని శ్రీరాముఁడు మందస్మితవదనారవిందుఁడై వారలఁజూచి యిట్లనియె, జనులారా? మీరుబాగుగ తత్త్వమును గనుఁ

గొని జ్ఞానవంతులై తిరి, సుఖముగ నుండెదరుగాక, యాత్మకంటె వేఱొక్కరాముఁడు గలఁడని భేదబుద్ధి నుంచవలదు, యనియానతిచ్చి, ముదముతోఁడ సీతాదేవి యంతఃపురంబున కేఁగెను, పురజనులు మొదలగు వారలు యాత్మనే పరముగా నెంచుచు విగతమోహులై యుండిరి, ఓవిష్ణుదాసా ? ఈప్రకారము శ్రీరాముని దూతలచే నుపదేశింపఁబడిన వాక్యములచే పురజనులెట్లు జ్ఞానమును బొందిరో యావృత్తాంతముల నీకుఁజెప్పితిని, మఱియొకసంగతినివినుము.

* కైకేయికి శ్రీరాముఁడు తత్త్వోపదేశమును జేయుచుట *

ఒకప్పుడు శ్రీరాముఁడు యేకాంతమున నుండగా శ్రీరాముని కైకేయి నమస్కరించి వినయముతో నెదుటనిలచి మధురమైన వచనములతో పుండరీకాక్షుఁడగు యోశ్రీరామచంద్రా ? ఇంతకుమునుపు నేనునీకు యేయపరాధమును జేసియున్నానో దానినిక్షమించి దయతోఁడ నన్నురక్షించి యేయుపాయంబున నాయజ్ఞానము వదలి నిర్మలమగు జ్ఞానము గలుఁగునో నద్దానిని శరణాగతయగు నాకుపదేశింపవలయు, నన, యాకైకేయి వచనము లాలించి శ్రీరాముఁడు మందహాసముతో మృదుమధురంబులగు వచనముల నిట్లుపలికె, తల్లీ ? నీవు నాకేమియు నపరాధముఁ జేసియుండలేదు నాయానతిచే సరస్వతి నీవాక్కునుండి వరములను వేడెను, నీవు పరిశుద్ధురాలవు, నీయందు నాకేమియుఁ గోపము లేదు, రేపు లక్ష్మణుఁడు నిన్నుఁదీసికొని వెడలి యుపదేశమును జేయుంచఁగలఁడు, అని పలికి, శ్రీరాముఁడు నామెనంపి, లక్ష్మణునితో రేపటియుదయమున నేను చెప్పెడి రీతిగ కైకేయిని పల్లకియందు నెక్కించి పట్టణమునకు వెలుపల సరయూనదీతట సమీపమున మేకలమంద యెచ్చటనుండునో నచ్చోట పల్లకిని నిలిపి యామె మేకలయరపులను గొంతసేపు వినునట్లు చేసి నాకడకుఁ బిలుచుకొని రమ్మని చెప్ప వినిలక్ష్మణుఁడు నట్లయని యంగీకరించి రామునియెదుట నూరక యుండెను, యనంతరము ప్రాతఃకాలమున లక్ష్మణుఁడు భరతుని మందిరమున కరిగి కైకేయిని పల్లకియందెక్కించి సంతోషముతోను దాసీజనంబులచేతను వేత్రపాణులగు సేవకులతోను బరివేష్టితురాలగు నామెను యూరిబయట సరయూనదీతీరమున మేకలమందల దగ్గర పల్లకిని నిలుచునట్లు చేసెను, అచ్చట బ్రాహ్మణులు దక్షిణేచ్ఛచేత సుస్నాతయగు కైకను వెంబడించి పల్లకివెనుకఁ బరువెత్తివచ్చిరి అప్పుడు లక్ష్మణుఁడు పండితులును సుప్రతిష్ఠులును శ్రోత్రియులును శృత్యుక్త కర్మానుష్ఠానపరులును గానట్టి కుటివారు మొదలగు నీద్విజులు అతిమూర్ఖులుగనున్నారు వీరుదయాకృత పారితోషికాప్తులుగా నున్నారుగాని, మంత్రపూత విష్ణ్వుక్త దానార్హులు గారనివారిని వారించి, దూతాది పరివారంబును దూరముగనుంచి పల్లకికి నిరువంకల ప్రేలాడుచుండు ముత్తెముల జాలరులను తనరెండుచేతుల పైకినెత్తి నిలిపి కైకనుజూచి అమ్మా ? ఎదుట

నుండు మేకలమందను చూడుము. తల్లీ? యాదరముతోడ రాముఁడు నిన్ని చ
టికి నుపదేశముకొఱకుఁ బంపెను. అని విన్నవించిన, కైక, దనమంతనంబున
నింతదోప నెందుకిచ్చుటకై శ్రీరాముఁడు యాదరంబున నన్నంపె ? నన్ను వంచిం
చెనా యేమి ? యని యిట్లు వితర్కించుచు గొంతసేపూరకయుండఁగా నింతలో
పలుమారు మేకలయొక్క మే, మే, యను ధ్వనులు వెలువడినవి, కైక,
యాధ్వనులను విని దనమనంబున నిట్లు జింతించెను. ఈమేక లన్నియు నాయె
దుటఁ బలుమారు మే, మే, యని యేలఁ జెప్పుచున్నవి ? ఈధ్వనుల యందెద్దేని
గూఢార్థమొుండు యుండనోపు, అనియాలోచించి యామె కన్నులుమూసికొని
కొంతసేపు హృదయమున ధ్యానమును జేసి సర్వము నెఱింగి యజ్ఞానముచేఁ దొలఁగి
యమందానందతుందిల హృదయారవిందయయ్యెను. అంత నామె నవ్వుచుఁ
దన యెదుట నిలచియున్న లక్ష్మణునిఁజూచి, బిడ్డా ? నేను జ్ఞానమునొందితిని,
నన్ను శ్రీరామునికడకుఁ గొనిపొమ్ము. యనిన నతఁడట్లే యని ముత్తియముల
జాలరుల సరములనువదలి, దూతలను బిలిచి శీఘ్రముగ కైకను సీతాదేవి
మందిరమునకుఁ గొనివచ్చెను. అచ్చట శ్రీరాముఁడు నవరత్నచిత్రిత దివ్యకిరీట
మును ధరించి సీతతోడ సరసములాడుచు సీతచేతఁ జూపఁబడు నిద్దంపుటద్దంబున
దనముద్దులొలుకు మొగంబును గాంచుచుండగా నా కైక రామునికి నమస్కరించి,
రామచంద్రా ? నీదు కృపచే మేకలయఱపుల విచారమునుండి నా యజ్ఞానము
తొలఁగినది, సుజ్ఞానముగలిఁగినది. ఇఁక నీయుపదేశము నాకక్కర లేదు, నేను
ముక్తురాలనైతిని, యన, నా శ్రీరాముఁడు కైక మాటలను విని నగుచు నిట్లనియె.
తల్లీ ? నీ వెట్లు విచారించితివి ? నీ కెట్లు జ్ఞానము గలిగినది ? ఆసంగతిని నాయె
దుట సవిస్తరముగఁ జెప్పుమన నందుకామె. ఓ శ్రీరామా? నాకు ఎద్ది తెలియఁ
బడినదో వృత్తాంతమును జెప్పుచున్నానువినుము. అచ్చట మేకలమందదగ్గర వాని కేక
లను మే, మే, యని విని మనంబున క్షణ మాలోచించితిని. ఈధ్వనులు నాకుఁ
బలుమారు, మే, మే, నాది-నాది-యని వినిపించుచున్నవి. వినిన నేను కూడ నిట్లే
పలుకవలయునా ఏమి ? అట్లయిన నెల్లప్పుడును పశుపుత్రగృహారామాది సకల
విషయంబులయందును. మే-నాది, మే-నాది, యని చెప్పుచున్నాము, కావున
నిదికాదు నా కుపదేశంబు, ఇఁక నెద్ది యనిన మే, మే, యని పలుకవలదని నాది
నాది యను మమకారమును వదలు మని విశేషార్థమందీ యుపదేశము, ఇఁక
నందువలన నేను నాదియని దేనిని అభిమానించను, నాతల్లి, నాబిడ్డలు, నాబంధు
గులు, నాయిల్లు, నారాజ్యము, నాపత్ని, నాకొడుకు, నాసవతి, నాసవతిబిడ్డలు,
నాదేహము, నాసొమ్ములు, ఇదినాప్రియదాసియగు మంథర, నాపుత్రులు,
అనునిట్టి దుర్బుద్ధి యేది కలదో దానిని వదలుమని ఇవి నా కుపదేశించుచున్నవి,
రామా ? మఱియుఁ గొన్ని విశేషముల బోధించుచున్నవి. ఎట్లన ! మే-నాది నాది

యను బుద్ధితో పూర్వజన్మమునందు వర్తించినందున నీజన్మమున మేకలమై జన్మించితిమి, గాన. మా-యను బుద్ధి వదలవలయు. నొకప్పుడును దానికి లోఁబడి యాబుద్ధి నంగీకరింపరాదు. నాదియను బుద్ధిగలుగుటచే మాకేగతి గలిగినదో నదియె మమకారముగల జనులకు మీకును గలుఁగును, అని తమమాటలచే నవి జనుల కుపదేశమును జేయుచున్నవి. దీనిని జనులు తెలిసి వర్తించరు. వాని వాక్యోపదేశము వలనను నీ యనుగ్రహంబునను నాకు, మే, మే, (నాదినాది), యను మమకారము వదలి, నేనిచ్చట ముక్తురాలనైతిని. నాదేహమను బుద్ధి యెప్పుడు నశించినదో యప్పుడు దుఃఖదాయకంబగు సంసారంబున మిగిలిన దేమి గలదు ? నీటితరంగంబువలె నీశరీరముండని, పోని, పుత్రుడెవ్వఁడు? ఎవ్వని కెవ్వతెతల్లి ? సర్వము బ్రహ్మాత్మకంబు, ఇందుకు సంశయములేదు నేనే పరబ్రహ్మగా నున్నాను. నాకన్న వేఱొండు బ్రహ్మవస్తువులేదు. కనుబడుచుండు నీప్రపంచంబంతయును నీమాయగా నున్నది. ఈప్రపంచంబు నీటిబుగ్గవలె నశ్వరంబయినది. ఓ ప్రభువగురామా ? నాచే నిట్లు తత్వమును దెలిసికోఁబడినది. అనిన కైకేయి మాటనువిని శ్రీరాముఁడు మందస్మితవదనుఁడై, ఓకైక? మేకమాటలను బాగుగ విని చక్కఁగా నొక్కి విచారించి తెలిసికొంటివి. ఇఁక నిప్పుడు పోయి సుఖముగానుండుము, నీవు జీవన్ముక్తురాలవై యున్నావు అని చెప్పి యామెనంపెను. ఆమెయు మిగుల సంతోషముతో దేహాభిమానమునువదలి సీతారాములకు నమస్కరించి భరతుని మందిరమునకుఁ జని దేహయోగను యాసక్తురాలుగాక నిర్లిప్తయై యుండెను. ఓశిష్యుఁడగు విష్ణుదాసా ? మేల యుపదేశంబున కైకకు యెట్టి జ్ఞానము లభించెనో నద్దాని నీ కుపదేశించితిని మఱియొక విశేషమును వినుము.

* శ్రీరాముఁడు సుమిత్రకు బ్రహ్మతత్వోపదేశము నొసఁగుట. *

ఒకప్పుడు శ్రీరాముఁడు సీతాదేవితోఁడ నేకాంతమున యుండఁగా శ్రీరాముని సన్నిధికి సుమిత్రవచ్చి శ్రీరాముని కభివాదన మొనరించి రాజీవాక్షుఁడగు శ్రీరామా ? కొంచెము నిన్నుఁ బ్రార్థించుచున్నాను. నాకు నుపదేశము నిమ్ము, యనఁ బిదప, నారాముఁడు సుమిత్రమాటలను విని, నీవెవతెవు ? ఆసంగతిని మొదట నాకుఁజెప్పుము. పిదప నీ కుపదేశించెదను. ఇంటికిపొమ్ము, నీబుద్ధితోఁ జక్కఁగ నాలోచించి రేపువచ్చి నా ప్రశ్నకుత్తరమిమ్ము, అప్పుడుపదేశించెదను. తల్లీ ? నీవు నానందించెదవు, అనిన శ్రీరాముని వాక్యములను విని సుమిత్ర మిగుల సంతసించినదై సుస్మితయై యూరకె నింటికివెడలెను. అంత నామె యిట్లు, ఆలోచించెను. రామునిచే నడుగఁబడిన నేనెవ్వతె ? నేనేమి యుత్తరమీయఁదగు, నేను దేవియా? రక్కసినా? అసురస్త్రీనా? దానవాంగననా? నరవనితగా నున్నానా ? ఇట్లని యాలోచించి, యేదైన నొకటి నుత్తరమును

జెప్పెద నందునా? నేను నటుని వలె ననేక శరీరములను ధరించుచున్నాను, అప్పుడు, ఈమనుష్యత్వము ఇతరజాతిలో ఘటించుచున్నదా? లేదు, కావున నేను మనుష్యస్త్రీనిగాను, మఱి యితరమును గాను, మానవి, రాక్షసి, యనునట్టి నామంబులు దేహంబునకేగాని నాకులేవు, దేహంబయినను నశ్వరంబని చెప్పఁబడుచున్నది. దేహమునకంటె వేఱుగ నే నెవ్వతె? ఇట్టి నేను అనేకరూపంబులను ధరించుచున్నా ననుసంగతి నెఱుంగకపోతిని. యిప్పుడు తెలిసికొంటిని. విష్ణువెట్లుండునో? యట్లే నేనును, అతఁడు మత్స్యాది నానా రూపంబులఁ ధరించుచున్నాఁడుగదా. యట్లే అహం వాచ్యంబగు నేనును గూడ వివిధరూపంబులను ధరించుచున్నాను. ఇట్లే యతని ప్రశ్నకు నుత్తరం బీయఁదగు. స్వవశంబుగా నావిష్ణువు యున్నాఁడు. నే నెల్లప్పుడును విష్ణువశనై యున్నాను. కావున నేను విష్ణుని కళనై యున్నాను. ఇందు సంశయం బేమియును లేదు. విష్ణువునకును నాకును భేదములేదు. గంగయే ప్రకారమొక్కటిగ భూమియందును ఘటమునందును గూడయున్నదో నట్లే విష్ణువుకూడ నేనుగా నున్నాఁడు. నేనే విష్ణువైనప్పుడు ఇప్పుడు ఏమి మిగిలినది. సర్వము బ్రహ్మాత్మకంబై నిలిచినది. అడుగవలసినదేమి గలదు. జీవన్ముక్తనై యున్నాను. ఇట్లు సుమిత్రాదేవి మంతనంబున చింతనంబును జేసి యారాత్రి గడచినపిదప ప్రాతఃకాలమున శ్రీరామ పరబ్రహ్మసాన్నిధ్యమునకు వచ్చి నమస్కరించి ఓశ్రీరామా? రాత్రియంతయుఁ జింతనమును జేసితిని నినెవరనని నీవు ప్రశ్నముఁ జేసియుంటివి. నేను బ్రహ్మముగా మిగిలితిని నీ వడుగ వలసినదేదియు నొండులేదు. ఎప్పటికిని నీకంటె వేఱొండు నేను లేను అని యిట్లు తానుఁ జింతనముఁ జేసిన యావద్వృత్తాంతమును సవిస్తరముగ విన్నవించి తాను జీవన్ముక్తయై నిలిచెను. శ్రీరాముఁడును, తల్లీ? బాగుగ నీబుద్ధిచేఁ జింతించితివి నీవు జీవన్ముక్తవై యున్నావు. ఇంటికి వెడలుము సుఖముగ నుండుము. అనిపంపెను. అంత సుమిత్ర సీతారాములకుఁ బ్రణమిల్లి మోహము నశించినదై మిగుల సంతుష్టురాలై లక్ష్మణుని మందిరమునకుఁ జనెను. అట్లు నే నెవ్వతె నను విచారముతో సుమిత్ర ముక్తయయ్యెను. శిష్యుఁడగు విష్ణుదాసా? మఱియొక సంగతిని జెప్పెదను వినుము.

* శ్రీరాముఁడు కౌసల్యకు బ్రహ్మ తత్త్వోపదేశము నిచ్చుట *

ఒకప్పుడు శ్రీరామునితల్లియగు కౌసల్యాదేవి. ఏకాంతమున చిత్రశాలయందు సీతతోఁడ సుఖముగ గూర్చుండియుండిన శ్రీరామచంద్రునిఁజూచి నమస్కరించి సాక్షాత్పరబ్రహ్మముగు నారాయణునిగా నెంచి, రామభద్రా? దివ్యమంగళంబగు నీకు సుజ్ఞానము నాకెట్లు లభించునో కొంచె ముపదేశింపుము, నాయనా? యని ప్రార్థించెను, ఆతల్లి పలుకులను విని శ్రీరాముఁడు నగి రేపు ప్రొద్దున లేచి యావులుయుండు చోటికిఁబోయి యచ్చటఁ గొంతసేపుండి యాగో

వులదూడల వాక్యధ్వనులను విని వానిని బాగుగ విచారముచేసి నాకడకురమ్ము. తల్లీ ! అనంతరము నీకు నే నుపదేశముఁ జేయఁగలను. సందేహము వలదు అని చెప్పె, అంతనామె యట్లేయని యాశ్చర్యముగలదై సీతను రాముని నమస్కరించి యూరకె నింటికి వెడలెను, ఆరాత్రిగడచిన పిమ్మట ప్రాతఃకాలమునలేచి నామె గోష్ఠమున (ఆవులదొడ్డి) కుఁబోయి కొంతసేపుండి, యచ్చట, "అహంమా" యను ఆవుదూడయొక్క పలుకులను బలుమారువినెను, యాపలుకులను విని మనంబుననిట్లు మననముఁజేసెను, అహంమా, అహంమా, యని యేల దూడ లిట్లుపలుకుచున్నవి ? ఇవి నన్నేమని పలుమారు బోధించుచున్నవి ? అని క్షణకాలమట్లు ధ్యానమును జేసి హృదయమునఁ జక్కగా విచారించి దూడల వాక్యములనుండి అజ్ఞానముఁదొలగి యానందమునంది శ్రీరాముని సాన్నిధ్యము నకువచ్చి శ్రీరామునికిఁ బ్రణమిల్లి లక్ష్మీభర్తయగు రామా? విష్ణుమూర్తీ ? ఆవుదూడమాటలచే చక్కగ జ్ఞానమును బొందితిని నీవలననే నాయజ్ఞానమునశించినది, నీయుపదేశమునందు కొంచమైన నిఁక యపేక్షలేదు, సుజ్ఞానముఁ బొందిన నేను నీకంటె వేరుగాలేను, అనిన కౌసల్యతో శ్రీరాముఁడు 'తల్లీ? దూడపలుకులచే నీకెట్లు జ్ఞానములభించినది ? యాసంగతిని జెప్పుమని యడిగెను, అందుకు కౌసల్య "రఘురామా ? అహంమా, యను యాదూడ పలుకులను వింటిని ఇవి నన్నేమని బోధించుచున్నవని విచారించగా కొంతసేపటికి వాక్యార్థమిట్లు ఫలితార్థంబయ్యె, జనులారా? నేను వలదని పలకండి, అని చెప్పినట్లయినది, దూడ లిట్లు బోధించుచున్నవి, జనులు వానినెఱుఁగరు, అహం, మను శబ్దము దేహపరము దానినెప్పుడు నేను వదలితినో ? 'అప్పుడు' నేను దేహిని, నేనుతల్లిని, *అను నీమమకార బుద్ధి మాయమయ్యె. దేహమను భ్రాంతి యెప్పుడు నశించినదో యప్పుడు నేమియు మిగులలేదు, బ్రహ్మమొక్కటియే మిగిలినది, శ్రీరామా ? సుఖదుఃఖములు దేహమునకేగాని నాకులేవు, ఈదేహముండిన నుండుగాక, పోయిన పోవుగాక, దేహము భోగములకాశ్రయంబు, నేనైననో దేహమునకంటె భిన్నముగ నున్నాను, ఇది వేఱొకయుపాధివలనఁ దెలియఁబడినది, సూర్యుఁడెట్లు యుపాధిభేదముచేత కుండలో కనుఁబడునో ? అట్లె నీకంటె నేను భిన్నముకాను, నేనే బ్రహ్మస్వరూపం బనఁబడితిని గదా ? అనిచెప్పగా నాతల్లి పలుకులను విని శ్రీరాముఁడు స్మితాననుఁడై తల్లీ నీవు ముక్తనైతివి సంశయములేదు, ఆవుదూడ మాటను జక్కగా విచారించితివి, ఈతత్వమునె మననముచేసి బుద్ధియందు దృఢముగ నుంచుకొనుము, అమ్మా ? నేనెందుకు మీకుపదేశింపక నిట్లుచేసితినో ? వినుము, ఉపదేశించువాఁడు గురువనఁబడును, మీకునేనుఁ బుత్రుఁడను, ఎట్లుపదేశించెదను ? మఱియు, స్త్రీలకు పతియేగురువు, మఱియొకఁడులేదు, కావున నానోటినుండి యుపదేశింపలేదు, మీవలననే మీకుపదేశము గలుగునటులఁ జేసి

తిని, పౌరులకును వారివారి తండ్రులు, పురోహితులును, గురువుగాను౦దురు, కావున దూతవాక్యంబులచే వారిలో వారికి జ్ఞానము స్ఫురించునట్లు చేసితిని, పరులముఖమునవలననే యుపదేశమునిట్లు చేయించితిని, అమ్మా? యిఁక నింటికి పొమ్ము సుఖముగా నన్నే చింతింపుచుండుము, అని చెప్పగా నిజమందిరముఁ జేరి సుఖముగనుండెను, ఇట్లు శ్రీరామునిచే బోధింపఁబడిన వారలగు ముప్పురు తల్లులును దనుతమ ఆయుఃపరిమితి దీరినపిదప వారివారిదేహములను వదిలిరి. శ్రీరాముని సాన్నిధ్యబలముచే నందఱును దివ్యవిమానములనెక్కి శ్రీరాముని చేతనే సత్కృతు లగుచు నిత్యానంద వైకుంఠమును జేరి విష్ణుసాయుజ్యము నొందిరి. శిష్యుడా? శ్రీరామాదులచేతి మీాకుగా నేవనితామణులకు పరలోకక్రియా నులు జరిగినవో? ఆస్త్రీలుగదా ధన్యలు, వారిభాగ్యమే భాగ్యము. వారి చరితమును వర్ణించితిని.

ఇట్లని శ్రీమదానంద రామాయణమునందలి మనోహరకాండమునందు రెండవసర్గము సంపూర్ణము.

శ్రీవిష్ణుదాసుఁడు. అడుగుచున్నాఁడు, గురూత్తమా? శ్రీరాముపు బ్రహ్మోపాసకులగు మానవులుగుచేత శ్రీరాముని మానసపూజ నెట్లుచేయవలయు? సుభప్రదంబగు బాహ్యపూజ నెట్లొనర్పవలయు? శ్రీరామోపాసన నెట్లు గ్రహింపవలయు? ఉత్తమంబగు నుపాసనయేది? శ్రేష్ఠుఁడగు నాచార్యుఁ డెవ్వఁడు? భక్తులకు సిద్ధిప్రదంబులైన శ్రీరామ మంత్రంబు లెవ్వి? ఏతిథి శ్రీరాముని కానందముఁ గలిగించునది? యాశ్రీరామునికిఁ దృప్తిని గలిగించున వేవియేవి? శ్రేష్ఠుఁడగు దేవుఁడెవ్వఁడు? ఎవని యుపాసనను గ్రహింపవలయు? నదియంతయు సవిస్తరముగ నాకుపదేశింపుమని విష్ణుదాసుఁడడుగగా నంతనా శ్రీరామదాసుఁ డిట్లు నిరూపించుచున్నాఁడు, శిష్యుఁడగు విష్ణుదాసా? బాగుగనడిగితివి వానిని వివరించెదను, సావధానముగ వినుము, మొదట నుత్తముఁడగు నాచార్యుని వానిలక్షణంబులచేఁ బరీక్షించి తెలిసికొని బ్రాహ్మణోత్తములు పుణ్యతీర్థస్థలంబులయందు విధిప్రకారంబుగ నాగురువునుండి యుపదేశమును బొందవలయును, కావున, ముందుగ గురువుయొక్క లక్షణములను నీయొకుటఁ జెప్పుచున్నాను. క్రోధముఁగలవాఁడు, కుష్ఠాదిమహారోగంబులు గలవాఁడు, మలినుఁడు, దయలేనివాఁడు, జడుఁడు, వివేకములేనివాఁడు, దూషకుఁడు విషయాసక్తుఁడు, దంభము గలవాఁడు, గర్వముగలవాఁడు, దుష్టమైన బుద్ధిగలవాఁడు, దుష్కులమునఁ బుట్టినవాఁడు, హింసఁ జేయువాఁడు, పరులవంచించువాఁడు, పరద్రవ్యముల నపహరించువాఁడు, జితేంద్రియుఁడు కానివాఁడు, వేదబాహ్యుఁడు, జారుఁడు, పరులయందు దోషముల నారోపించువాఁడు, లోభి, బుద్ధినిజయించనివాఁడు, వేదములను, దేవ

తలను, బ్రాహ్మణులను, యతులను, తీర్థములను, గోవులను అగ్నిని, సూర్యుని, తులసి మొదలగు పవిత్రవస్తువులను ద్వేషించువాఁడు, నిట్టివాఁడెన్నటికిని గురు వనఁబడుటకు తగడుగదా? ఇఁక సర్వధర్మముల నెఱింగినవాఁడును, శాస్త్రము లందు విచక్షణుఁడును సత్యసంధుఁడు, మితభోజి, జ్ఞానముగలవాఁడు, విద్యలు గల వాఁడు, బ్రహ్మకులమున జనించినవాఁడు, సత్కర్మములయందు నిష్ఠగలవాఁడును, ధర్మముల నుపదేశించువాఁడును, యోగాభ్యాసమునందు నేర్పరియు, యోగము గలవాఁడును, భూతములయం దన్నిటియందును సమమగు బుద్ధిగలవాఁడును, సర్వకర్మముల నాచరించినవాఁడును, తీర్థముల సేవించినవాఁడును, ధర్మాధర్మ పరిశీలుఁడును, తత్వచింత గలవాఁడును, బ్రహ్మచారియైనను గృహస్థుఁడైనను యతియైనను, తనయాశ్రమమును బరిపాలించుకొనువాడును, మంచిబుద్ధి గలవాఁడును, జయించిన యింద్రియములుగలవాఁడును ఓర్పుగలవాఁడును, దయగలవాఁడును, మృదువగు మాటలు గలవాఁడును, సుముఖుఁడును, చల్లనిచూపుగలవాఁడును, నిద్రాలసుఁడుకానివాఁడును, మంచిప్రయత్నము గలవాఁడును, శాంతస్వభావము గలిగినవాఁడును పరులను సంతోషపరచువాఁడును, ఉదారబుద్ధిగలవాఁడును, జ్ఞాననిష్ఠుఁడును, శుచియైనవాఁడును, పరిగ్రహపరాఙ్ముఖుఁడును, అయినవాఁ డెవ్వఁడో వాఁడే ఉత్తమగురువనఁబడును, అట్టివానిని జక్కఁగ సేవించి వానియను గ్రహమునుబొంది యాతనివలన దేవతోపాసనంబును పుణ్యస్థలంబున విధిప్రకారం బుగా గ్రహింపవలయు, ఉపాసనలు, సాత్వికోపాసనము, రాజసోపాసనము, తామ సోపాసనము, అని మూఁడు తెఱంగులయుండును, అందు భూతప్రేతపిశాచాదుల నుపాసించునట్టిదియు, క్రూరమైనదియునగు తామసోపాసనము నింద్యము, దేవతల నుపాసించుట సాత్వికోపాసనమనఁబడును, రక్షోయక్షులనుపాసించుట రాజసోపా సనమనఁబడు, మఱియు, శైవంబులు, సౌరంబులు, గాణేశంబులు, శాక్తంబులు, వైష్ణవంబులు, అనుయవతారంబులైదు లోకమునఁగలవు, బ్రాహ్మణాదులు గురు ముఖమునుండి వీని యుపాసనలను గ్రహించవలయును, అయినను, అయిదువిధం బులగు నవతారంబులలోను పరమోత్తమంబులగు నలువదినాలుగు మహావిష్ణుని యవతారంబులను నిరూపించుచున్నాను అవి ఏవనిన? పురుషోత్తమావతారం బు, బ్రహ్మావతారంబు, రుద్రావతారంబు, నారాయణావతారంబు, హంసావతా రంబు, దత్తాత్రేయావతారంబు, కుమారావతారంబు, ఋషభావతారంబు, హయగ్రీవావతారంబు, మత్స్య, కూర్మ. వరాహ, నారసింహ, వామన, పరశు రామ, శ్రీరామ, కృష్ణ, బౌద్ధ, కల్కి, యను. దశావతారంబులు, యజ్ఞ, హరి, వాలఖిల్య, ఉద్ధారక, పృథు, ధన్వంతరి, మోహిన్యవతారంబులు, నారద, వ్యాస, కపిలావతారంబులు, కేశవ, మాధవ, గోవింద, మధుసూదన, త్రివిక్రమ శ్రీధర, పద్మనాభ, దామోదర, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, అధోక్షజ,

అచ్యుత, జనార్ధన, ఉపేంద్ర, హృషీకేశావతారంబులును చేరి, 44, విష్ణ్వవతారంబులు, మహోత్కృష్టంబులు వానిలో మత్స్యాదిదశావతారంబులు పరమోత్కృష్టంబులు, ఆపదియవతారంబులలోను రామకృష్ణావతారంబులు రెండును అత్యంతోత్తమంబులు, ఆరెండిటిలోను సత్యసంధుఁడును, ఏకపత్నీవ్రతుఁడును, ఏకబాణుఁడును, మహావీరుఁడును, రాజేంద్రుఁడును, సప్తద్వీప పరిపాలకుఁడును, శ్రీమంతుఁడును, అనన్యసాధారణ మహారాజలక్షణుఁడును నగు శ్రీరాముని యవతారంబు యుత్తమోత్తమంబై యొప్పుచున్నది. యని తెలిసి గురు వుపదేశించిన విధిప్రకారము శ్రీరామోపాసనను పుణ్యస్థలంబున సుముహూర్తమున గ్రహించి యుపాసించవలయు. అటుగాదేని. యేదేవత నుపాసించఁ దలతురో ఆదేవతయొక్క జన్మనక్షత్రమునందును, తిథియందును యాదేవత నుపాసించవలయు, శ్రీరాముని జన్మ దినంబగు చైత్రశుక్ల నవమినాఁడు శ్రీరామమంత్రోపాసన నాచరించి యుపాసనానంతరము శ్రీరాముని భక్తితోఁ బూజించవలయు. ఇట్లు, నే యవతారంబునైనను తత్తజ్జన్మదినంబున నుపాసించి మహోత్సవంబులతోఁడ నారాధించవలయు,

* దశావతారకాల నిరూపణము. *

ఇఁక దశావతార జన్మదినంబుల నుడివెద వినుము. చైత్రశుక్లపంచమి నాఁడు అపరాహ్ణకాలంబున భగవంతుఁడు మత్స్యావతారంబును, జ్యేష్ఠశుక్ల ద్వాదశియందు సాయంకాలమున కూర్మరూపంబును చైత్రకృష్ణనవమినాఁ డపరాహ్ణంబున వరాహావతారంబును. వైశాఖశుక్ల చతుర్దశినాఁడు సాయంకాలమున నృసింహావతారంబును, భాద్రపద శుక్లద్వాదశినాఁడు మధ్యాహ్నమున వామనావతారంబును, వైశాఖ శుక్ల తృతీయనాఁడు మధ్యాహ్నమున పరశురామావతారంబును, చైత్రశుక్ల నవమినాఁడు మధ్యాహ్నమున శ్రీరామావతారంబును, శ్రావణ కృష్ణాష్టమీనాఁడర్ధరాత్రమున శ్రీకృష్ణావతారంబును, పుష్యశుక్ల సప్తమినాఁడు సాయంకాలమున బుద్ధావతారంబును, మాఘశుక్ల తృతీయనాఁడు సాయంకాలమున కల్కియవతారంబును లోకానుగ్రహార్థంబుకై చేసినాఁడు, వీనిలో కాలవ్యాప్తి రెండుదినంబులయందును సమానముగానుండిన యెడల పూర్వదినమే పూజ్యంబై యుండును, ఇట్లుఁగాఁగి ఆయా యుపాసన లాచరించువారు నిత్యపూజనంబుల నాచరించుచు నాయా యవతార దినమునందు విశేష మహోత్సవముల సంతోషముతో నాచరించవలయు, గురూపదిష్ట మంత్రంబులను నిత్యము మనంబున ననుసంధానముఁ జేసి జపించవలయు, అందు, శ్రీరామమంత్రంబు లనేకములు గలవు, నూఱు, యక్షరంబులు గల మంత్రంబు, అట్లే ౫౦-౪౨-౩౨-౨౭-౨౫-౨౪-౨౧-౨౦-౧౮-౧౬-౧౫-౧౪-౧౩-౧౨-౧౧-౧౦-౯-౮-౭-౬-౫-౪-౩-౨-౧ ఏబది మొదలు ఏకాక్షరమంత్రము వరకును,

శ్రీరామమంత్రంబులు నూఱులకొలఁది* వేలకొలఁదిగా నున్నవి. వానిలో గురువు నుండి యొకమంత్రమును యుపదేశముఁబొంది శ్రీరామసాన్నిధ్యమున జపమాచరించవలయు, శ్రీరామోపాసకులగు మానవోత్తములు ఉపాసనావిధానంబును, మంత్రస్వరూపంబును, మంత్రశాస్త్రమునుండి తెలియవలయును, ఇప్పుడు నేనిచ్చట దండకారణ్యమునందు సుతీక్ష్ణమునికి నగస్త్యమహాముని యిచ్చిన మానసపూజా విధానంబును జెప్పుచున్నాను,

* అగస్త్యునిచే నుపదిష్టమగు శ్రీరామోపాసనావిధి *

ఒకప్పుడు సుతీక్ష్ణుఁడు అగస్త్యమునిని జూచి పరమభక్తితోఁ బ్రణమిల్లి వినయపూర్వకముగా నిట్లడిగెను, స్వామీ? హృదయమున మానసపూజనంబు నెట్లు చేయవలయును? శ్రీరాముఁ డెన్నివిధంబులగు నుపచారంబులచేఁ బూజింపఁ బడుచున్నాఁడు? అనిన సుతీక్ష్ణునికి నగస్త్య మునీంద్రుఁడు చెప్పుచున్నాఁడు, తామరరేకులవలె విశాలమైన నేత్రములుగలవాఁడును, నల్లనిమేఘమువంటి శరీరకాంతి గలవాఁడును, నగుమోముగలవాఁడును, సంతోషమున గూర్చుండువాఁడును, నగు శ్రీరామస్వామిని హృత్కమలమున ధ్యానించవలయును, రాగద్వేషాదులచేఁ గలుషంబగు మనంబును వైరాగ్యముచేత బాగుగ నిర్మలముచేసి సంసారమను బంధమును వదల్చుకొనుటకు శ్రీరాముని ధ్యానించవలెను, ప్రాతఃకాలమున లేచి తంద్రలేనివాఁడై శౌచాదియాచారములచేఁ బరిశుభ్రమగు దేహముగలవాఁడై రహస్యప్రదేశమున ధ్యానమును పూజనమును నారంభింపవలెను, పిదపఁ దనహృదయమును నాభియను కందమునుండి బుట్టినదియు అరటిపూవువలె నుండునదియు ఎనిమిది పత్రములు గలదియు, స్నిగ్ధవర్ణము కలదియునగు పద్మమునుగా ననుసంధానముఁజేసి యాపద్మమును రామనామముచేతనే వికసింపఁజేసి దానిమధ్యమున సూర్యచంద్రాగ్ని మండలముల నొకదానిపై నొకటిగ ధ్యానము చేసి దానిమీఁద దివ్యరత్న పీఠంబును ధ్యానముచేసి దానిమధ్యప్రదేశమున కోటిసూర్యప్రకాశమానుఁడును నల్లకలువవంటి దేహకాంతి గలవాఁడును, శాంతుఁడును, విశాలనేత్రుఁడును, గొప్పదగు యురము గలవాఁడును, ప్రకాశమాన దివ్య కుండలాలంకృతుఁడును సునాసుఁడును, సుమకుటుఁడును, అందమగు చెక్కిళ్లు గలవాఁడును, తెల్లని నగవుగల వాఁడును, జ్ఞానముద్రగలవాఁడును, ద్విభుజుఁడును, కంబుగ్రీవుఁడును, మంచికుంతలములు గలవాఁడును, నానారత్నహారములచే భూషితుఁడును, అవ్యయుఁడును, మెరుపుతీగల గుంపువంటి కాంతిగలవాఁడును, వస్త్రయుగ్మమును ధరించినవాఁడును, పాపముల నశింపఁజేయువాఁడును, వీరాసనాసీనుఁడును, పారిజాత వృక్షముక్రిందఁ గూర్చుండువాఁడును, దివ్యగంధముచేఁ బూయఁబడిన యంగముగలవాఁడును, వనమాలను ధరించినవాఁడును, నగు శ్రీరామచంద్రస్వామిని, కుడిప్రక్క బంగారు

చాయగలిగిన లీలాకమలమును వాల్చి మ్మంగళముఖియై నగుచు దివ్యాభరణం బులను ధరించి ప్రేమార్ద్రి దృష్టిచే నవలోకించుచుండు సీతాదేవిని, ఛత్రచామ రములను జేతఁ బూని సేవించుచుండు లక్ష్మణుని, సంతతము బరివేష్టించియుండు హనుమంతుఁడు మొదలగు కపీంద్రులను, స్తోత్రముసేయుచుండు మునీంద్రులను, సేవించుచుండు భరతాదులను, ప్రణమిల్లుచుండు సనందనాది యోగీంద్రులను, ధ్యానించవలెను. ఇయ్యది సర్వశాస్త్రార్థ తత్వకుశలుఁడును, యోగము నెఱింగిన వాఁడును, యోగసిద్ధినిచ్చువాఁడు నగు శ్రీరామచంద్ర పరబ్రహ్మముయొక్క ధ్యానక్రమంబు, ఇట్లు శ్రీరాముని ధ్యానముచేసి, "ఆవాహయామి విశ్వేశం" అను మంత్రంబుచే నావాహనంబును, "రాజాధిరాజ రాజేంద్ర" యను మంత్రం బున రత్నసింహాసన సమర్పణంబును, "రఘునందస రాజర్షె" యను మంత్రంబున అభిముఖీకరణంబును, "ప్రసీదజానకీనాథ" యను మంత్రంబుచే ప్రసన్నభావం బును, "శరణం మే జగన్నాథ" యను మంత్రంబున శరణాగతి నొందుటయును, "పాద్యం గృహాణ రాజర్షే" యను మంత్రంబున పాద్యసమర్పణంబును, "గృహా ణార్ఘ్యంమయాదత్తం" మ్మను మంత్రంబుచే నర్ఘ్యసమర్పణంబును, "మధు పర్కం గృహాణేమ" మ్మను మంత్రముచే మధుపర్కనివేదనంబును, "గృహా ణాచమనం దేవ" యను మంత్రంబున నాచమనార్పణంబును, "స్నాపయిష్యా మ్యహం భక్త్యా" యను మంత్రంబున స్నానకైంకర్యంబును, "సంతప్తకాంచన ప్రఖ్య" మ్మను మంత్రంబుచే వస్త్రసమర్పణంబును, "శ్రీరామాచ్యుతయజ్ఞేశ" యను మంత్రంబుచే యజ్ఞోపవీతధారణంబును, "కిరీటహార కేయూర"యను మం త్రంబున దివ్యాభరణార్పణంబును, "కుంకుమాగరు కస్తూరీ" యను మంత్రం బున గంధార్పణంబును, "తులసీ కుందమందార" యను మంత్రంబుచే పుష్ప పత్రాద్యర్పణంబును, "వనస్పతి రసైర్దివ్యై" ర్యను మంత్రంబుచే ధూపార్ప ణంబును, "జ్యోతిషాం పతయేతుభ్యం" అను మంత్రంబుచే దీపార్పణంబును, "ఇదం దివ్యాన్నమమృతం" అను మంత్రంబుచే నైవేద్యసమర్పణంబును, "నాగ వల్లీదళైర్యుక్తం" మ్మను మంత్రంబుచే తాంబూలార్పణంబును, "మంగళార్థం మహీపాల" యను మంత్రంబుచే నీరాజన సమర్పణంబును, "ఓం నమః శ్రీభగ వతే రామాయ పరమాత్మనే" యను నెనిమిది నమస్కారమంత్రంబులచే నమ స్కారంబులును, "నృత్య గీతాదివాద్యాది" యను మంత్రంబులచే నృత్య గీతాది సకల రాజోపచార సమర్పణంబును, "అంతః కరణ సంశుద్ధిం" అను మంత్రం బులచే దన మనంబును నిర్మలముగఁ జేయుమని ప్రార్థనంబును, "నమోనారాయ ణానంత" యనుమంత్రంబులచే సంసారసాగరమునుంచి దాటింపుమని ప్రార్థనం బును, "రామచంద్ర మహేష్వాస" యను మంత్రంబుచే తాపత్రయాగ్నులనుండి దప్పింపుమని ప్రార్థనంబును, "శ్రీకృష్ణ శ్రీకర శ్రీశ" యను మంత్రంబుచే

గర్భజన్మదుఃఖాదులనుండి తొలగింపుమని వేడుటయును మొదలగు సగుణ నిర్గుణ బ్రహ్మనామంబులచే శ్రీరామస్వామిని స్తోత్ర మొనరించి "తత్తజ్జాంబూనదేనైవ" యను మంత్రంబుచే సువర్ణ పుష్పమునర్పించి, "హృత్పద్మ కర్ణికామధ్యే" యను మంత్రంబున సపరివారముగ నీవు నాహృదయమందు నివసింపుమని ప్రార్థించి, "తత్సర్వం ప్రీతయే బ్రూయాత్" అను మంత్రంబుచే సర్వము శ్రీరామార్పణ మస్తు యని వచించి, "అపరాధసహస్రాణి" యను మంత్రంబున యపరాధ క్షమాపణమును వేడి, "నమస్తే జానకీనాథ" యను మంత్రంబున పునరర్ఘ్యము నొసంగవలయును ఇట్లు, మానసమునఁగాని, వెలుపలఁగాని యొక్కమారు పూజించినమాత్రమున మనుష్యుఁడు శ్రీరామ సాయుజ్యమునొందును, ఇంక చెప్పునదేమి? సంతత మిట్లు పూజించినవాఁడు ఇహపరములనందును సమస్త కామముల ననుభవించును, ఓ సుతీక్ష్ణుఁడా? నీవడిగిన శ్రీరామ మానసపూజా విధానంబును యిట్లుపదేశించితిని, అని యిట్లగస్త్యమునీంద్రుఁ డుపదేశించిన శ్రీరాము పూజావిధానము నుపదేశించితిని, ఓవిష్ణుదాసా? ఇంక బహిః పూజా విధానమును వినుము,

* శ్రీరామ పరబ్రహ్మ యొక్క బహిః పూజావిధానము. *

మనుష్యుఁడు ప్రాతఃకాలమున లేచి శౌచాదిక్రియలను పిదప స్నాన సంధ్యాది కర్మలను నెఱవేర్చి దేవపూజ నారంభించవలయును. తీర్థంబుననో, దేవాలయంబుననో, ఆవులను గట్టుచోటుననో, పుణ్యస్థలంబులనో, నదీతీరంబు ననో, ఎంతైన నొకచోట గోమయముచే నేలనలికి ముగ్గుపిండిచే పద్మములను వ్రాసి, వానిలో తెలుపు, యెఱుపు, పసుపు, ఆకుపచ్చ, నిలము, నలుపు, మొద లగు రంగులచేతఁ జిత్రముగానించి దానిపైన ౧౦౦౮ అష్టోత్తరసహస్రముగాని ౧౦౮ అష్టోత్తరశతముగాని రామలింగములచే చిహ్నితమగు యాసనంబునైనను, ౧౦౦౮ గాని ౧౦౮ గాని రామభద్రవిగ్రహములచే చిహ్నితమగు పీఠాసనంబున నైనను, మఱియు నెన్నియో లఘ్వాసనంబులు గలవు వానిలోనే దేని నొక్కటి నైనను జిత్రములచే నలంకృతముఁ జేసి యట్టి పీఠముమీద పూలతోగాని పత్ర ములచేగాని శుభ్రవస్త్రముచేగాని యాసనముపరచి యచ్చట నట్టి సర్వతోభద్ర పీఠమధ్యమున దివ్యరత్న సింహాసనాసీనుఁడగు శ్రీరామమూర్తిని సీతాదేవి తోడఁ బ్రతిష్ఠించి రామునికివెనుక లక్ష్మణస్వామిని, కుడిప్రక్క భరతుని, ఎడ మప్రక్క శత్రుఘ్నుని, ముందుభాగమున నాంజనేయుని, వాయవ్యభాగమున సుగ్రీవుని, ఈశాన్యభాగమున విభీషణుని, ఆగ్నేయభాగమున యంగదుని, నై ఋతిభాగమున జాంబవంతుని బ్రతిష్ఠించి యారాధించవలయు. పూజయొనర్చు నప్పుడు తూర్పుదిక్కునకుఁ దిరిగి యుండవలయును, అన్ని శాస్త్రంబులయందు నిట్లే పెద్దలు వచించుచున్నారు, లక్ష్మణుని హస్తమునందు ముత్తియముల గొడు

గును, భరతుని హస్తమందు బంగారు చామరమును, శత్రుఘ్నుని కరమునందు
చిత్రవర్ణములుగల విసనకఱ్ఱయును, ఆంజనేయుని కరంబుల శ్రీరాముని పాదు
కలను, సుగ్రీవుని కరంబున మనోహరంబగు జలపాత్రంబును, విభీషణుని కరం
బున నుత్తమంబగు యద్దంబును, అంగదుని కరంబున తాంబూలపాత్రంబును,
జాంబవంతునికరంబున వస్త్రములపెట్టెను, నలంకరింపవలయు, నియ్యాది నవా
యతనవిధి యండ్రు, అటుగాకున్న, దివ్యపీఠమధ్యమున సీతారాములను, వారి
కిరుప్రక్కలను భరతశత్రుఘ్నులను, వెనుకభాగమున లక్ష్మణస్వామిని, ముందు
భాగమున నాంజనేయుని నిట్లు " పంచాయతన, మూర్తులనైనను స్థాపించ వల
యు. మఱియు, మధ్యమున సీతారాములను, వెనుకలక్ష్మణుని, ఎదుట నాంజనే
యుని, భద్రాసనముమీద స్థాపించి పూజించ వలయు, అదియుఁగాక, సీతా
లక్ష్మణులతోఁ గూడిన శ్రీరామునినైనఁ బూజించవచ్చును, గాని, లక్ష్మణుని
విడచి కేవలము రాముని, సీతను మాత్రము బూజింపరాదు, అట్లొనర్చిన, నయ్యా
దిమిగుల విఘ్నములఁ గలిగించును. ఇదినిశ్చయము, పైఁజెప్పఁబడిన ప్రకా
రములలో నవాయతనపూజ మిగుల శ్లాఘ్యము శుభప్రదమునైనది. పంచా
యతన పూజమధ్యమంబు, ముఖ్యాను దేవతలుగల పూజకనిష్ఠము, సీతారాముల
నిరువురినే యారాధించుట మిగులకనిష్ఠము, శ్రీరామునివామహస్తమున కోదం
డంబును, వామభుజంబున నంబులపొదియును, కుడిచేతియందు రామబాణమును
ధరించినట్టి శ్రీరామస్వామిని ప్రతిష్ఠించి యారాధించవలయును, ఆరాధించు
వాఁడు తనకెడమభాగమున నుదకకలశమును, తనకు దక్షిణభాగమున పూజా
పాత్రమును, తనయెదుట నొకపెద్ద పళ్లెరమును నుంచుకొని తూర్పుదిక్కున కభి
ముఖముగ పద్మాసనమునఁ గూర్చుండి శుచియై మౌనముగాని తులసీమణి
మాలను ధరించి నిశ్చలమైన మనంబుగలవాఁడై ముడివైచికొనినజుట్టు గలిఁగిన
వాఁడును, పరిశుభ్రమైన వస్త్రములు గలవాఁడును పవిత్రమును ధరించినవాఁ
డును, శుద్ధమగు ద్వారకయందు బుట్టిన మృత్తిక చేత తిలకమును ధరించినవాఁడై
మొదట గణపతికి మ్రొక్కి తిథివారాది సంకల్పముఁ జేసి భూశుద్ధిని భూతశుద్ధిని
అంగన్యాసాదుల నాచరించి క్రమముగ ప్రోక్షణ పాత్రమును జలపూర్ణ పాత్ర
మును బెట్టికొని గంధపుష్పాక్షత దూర్వాదులచే కలశపూజన మొనరించి యాక
లశ మందుండు జలముచే పూజాద్రవ్యముల నెల్లఁ బ్రోక్షించి తనశిరమును ప్రో
క్షించుకొని పాద్యమునకును అర్ఘ్యమునకును ఆచమనమునకును మూడుపాత్ర
ములను వేఱువేఱుగానుంచి గణరాజును బూజించి యనంతరమందు వరుణునిఁ
బూజించి శంఖము నర్చించి ద్రవ్యములను, తనను బ్రోక్షించుకొని ధేనుముద్రను,
శంఖముద్రను, చక్రముద్రను, గరుడముద్రను జూపించి, శిలాప్రతిమ, దారువి
గ్రహము, లోహబింబము, చందనాదులచేఁ జేయఁబడిన ప్రతిమ, చిత్రప్రతిమ,

ఇసుకబొమ్మ, మణిమయ విగ్రహము, మనోమయమూర్తి, యను నెనిమిది విధంబులగు ప్రతిమలలో దేనినైనను నిట్లుధ్యానించవలయు. సీతాదేవితోఁగూడినట్టియు, ఎదురుగనున్నట్టియు, రెండుభుజములుగలిగినయట్టియు, ధరించిన ధనుర్బాణ తూణీరములుగలిగి నట్టియు, దివ్యాలంకారములతో నిండినట్టియు, పచ్చని పట్టువస్త్రమును ధరించినట్టియు లక్ష్మణభరత శత్రుఘ్నులతోఁ గూడినట్టియు, ఎల్లపు డాంజనేయునిచే సేవింపఁబడు పదద్వయము గలిగినట్టియు, రత్నసింహాసనమునన్నట్టియు, తెల్లనిగొడుగు గలిఁగినట్టియు, దివ్యచామరవీజితుఁడును, విభీషణునితోఁ గూడినట్టియు, సుగ్రీవునిచే నమస్కరింపఁబడినట్టియు, అయోధ్యావాసియునగు శ్రీరామచంద్రు నిట్లు హృదయమున ధ్యానముచేసి, "సీతారామ సమాగచ్ఛ" యనుమంత్రంబున యావాహనంబును, "హిరణ్మయం రత్నయుక్త" మ్మనుమంత్రముచే సింహాసన సమర్పణంబును, "చందనాగరు సంయుక్తైః" అనుమంత్రంబుచే పాద్యసమర్పణంబును, "పుష్కరాదిఘుతీర్థేషు" యనుమంత్రంబున నర్ఘ్యంబును, "సుగంధవాసితంతోయ" మ్మనుమంత్రంబున నలుగును, "కామధేనూద్భవం క్షీర" మ్మనుమంత్రంబులచే పంచామృత స్నానంబును, "గంగాచ యమునాస్త్యైన" అనుమంత్రంబులచే శుద్ధజలస్నానంబును, "పునరాచమనం రమ్య" మ్మనుమంత్రంబున పునరాచమనంబును" "సువర్ణతంతుభిశ్చిత" మ్మనుమంత్రంబున వస్త్రార్పణంబును, "శుద్ధం హేమమయం రమ్య" మ్మనుమంత్రంబున యజ్ఞోపవీతార్పణంబును, "మకుటంకుండలైరమ్యై" యనుమంత్రంబున ఛత్రచామరాది సమర్పణంబును, "సుగంధ చందనం దివ్య" మ్మనుమంత్రంబున గంధార్పణంబును, "అక్షతాంశ్చవరాన్ దివ్యాన్" అనుమంత్రంబున అక్షతార్పణంబును, "మాల్యాదీని సుగంధాని" యనుమంత్రంబున పుష్పంబులను, "వనస్పతి రసోద్భూత" అనుమంత్రంబున ధూపంబును, "సాజ్యంత్రి వర్తిసంయుక్త" మ్మనుమంత్రంబున దీపంబును, "భక్ష్యభోజ్యైశ్చ సంయుక్త" మ్మనుమంత్రంబున నైవేద్యంబును, "ఆమ్రాదీనిసుపక్వాని" అనుమంత్రంబున ఫలంబులను, "పూగీఫలసమాయుక్త" మ్మనుమంత్రంబున తాంబూలంబును, "హిరణ్యం బ్రహ్మసంభూత" మ్మనుమంత్రంబున దక్షిణయు నర్పించి, ఇట్లు ఆవాహనాది షోడశోపచారంబులఁ బూజచేసి "పంచవర్తి సమాయుక్త" మ్మనుమంత్రంబున పంచార్తిక నీరాజనంబును జాజి, సంపగి, పారిజాత, మొగలి, తులసి, దవనము. మొల్లలు, నల్లయగసి, బృహ్మతీపుష్పము, నను నీతొమ్మిది పూలచేతను మంత్రపుష్పార్పణంబును "యానికాని చపాపాని" యనుమంత్రంబునసకలపాప పరిహారంబుగా ప్రదక్షిణంబును, "ఉరసాశిరసాదృష్ట్యా" యనుమంత్రంబున సాష్టాంగ ప్రణామంబును, "ఆవాహనంనజానామి" యనుమంత్రంబున తనయజ్ఞానమువలన నేదేనిలోపము లుం

డినివానిని క్షమింపుమని ప్రార్థనంబును, యొనర్చవలయు, అట్లు శ్రీరాముని పూజ
నంబును భక్తితో నిత్యము చేయవలయును, మఱియు, నవమియందు విశేషఫల
ప్రదంబుగనుండును, అని శ్రీరామదాసుఁడుపదేశించెను, అంత విష్ణుదాసుఁడు,
గురూత్తమా? శ్రీరాముని యారాధనంబును వింటిని, మఱియు ననేకదేవతా
పూజలను వింటిని, గాని, ఎచ్చటను నవపుష్పాంజలి చెప్పఁబడియుండలేదు. శ్రీరా
ముని పూజించునప్పుడు నవపుష్పాంజలి నెట్లు యర్పించవలయునయ్యా? శ్రీరా
మునికి ప్రీతికరంబగుటకు కారణం బెయ్యదియన?

నవపుష్పాంజలి ప్రస్తావమున నవరామోపాఖ్యానము

విష్ణుదాసునికి శ్రీరామదాసుఁడిట్లు నిరూపించుచు. వత్సా? వినుము.
బాగుగ నడిగితివి సావధానమనంబుతోఁడ వినుము, పూర్వము కావేరీనదికి యు
త్తరతీరంబున రామనాథపురంబను పత్తనంబున సుందరుఁడను బ్రాహ్మణోత్త
ముఁడుండె నాతనికి శ్రీరామధ్యాన పరాయణులైన చంద్రుఁడు, అతిచంద్రుఁడు,
చంద్రాభుఁడు, చంద్రాస్యుఁడు, చంద్రశేఖరుఁడు, చంద్రాంశుఁడు, జితచంద్రుఁ
డు, చంద్రచూడుఁడు, రామచంద్రుఁడు, అనుపేళ్లుగల తొమ్మిదిమంది కొమ
రులుఁ గలిగిరి, వారొకప్పుడు భక్తులయొక్క దయానిధియగు శ్రీరామస్వామిని ద
ర్శించుటకై చైత్రమాసమున నయోధ్యకు వచ్చిరి, అప్పటికచ్చటికి సరయూనదీ
తీరమున శ్రీరామతీర్థ స్నానములు చేయుటకు నానాదేశములనుండి కోట్లకొ
లది జనులు నానావాహనాదులతోఁడ వచ్చిరి. ప్రజలందఱు శ్రీరామ తీర్థమున
స్నానముచేయు సందడిలో ఈ బ్రాహ్మణ పుత్రులకు శ్రీరామ సందర్శనము
లభింపలేదు అంతనా సుందరుని పుత్రులు తొమ్మిదిమందియును. ఇట్లాలోచించిరి
శ్రీరాముని దర్శనము మన కెట్లు లభించును? ఈ జనసంమర్దనమున కానేరదు
ఎట్టకేలకు లభించినను స్వస్థమనంబుతోఁడ సేవించినట్లు సంతోషముగా నుండ
దు, అని యోచించుచుండగా వారిలో పెద్దవాఁడగు చంద్రుఁడు యిట్లనియె, మన
మిచ్చటనే తీక్ష్ణతపముచే శ్రీరాముని దర్శింతము, గాన, తపమున కారంభింపుడన?
నందుకు నందఱును నియ్యది బాగుగనున్నది, ఒకకాలమునందు తపముసేయు
మనలో నెవ్వనికి మొదట దర్శనమిచ్చును? యెవ్వనికి వెనుక దర్శనమిచ్చును?
ఎవ్వని భక్తి దృఢతరంబుగనుండునో, చూడఁదగునని యందఱాలోచించుకొని
యా జనమునకు బహుదూరముగ పోయి యాహారమును వదలి వాయువును భక్షిం
చుచు ఏకాంతమున శ్రీరామధ్యాన తత్పరులై తపముసేయుచుండిరి. అంత,
సర్వజ్ఞుఁడు, సర్వసాక్షియు, భగవంతుఁడునగు శ్రీరాముఁడు తొమ్మిదవనాడు
వారికి దర్శనమీయ దలంచి మనమున క్షణమాలోచించి ఏకకాలముననే వారికి
దర్శన మొసంగిన మొదల సంతోషము సంభవించునుగాని, వేర్వేరుగా దర్శనం
బొసఁగిన సంతోషముగలుఁగదు, కావున నేడు తొమ్మిది రూపములనందెదను,

అనియాలోచించి, లక్ష్మణునిఁబిలిచి నేఁడు బయట వెడలవలయునుగాన పల్లకిని దెప్పింపుమన నతఁడట్లేయని దూతలచే శిబికను దెప్పించి రామునికి విన్నవించెను, అంతనా శ్రీరామచంద్రుఁడు సింహాసనమునుండి దిగి పల్లకియందునెక్కి బంధుమిత్ర మంత్రివర్గాదులతోఁడ సంతోషమున బయలువెడలి యూరు దాఁటి జనసంమర్దమును యతిక్రమించి పిదప నప్పరమేశ్వరుఁడగు శ్రీరాముఁడు తొమ్మిది రూపంబులఁ దాల్చెను, పల్లకీలను బోయిలను దూతలను మంత్రులను మిత్రులను చూడవచ్చిన వారిని మొదలగు నందఱిని తొమ్మిది రూపంబులుఁగల వారినిగ నేర్పరచెను, అంతనందరితోఁడను సుందరుని పుత్రులగు తొమ్మిది మంది చంద్రాంకులగు బ్రాంహ్మణుల యెదుట కేఁగి దర్శనంబొసఁగెను, వారును వారి యెదుట వేర్వేరుగ తొమ్మిది రూపములఁ ధరించియున్న శ్రీరామమూర్తి నవలోకించి సంతోషించుచుఁ బ్రణామంబు లాచరించిరి, శ్రీరాముని తొమ్మిదిరూపములు పల్లకీలనుండి దిగి నొక్కొక వేర్వేరుగ తొమ్మిదిమంది ద్విజుల నాలింగనము చేసికొనెను, మఱియు, నా శ్రీరాములు మధురమైన వాక్యములతోఁడ నో బ్రాహ్మణులారా? మీరు ఘోరమగు తపముచే మిగుల శ్రమనొందితిరి, మీ మనోనిశ్చయమును, దృఢమగు భక్తిని నేనెఱింగి మీకేక కాలమున తొమ్మిది రూపములఁ దాల్చి మీకందఱకు దర్శనమొసఁగితిని, నేనొక్కరూపమున దర్శన మొసఁగుతఱి మీలో నెవ్వనికి ముందు యెవ్వనికి వెనుక నీయందగు నని మనంబున యోజించి యిట్లు నవరూప ధరుండనైతి, గావున మీకుఁ గావలయు వరంబుల వేఁడుఁడు, అనిపలుక, నా రాముల వాక్యముల విని బ్రాహ్మణోత్తములు, ఏవరంబునమాకు పుడమిఁ గీర్తి గలుఁగునో యట్టి వరంబు దయసేయుఁడు, అనిన, నారాములు, ఓ బ్రాహ్మణులారా? మీకొఱకు నే నవరూపంబుల ధరించితిఁ గాన నిది మొదలు భూమియందు నవరాముఁడను ప్రఖ్యాతి నొందెదను, లోకమున తొమ్మిదియను నదంతయు నాకు మిగులఁ బ్రీతికరంబుగ నుండును, అనిన నా వాక్యముల విని యా విప్రులు తమతమ రాముని మిగులఁ గొనియాడిరి, అప్పుడు జనులందఱు రామలక్ష్మణభరతాదు లొక్కొకరు నవరూపంబుల ధరించుట గాంచి నెంతయు విస్మయాంబుధి మగ్నమానసులైరి. పిదప, రాముఁడు శిబికారోహణంబుఁ జేసి బ్రాహ్మణులనీడ్కొలిపి మార్గమధ్యమున మరల నేకరూపము నొందెను, లక్ష్మణాదులుఁగూడ నట్లే యేకరూపధరులైరి, దీనిఁజూచి జనులెల్లను మిగుల నాశ్చర్యము నొందుచుండిరి, పిదప, రాముఁడు బందుగులతోఁడ పట్టణంబునకేతెంచి యంతఃపురంబునకరిగి సీతాదేవి కీవృత్తాంతము నంతయు సవిస్తరముగ దెలిపి సంతసంబున మెలంగుచుండె, దానఁజేసి లోకంబున రాముఁడు నవరాముఁడను నామంబుచేఁ బ్రసిద్ధిఁగాంచి తొమ్మిదియనునదెల్ల నాతనికి ప్రియంబై యుండెఁకి, ఏకాదశరుద్రులు, అష్టభైరవులు, నవదుర్గలు, ద్వాదశాదిత్యులు, ఏక

వింశద్గణపతులు, లోకమునసెట్లు సుప్రసిద్ధులట్లె నవరాములుఁగూడ సుప్రసిద్ధులు, సూర్యునకు పండ్రెండును, శివునకు పదునొకండును, వినాయకునికి నిరువదొకటియు భైరవున కెనిమిదియు, దుర్గకు తొమ్మిదియు, ప్రీతికరంబు లగునట్లు రామునకును తొమ్మిది ప్రియకరంబులు. గాన తొమ్మిది విధంబులగు* పుష్పాంజలులు రామునకు ప్రియంబులు.

ఇది శ్రీమదానంద రామాయణాంతర్గత మనోహరకాండంబున
రామపూజావిధానాది వర్ణనంబను
మూఁడవ సర్గము సంపూర్ణము.

శ్రీరామలింగతోభద్ర సర్వతోభద్రాది ప్రస్తారనిరూపణము

విష్ణుదాసుఁడడిగెను, స్వామీ? మీచేఁ జెప్పఁబడిన అష్టోత్తర సహస్ర రామనామ భద్రప్రస్తారమును వింటిని శ్రీరామార్చనయందు శ్రీరామనామంబులకు భద్రమని సంజ్ఞఁ జెప్పితిరి, ఆభద్రాసనం బెట్టిది? వాని నెట్లు మనోహరముగ వ్రాయవలయు? వానిని సవిస్తరముగ నాకుఁ దెలియునట్లుఁ జెప్పవలయును, ఆపీఠములయందు గల విశేషములు నాకుఁ జెప్పవలయును, అనిన, శ్రీరామదాసుఁడిట్లుఁ జెప్పందొడంగె, విష్ణుదాసా? వాని విశేషములను రచనలను జెప్పుచున్నాను వినుము, వానిలో మొదట అష్టోత్తరశతరామలింగతోభద్రమును నీకు వివరించి చెప్పుచున్నాను, ఇచ్చట ఉపాసింపఁ దగినది రామముద్రయై యున్నది ఉపాసకుఁడు రుద్రుఁడుగా నున్నాఁడు, కావునను, దీనిని పండితులు శ్రీరామలింగతో భద్రంబని చెప్పుచున్నారు, అడ్డముగాను, నిడుపుగాను ౨౦౧ రేఖలను గీయుఁదగు, ఇచ్చట మొదటి యంచున నలుపు, పిదప ఎఱుపు, పిమ్మట తెలుపు, అటుపై పసుపురంగులుగల పరిధుల నేర్పరచునది. మూలలందు మూఁడేసియిండ్లు తెల్లగా చంద్రాకారముగా నేర్పరచవలయు. ఆ చంద్రాకారముయొక్క యగ్రమునుండి పండ్రెండుయిండ్లు నల్లగా సంకిలివలె నేర్పరచవలయు. నచ్చటనుండి పచ్చనితీగెను ఇరువదిమూఁడిండ్లలో నేర్పరచవలయు, అనంతరము పచ్చనిసంకిలి పండ్రెండుయిండ్లలో నేర్పరచవలయు, ఇరువదియిండ్లనుండి యెఱుపురంగుతో భద్రము (రామనామము) ను యేర్పరచవలయు, అంతతెల్లనికోనేరు పదమూఁడుయిండ్లనుండి తెలియును, ఇరువదాఱు యిండ్లనుండి లింగాకృతిగా నేర్పరుపవలయు, పిదప 26 యిండ్లనుండి లింగాకృతిగా నేర్పరచి, నల్లనిరంగుతో నాలుగుయిండ్లుశిరమున్ను, 2 యిండ్లు బొడ్డుగానున్ను, 6 యిండ్లు మూలస్కంధములుగాను, 4 యిండ్లు పార్శ్వముగాను, యేర్పఱుపవలయును, పిదప నెఱ్ఱనిపరిధినొకదాని నేర్పరుపవలయును, సంధియన పండ్రెం

డవవరుసనుండు యెల్లకు పైని, పిదప 144 యిండ్లవఱకు రామనామాంకిత ముగుముద్రనుంపవలయును, అనంతర పరిధి (మర్యాదను) ని యేర్పఱచి యావల నొకయింటిలో లింగముద్రయు నొకయింటిలో రామముద్రయు నిట్లు క్రమముగా 9 లింగముద్రలు. 8 రామముద్రలు లింగముద్రల యూర్ధ్వపార్శ్వము నందు నంతమునందు 16 పరిధులును, అడ్డముగా 9 యిండ్లచే పసుపువన్నెలోగాని యాకుపచ్చవన్నెలోగాని భద్రము నొకదానిని యేర్పరుపవలయును, పిదప రక్తభద్రముపైన నెన్నియిండ్లు గలవో వానియందెల్లెడల గొలుసువలె నిష్టము వచ్చినచిత్రవర్ణములచే నొకదానిని లిఖించవలయు, నడుమనున్న లింగముద్ర యొక్క రెండుస్కంధములయందును తెల్లని రెండుకండ్లును యితరములగు లింగ స్కంధములయందు పచ్చని మూడుమూడు యిండ్లుగల గొలుసులు రెండును, లింగమునకుపై భాగమునం దధోముఖముగా నెఱ్ఱనిరంగుతో 62 యిండ్లు గల భద్రమొకటియు, అడ్డముగా 18 యిండ్లకుపైన పచ్చనిరంగులో రెండుభద్రములు పిదప నావంక్తిపైన పచ్చనిపరిధియొకటియు, గలుగునట్లు మొదటిపంక్తిలో నేర్పఱచి, రెండవపంక్తిలో 7 ముద్రలు 8 లింగముద్రలు, 14 పరిధులు, ఎఱ్ఱనిరంగుతో 6 యిండ్లు భద్రమొకటియు, వ్రాయవలయును. మిగిలినదంతయు మొదటి పంక్తియందువలె నాచరింపందగు, మూడవపంక్తియందు, 5 ముద్రలు. 6 లింగములు. పది పరిధులు, 30 యిండ్లు గల నొకభద్రము నేర్పరుపవలయును, పిదప నాలవపంక్తియందు 3 లింగములు 4 రామముద్రలు, 8 పరిధులు, 49 యిండ్లు గల భద్రమును, ఆకుపచ్చ, పసుపుపరిధుల రెంటినడుమ నొకయెఱ్ఱని పరిధిని గల్పింపవలయును, అంత నైదవపంక్తియందు 1 రామముద్రయు 2 లింగములు, 4 పరిధులు. 90 యిండ్లుగల భద్రమొకటియు ముందుచెప్పినరీతి ఆకుపచ్చ యెఱుపు పసపురంగులు గల పరిధులు నుండవలయును. ఆరవపంక్తియందు. 1 రామముద్రయు 2. పరిధులు. 49 యిండ్లుగల భద్రమొకటియు, 3 పరిధులును, నడుమ. 424 యిండ్లుగల సర్వతోభద్ర మొకటియు 3యిండ్లుగల చంద్రరేఖ 1యు. 5 యిండ్లు గల నల్లని గొలుసులు. 11యిండ్లుగల తిగ1యు. 9యిండ్లుగల భద్రము 1యు. 24యిండ్లుగల నడబావి 1యు, తెల్లనిపరిధి 1యు. నడుమ 16 యిండ్లయందే పద్మమును, యిష్టమయినరీతి నేర్పరుపవలయు. దానిమీఁదై మాత్రము పసపు రంగుతో వేయందగు, ఇదియే. అష్టోత్తర శతరామలింగతో భద్రమనంబడును, 144యిండ్లచే రామముద్రా స్వరూప మేర్పడుచున్న యది, రాజ్యకాండమున నుత్తరార్ధమున 18దవసర్గములో చెప్పఁబడినరీతిగనే చెప్పుచున్నాఁడను, దీని యంతట నన్నిపఙ్తులును. 12యిండ్లపైన 12 యిండ్లుగలవియై యుండవలయును, వానిలో తూరుపుదిక్కునుండి. క్రమముగా నీక్రింది ప్రకారముద్ధారముం జేయ వలయును.

1-7 యీపంక్తులు నల్లనిరంగుతోఁడ వేయవలయు, అందు, పైన 5ను క్రింద 5. పంక్తులుండును. వానిలక్షణముం జెప్పెద, 5 పంక్తులలో మొదటిదానిని పైన వేయవలయు దాని మొదటిల్లుమాత్రము నల్లనిరంగుతో, 87 యిండ్లు పైన నుండవలయును, దానిక్రిందనుండు రెండవ పంక్తియందు 1-2-4-6-7-8-9-11. యిండ్లు నల్లని రంగుతో వ్రాయందగు, దానిక్రిందనుండు 4వ పంక్తిలో 1-2-4-7-10-8-11. సంఖ్యగల. యిండ్లను, దానిక్రిందనుండు నైదవ పంక్తియందు 1-2-4-6-9-11 సంఖ్యగలయిండ్ల నదేరీతిగా నేర్పరచి యందు రాజా, అను రెండక్షరములం దెల్లనిరంగుతో నయిదుపంక్తులయందు వ్రాయవలయు, 5పంక్తులలో మొదటి పంక్తియందు పూర్వరీతిగ నేర్పఱచి. రెండవ పంక్తియందు 1-2-4 6-7-9-10-12 యిండ్లయందు నల్లనిరంగును వ్రాయనగు, 3వ పంక్తియందు. 4-6-12-7- యిండ్లయందును, 4వ పంక్తియందు 1-2-6-4-8-9-12-10. యిండ్లయందును, 4వ పంక్తియందు 2-4-5-6-8-7-10-9. యిండ్లయందును నల్లని వర్ణముతోఁడ రామ, అను రెండక్షరములను వ్రాయవలయును. రాజా, రామ, అనునాలుగు వర్ణములను వ్యత్యయముగా రామరాజాయని తలచవలయును, లేనిచో. రామరామయనియును దలంపఁదగు, నచట క్రిందుండు నయిదు పంక్తుల యందలి విశేషంబు లేమన? నాలవ పంక్తిలో మొదటిల్లును నల్లనిరంగుతో వేసి యాస్వరూపము నెంచ నచట రామనామముంగాని. లేక. రమారామ. యని తలఁపవలయు, పై పంక్తులలో విశేషమేమన ముందుఁజెప్పినరీతిగనే. మొదటి పంక్తిని నిర్మించి. యటుపిమ్మట రెండవ పంక్తియొక్క. 1-2-3-5-8-9-6-11.యిండ్లయందును. మూడవ పంక్తియొక్క. 1-11-6-5. యిండ్లయందును, నాలవ పంక్తియొక్క. 1-2-3-5-7-8-9-11. యిండ్లయందును నల్లని రంగు వేయవలయును. అయిదవపంక్తియొక్క. 1-2-3-5-7-8-9-11 యిండ్లయందు తెల్లనిరంగు వేసి నాలుగు పార్శ్వములందును రామ యనునామముల నాలుగింటిని యా తెల్లని రంగులోనే వ్రాయవలయు, మఱియు లఘు ముద్రాయుతముగు రామలింగతో భద్రమెట్లనిన నిలువుగా నడ్డముగా నేబది గీతలుగీచి యా యిండ్లయందు పచ్చని రంగుతో 77 యిండ్లుగల పరిధులరెంటి నేర్పఱచి యొకమూల మూఁడిండ్లలోఁ దెల్లని వర్ణమునఁ జంద్రుని సంకిలిని నల్లనివర్ణముతో 12 యిండ్లుగల తీగెను, నల్లనిరంగుతో 8 యిండ్లయందు లింగమును, పై నుడివిన తీగె సమీపమున నల్లని రంగుతో 2 యిండ్లుగల భద్రమును 60 యిండ్లలో రామముద్రయు, పఙ్క్తి కోణముల యిండ్లను వదలి యితరములగు నిండ్లలో నల్లని రంగును బూసి యందు రామ. యనునామములను వ్రాయఁదగు, అందు మొదట 4. రామముద్రలు. ఎఱ్ఱని పరిధులు. 2 లింగములు. యాలింగములపై భద్రమొకటియు, 2. యిండ్లను, పచ్చని వర్ణముగల వీధియందొక తీగెయు, నుండఁదగు.

రెండవ పంక్తిలో 1. రామముద్రయు. 2. పరిధులు. 2. లింగములు, లింగము తీగె నడుమ నెనిమిది యిండ్లుగల భద్రమొకటి. లింగముపైన. ఆకుపచ్చని రంగుతో నాలిండ్లుగల భద్రమొకటియు, లింగముయొక్క స్కంధప్రదేశమున. నాలుగిండ్లు గల ఎఱ్ఱని భద్రమొకటియు, రెండురెండు పచ్చనియిండ్లును, వీథియొక్కటియు, నొక్కలుపవలయు, నిచట నాకుపచ్చని దొకటియు, నెఱ్ఱనివి రెండును కలసి మూఁడు భద్రము లేర్పఱుపఁ బడినవి, పిదప మధ్యభాగంబున సర్వతో భద్రంబును, నిరువది నాలుఁగిండ్లుగల నడబావి యొకటియు సమీప కోష్ఠములందు భద్రమును, మూఁడుమూడిండ్లలో తీగెయు, లింగమును, అయిదిండ్లలో సంకిలియు, పిదప, పరిధియొక్కటియు, నడుమ నెఱ్ఱని రంగుతో. గాని. చిత్రవర్ణములతోగాని యొక పద్మమును, లిఖింపవలయును. నిందు కొన భాగములందు 4 ప్రక్కలను క్రమముగా పీత శుక్ల రక్త కృష్ణవర్ణములుగల పరిధుల నేర్పరుప వలయును. ఇట్లు పదునారు ముద్రలచే రామలింగతో భద్రమేర్పడుచున్నది. ఇట్లు సదానంద రూపుండును, సకల ప్రపంచభావ భాసకుండు నగు నారామచంద్రు నుపాసించవలయు. మున్నెఱింగించిన నీరామలింగతో భద్రమునంద విచారంబుగా జ్ఞానవిషయంబు వెలుంగుచున్నయది ఎట్లన. భూమియందవతరించిన రఘుసత్తముండు రామలింగ యుక్తుండని పలుకంబడు, అధ్యాత్మజ్ఞానయుతులగు యోగులెల్లరు భగవంతుండగు సీతనియందు రమించుటం జేసి రాముండనియు, నెచ్చట భూతంబులన్నియు లయంబునొంది మఱియు వెలువడుచున్నవియో యట్టిమహదాకాశాత్మకంబగు వానిని లింగమనియు. బ్రహ్మజ్ఞానులు వక్కాణించెదరు. భగవంతుఁడగు శివుండు ప్రభావముచేఁ జూడఁబడి ధ్యానింపఁబడు నాకారణమున రాముఁడు లింగరూపియనఁబడు, గావున సీతనికి రామ. యనియు, లింగయనియు రెండు నామములు ప్రసిద్ధములై యున్నవి. ఇంకను రామేశునకు వేలకొలఁది నామములు గలవు. భూమియందలి సూక్ష్మములగు పరమాణు కణములనైన లెక్కింప వచ్చుంగాని యాభగవంతుని నామంబుల లెక్కింప వలను పడదు, పైఁజెప్పంబడిన సర్వతోభద్ర మీపరమాత్మకు హృదయ రూపముగానున్నది. అందు. 8. దళములు కింజల్కములు మిద్దెయుగల పద్మంబు రామలింగ మూర్తియొక్క ధ్యానము కొఱకై యేర్పరుపంబడినది, లేనిచో, సర్వవ్యాపియగు భగవంతునకు దేశాది భేదములు, గలుగునెట్లు, జ్ఞానప్రకాశుండగు నీపరమాత్మ విలాసార్థమై స్వేచ్ఛగా ధర్మార్థ కామమోక్షంబులఁ బ్రవర్తింపఁ జేయ స్వమాయా వశంగతుఁడై యిభ్భూమి నవతరించె, అట్టిజ్ఞాన చంద్రునకు పదునారు కళలు గలవు. ఇట్టిశ్రేష్ఠములగు కళలు జ్ఞానపూర్ణములై ద్వారభూతములగు ఘటపటాదుల విషయములుగా జేసికొని. వానిం బ్రకాశింపఁ జేయుచు గ్రహించుచు విడుచుచున్నవి, శివస్వరూపుఁడగు నాచైతన్య

చంద్రుని 16 కళలలో సమీపమందుండిన కళయే నిర్మలమగు బుద్ధి యగుచున్నది, దానిచేనది జ్ఞానప్రధాన మైనదై చక్షురాదీంద్రియంబులఁ దెలియంబడుచుండు. అదియె మఱియు వ్యాపించి రూపశబ్దాదుల నెఱుఁగుచున్నది, అయ్యది. తత్వవేత్తలచే వృత్తిభేదముచే నాలుగు తెఱఁగులుగా జెప్పంబడినది యయినం దీనిచే నిచటఁ బ్రయోజనంబు లేదు, గాన ప్రకృతము నెఱింగించెదను, మనుజునిచే నేదేని వ్యాపారమును జేయించు ప్రాణంబు ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము, అనియయిదు విధములుగా తనవ్యాపారముచే తనే యేర్పడియున్నది, వాక్కుపాణిమున్నగు కర్మేంద్రియముల వ్యాపారము. ప్రాణముచేతనే గలుగుచున్నదనియు. (చెవి, కన్ను, ముక్కు, త్వక్కు, నాలుక, యనునింద్రి యములైదును) (జ్ఞానమునకు ద్వారభూతములగు వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థలను కర్మేంద్రియములయిదును,) యిట్లు, నయిదు ప్రాణంబులు, నయిదు జ్ఞానేంద్రియంబులు, నయిదు కర్మేంద్రి యంబులు, బుద్ధియు, జేరి 16ను. కలలని చెప్పంబడు చున్నవి, నీని యందెల్లెడల రామనామమను నదియె చైతన్య స్వరూపమై వెలసి ప్రపంచంబునంతయు చేష్టావంతంబుఁ జేయుచున్నది. అనాదిసంసార వృక్షమునకు కర్మము ఫలమైయున్నది· దీనిననుభవించు దేహాత్మాభి మానముగల జీవులు పక్షులు. వీరు వారివారి కర్మానుగుణముగ నీశ్వరునిచే నొసంగఁబడిన సుఖదుఃఖముల ననుభవించుచున్నారు. ఇట్టి జీవులలో నొకానొకఁడు వేన వేల జన్మంబులనొంది వానిసుకృత పరిపాకముచే జ్ఞానవంతుఁడై శ్రీరాముని స్వరూప రూపగుణ విభూతులం జక్కగా నెఱింగి యనశ్వరంబగు మోక్షంబు నొందుచున్నాఁడు. అన్నిఁటిలోపల నింద్రియములు శ్రేష్ఠములంతకన్న, బుద్ధి మిగుల శ్రేష్ఠమయినది, వీనికన్నిఁటికన్న సర్వసాక్షిగనుండు భగవంతుండు పరమశ్రేష్ఠుండు, మఱియు ' పరబ్రహ్మమను మూలమును, ప్రాణాదులను కొమ్మలును, గలిగి అవ్యక్తము. (ప్రకృతి) నుండి యేర్పడినదియు ప్రాణులందఱి కర్మఫలములకు నాశ్రయ భూతంబయిన నీక్షేత్ర (శరీర) మనునదియె యొక వృక్షము, ఇట్టి వృక్షంబును జీవుఁడు భగవంతుఁడు. అను రెండు పక్షులు. సర్వకాలములయందు సమాశ్రయించియుండు, నందు జీవుఁ డజ్ఞుఁడగుటం జేసి నియామ్యత్వ సంబంధమువలనను భగవంతుఁడు సర్వజ్ఞుఁడగుటం జేసి, నియామకత్వ శక్తివలనను వెలుంగుచుండు. వీరిలో నొకండగు జీవుండు నిజంబగున జ్ఞానవశంబున నానావిచిత్ర వేదనాస్వాదు రూపంబై కర్మముచే నిష్పన్నంబయిన సుఖరూపంబగు ఫలం బనుభవించుచున్నాఁడు, మఱియొకఁడు (భగవంతుఁడు.) సర్వజ్ఞుండును, నిరవధిక సత్వగుణ ప్రధానుండును, సర్వశక్తి సంపన్నుండును, నిరతిశయానంద యుక్తుండునగుటం జేసి యట్టి యవిద్యాఫలమునను భవింపక క్షేత్రక్షేత్రజ్ఞులకు నిత్యసాక్షి భూతుఁడై కటాక్షించుచున్నాఁడు. ఇట్లు,

జీవేశ్వరులేక వృత్తిగతులయినను జీవుండు మాత్రము అవిద్యాకర్మ వాసనా
దూషితుండై దేహమె యాత్మయను నభిమానముగలిగి దేహమే నేను, నాకొ
అను, నామనుమఁడు, నాది, నేను కృశుఁడను, స్థూలుఁడను, గుణవంతుఁడను,
నిర్గుణుఁడను, అనుచు సాధనము నశించె నాసుతుఁడు పోయెనని పలువిధము
లుఁగ నానాదుఃఖములకు లోనై విలపించుచు చచ్చుచు మఱియు పశుపక్షివృ
గాది యోనులయందు కర్మానుసారముగఁ బుట్టుచు గిట్టుచు, నీసంసార చక్రంబున
పరిభ్రమించుచు నొకానొకప్పుడు భగవత్కటాక్షముచే నవివేకమించుక నశిం
చి, జ్ఞానోదయంబుగలిగి, సదాచార్యుల చరణవరణముచే తత్కటాక్షముచే
భగవంతుని స్వరూపంబును తన స్వరూపంబును జక్కఁగ నెఱింగి. అహింస.
సత్యము. అంతరింద్రియ నిగ్రహము. బహిరింద్రియ నిగ్రహము, బ్రహ్మచర్యము.
వైరాగ్యము అనునట్టి సుగుణగణ పరంపరా విలసితుండై. భగవంతుండు నిత్యుం
డు, క్షుత్పిపాసా జరా మరణాది రహితుండు, సర్వజగత్తునకు కారణభూతుండు,
సర్వ నియామకుండని తెలిసికొని తదీయగుణగణాను సంధానంబున తుదకు సం
సార విముక్తుండై భగవత్సాన్నిధ్యమును బొందుచున్నాఁడు. అని యాథర్వణశ్రు
తి విశదీకరించుచున్నయది. గావున. స్థూల సూక్ష్మ కారణ భేదముచే మూఁడ
యిన క్షేత్రమను నీశరీరమున క్షేత్రజ్ఞుండను జీవుండు భోక్తయు, వానిచే ననుభ
వింపఁబడు నీక్షేత్రంబు భోగ్యంబునయి యుండును. వీనికి రెంటికన్న విలక్షణుం
డును సాక్షిభూతుండగువాఁడై పరమాత్మయనియు పరబ్రహ్మ యనియుఁ జెప్పఁ
బడును, సర్వత్ర కలదు అను వ్యవహారమునకు సాక్షియు, నిత్యసత్య స్వరూప
మై ప్రకాశించునదియు, ఆనందాత్మకంబై యితరుల నానందింపఁ జేయునదియు,
సకల వేదంబులయందు జ్ఞానస్వరూపంబుగ బ్రతిపాదింపఁ బడినదియు, అచేతనా
త్మకమైన ప్రపంచ విషయాదులు మొదలు బుద్ధివఱకుఁ గల జడపదార్థగణంబం
తయు గూడ.·భోగ్యముగ గ్రహించునదియు నగు పరబ్రహ్మంబె జగత్కారణం
బయ్యెదియె కేవల ప్రేమాస్పదుండగు రాముండు. ఇతఁడు. సకలప్రాణివర్గము
నకు ప్రీతికరుండై స్వాత్మయైయుండు. నితనికన్న మఱియొకఁడు లేడు. వీడునానా
త్వము నొందువాఁడుగాఁడు. అట్టి పరమాత్మయై చిత్స్వరూపుండగు రాముని
స్వాంతర్యామిగ నెవఁడు సదాచార్య కృపచే జ్ఞానమునొంది ధ్యానించునట్టి వానికి
నిశ్చలమైన జ్ఞానముగలిగిన పిదప నీజన్మమునఁ జేయఁదగిన కార్యమొద్దియు లేదు.
సర్వయుక్తులును సమస్త శాస్త్రంబులును నేపరమాత్మ స్వరూపమును దెలియు
టకై యేర్పడినవో యట్టిపరమాత్మయగు రాముని సదాచార్యునివాక్యముచేఁ దెలి
సికొనిన పిదప నటుపైనఁ గావఁదగిన దేమున్నది? ఇట్లు. నిర్ణయింపఁబడిన సర్వాత్మో
భద్రము యొక్క విచారము జరిగించు నపుడెల్ల సత్పురుషుల కెంతయు ప్రీతి
గలుగుచున్నది. మఱియు, శాంతుండును. లింగరూపధరుండును, సుఖకరుం

డును వ్యాపకుండు నానందాత్మకుండు నగు శ్రీశివరామ పరబ్రహ్మంబునకు నమ స్కారంబని. స్తుతించి. శ్రీరామతో భద్రాసన వివరణంబు తెలియఁజేయఁబడు చున్నది, మున్నుటంగించిన విధముగనే భావిలేఖన మొనర్చి. యందు మొదటి స్థలమందు 9యిండ్లుగల భద్రము నెఱ్ఱని రంగుతోఁడను, అడ్డముగా నాలిండ్లు గల భద్రమును పీతవర్ణముతోఁడను లిఖించి రెండవ స్థలమందు 20 యిం డ్లుగల భద్రమును రక్తవర్ణముతోఁడను, అడ్డముగఁ దొమ్మిదియిండ్లుగల భద్ర మును పీతవర్ణముతోఁడను లిఖించి చిత్రవర్ణములతో రెండు రెండిండ్లుగల గొలుసులను రెంటిని లిఖింపవలయు. నియ్యదియె కేవలము రామునకు ప్రీతిక రంబగు రామతో భద్రాసనము. పిదప షడ్గుణైశ్వర్య సంపన్నుఁడును మాయా తీతుఁడును వికార రహితుఁడును, అవాప్త సమస్త కాముఁడును, ఆనంద స్వరూపుండును విద్యాధారుఁడును నగు శ్రీరామ పరబ్రహ్మమునకు నమస్క రించి రామనామాంకిత భద్రాసన రచనాక్రమంబు జెప్పఁబడుచున్న యది, సమముగ తూరుపునుండి పడమరకును దక్షిణమునుండి యుత్తరమునకును. 299 గీతలుగీచి. మూలయిండ్లలో పచ్చని వర్ణముతోఁడ పరిధుల నేర్పఱచి. కోణాబ్జ శృంఖల లతలను యథాక్రమముగ సిత కృష్ణ నీలవర్ణములతోఁడ నిర్మించి. భద్రములను వేరువేరుగా నెఱ్ఱని రంగుతోఁడను ముద్రలను తెల్లరం గు తోఁడను. పరిధులను రక్తవర్ణముతోఁడను, లిఖింపవలయు, పిదప 70యిం డ్లుగల ముద్రను లిఖించి. తూర్పుదక్షిణ మునునుండు పఙ్క్తులను మాత్రము వ దలి. ప్రత్యేకముగా నాలుగు కోణములనుండు నాలుఁగు యిండ్లను 4-6 పఙ్క్తు లను నల్లని రంగుతోఁడ వ్రాయవలయును, పిదప నేడవ పఙ్క్తిలో మొదటి యింటిలో రామయను నామమును లిఖింపవలయును. యీరామనామమును ప్రాణావసానమునందు పఠించువాఁడు సర్వపాపములందొలఁగి మోక్షము నొందు చున్నాఁడు. అంతమొదట నిరువది యిండ్లవఱకు రామముద్రల లిఖించి మధ్యను రెండు పరిధుల నిర్మింపవలయు, మొదట 24 యిండ్లుగల రామముద్రయు ననం తరము, 25 యిండ్లుగలదియు పిదప 22 యిండుగలదియు నావల 21 యిండ్లుగల దియు. నాపైని 20 యిండ్లుగలదియు. ననంతరము. 18 యిండ్లుగలదియు. పిదప 17 యిండ్లుగలదియు, నాపైని 16. యిండ్లుగలదియు. నాపిదప 14. యిండ్లదియు. పిదప 13 యిండ్లదియు. నంతట 12 యిండ్లదియు. నావల 11 యిండ్లదియు. నావల. 9 యిండ్లదియు. పిదప 8 యిండ్లదియు. పిదప 7 యిండ్లదియు. పిదప 6 యిండ్లదియు నావల 4 యిండ్లదియు. పిదప 3 యిండ్లదియు. నాపైని. 2 యిం డ్లదియు. నావల 1 యిల్లుగల భద్రమొకటియు. 16 యిండ్లుగల భద్రమొకటి యు. 36 యిండ్లుగల భద్రమొకటియు. 24 యిండ్లుగల చంద్రకలలను నాలుగు పార్శ్వములందును వ్రాసి. 21 యిండ్లుగల భద్రమును, 24 యిండ్లుగల నడబా

వియు పిదప పరిధియొకటియు, ఎఱ్ఱని రంగుతోడ నొకకమలంబును లిఖింపవలయును. పిదప భద్రముపైని. మిగిలిన యిండ్లయం దక్షముగా దనకుఁదోచినరీతి భద్రములను, సంకిలలను నిర్మింపవలయును. అంతటయు. 5 సంకిలిలును 11 యిండ్లుగలలతయును 3 యిండ్లుగల చంద్రుఁడును గలిగి వెలుపల క్రమముగా నాలుగు దిక్కులయందు కృష్ణ, రక్త, శుక్ల, పీత, వర్ణములతోడ నాలుగు పరిధులను లిఖింపవలయును. ఇట్లు లిఖింపఁబడినదాని 113* యిండ్లుగల రామతో భద్రమని చెప్పఁబడుచున్నయది. యిట్లుకాదేని. మనుసంఖ్యగల రేఖలనురెట్టించి యొకపరిధి నేర్పఱచి దానియందు, ౧౭౮ లింగములను, నడబావ్రులు, భద్రములు, చంద్రుఁడు మున్నగువాని నాలుగుప్రక్కలయందు లిఖింపవలయును, అందు లింగము. 24 యిండ్లుగలదిగ నుండవలయు. మఱియు, తొమ్మిదితొమ్మిది యిండ్లుగల భద్రములు 2ను, పదిపదియిండ్లుగల లింగములు. 36ను, నడబావ్రులు 27ను. లిఖించి యొకపార్శ్వమునందు లింగములు వేయగా మిగిలిన యిండ్లయందు రెండు భద్రములను వేయవలయు. పిదప పదిపది యిండ్లయందు మిగిలిన యంక కోష్ఠముల నిర్మించవలయును, ఇంను లింగము. కృష్ణవర్ణముతోడను నడబావ్రులు శ్వేతవర్ణముతోడను, వేసి మిగిలినదంతయు మున్దెఱింగించినరీతిగనే జేయవలయును. ఎచ్చటెచ్చటయిండ్లు మిగిలియుండునో. యాస్థలమునందంతయు భద్రములు శృంఖలములు నేర్పరుప యోగ్యములైనచో వాని లిఖింపఁదగును, ఆనంతరమునందు కృష్ణ రక్త శ్వేత పీతవర్ణములుగల పరిధుల నేర్పఱుపవలయును. ఇట్లు లిఖించినదానిని. రామలింగతో భద్రమని పెద్దలు వర్ణించుచున్నారు, దీనిచే రామచంద్రులు ప్రీతిమంతులు గాగలరు. ఇది శ్రీరాముని పూజింప నాసనములలో శ్రేష్ఠతమముగాఁ జెప్పఁబడినది. ఇఁక. జ్ఞానవంతులగు నాచార్యులను భక్తియుతుఁడనై నమస్కరించి. వారియనుగ్రహము వలన రామతో భద్రాకృతిని జెప్పుచున్నాఁడను.

* రామతో భద్రాకృతి వివరణము *

రామతోభద్రము ప్రకృతియు నదిలింగ సంయుతమైన వికృతియునై వానికన్న నితరంబులు వికారంబులని చెప్పంబడుచున్నవి. ఇట్లు మూడు తెఱంగులుగ నాకృతుల నెఱుంగునది. ఇఁక. అడ్డముగా నిలువుగా 104 గీతలనుగీచి. యాగళ్లయందు. 7 పరిధులను అంతమున 3 పరిధులను పచ్చని (పీత) వర్ణముతో నిర్మించి కోణములయందు. తెల్లనిరంగుతో. 3 గళ్లలో నొకచంద్రుని. నల్లనిరంగుతో నొక గొలుసును భద్రముతోచేరి. 16 యిండ్లుగలతీగె యొకటియు. లిఖించి. యావల నష్టకోష్ఠములయందు. 4-16-1-6-2-16. యిండ్లుగల కోష్ఠముల నిర్మించి వానియందంతయు రామముద్రల లిఖింపవలయును, అంతటవాని సీమాపరిధులను క్రమముగా. 8-64-4-1 యిండ్లు గలుగునట్లు నిర్మించి. పైన నెఱ్ఱనిరంగు

తోడ నింకొక యిల్లధికముగ పరిధుల నిర్మింపవలయును. 1-2-4-పంక్తుల నమము వానిని యిబ్బడి చేసినచో మర్యాదయను పేరుగల పరిధులు. 3 అగుచున్నవి. అంతమునందు పరిధులకుపైన సర్వతో భద్రము నొకదాని వేయవలయును. అందువిశేషమే మన. వాపిక. 24 యిండ్లలో నుండవలయు నావల. భద్రమొక్కటియు. నెఱ్ఱనిరంగుతోడ 9 యిండ్లుగల పద్మమొకటియు, పరిధుల పైని లిఖించి. దానిమీఁదను పచ్చరంగుతో నేర్పరచి. పిదప పీత. శుక్ల. రక్త కృష్ణ. వర్ణములతోడ పరిధులఁ గల్పింపవలయు, మఱియు. భద్రమునొకదానిని నిర్మించి. శేషించిన యిండ్లను. తిర్యగ్భద్రము, శృంఖల మున్నగువానిచే సయుక్తికముగ పూర్తిఁ గావింపవలయు. అందు పచ్చనిరంగుతో భద్రమును, చిత్రవర్ణముతోడ శృంఖలయు నుండవలయు, ఇట్లేర్పఱుపం బడినదియె యష్టోత్తరశత రామతోభద్రమనంబడు చున్నది.

* అధ్యాత్మ తత్వనిరూపణము *

అద్వితీయంబును, జరామరణాది దూషిత సంసార రహితంబును, నిఖిల సుఖాస్పదంబును, సర్వానంద స్వరూపంబును, సచ్చిదాత్మకంబును, సర్వవ్యాపియు, బ్రహ్మవిష్ణు శివాత్మకంబై. జగత్సృష్టి స్థితిలయముల నొనర్చునదియు, వేదప్రతిపాద్యంబును, సర్వభూతాంతరాత్మయు, సర్వజ్ఞంబునగు ననిర్వాచ్యమగు తేజంబు (రాముని)ను, నమస్కరించి. పరమ గురుచరణార విందంబున కెఱఁగి. సజ్జనుల హృత్కమలంబున కానందదాయకంబును, నాత్మ విచార పరంబునగు. దివ్యసూక్తి నుడువుచున్నాఁడను. లోకములో బ్రతికియున్నపుడుగాని చచ్చిపోయినపుడుగాని, మనుష్యులకన్న నితరములగు ప్రాణిసంఘములును నచేతనములగు జడపదార్థములు మున్నగు చరాచరాత్మకంబగు ప్రపంచంబంతయు నొక్కొక ప్రయోజనముకొఱకే గల్పింపఁబడియున్నది. గనుకనే జంతువుల శరీరంబుననుండు రోమాదులు కంబళ్లు మున్నగువానికి నుపయోగించుచున్నవి. ఇట్లె నిష్ప్రయోజనములని పారవేయు పశువుల కొమ్ములు గోళ్లు గూడ. దువ్వెన మొదలగు నుపకరణముల కుపయోగ పడుచున్నవిగదా. ఇఁక మనుష్యుఁడన్ననో బ్రతికియుండు నంతవఱకు ప్రపంచ విషయంబులయందు నిగ్రహాశక్తి సమన్వితంబై పుణ్యము పాపము అను సుకృతదుష్కృతములకు సాక్షియగుటచే, సుఖదుఃఖాత్మకమగు స్వర్గనరకాను భవదక్షుఁడై స్వస్వరూప విజ్ఞాన సమర్థ మగుటం జేసి శుద్ధమయిన జ్ఞానముచే బ్రకాశించుచుండును, మృతిఁబొందిన వెనుక వీనిదేహము వీసమునకైనఁ గొఱగాదు, పశ్వాదిదేహంబుల కన్నను మిగుల నీచంబగును, గావున. మనుష్యుఁడు చేయవలసినదేమియు లేదు, పరమానంద దాయకంబగు భగవత్సాన్నిధ్యము నొందుటకై తగిన విజ్ఞానమును సంపాదించుకొని పరమ విరక్తుఁడై. సర్వకాలంబుల భగవత్సేవా తత్పరుండై యుండ

వల్లయు, ఇట్టి జ్ఞానమును వ్యర్థముగ జేయునట్టి దేహము నశించునది యగుటచే శీఘ్రకాలమున జ్ఞానమును సంపాదింప వలయును, మృతిబొందిన పిదప జ్ఞానసిద్ధి లేనందున మోక్షము సాధ్యంబుగా, రెండుమార్గములు జెడినవాడగును, గావుననే జ్ఞానమనునదియే మిగుల పావనంబును సకల సుఖహేతు భూతంబును సర్వోత్తమంబై వెలుంగుచున్నయది. అట్టిజ్ఞానము లేనిచో పశువునకు మనుజునకు భేదమేమి గలదు? భగవంతునియందు శ్రద్ధాభక్తులుగల వాడును ప్రతిభాశాలియు, నగుమనుజుడు కోటికొకడు శ్రీమన్నారాయణుని సాయుజ్యముఁ బొందుచున్నాఁడు.

* రామతో భద్రముద్రాస్వరూప నిరూపణము. *

ఒకానొకనిచే రామతో భద్రస్వరూపంబును, రామనామాంకితంబును షష్టిపదాత్మకంబునయిన ముద్రయొక్క స్వరూపంబును జక్కగా నెఱింగింపఁబడుచున్నది. ఈ బ్రహ్మాండమునందు నేడు లోకంబు లెట్లేర్పఱుపంబడినవో యట్లే యీ రామతో భద్ర ముద్రయందుగూడ నేర్పఱుపంబడియున్నవి. యీ రామతో భద్రమే బ్రహ్మాండము ముద్రలే సకలభూతములు ఇయ్యవి రామచైతన్యయుతములని యెల్లరచే పరిగ్రహింపఁబడియున్నవి. దేనియందుఁ బరబ్రహ్మవస్తువు ముద్రితమై యున్నదియో యద్దానినే ముద్రయనియెదరు. లోకములో ముద్రితమన ముద్రింపబడినదనియు చిహ్నితమన గురుతు వేయఁబడినదనియు, పిహితమన నాచ్ఛాదింపఁబడినదనియు నర్థమగునట్లు నిచ్చట గూడ బ్రహ్మముచే ముద్రితమయినదని యర్థము. అయిన వీనియొక్క వెలుపల లోపల నంతట నాత్మస్వరూపము ప్రకాశించుచునే యున్నది. స్ఫటికపు కుండలో నెట్టిన దీపపు కాంతి వెలుపలలోపల ప్రకాశించుపగిది వ్యాపించు భగవంతుని చైతన్యమునాపనెవఁడు శక్తుండగును. మూసలోనుంటిన తామ్రము దాని యాకారమునొందు రీతి నిరాకారంబగు పరబ్రహ్మంబుఁగూడ జగదాకారమై జగదంతర్యామియై వెల్గుచున్నది. కణ్వశాఖయందు బృహదారణ్యక చతుర్థాధ్యాయ పంచమబ్రాహ్మణమున ౧౮ మంత్రమునఁగూడ భగవంతుఁడు మొదట ద్విపాత్తులగు మనుష్యుల సృజించి పిదప చతుష్పాత్తులగు పశ్వాదుల సృజించి తాను వాని యందంతట నంతర్యామియై పరమపురుషనామంబున బరఁగుచున్నాఁడు. వానిచే విహీనమగు ప్రదేశ మొకటియైన లేదని నొడువుచున్నది. మఱియు కఠోపనిషత్పంచవల్లి ౧౨ వ మంత్రమునందు, ఎవఁడు సర్వజగత్తును స్వవశంబు జేసికొని నిస్సమాభ్యధికుండగుటచే నద్వితీయుఁడై సర్వభూతంబుల కంతర్యామియై వెలుంగునట్టి పరబ్రహ్మను తన యందంతర్యామియై యున్నవానిఁగా నెవరు దెలుసుకొనియెదరో వారలు శాశ్వతంబగు నానందంబు నందుచున్నారు. అనియుఁ జెప్పఁబడియున్నది. మఱియు శ్వేతాశ్వతరోపనిషత్తు షష్ఠాధ్యాయమున 11 వ

మంత్రముగాక పరమాత్మయొక్కఁడే సర్వభూతంబులయందు దృష్టిగోచరుఁడు
గాక వసించువాఁడును, సర్వమును వ్యాపించువాఁడును, సర్వభూతముల కంతరా
త్మయు, సకల హేయగుణ రహితుఁడునునై సర్వసాక్షిభూతుఁడై వెలుంగుచుం
డునని వక్కాణింపఁబడియున్నది. గావున నీశ్రుతులచే పరబ్రహ్మంబొకటియె
యంతర్బహిర్వ్యాపక చైతన్యంబని తెలియుచున్నయది,

* ఐతరేయోపనిషదర్థ విచారసూచనచే మానవజన్మ ప్రాశస్త్యము. *

భగవంతుఁడు మొదట సకలభూతంబులను సృజించియు వానివలన నానం
దము నొందక యీమనుష్యశరీరాత్మకం బగు ముద్రను సృజించి పరమానంద
భరితుఁడై వెలింగెను. దేవతలుగూడ, నన్నమును భుజించుటకొఱకు నీమానుష
శరీరమునుజూచి, ఆహా యేమి మాసుకృతమని నుడివిరి. యీవిషయ మైతరేయో
పనిషత్తునందు ద్వితీయఖండమున నిట్లు వ్రాయఁబడియున్నది. సర్వజ్ఞుఁడు సర్వ
శక్తి సంపన్నుఁడు సర్వసంసార వర్జితుఁడు. అజుఁడు నజరుఁడు నమృతుఁడు నభ
యుఁడు నగు భగవంతుఁడు నానాభేదాత్మకంబగు ప్రపంచమును నామరూప
ములు గలుఁగునట్లు సృజించెను. అయినను నురుగుతరంగములు బుడకలు అను
రూపము, నామము, క్రియయు కలిగియున్నను జలమొకటియె సత్యమై మిగిలిన
వన్నియు నసత్యములగురీతి నీ జగంబంతయు నాత్మైక శబ్దప్రత్యయ గోచరంబు
గానే యున్నయది. ఆసృష్టియెట్లన నాకాశాది క్రమముగా బ్రహ్మాండమును
సృజించి యావల నంభఃప్రభృతిలోకంబుల నిర్మించెను. పిదప నాయీశ్వరుని
సంకల్పరూపమగు తపస్సుచేత నేర్పడిన నీ పురుషపిండమునందు ముఖాకారం
బగు నొక సుషిర (రంధ్ర) మేర్పడె, అందుండి, వాక్కు, దాని కధిష్ఠాన
దేవతయగు నగ్ని యుదయించె నిటులనే లోకపాలాదిదేవతులు జనించిరి. యిట్లు
లోకపాలురుగా సృజింపఁబడిన దేవతలు అజ్ఞానమున కామవశమున కర్మచేఁ
బుట్టిన దుఃఖమను జలమును, తీవ్రరోగములు, ముసలితనము, మృత్యువులను
మహాక్రూరంబులగు మొసళ్లును, గలిగి అనాదియు ననంతమును అపారంబును
నిరాధారంబును విషయేంద్రియ జనిత సుఖలేశ క్షణవిశ్రాంతియును, పంచేంద్రి
యార్థ తృష్ణావాయు విక్షోభంబుచేఁ బుట్టిన యనర్థ శతంబులను నలలుగలిగినది
యు, మహారౌరవరౌరవాది నరకంబులం బడి యొనర్చు హాహాకారంబను మహా
ధ్వని గలిఁగినదియు, సత్యము, దయ, ఆర్జవము, దానము, అహింసయు, శమదమ
ములును, ధృతియు నను నాత్మగుణముల నుపాధేయంబగు పూర్ణజ్ఞానమను నోడ
లుగలదియు, సత్పురుషులతో సహవాసమువైరాగ్యమునను మార్గంబులు గలది
యు, మోక్షమను తీరముగలదియు, నగు మహాసంసార సాగరంబున౯బడిరి. పిదప
పరబ్రహ్మంబు స్థాన కరణ దేవతోత్పత్తిబీజంబును, మొట్టమొదట సృజింపఁబడి
నదియు నగు పురుష పిండాత్మను, క్షుత్పిపాసాదియుతం బగు నట్లొనర్చెను. అందుచే

నాభగవంతునిచే నొనర్పఁబడిన, దేవతలకుఁ గూడ నాకలి దప్పియు మున్నగు వికారములుగలిగె. అందుచే నాదేవతలు బ్రహ్మకడ కేఁగి. దేవా మేము సుఖముగా నన్నము భుజింపఁదగిన యధిష్ఠాన మెయ్యదియో యద్దాని మాకొసంగుఁడు. అని ప్రార్థింప నతఁడు వారి కొఱకొక గోవు నేర్పఱచియిచ్చెను. దానిం జూచి వారు మాకిది చాలదని పలుక మరల నొక గుఱ్ఱము నేర్పరచి యియ్య నదియును చాలదనిరి. అంత నీశ్వరుఁడు పురుషుని నిర్మించి యొసంగెను. అప్పుడు వారు సంతోష భరితులై యాహా మాసుకృతమేమని తమలో దామ యధిష్ఠానమును పొగడుకొనిరి. అపుడు భగవంతుఁడు వారింజూచి మీ మీయనాది క్రియాయోగ్యతకుం దగిన యధిష్ఠానంబున ప్రవేశించుఁ డనియెను. అపుడు రాజు నాజ్ఞను శిరసావహించి సంచరించు భటులు తమతమనెలవుల కేగి వసించునట్లు వార లటులనే గానిండని నుడివి వారిలో నగ్ని వాగభిమానదేవత యగుటంజేసి, యా వాగ్రూపమును బొంది దానికి నుత్పత్తిస్థానమగు ముఖంబునఁ బ్రవేశించె, అటులనే వాయువు ముక్కును, సూర్యుఁడు నేత్రములను, దిగ్దేవతలు శ్రోత్రంబులను, ఓషధి వనస్పతులు త్వక్కును, మృత్యుదేవత నాభికుహరమును, ఆపోదేవత, శిశ్నమును బ్రవేశించె. అంత నాయీశ్వరుఁడు మనుష్యాదుల కన్నభూతంబులగువస్తు యవలు గోధుములు మున్నగు ధాన్యములను, పిల్లి, పులి, సింగము మున్నగు జంతువుల కాహారభూతంబులగు ఎలుక, మేక, యేనుఁగు మొదలగు జంతువులను దన యిచ్ఛామాత్రంబుచే సృజించెను. అపుడు లోకంబున నుండు సకల ప్రాణులు నన్నమునొందినవై మిగుల నానందము నొందుచుండెను. అనంతరము పరబ్రహ్మము వార కందఱకు నంతరాత్మయై రాజు తన పట్టణమును బ్రవేశించురీతి నానంద మను బ్రహ్మరంధ్ర మార్గముగా వారిలోపల వ్యాపించి కృతాకృతఫలములకు సాక్షి భూతుఁడై నిలుచుచున్నాఁడు. యీ యాత్మకు జాగ్ర దవస్థయందు నింద్రియ స్థానమగు దక్షిణ చక్షుస్సును, స్వప్నావస్థయందు నంతర్మనంబును, సుషుప్తికాలంబున హృదయాకాశంబును నను మూఁడు స్థానములు గలవు. అట్లె సృష్టికిఁగూడ పితృశరీరము మాతృ గర్భాశయము నిజ శరీరము నను మూఁడుస్థానములు గలవు, ఇట్లు జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థల యనుభవంబుగల స్థూలసూక్ష్మ కారణాత్మకంబగు దేహంబనిత్యంబు. స్థూల సూక్ష్మకారణ దేహంబులలో పర్యాయముగా సంచరించు నీ జీవాత్మ యవిద్యచే మేల్కొనుట లేదు. ఇట్టి జీవుండు పరమ దయామయుండగు నాచార్యునిచే వేదాంతమును జక్కఁగ బోధింపఁబడి తన స్వరూపమును భగవత్స్వరూపమును జక్కఁగ నెఱింగి తుదకు పరబ్రహ్మ సాక్షాత్కారము నొందుచున్నాఁడు. ఇంతకు ఫలితార్థమేమన? కేవలజ్ఞాన స్వరూపుండును, నిత్యవస్తువులు నగు నాత్మలయందు పరబ్రహ్మ యంతర్యామి రూపముచే వ్యాపించి ఆకాశాది క్రమముగ సర్వమును

నిర్మించి ప్రబోధనార్థంబు ప్రాణాది మచ్ఛరీరంబులయందు తానే ప్రవేశించి, సర్వజగంబులఁ గాపాడుచున్నాఁడు. దేహంబులన్నిటిలో నుండు పరమాత్మ యొక్కండే యని పరమాత్మనిర్ధారణం బీయైతరేయోపనిషత్తునందుఁ జెప్పఁబడినది. యీశ్రుత్యర్థము యిచ్చట మనుష్యదేహాత్మక ముద్రకు ప్రాశస్త్యముఁ జెప్పుటలో సూచింపఁబడినది. మొదట సర్వభూతంబుల సృజించియుఁ దృప్తినొందని పరమేశ్వరుఁడు పరబ్రహ్మ సాక్షాత్కారము నొంద శక్యమగు బుద్ధిగల మనుజుని సృజించి వానింగని మిగుల సంతసించెను. గానవో విష్ణుదాసా యిట్లు భగవద్వాక్యములు తెలియంబడుచున్నవి. ఇంతియగాక మంత్రశాస్త్రమునందుగూడ ముద్రయనుటకు వివరణము జెప్పఁబడినది. ము=ముదమును దేవునికిఁ గలుగఁజేయును, ద్రా=దుఃఖములను పాపములను ద్రవింపఁజేయును (నశింపఁజేయును). కావున ముద్ర మేలైనది. అట్టిముద్ర యీమనుష్యముద్రయె, అందుచే నన్ని దేహములలో మనుష్యదేహమే మిగుల శ్రేష్టంబయినదనియు, దీనిచేతనే స్వర్గమునకుగాని మోక్షమునకుగాని బోవ నధికారము గలుగుచున్నదనియుఁ జెప్పఁబడినది. సాధారణముగా లోకములో రాజముద్రాంకితుఁడగు మనుజుని జూచి యందఱు నతని నధికారియని భావించి గౌరవబుద్ధిచే నాదరించుచున్నారనునది సుప్రసిద్ధముగదా. అట్లె మానవదేహమను ముద్రచే నలంకరింపఁబడిన జీవుఁడు శాస్త్రభూములయందు పూర్ణాధికారియగుచున్నాఁడు. యితర దేహములచే స్వాత్మపదంబు నెఱుంగుట సాధ్యంబుగాదు, యిట్టి మానవోపాధియందె 60 పదములు (కళాస్థానవిశేషము, చిహ్నము, స్థలము అను స్థానములు) గలవు వానిని సంక్షేపముగాఁ జెప్పుచున్నాఁడను.

స్థూల సూక్ష్మ కారణాత్మక పురత్రయవిచారము

అవిద్య. కామము. కర్మము. అను 3 ను. భోక్త, భోగము అను 2 ను సుషుప్తి (నిద్ర) యును కలసి 6ను. దేహమునందు కారణములను పేరుగల పదంబులై యున్నది. తమస్సు, అజ్ఞానము, అవిద్య, యను పదములు సమానార్థకంబులు. అందుచే నీయాఱింటియందు సుగుణ గ్రహణము గనుబడుటలేదు పై యాఱింటిలో నీతమస్సు అజ్ఞానముగూడ చేరి. 8 పురములను పేరనొప్పుచున్నయవి. యెనిమిదింటిచే నొప్పులింగ సంజ్ఞగల కారణదేహంబునందు అవిద్య, కామము, కర్మము, అను నీమూఁడే హేతువులు అని గ్రహింపఁబడుచున్నవి. కారణ దేహంబునందు చేయుకార్య మెద్దియులేక పోయినను కారణరూపమున నీకామకర్మములకు సూక్ష్మరూపము గలిఁగినదయ్యె. యీకారణాత్మక శరీరమునందు అవిద్యయనునది ముఖ్యకారణమై యున్నది. నిజముగా విచారించినచో కామము (ఇచ్ఛాదిక వస్తువు. ఇచ్ఛ) యీకారణ దేహమునందు లేదని శ్రుతితెలు పక్కాణింపుచున్నది. ఇఁక సూక్ష్మదేహమున 88 పదము (స్థానము)

లుగలవు, అవియేవన? జ్ఞానేంద్రియంబులు. ౫, కర్మేంద్రియంబులు. ౫, ప్రాణములు. ౫ బుద్ధి 1 మనస్సు 1 అను 17 తత్త్వములుఁగల దేహంబు లింగదేహంబని శాస్త్రసమ్మతమై యున్నది. మఱియు విషయగ్రహణములు ౫ కర్మక్రియలు ౫ ప్రాణవ్యాపారంబులు ౫ సంకల్పము 1 నిశ్చయము 1 అనునీ 17ను ధర్మంబులు సుప్రసిద్ధంబులుగా నున్నయవి, స్వప్నాభిమానము, భోక్త, భోగము, రజోగుణము అను 4 ను వెరసి 38 పదములును దేవతలకు నింద్రియములకు మఱియొక స్థానము లేనందున నీలింగదేహమునఁ గల్పింపఁ బడినవి. ఇఁక స్థూలదేహంబునందు 16 పదంబులు మాత్రము సమ్మతంబులు, ఎట్లన? జ్ఞానేంద్రియాదులగు 17 తత్త్వములయొక్క గణము 1 అందుపాన వ్యానంబులకు స్థానములగు పాయుత్వక్కులు 2 వాక్కు 1 వక్షస్థ్సలము 1 ప్రాణస్థానములు.5 మనస్థ్సానము1 బుద్ధిస్థానము 1 భోక్త 1 భోగ్యము 1 తమోగుణము 1 జాగ్రదవస్థ 1 వెరసి, 16 పదములచే నీ స్థూలదేహంబు వెలుఁగుచున్నదియని శాస్త్రమునందుఁ జెప్పఁబడియున్నది. కావున జీవుండు నిస్సమానంబగు నీమానవముద్రను బొంది. యాత్మపరమాత్మల స్వరూపంబుఁ జక్కగా నెఱింగినచో వాని జన్మకృతార్థంబగుచున్నది, అట్లుగాకున్న నంతకన్న వేఱొకయనర్థము లేదు. ఏనామముచే నాముద్రయంకితంబనియు, ఆముద్రాస్వరూపం బిట్టిదనియు వివరించి నుడివితినో అట్టి నామ స్వరూపమిచ్చటఁ జెప్పుచున్నాఁడను.

* రామలింగనిర్వచన తన్మహిమాదికము *

లోకము లందంతట తానురమించుటం జేసియు, పరానంద మయుండును నమలుండునగు నీతని యందు సంతతము యోగులు రమించుటం జేసియు నీతఁడు రాముఁడని చెప్పంబడు చున్నాఁడు ఈబాహ్యంబగు నింద్రియ విషయరసముచే సకల చేతనులు జీవించుచున్నారుగాని వేరుగాదు, యీరసమునందియె యెల్లను పరమానంద భరితులై వెలుగొందుచున్నారు. రసమనగా పరబ్రహ్మము. అట్టి రసరూపియగు పరబ్రహ్మము ధ్యానమును జేయుచున్న చేతనుఁడు మిగుల నానందించు చున్నాఁడు. ఎవఁడు సర్వప్రపంచ ములయందు వ్యాపించి జగత్తునంతయు చేతనావంతంబు జేయునో. ఎవని నొక్కండేనియు నితరుండు చేతనావంతంబు జేయఁదగఁడో నాతండె పరబ్రహ్మ పదవాచ్యుండగు రాముండు. ఈరాముని చేతనే ప్రపంచంబంతయు సత్తారూపంబుగ దోఁచుచున్నయది. యీతండు ప్రత్యక్షం బైనచో తానొకఁడు మాత్రము సత్తాస్వరూపుఁడుగను యున్యంబంతయు నసత్ప్రదార్థఁనుగను దోచుచున్నది. ఇట్లు పరబ్రహ్మమునకు రామయను నామము సుప్రసిద్ధంబై యుండురీతి. లింగయను నామమును పరమాత్మకు సుప్రసిద్ధంబై వెలయుచున్నది. దీనియందు సకలభూతములు లయంబునొందుచున్నందునను, లయించిన భూతంబులు మరలబయలు వెడలుచున్నందునను,

లింగమనుపేరు గలిగియున్నది. ఈలింగము సర్వోత్తమంబు, వ్యోమపద వాచ్యంబు, సర్వవ్యాపకంబు, సర్వాధారంబు, సర్వాతీతంబు, మంగళకరంబు, ఇదియెపరబ్రహ్మంబు, ఇట్లు శాస్త్రజ్ఞులు తత్వవేత్తలు వక్కాణించుచున్నారు. అందువలన సకలభూతములయొక్క నామములు రూపములు వ్యావహారిక దశ యందు మాత్రము సత్యములు. పారమార్థిక దశయందివి యన్నియు నసత్యములు. అపుడు నిజమయిన వస్తువొకటియు పరమాత్మకులేదు, అతఁడే శివుఁడు, అతండె విష్ణువు, అతండె బ్రహ్మదేవుఁడు, అతండె దేవేంద్రుఁడు, అతఁడె నాశరహితుడును పరముఁడు అని, తైత్తిరీయమునఁ బోధింపఁబడియున్నది. వియ దాది సర్వప్రపంచ విషయంబులును భగవత్సంబంధము చేతనే సచ్చిదానం దాత్మకములై వెలుంగుచున్నయవి. వీని యందంతయు వ్యాపించి చైతన్య మూర్తియై పరమాత్మ ప్రకాశించెడి. అందుచే స్వస్వరూప రూపంబగు వస్తువు మాత్రము ప్రియమై విలసిల్లుచున్నది. ఆట్లు సర్వవేదములయందు మొదటను మధ్యమునను అంతమునను రాముని కళ్యాణ గుణగణ వర్ణనంబె ప్రతిపాదింపఁబడి యున్నది.

* ఐతరేయోపనిషదర్థవిచారము *

ఐతరేయోపనిషత్తునందు ప్రజ్ఞానమనునదియె యాత్మస్వరూపము. యీ ప్రజ్ఞానము చేతనే మనుజుఁడు రూపమును గనుగొనుచున్నాఁడు, శబ్దమును వినుచున్నాఁడు. గంధమును ఆఘ్రాణించుచున్నాఁడు. వాక్కుల నుచ్చరించుచున్నాఁడు. ఇదిరుచ్య పదార్థమనియు నిది యరుచ్య పదార్థమనియు నెఱుఁగుచున్నాఁడు. గాన నిదియె. హృదయము, మనస్సు, సంజ్ఞానము, అజ్ఞానము, విజ్ఞానము, ప్రజ్ఞానము, మేధ, దృష్టి, ధృతి, మతి, మనీష, జూతి (రోగాదులచేఁ గలుగు దుఃఖప్రాప్తి) స్మృతి, సంకల్పము, క్రతువు, అసువు (బ్రతుకుటకు దగిన వృత్తి) కామము (తృష్ణ) వశము (స్త్రీసంపర్కాద్యభిలాషము అను నామములచే బరఁగుచున్నది. ఈప్రజ్ఞాన మనునదియె బ్రహ్మ, యతఁడె ఇంద్రుఁడు (అంతర్యామి రూపముచే సర్వత్ర నెఱుంగునది) యతండె ప్రజాపతి, యీదేవతలందఱు పంచభూతములు స్థావరములు మున్నగు సర్వమునకు, ప్రజ్ఞానమె నేత్రరూపము, యీప్రజ్ఞానమునందె సర్వము ప్రతిష్ఠింపఁ బడియున్నది, గానఁ బ్రజ్ఞానమె బ్రహ్మము, అని స్పష్టముగా ప్రతిపాదింపఁ బడియున్నది. ఉత్పత్తికి పూర్వము జగత్తునకు నామము రూపము లేకుండ యుండినది. సృష్టించిన పిదప ప్రపంచమున కంతయు నామరూపములు భగవంతుఁడు గల్పించె, అట్టిబ్రహ్మచేతనే స్వేచ్ఛగా లోకపాలురు సృష్టింపఁబడిరి. పిదప వారల జీవనము కొఱకు నన్నమును సృజించి, యనంతరము సర్వమునకు తాను స్వామియగుట విచారించి బ్రహ్మరంధ్రముగుండ వ్యాపించి యంతరాత్మ

మై యింద్రత్వమును నొందియున్నాఁడు గావున నింతకుమున్నుఁ జెప్పంబడిన ప్రజ్ఞానము సచ్చిదానంద స్వరూపుండగు శ్రీరాముఁడు.

తైత్తిరీయోపనిషదర్థ విచారము

ఇఁక నీవిషయము తైత్తిరీయోపనిషత్తునందు మొదట సత్యజ్ఞాన స్వరూపంబనియు ననంతంబనియు బ్రహ్మస్వరూపం బనియు ననంతంబనియు బ్రహ్మస్వరూపమును జక్కఁగ గీర్తించి, యీబ్రహ్మను ఎవ్వండు బాగుగ నెఱుంగునతండు సమస్త కామంబుల నందుచున్నాఁడని, పరబ్రహ్మ విషయిక జ్ఞానంబునకు ఫలంబుఁ జెప్పి, యందువలననే యీజగంబంతయు బ్రహ్మాత్మకంబని నుడివి, పిదప భూతముల క్రమోత్పత్తియు, కోశపంచక వివేకంబును, దానికి ఫలంబును, అదియనాత్మ యగుటను నిర్ణయించి, సర్వాంతర్యామిగాన సత్తామాత్రంబై నిలుచు పుచ్ఛంబె బ్రహ్మయని నిరూపించి, లోకమున లేదు కలదు అను ప్రతీతిచే పరబ్రహ్మము సదసదాత్మకం బగునా యను విషయమును విచారించి, యాపరబ్రహ్మంబె కామయి తృప్తుఁడై జగత్తునె తనకాత్మనుగా జేసికొని, దానియందంతయు వ్యాపించి మూర్తామూర్త వాచ్యుండై యుండునని నుడివి, ఆత్మయొక్క యస్తిత్వదశయందు ప్రాణాపానంబుల చేష్టగలుగుచున్నదనియు, అట్టియాత్మయె యెల్ల ఆనానందింపఁజేయు రసస్వరూపుండనియు, వాయువు మున్నగువాని కన్నిటికి భయకారణం బా బ్రహ్మంబెయనియు నిర్ణయించి పిదప మనుష్యానంద స్వరూపంబుఁ దెలిపి దీనికన్న నూరునూరు మడుంగులు రెట్టించుచు గంధర్వులు మొదలు బ్రహ్మపర్యంతము ఆనంద నిరూపణ మొనర్చి బ్రహ్మేతరుల యానందములన్నియు పరబ్రహ్మ యానందముయొక్క బిందువులని నిర్ణయించి మానవులయందును సూర్యునియందు నంతర్యామియై యుండువాఁడు పరంబ్రహ్మం బొక్కండె యనియెఱుంగు మానవుఁడు కృతాకృతంబు లయినను పాపపుణ్యంబులచే సంతాపంబు నొందక నిరతిశయానంద యుక్తుఁడై భగవత్సాన్నిధ్యము నొందుచున్నాఁడని తేటతెల్లంబుగఁ జెప్పంబడియున్నది. ఎచ్చట బ్రహ్మనుగురించి మహిమాదులు ప్రతిపాదింపఁబడునో యవియన్నియు రామునిగుఱించియెగాని వేరుగాదు.

ఛాందోగ్యోపనిషదర్థ వివరణము

మఱియు ఛాందోగ్యోపనిషత్తునందు తృతీయ ప్రపాఠకమున నుద్దాలకశ్వేతకేతు సంవాదమునందు ఓశ్వేతకేతూ నామరూప క్రియాభేదములతో గూడియుండు నీజగత్తుయొక్క సృష్టికి మున్ను కేవలమద్వితీయంబగు సత్పదార్థమొక్కటియే యున్నయది. దీనిఁగుఱించి కొందఱు, (అసదద్వైతకారణవాదులు) జగత్తుయొక్క సృష్టికి పూర్వము అసత్పదార్థమొక్కటియె యున్నదనియు దానినుండి సత్పదార్థము గలిగెననియు నుడువుచున్నారు. అట్లు అభావ పదార్థమునుండి భావపదార్థ ముదయించుట

కేవల విరుద్ధ మగుటచే నది సరిగాదు. కుండలు, మూకుళ్లు, పిడతలు, అనియనే
క నామములు రూపములును గలిగియున్నను, మట్టిమాత్రము అన్నిటికి కార
ణమై యున్నట్లును, మురుగులు గొలుసులు మున్నగు సువర్ణాభరణంబు లనేక
నామరూపభేదము లందియున్నను, అన్నిటికి బంగారొక్కటియె కారణంబగు
నిట్లు నీజగత్తంతయు నామరూప భేదముచే ననేక ప్రకారంబై యున్నను, దీనికి
సత్పదార్థ మొక్కటియె కారణమైయున్నది. అట్టి సత్పదార్థము, మొదట
నామరూప క్రియాభేదముతోనుండు ప్రపంచమును సృజింప వీక్షణరూపముగ
సంకల్పించి తేజస్సును సృజించె. అట్టి తేజస్సంకల్పమున నుదకంబులుదయించె.
గావుననే లోకములో పురుషుడెచ్చట నెపుడు శోభించుచుండు నపుడు వాడు
స్వేదోదకముతో గూడియె యుండును. ఆ తేజస్సుచే సృజింపబడిన యుదకం
బులు కారణగుణాను రూపముగా బహుభవన సంకల్పముచే నన్నరూపంబగు
పృథివీ భూతంబును సృజించె. కావున నెచ్చట చక్కగ వర్షము గురియు
నచ్చట నన్నస్వరూపంబగు పృథివీ భూతంబు మిగుల సమృద్ధి నందుచున్నయది.
ఈభౌతిక ప్రపంచమునందు ప్రత్యక్షాది విషయంబులగు నర పశు పక్ష్యాది
భూతములకు నుత్పత్తికారణంబులగు బీజంబులు అండజమనియు జీవజమనియు
నుద్భిజ్జమనియు మూడువిధములయి యున్నవి అందు అండజ మన గ్రుడ్డు
వలనం బుట్టెడు సర్పములు, పక్షులు మున్నగువాని జాతి జీవజ మన జరా
యుచేం బుట్టంబడి జీవముతో నుత్పన్నంబగు మనుష్యులు పశువులు మున్న
గువాని జాతి. ఉద్భిజ్జంబనిన భూమిని భేదించుకొని పుట్టుస్థావరములయిన తరు
గుల్మ లతాదులజాతి యై యున్నది. ఇట్లు తేజోబన్నంబులకు కారణంబయిన
యాసత్తాదేవత తనచే సృజింపబడిన నీ తేజోబన్నాత్మక దేవతాత్రయమునందు
జీవాత్మ స్వరూపంబుచేం బ్రవేశించి నామరూపంబులు వ్యక్తము లగునట్లుం జేసెద
నని సంకల్పించెను. అంతియగాక ఆ తేజో బన్నరూపములగు భూతములలో
నొక్కొక దానిని మూడుభూతములయందు సంబంధించి యుండునట్లు చేయవల
యునని గూడ సంకల్పించి యట్లె జీవాత్మ స్వరూపంబుచే వానియందు ప్రవే
శించి నామరూపములను జక్కగ వేర్వేఱుగా వ్యక్తపరచెను. ఇట్లు మూడు
భూతములను మూండేసివిధములతోం గూడియుండునట్లె యొనర్చెను. గనుక
శ్వేతకేతూ నేను చెప్పంబోవు వాక్యంబులవలన మననముం జేసికొనుమని 4-5
6-7 ఖండములలో నీని కన్నింటికిదృష్టాంతాదుల నెఱింగించి, పిదప తత్త్వమసి
యను వాక్యార్థమునందు త్వంపదతత్పదముల నైక్యమును సద్వస్తువుయొక్క
సద్భావా సద్భావముల విచారంబువిశేషముగా నొనర్చి (యాపరమాత్మ జ్ఞాన
ములేని కాలమునందు) గంధార దేశగతుండగు మనుజుని దొంగలు కన్నులు
గట్టి పాశబద్ధునిం జేసి యాగాంధారదేశమునుండి గొనివచ్చి దూరమున నిర్జనం

బగు మహారణ్యమున విడిచిన నాతఁడు దిక్కెఱుంగక యుఱ్ఱో కన్నులు గట్టి దొంగలిచ్చట విడిచిరిగదా యని యేడ్చుచుండ నచ్చట పరమకారుణికుండగు నొకఁడు వాని కనుల కట్లు విడదీసి దిక్కులను జూపి యీదిక్కున గాంధారదేశముగలదు పొమ్మని చెప్పగా నాపురుషుఁడు ఒకగ్రామమునుండి మఱియొకగ్రామమునకుఁ బోవుచు నాగ్రామవాసుల నడుగుచుఁ దాను పండితుఁడును, మేధావియుఁ గనుక దిన్నగాఁ దన గాంధారదేశముఁ బొందురీతి, నీలోకంబున ననాది కర్మవాసనా బద్ధుఁడై స్వస్వరూపజ్ఞానము లేక యహంకారభూయిష్టుం డగుటం జేసి జనన మరణాది దుఃఖప్రవాహరూప సంసారారణ్యంబునం బడి పరితపించుచున్న జీవుండు సదాచార్యునిచే స్వస్వరూప పరస్వరూపంబుల నెఱింగి, తత్త్వజ్ఞాననిష్ణాతుండై తదుపదిష్టమార్గంబు నవలంబించి పరమానంద దాయకంబగు మోక్షంబునంది కృతార్థుండగుచున్నాఁడు. అని నుడివి అట్టి మోక్షంబు సత్యబ్రహ్మాభిసంధునకు పునరావృత్తి రహితంబై యుండునని పరబ్రహ్మము మిగులఁ గొనియాడంబడినది. ఆపరబ్రహ్మంబె రాముఁడని చెప్పంబడును, ఆరామ పరబ్రహ్మంబె సృష్టి స్థితిలయ కారణంబు.

* బృహదారణ్యకోపనిష దర్థసంగ్రహము. *

ఇంతియకాక మఱియు, శుక్ల యజుర్వేద కాణ్వ శాఖయందు బృహదారణ్యకోప నిషత్తునందు షష్ఠాధ్యాయమున జనక యాజ్ఞ్యవల్క్య సంవాదంబున "లోకములో నెవరు ప్రాణమునకు ప్రాణముగను నేత్రమునకు నేత్రముగను శ్రోత్రమునకు శ్రోత్రముగను మనమునకు మనముగను పరబ్రహ్మనెఱుంగుదురో వారలె పురాణంబును శ్రేష్ఠంబునగు పరబ్రహ్మమును నిశ్చయముతో నెఱింగిన వారగుదురు. అని బ్రహ్మము నెఱుంగుటకు పరమార్థజ్ఞానసంస్కృతంబగు మనంబు దప్ప మఱియొకసాధనం బొకటియు లేదు. ఆపరబ్రహ్మంబు నెవండు పెక్కులుగా దలంచు నాతఁడు మృత్యువుచే మరణమునొందును. అప్రమేయంబును నాశ రహితంబును రజోగుణశూన్యంబును జననమరణ విరహితంబును. పరంబును సూక్ష్మంబు వ్యాపకంబు నపరిచ్ఛేద్యంబు నిత్యశుద్ధంబునగు నాపరమాత్మను బుద్ధిమంతుండగు బ్రాహ్మణుండు శాస్త్రంబుచేతను నాచార్యోపదేశంబుచేతను జక్కగ నెఱింగి. ప్రజ్ఞావంతుఁడుగాదగును. అట్టిపరబ్రహ్మ నెఱింగినవాఁడు బహు శబ్దంబుల నుచ్చరింపఁగూడదు. అట్లుచ్చరించినచో వాగింద్రియంబునకు శ్రమము గలుగును. దానిచే మానసస్థైర్యమునకు భంగము గలుగును. కావున నాత్మజ్ఞానంహేతు భూతంబులగు భగవన్నామంబుల ననుసంధానము సేయవలయునని మనఃప్రాణంబుల కెయ్యది మనఃప్రాణ స్వరూపంబై యున్నదదియె తత్పదార్థంబనియు. అట్టి తత్పద వాచ్యంబగు పరబ్రహ్మము సర్వప్రాణుల యనుభవముచే

సర్వసత్తాకంబై యున్నదనియు, మఱియు నది వ్యక్తావ్యక్త తత్త్వాతీతంబై యింద్రియాదులకు గోచరంబుగాక యున్నదనియుఁ బ్రతిపాదించి యంగుచేతనే యా పరబ్రహ్మంబు జగమునందు సర్వసాక్షియై యుండుననియు, మనుష్యులట్టి భగవద్విషయ విజ్ఞానమును బొందకుండుట దేవతల జయమునకు హేతువగుచున్నదనియు, అట్టిబ్రహ్మ నెఱుంగుటకు నాచార్యోపదేశంబున సంపాదించిన విజ్ఞానమొకటియె ముఖ్యసాధనమనియు, నందుచే సదాచార్యుల నాశ్రయించి పూజనీయంబగు విద్యను సంపాదింపవలయుననియు, అట్టి పరబ్రహ్మజ్ఞానంబును దుర్లభంబగు మానవజన్మంబునొందియుఁ గూడ సంపాదింపకున్న నాతనికిం గల్గు నష్టమింతింతయని చెప్పనలవికాదనియు, నుడివి పిమ్మట నధ్యాత్మమనియు నధిదేవమనియు రెండుభేదములచే విద్యాసాధనమున స్వరూపమును నిరూపించి సమస్త పాపములు బ్రహ్మజ్ఞానముచే నశించు విధంబును, తత్ప్రాప్తి ప్రకారంబును, చక్కఁగ నాయాశ్రుతులచేఁ గీర్తింపఁబడినది. అట్టిజ్ఞాన గమ్యంబును జ్ఞానానందామలత్వాది విశిష్టంబునగు పరబ్రహ్మంబె భూలోకంబున దుష్టుల సంహారింప శిష్టుల బాలింప రామరూపంబున నవతరించెనని యాచార్యముఖంబున నెఱుంగునది,

* ముండకోప నిషదర్థసంగ్రహము. *

మఱియు ముండకోపనిషత్తునందుఁగూడ ' నాశరహితంబగు పరబ్రహ్మను తెలియఁజేయునది పరవిద్యయనియు, ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము, శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛన్దస్సు, జ్యోతిషము అనునవి తెలియంజేయునది యపరవిద్యయనంబడును, అందుసంసారము, మోక్షములనునవి పరవిద్యకు నపరవిద్యకును విషయములుగానున్నవి. యనిచెప్పియనంతరము పలుదృష్టాంతములచేత సృష్టిక్రమంబును నుడివి అట్టి సృష్టియు లయంబును నాపరబ్రహ్మాధీనములయి యున్నవనియు, సర్వప్రపంచమును పరబ్రహ్మమయ మనియుఁ జెప్పంబడినది ఎట్లన? చూచుట కలవిగానిది. కర్మేంద్రియములచేఁ దెలిసికొన నశక్యమైనది, మూలములేనిది, వర్ణములేనిది, కన్ను చెవి చేతులు కాళ్లు మున్నగునవయవంబులు లేనిది, నిత్యము, వ్యాపకము, అంతటను నిండియున్నది, నాశరహితంబయినదియగు పరబ్రహ్మంబును జ్ఞానులు చక్కఁగ నెఱుంగుదురు, ఏయక్షరంబగు పరబ్రహ్మముకన్న పరమగునదియు నపరమగు నదియుఁ గొంచెముగూడ లేదో ఏపరమాత్మకన్న సూక్ష్మపదార్థముగాని స్థూలపదార్థముగాని యెక్కుడుగూడ లేదో ఎవడు స్థాణువువలె తటస్థుఁడై యున్నాఁడో అట్టి పరిపూర్ణుండగు పరమాత్మచేత నీసర్వంబును నిండియున్నది. లోకములో సాలెపురుగు దారములను సృజించి తిరిగి గ్రహించురీతిగను, పుడమియందు పెట్లతీగలు పొదలు మున్నగు నోషధులు పుట్టుచున్నమాడ్కిని, బ్రతికి

యుండు పురుషునినుండి కేశలోమాదులు బుట్టువిధంబుగను నక్షరుండగు పరమాత్మనుండి యీప్రపంచమంతయుఁ గలుగుచున్నది. అట్టిబ్రహ్మంబు ప్రణవమను ధనువునకు లక్ష్యమైయున్నది (అనఁగా ప్రణవాకారమున బ్రహ్మవేద్యమయియున్నది) అందుచే జీవవ్యక్తి తదాకార కారితంబై బ్రహ్మార్పణంబగును, ఓంకారము ధనస్సు, జీవుఁడు బాణము నాశరహితమగు పరబ్రహ్మము లక్ష్యము అనియు నెఱుంగునది. యీ ఓంకారమను ధనస్సునందు జీవుండను బాణమెక్కువెట్టఁబడి లక్ష్యభూతమగు పరబ్రహ్మయందుఁ బొందింపఁ బడినచో లోకములో బాణము లక్ష్యమునుబొంది తత్తాదాత్మ్యమును వహించునటులనే జీవుండును పరమాత్మయందుఁ జేరి తత్తాదాత్మ్యము నొందుచున్నాఁడు, ఆపరబ్రహ్మ మహిమాతిశయ మపారమైనది. వాని ప్రకాశముచేతనే సూర్యుఁడు చంద్రుఁడు నక్షత్రములు మున్నగునవి ప్రకాశించుచున్నవి. ఇవియన్నియు నాపరబ్రహ్మమును ప్రకాశ పరుపఁజాలవు, ఆతని ప్రకాశముచేతనే ప్రప్రంచమంతయు వెలుంగుచున్నయది. బ్రహ్మయొక్కఁడె ప్రకాశరూపుఁడగుటచే నతనిని ప్రకాశపరచునది యొకటియులేదు, సర్వజ్ఞుండును సర్వవిత్తగునాత్మ ఎవఁడు సామాన్యముగా సర్వము నెఱింగినవాఁడును విశేషముగా సర్వము నెఱింగినవాఁడు నగుచున్నాఁడో ఎవని విభూతి లోకమువందుఁ బ్రసిద్ధమయి యున్నదో అట్టి యీయాత్మప్రకాశాత్మకంబగు బ్రహ్మమయపురమునందుఁ బ్రతిష్ఠింపఁ బడియున్నాఁడు అట్టిపరబ్రహ్మను వాక్కుమున్నగు కర్మేంద్రియములచేతను చక్షుస్సుమొదలగు జ్ఞానేంద్రియములచేతను, సర్వసాధకంబగు తపంబుచేతను, అగ్నిహోత్రాది శ్రౌతస్మార్తకర్మానుష్ఠానంబుచేతను బ్రాపింప నలవిగాదు. నిర్మలమగు నాత్మజ్ఞానము నొంది పరిబుద్ధాంతఃకరణుండై నిష్కలుండగు నప్పరమాత్మను తదేకాగ్రచిత్తంబును ధ్యానించు బ్రహ్మవేత్త ప్రాపించుచున్నాఁడు, హృదయపుండరీకమను గుహాయందు నిరంతరము వసించుచున్న వానినిగ పరమాత్మనెఱింగెడు బ్రహ్మవేత్త యీయవిద్యయనుబంధనమును ఛేదించుచున్నాఁడు, ఇంతియకాక స్వస్వరూపాను సంధానపరుండగు నొకానొకనిపై మాత్రమాపరబ్రహ్మ కటాక్షము ప్రసరించుచున్నది. ఆపరమాత్మాను సంధానముచేఁ దప్పమఱియొక సాధనంబున నప్పరమాత్మ లభించునది కాదు, అదియునుంగాక, సాధకుఁడగు వాఁడే కారణముచే భగవంతునిఁబొంద నిచ్ఛగించునో యాకారణముచే భగవత్సాన్నిధ్యము గలుఁగుంగాని యన్యసాధనములచేతఁ గలుఁగనేరదు, ఆపరమాత్మ ఆత్మనిష్ఠాపరాక్రమాది బలంబులేకపోయిన లభింపదు ఆయాత్మనిష్ఠాది బలములచేతనే ప్రాప్యంబు వేదాన్తమును జక్కఁగ నెఱింగి ప్రపత్తియోగ పరతచే నిర్మలమగు హృదయముగలవాఁడు దేహవియోగమునందు మోక్షమునందుచున్నాడు, ఇది వేరుప్రకారము గానేరదు, సముద్రమునందు నదులు నిజనామరూపములను విడ

చియుందులోనె గలయురీతి ప్రాణాది కలలును ఇంద్రియంబులును ప్రతిష్ఠనంది యుండు చిత్తునందు బ్రహ్మజ్ఞానియగువాఁడు నామరూపంబుల విడచి. ప్రారబ్ధకర్మవినాశకంబగు మోక్షమును బొంది యాపరబ్రహ్మములోనె గలయుచున్నాఁడు, ఏపరబ్రహ్మమునుండి యీసమస్తంబును దయించెనో అదియె యీజ్ఞానస్వరూపంబగు రామపరబ్రహ్మంబు.

* శాంతిమంత్రార్థవిచారము *

మఱియు బృహదారణ్యక సప్తమాధ్యాయమున ప్రథమ మంత్రమగు శాంతిమంత్రమునందు, కారణ స్వరూపంబగు తత్పదవాచ్య పరబ్రహ్మంబు సర్వవ్యాపియైయున్నది, ఈజగత్తు నామరూపములచే వ్యవహరింపఁబడుచున్నదైనను పరబ్రహ్మచే సర్వత్ర వ్యాపింపఁబడిన దగుటచే నిదియు పూర్ణంబు. కార్యాత్మక బ్రహ్మంబు కారణాత్మక బ్రహ్మమువలన పరమాత్మభావము వదలక వెలువడుచున్నది. కార్యాత్మయొక్క కారణసత్తనెఱింగిన ప్రజ్ఞానఘనంబగు పరబ్రహ్మయొక్కటియె యతిరిక్తమగుచున్నది యనిచెప్పఁబడియున్నది. కావున నీకండికయందు ఆది మధ్యాంతములలో పరబ్రహ్మంబె పూర్ణంబని నిశ్చయింపఁ బడినది. పూర్ణమనఁబడు పరోక్షరూపముచే తత్పదసంజ్ఞితమగు నీశ్వరచైతన్యం బుదయించెను, మఱియు ప్రత్యక్షరూపంబగు త్వంపదముచేఁ బాంచాలభౌతికములగు దేహములందుండు పూర్ణమగు సోపాధికమగు జీవచైతన్యము గలిఁగినది. ఇట్లు నిరూపకంబగు పూర్ణపరబ్రహ్మమునుండి సోపాధికంబగు పూర్ణుండగుజీవుం డుదయించెనని యిచటఁ జెప్పంబడినది. అట్టిపూర్ణ పరబ్రహ్మమును శాస్త్రముచేతను శాస్త్రమునెల్ల నుపదేశించు నాచార్యునిచేతను దనయవిద్యను నశింపఁజేసి కొని వేదాంత వాక్యముచేఁ గనుఁగొనినచో పరిపూర్ణంబు నానందమయంబునగు పరబ్రహ్మయొక్కండె యనితేలుచున్నది. అట్టి సకల జగత్కారణంబగు శ్రీరామపరబ్రహ్మంబె యోగులచే నిరంతరము ధ్యానింపఁబడు ననాదితత్వంబు.

* భగవద్గీత వాక్యార్థాదివిచారము *

భగవద్గీతయందు సర్వధర్మ నిషేధపూర్వకంబుగ ప్రతులయందు మిగుల గీర్తింపఁ బడినవాఁడు పరాత్పరుండును సకలమగు ప్రపంచముయొక్క సృష్టిస్థితిలయములకు కారణ భూతుండగు వాడను నేను, ఓధనంజయా (జీవుఁడా) నాకన్న వేరగు గొప్పపదార్థ మొక్కటియులేదు, దారమునందు మణులు గ్రుచ్చఁబడినట్లు యీప్రపంచమంతయు నాయందు సూత్రింపఁబడియున్నది" అని భగవంతుఁడగు శ్రీకృష్ణుండానతిచ్చి యున్నాఁడు, వేదంబునందును "తజ్జలాని"యను వాక్యంబు మొదలగు వానియందంతయు నీతత్వంబె ప్రతిపాదింపఁ బడియున్నది. ఇట్లు సకల శ్రుతులయందును స్మృతులయందు నితిహాసములందు పురాణము

లందు నింక నితర శాస్త్రంబులందును, ఎయ్యది పరబ్రహ్మంబని చెప్పంబడినదో యద్దియె యోగిగమ్యంబును నిరామయంబునగు రామపద వాచ్యంబు. అయ్యది సీజీవులచేత ననేక నామరూపంబులనంది సకలభూతములందు నంతర్యామియై వ్యాపించి, ప్రపంచమునంతయు నడిపించుచు స్పష్టముగా స్వస్వరూపమును దెలియఁజేయు చున్నను అజ్ఞులగు మనుజులు దానిని తమమనస్సునందు గుర్తెఱుఁగక యున్నారు, ఇదిగాక బ్రహ్మజ్ఞానము గలుఁగుటకుఁ గారణ మెక్కుడుగలదు, లోకంబునఁ బ్రతిమనుష్యుఁడును తమయింద్రియములను దజ్జన్యవ్యాపారములను గాపాడుకొనువారలు గనె కనుబడుచున్నారు. అందుచేత కేవల జ్ఞానస్వరూపంబగు పరమాత్మను దెలిసికొనలేక యున్నారు.

కఠోపనిషదర్థసార నిరూపణము *

స్వయం జ్యోతియగు భగవంతుని గనుఁగొనుటకుఁ బ్రతిబంధకములై శబ్దాది విషయములందుఁ బ్రవర్తింపఁజేయు నింద్రియములు సృజింపఁబడినవి. ఇట్టి యింద్రియములు అంతర్నిగూఢంబగు నాత్మనుగనుంగొనలేవు. అని శ్రుతులయందుఁ బ్రతిపాదింపఁబడియున్నది లోకంబులోనుండు మానవులందఱును ద్రవ్యమునకు స్త్రీలకుఁ గుమారులకు (ఈషణాత్రయమునకు) దాసభూతులై యున్నారు, ఇచ్చటఁ జెప్పునదేల జీవుడు సుఖభోగముల విషయమై దాసుఁడుగా బ్రవర్తించుచున్నాఁడో అందుచేతనే తనజ్ఞానంబు ప్రకాశింపకున్నయది. నిత్యానందుండును సర్వసాక్షియునగు స్వాత్మయొక వేళ ప్రకాశించనిచో నామానవునకా పరమాత్మస్వరూపమునకన్న నింకొకటి రుచించునా? స్వాత్మయొక్కండె సర్వకాలంబు రుచించును, అనేకమానవులలోఁ దనపూర్వపుణ్య వశంబున విజ్ఞానంబుగలిగి యాత్మయొక్క స్వరూపమును జక్కగ నెఱింగి. తద్ధ్యానానందాస్వాదముచే సొక్కుచుండు మానవుండితర విషయములయం దిచ్ఛనువహించి, యేప్రయోజనముకొఱకీ శరీరము నుపయోగ పఱచును? అని బృహదారణ్యక శ్రుతి నుడువుచున్నది. సర్వకాలమునందు నాత్మయందె విచారముగలిగి. దానిస్వరూపము నెఱింగి పరబ్రహ్మమును ధ్యానముసేయుచున్న మానవుఁడు నిత్యతృప్తి గలవాఁడై యే యుండును, ఆత్మవిషయమై సంతుష్టుండైన మనుజునకింకేమి కార్యముగలదు? అని భగవద్గీతయందు శ్రీకృష్ణుండర్జునున కుపదేశించియున్నాఁడు. ఇంద్రియభోగములయందు నాసక్తిగల పురుషుండు దానొంటరిగా రమింపక నింకను దారేషణ ధనేషణ పుత్రేషణయను నీషణాత్రయముతోడంగూడి. యెల్లప్పుడు నట్టిభోగమునకై ప్రయత్నముసేయుచున్నాఁడు. లోకములో పుత్రులులేని వారి ననేకులను జూచుచున్న వాఁడయ్యును దానినెఱుంగక తానుపుత్రులను బుట్టింపనిచ్ఛగలవాఁడై మొట్టమొదట నతిప్రయాసమునొంది మందబుద్ధి గలవాఁడుగాన నట్టికేలకు. భార్యనుసంపాదించుకొనుచున్నాఁడు. అట్టి భార్యయందతి ప్రయాస

మృగుఁ బుత్రులుంబుట్టించి వారలను బోషింపఁజాలక మిగుల కష్టమునొందుచు ధనములేక యజ్ఞయాగాది క్రతువు లొనర్పలేకను కుటుంబ భరమును మోయ లేకను మిక్కిలి సంతాపము నొందుచున్నాఁడు. ఇట్లు నిత్యము తనచిత్త మీసంతాపముచే దహింపఁ బడుచుండ శోకప్రదముగాని తనకోరికను నెఱవేర్పు కొనలేఁడు. లోకములో సాధారణముగా ప్రతియింటియందును పత్రి(?)యావంతుఁడయ్యును శాస్త్రమును జక్కగ నెఱింగినవాఁడయ్యును ధనిగ్రామశునకంబులఁబోలె ధనవంతుల వాకిళ్లయందుఁ బడి వారు మెడఁబట్టినెట్టి యనరానిమాటల నను చున్నను అట్టి యవమానముఁగూడ ధనమునకై సహించి దానికి దాసభూతుఁడై వర్తించుచున్నాఁడు. ఇఁకనజ్ఞుఁడగువాని విషయము కై ముతిక న్యాయసిద్ధమెగదా! పురాకృత పుణ్యపరంపరచే ననసాధువులుఁగూడ గొప్పకులమందు జన్మించుచున్నారు. వారొకానొకప్పుడు సత్పురుషులు చూపినమార్గము నవలంబించి ధన్యులగుచున్నారు. అట్టివారలే శ్రీరామపర బ్రహ్మముయొక్క దర్శనార్థమై స్వాత్మముద్రను నిందించుచున్నారు (స్వాత్మారాములయ్యెదరు) ఇంతియెగాక యెచ్చటనైనను మానవులు సత్పురుషుల సంసర్గముచే లభించిన యుక్తిచేతను గాక పురాకృత పుణ్యమూలకముగ గాక స్వవిద్యచే బ్రహ్మజ్ఞానమును బొందనేరరు. (సదాచార్యునిచే నుపదేశింపఁబడిన మార్గమున వర్తింపుచుఁ బ్రారబ్ధ దురితనాశంబయినపిదప మోక్షమును బొందునుగాని స్వసామర్థ్యముచేఁ బొందనేరఁడు) అయినయట్టి రామపరబ్రహ్మను సంధానమునకై స్వాత్మముద్రా పూరణ ప్రకారము నెఱింగించుచున్నాఁడను. లోకమున సామాన్యముగా జక్కగ సంపాదింపఁబడిన యంజనమును కనులకుఁ బెట్టుకొనినచో ధన నిక్షేపంబు లెట్టు దప్పక గోచరించుచున్నవో యటులనే యీబ్రహ్మాండము విచారమునందునుగూడ సాధన చతుష్టయమనునది యానిధి నిక్షేపముల నెఱుంగనగు నంజన స్థానములోనున్నది. (దానితో తుల్యమయినది)

* సర్వతోభద్రయంత్రమునందలి వర్ణకల్పనా విచిత్రార్థ విచారము. *

సర్వతోభద్ర యంత్రమునందుఁ బరిశుద్ధమగు నవ్యయంబగు రామయను పదము స్వస్వరూపాను సంధానమునకు లక్ష్యముగా నుంచుకొని యట్టిపరబ్రహ్మ సాక్షాత్కారమును బొందవచ్చును. పదమనిన రామయను నామము వ్రాయంబడిన గృహము (యిల్లు) అందులో వ్రాయఁబడు నల్లనివర్ణము పరబ్రహ్మము మాయావియనునంశమునుఁ దెలియఁ జేయుచున్నది. పరబ్రహ్మవస్తువును సాధించునది యీనల్లని రంగనియె యెఱుంగవలయును. శుద్ధమనిన తెల్లని రంగుతో వ్రాయఁబడియుండును రామనామ వ్యంజకంబగు రేఖ బ్రహ్మవిద్యామయుంబని బ్రహ్మవేత్తలు వక్కాణించుచున్నారు. పిదప శిక్షించువాఁడు శిక్షింపబడునదియు శిక్షానియామక శాస్త్రంబును (బోధక బోధ బోధ్యంబులు) అనుమూఁడును పర

బ్రహ్మజ్ఞానానంతరమందు మిథ్యాభూతములగు నవిద్యామయంబులని తెలియం దగియున్నది. ఇందు నాలుగు ప్రక్కలయందును నలుపు తెలుపు పసుపు మున్నగు రంగులు లిఖించుటచే దీనికి చతుష్పాదమనంబడు. ఇందుచే నాలుగుభాగముల చేతను రామతోభద్రము. సంపూర్ణ సాధకంబని తెలియంబడుచున్నది. మఱియు ప్రత్యేక మొక్కొక్కటి సాధనముగాగలది సాధన చతుష్టయమని చెప్పంబడుచున్నది.

* మోక్షసాధన చతుష్టయ నిరూపణము. *

1 వివేకము. 2 వైరాగ్యము. 3 శమాదిషట్కసంపత్తియు. 4 ముముక్షుతయు ననునివి నాలుగు సాధనములు. అందు వివేకమననిత్యవస్తు విదియని చక్కగా నెఱుంగుట వైరాగ్యమన నీలోకములోన దేహధారణ వ్యతిరిక్తవిషయంబులలోను, స్రక్చందనతాంబూలాది భోగద్రవ్యములయందును కేవలము తుచ్ఛబుద్ధిగలిగి వానిని విసర్జించుటయు, నట్లె పరలోకములగు స్వర్గాదులయందు రంభాసంభోగాది భోగములయందు నిచ్ఛగలుగక యుండుటయు. శమాది షట్కసంపత్తియన అంతరింద్రియములను నిగ్రహించుట యనునట్టి శమమును బహిరింద్రియముల నిగ్రహించుట యనుదమమును, విధిపూర్వకంబుగ విహితకర్మత్యాగంబను నుపరతియు, చలివెట్ట యను భేదములేక రెండింటియందు సమబుద్ధిగలిగి సహించియుండుట యను తితిక్షయు, వినుట మొదలగు విషయములయందు జాగరూకతగల మానసముయొక్క వర్తకమను సమాధానంబును, శాస్త్రమునందును, తదుపదేష్టయగు నాచార్యునియందును, అత్యంత విశ్వాసమను శ్రద్ధయు, నను నారుగుణంబులు గలిగియుండుట. ముముక్షుతయన మోక్షమునొందుటయందు మిగులనార్తుండై వహించు తీవ్రేచ్ఛయె మైయున్నది. వీనికన్నింటికి, స్మృతులయందు మోక్షవిచార ప్రక్రియారంభమున చక్కని లక్ష్యములు చూపింపబడినవి. పైనుడివిన సాధన చతుష్టయంబను, నాల్గును, ధనైషణ దారేషణ పుత్రేషణములను నీషణత్రయ త్యాగపూర్వకంబుగ నొనర్చు సన్యాసంబును, సద్గురుసేవనంబును, గురువేదాంతవాక్యంబును, నిధిధ్యాసనంబును, బూర్వసమాధియు, నుత్తరసమాధియును జేరి పదునొకండును మోక్షసాధనైకాదశం బనంబడును. వీనికన్నిటికి పరస్పరము ప్రాణాదులు సంగతులని సమ్మతమైయున్నది. మోక్షేచ్ఛచేతనే సన్యాసము మొదలగు నారుగుణంబులకుఁ బ్రత్యక్షమని యుచటఁ జెప్పంబడినది. మోక్షేచ్ఛగలిగినపిదప నివియన్నియు సహాయమాత్రము లగుచున్నవి. ఉత్తరసమాధియను కడపటిగుణము గూడ వేరుగానుండునదియె గాన వివేక వైరాగ్య శమాది షట్కసంపత్తి గలుగకనున్నచో మోక్షేచ్ఛ గలుగనేరదు. ఇట్టిసాధనములచేత సాధకుండగువాఁడు పదములన్నింటిని రామనామములచే నిండింపుచున్నాఁడు. (అనఁగా మోక్ష

సాధనములయొక్క క్రమము జ్ఞప్తికివచ్చునట్లు సర్వతోభద్రయంత్ర రచనము, సమన్వయింపఁబడినది. మఱియు నితరపదంబులను బూర్తిసేయు విధమునంతయు శ్రోతలగువారు చక్కఁగ నెఱింగి, యట్లాచరించురీతి చక్కఁగ నుడువుచున్నారు.

* శ్రీరామబ్రహ్మైక్య తత్వప్రబోధనము. *

అందు ఇంద్రియములు పది వీనిలోఁదొమ్మిది మాత్రము గోళకములుగా నున్నవి. అనిన త్వగింద్రియ స్థానంబుదప్ప మిగిలిన శ్రోత్రచక్షుర్జిహ్వాఘ్రాణ వాక్పాణి పాదపాయూపస్థలను తొమ్మిది యింద్రియ స్థానంబులును గోళకంబులు, ప్రాణాపానంబులు. 2. మనోబుద్ధులు, 2. యీప్రాణాపాన మనోబుద్ధుల ధర్మము లగు. సంశయ నిశ్చయ ప్రాణాపానాగమనంబు లనునవి 4ను వెరసి యిరువది యేడు పదంబులును రామబ్రహ్మను సంధాన సాధనములతోడ గుఱుతించుటకు మిగుల యోగ్యంబులని తద్వ్యంజకంబులుగ సీరామతోభద్రమున సర్వప్ర కారములుగ పూరింపఁబడుచున్నవి అపుడు పరబ్రహ్మమగు రామయను పదంబు స్పష్టముగాఁ దనకు గోచరించి, ఆట్టిప్రత్యక్ష స్ఫురణముచేత సాధకుఁడు కృతకృత్యతనొందుచున్నాఁడు. ఈలాటి విజ్ఞానముచేత రామతోభద్ర ముద్రికయందు శ్రీరామునియొక్క నిరతిశయంబగు మహాత్మ్యము నిరూపింపఁబడినది. స్థానము వలనఁగాని నామమువలనఁగాని సంశయ నివృత్తికొఱకు పరబ్రహ్మను సంధాన మొనరింపగనే వానికి మంగళంబులుగలుఁగునో యదియె ముఖ్యమగు భద్రవాచకంబు ఇయ్యదిమంగళములకెల్ల మంగళమైయుండును (మిగుల మంగళకరంబైనది) ఇచట మంగళస్వరూపంబు ప్రత్యక్షముగా స్ఫురించుచున్నందున నియ్యది భద్రమను నామముచే వ్యవహరింపఁ బడుచున్నది. యీసర్వతోభద్రమధి దైవంబనియు నధ్యాత్మంబనియు రెండుదెఱంగులను నొప్పారుచున్నది. వానిరెంటినిచట రామబ్రహ్మను జక్కఁగా నెఱుంగుటకొఱకై వివరణముగాఁ జెప్పుచున్నాఁడను. ముందు నధి దైవమునందలి యమలంబగు భద్రమెట్లన? బ్రహ్మాండముయొక్క హృదయంబగు (మధ్యప్రదేశమగు) బ్రహ్మలోకంబె సర్వతోభద్రమనంబడును. దానిచేతనే లోకముల కన్నింటికి, భద్రముగలుగునని యేర్పడియున్నదిగదా? అందు బ్రహ్మ బంగారుతో నొనర్పఁబడిన దివ్యగృహంబును నిర్మించుకొని యందు నివసించుచున్నాఁడు. అట్టిదివ్య ధామంబె యిచ్చట పద్మమని తెలిసికొనందగినది. ఇట్టి హృత్పద్మమునందె స్వయముగాఁ గార్యప్రజ్ఞ యుదయించుచున్నది. దీనియందుఁ గేవలము సత్వగుణమునువహించి ప్రాణోపాసన మొనర్చుటయందు మిగుల శ్రద్ధవహించియున్న పూర్వులగు మహాయోగులు ప్రవత్తి నొనర్చియచట జ్ఞానస్వరూపంబగు పరబ్రహ్మను గుఱుతెఱింగియున్నారు. ఇట్లు బ్రహ్మలోకము నొందిన యోగులు. బ్రహ్మతోడనే ముక్తులగుదురని స్మృతివచించుచున్నది. మఱియు నాగమంబునఁగూడ నిట్లెవచించియున్నది. కావున శ్రుతిస్మృతు